# జగన్నాథ కథచక్రాల్

నూరు నవ్యవీక్లీ మొదటిపేజీ కథలు



జగన్నాథశర్మ

# జగన్నాథ కథచక్రాల్

నూరు నవ్యవీక్లీ మొదటిపేజీ కథలు

**జగన్నాథశర్మ**

**అమరావతి పబ్లికేషన్స్**
సాయిబాబా రోడ్ - గుంటూరు - 522 007

**JAGANNADHA KATHACHAKRAL**

*by* **Jagannadha Sarma**

---

**జగన్నాథ కథచక్రాల్**

**జగన్నాథశర్మ**

ప్రథమ ముద్రణ

**ఏప్రిల్ 2013**

© **రచయిత**

*టైటిల్ డిజైన్ :* **రమణజీవి**

*లే అవుట్ డిజైన్ :* **కె. రామకృష్ణ**

ప్రచురణ

**అమరావతి పబ్లికేషన్స్**

4-21-81, చైతన్యపురి, సాయిబాబా రోడ్,

**గుంటూరు**-522 007 ఫోన్: 0863-2333363

సోల్ డిస్ట్రిబ్యూటర్స్

**విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్**, హైదరాబాద్

ప్రతులకు

**విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు**

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం,

గుంటూరు, తిరుపతి, ఒంగోలు, హనుమకొండ, కాకినాడ, కరీంనగర్, శ్రీకాకుళం

**ముద్రణ:** శ్రీ కళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్

వెల : **రూ.** 160/-



## అంకితం

నవ్యవీక్లికి నన్ను సంపాదకుణ్ణి చేసి
ఈ 'మొదటి పేజీ' రాసేందుకు
అవకాశాన్ని కల్పించిన
ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్
**శ్రీ వేమూరి రాధాకృష్ణ** గారికి
హృదయపూర్వకంగా...

# ఇవీ కథలు...


| | | | |
|---|---|---|---|
| 1. | దేవుడిడ్లీ | ..... | 09 |
| 2. | చిట్టితల్లి ఉత్తరం | ..... | 11 |
| 3. | అమ్మ చెప్పిన ఎనిమిది అబద్ధాలు | ..... | 13 |
| 4. | డైరీలో ఒక పేజీ | ..... | 15 |
| 5. | ఒంటి కన్ను రాక్షసి | ..... | 17 |
| 6. | నాన్నకో ఆదివారం | ..... | 19 |
| 7. | చేజారిన క్షణాలు... | ..... | 21 |
| 8. | ఆదివారం అంటే అయిదు వేలు | ..... | 23 |
| 9. | నమస్కారం | ..... | 25 |
| 10. | ఎక్కడ ఉన్నా.. ఏమైనా... | ..... | 27 |
| 11. | నర్స్ | ..... | 29 |
| 12. | బొమ్మల పుస్తకం | ..... | 31 |
| 13. | ట్రాజెడీ | ..... | 33 |
| 14. | చూసునా! | ..... | 35 |
| 15. | గాలిపటం | ..... | 37 |
| 16. | బాకీ | ..... | 39 |
| 17. | మనకెందుకులే! | ..... | 41 |
| 18. | విడాకులు | ..... | 43 |
| 19. | ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది | ..... | 45 |
| 20. | కలవరించి... కల వరించి... | ..... | 47 |
| 21. | ఇలవేల్పు | ..... | 49 |
| 22. | ఏది ముందంటే... | ..... | 51 |
| 23. | రహస్యం | ..... | 53 |
| 24. | అమాయకుడు | ..... | 55 |
| 25. | గుర్తు | ..... | 57 |
| 26. | సందేహం | ..... | 59 |
| 27. | బర్త్‌డే కేక్ | ..... | 61 |
| 28. | ప్లీజ్! చిదిమేయొద్దు! | ..... | 63 |
| 29. | గాంధీనగర్ | ..... | 65 |
| 30. | కాగితం పడవలు | ..... | 67 |
| 31. | గులాబీ | ..... | 69 |
| 32. | జీవిత సత్యం | ..... | 71 |
| 33. | ఆనందం అంటే... | ..... | 73 |
| 34. | పాపం! పప్పీ! | ..... | 75 |

| | | | |
|---|---|---|---|
| 35. | బామ్మ మాట! బంగారు బాట! | ..... | 77 |
| 36. | తన కోపమే తన శత్రువు | ..... | 79 |
| 37. | మేలిమి బంగరు మెలిక తిరిగినా.. | ..... | 81 |
| 38. | గొప్ప సలహా | ..... | 83 |
| 39. | కోరిక | ..... | 85 |
| 40. | పండగంటే ఓరిమి | ..... | 87 |
| 41. | పొట్టిబాబు పాట్లు | ..... | 89 |
| 42. | ఆనందం | ..... | 91 |
| 43. | హ్యూమన్ లైబ్రరీ | ..... | 93 |
| 44. | చిన్న మాట! ఒక మంచి మాట! | ..... | 95 |
| 45. | సంక్రాంతి సంబరం | ..... | 97 |
| 46. | బిస్కట్‌ప్యాకెట్ | ..... | 99 |
| 47. | నేరం కలది కాదు, అయితే గియితే నీదే! | ..... | 101 |
| 48. | కండలు తిరిగిన గండర గండడు | ..... | 103 |
| 49. | కారు | ..... | 105 |
| 50. | మాటరాని మౌనమిది! | ..... | 107 |
| 51. | ఐ లవ్ యు సిద్ధూ | ..... | 109 |
| 52. | ఊరవతల గుడి | ..... | 111 |
| 53. | వర్షంలో వినాయకుడు | ..... | 113 |
| 54. | ఎమ్ ఫర్ మూర్తి | ..... | 115 |
| 55. | మారాలి! మారాలి! | ..... | 117 |
| 56. | ఋణం | ..... | 119 |
| 57. | కొండ గాలి తిరిగింది! గుండె ఊసులాడింది! | ..... | 121 |
| 58. | అడుగులోన అడుగు వేసి నడవనీ! | ..... | 123 |
| 59. | వేళ చూస్తే సందె వేళ... | ..... | 125 |
| 60. | ఓం ఆదిత్యాయ నమః | ..... | 127 |
| 61. | ఉపకారమే ఊపిరి | ..... | 129 |
| 62. | స్మైల్ ప్లీజ్!! | ..... | 131 |
| 63. | సంక్రాంతి సంబరం | ..... | 133 |
| 64. | స్నేహమేరా జీవితం | ..... | 135 |
| 65. | పాస్‌బుక్ | ..... | 137 |
| 66. | అమ్మో హారన్!! | ..... | 139 |
| 67. | శివరాత్రి వేళ! పెళ్లి గోల! | ..... | 141 |
| 68. | ఎంత హాయి! | ..... | 143 |
| 69. | జలకాలాటలలో... | ..... | 145 |
| 70. | అందెను నేడే! అందని జాబిల్లి! | ..... | 147 |
| 71. | ఉగాది ప్రయాణం | ..... | 149 |
| 72. | మనసు విరిగి తునకలయితే.... | ..... | 151 |

| | | | |
|---|---|---|---|
| 73. | తాతాజీ ఆటలు | ..... | 153 |
| 74. | విమర్శని తట్టుకో! విజయం నీదే! | ..... | 155 |
| 75. | నావల్ల కాదంటే కాదనుకునే వేళ... | ..... | 157 |
| 76. | దేవుడు తాతయ్య! | ..... | 159 |
| 77. | షాప్ ట్రీట్‌మెంట్ | ..... | 161 |
| 78. | పాడమని నిన్నడగవలెనా?! | ..... | 163 |
| 79. | ఒక్క నవ్వే చాలు! వద్దులే వరహాలు! | ..... | 165 |
| 80. | పెళ్ళంటే... | ..... | 167 |
| 81. | నీ సుఖమే నే కోరుతున్నా!! | ..... | 169 |
| 82. | మరో భాష నేర్చుకో! | ..... | 171 |
| 83. | జీవితం | ..... | 173 |
| 84. | చెక్ | ..... | 175 |
| 85. | రేపు | ..... | 177 |
| 86. | మచ్చ | ..... | 179 |
| 87. | కొబ్బరి బొండాలు | ..... | 181 |
| 88. | కళ్ళు | ..... | 183 |
| 89. | ఓటికుండ | ..... | 185 |
| 90. | కోరిక | ..... | 187 |
| 91. | దసరా | ..... | 189 |
| 92. | ఓ పువ్వు పూసింది | ..... | 191 |
| 93. | అమ్మమాట | ..... | 193 |
| 94. | ఆ క్షణాలు... | ..... | 195 |
| 95. | చిన్నబుర్ర అప్పన్న | ..... | 197 |
| 96. | క్రిస్మస్ తాత | ..... | 199 |
| 97. | చదువులోని మర్మమెల్ల.... | ..... | 201 |
| 98. | నన్నొకసారి తలచుకోండి | ..... | 203 |
| 99. | అద్భుతం | ..... | 205 |
| 100. | భగవద్గీత | ..... | 207 |

# దేవుడిడ్లీ

పెళ్ళికి తప్పకుండా రావాలి. లేకపోతే గొడవలయి పోతాయి అని ఫ్రెండ్ పోరు పెడితే ఆ ఊరికి రాక తప్పలేదు. మర్నాడు పెళ్ళంటే ముందు రోజే చేరుకున్నాం. పెళ్ళివారింట టీలు, టిఫిన్లు బాగుంటాయి. కాని, ఆ ఊరి హోటల్లో తినాలని సరదా పడ్డాం.

''మీ ఊరిలో ఏ హోటల్ బాగుంటుందిరా?'' అడిగాం.

''చలమయ్య హోటల్'' అన్నాడు పెళ్ళికొడుకు.

''ఇడ్లీ ఒకటే దొరుకుతుందక్కడ. ఇడ్లీకి ఆ హోటల్ పెట్టింది పేరు. తిని చూడండి. వెళ్ళి రండి'' అన్నాడు. వెళ్ళాం.

అయిదంటే అయిదే టేబుళ్ళున్నాయి అక్కడ. ఒక్కడే సర్వ్ చేస్తున్నాడు. మా పక్క టేబుల్ దగ్గర ఇద్దరు కూర్చున్నారు. మూడు ప్లేట్ ఇడ్లీ ఆర్డర్ చేశారు.

''ఒకటి దేవుడికి'' అన్నారు. దేవుడెవరు? పేరు బాగుందే అనుకున్నాం. చూస్తే ఇద్దరే ఉన్నారు. మూడోవ్యక్తి దేవుడు లేడక్కడ. సర్వర్ రెండు ప్లేట్స్ ఇడ్లీ సర్వ్ చేశాడు. మూడు ప్లేట్స్‌కి బిల్ తెచ్చి ఇచ్చాడు. గమనించాం అది.

''ఒకటి దేవుడికి'' అని ఓ స్లిప్ అక్కడి గోడకి అంటించి వెళ్ళిపోయాడు. కాస్సేపటికి మరో ఇద్దరు వచ్చారక్కడికి. మూడు ప్లేట్స్ ఇడ్లీ ఆర్డర్ చేశారు.

''ఒకటి దేవుడికి'' అన్నారు. మళ్ళీ దేవుడెవరు? అనుకున్నాం. సర్వర్ రెండు ప్లేట్స్ ఇడ్లీ సర్వ్ చేశాడు. మూడు ప్లేట్స్‌కి బిల్ తెచ్చి ఇచ్చాడు.

''ఒకటి దేవుడికి'' అని ఓ స్లిప్ గోడకి అంటించి వెళ్ళి పోయాడు. ఏంటిదంతా? విషయం వివరంగా కనుక్కుందా

మంటే సమయం చిక్కలేదు. పెళ్ళికొడుకు పిలుస్తున్నాడంటే పరిగెత్తాల్సి వచ్చింది. పరుగు సంగతి అలా ఉంచితే చలమయ్య హోటల్లో ఇడ్లీలు మాత్రం చాలా బాగున్నాయి. చట్నీ కూడా మంచి రుచిగా ఉంది.

పెళ్ళయిపోయింది. పొద్దునే వేడి వేడి ఇడ్లీ తినాలనిపించింది. చలమయ్య హోటల్‌కి చేరుకున్నాం. ఆర్డర్ చేసి కూర్చున్నాం. అంతలో ఓ బిచ్చగాడు వచ్చాడక్కడకి. అతని బట్టలు మట్టికొట్టుకుపోయి ఉన్నాయి. జుత్తు జడలు కట్టి ఉంది. తిండి లేక ఎండిపోయినట్టుగా ఉన్నాడు. అలాంటి వాళ్ళను హోటల్లోనికి రానివ్వరు. రానిచ్చారు. దానికి ఆశ్చర్యపోయి చూస్తూ కూర్చున్నాం. బిచ్చగాడు మా టేబుల్ పక్కన వచ్చి కూర్చున్నాడు.

''చెప్పు'' సర్వర్ వచ్చి అడిగాడతన్ని.

''ఓ ప్లేటు దేవుడిడ్లీ'' చెప్పాడు బిచ్చగాడు. ఇడ్లీ సర్వ్ చేశాడతనికి. చట్నీని, సాంబారునీ అడిగి నప్పుడల్లా విసుగుకోకుండా వడ్డించాడు. తిని బిచ్చగాడు వెళ్ళిపోయాడు. పైసా కూడా చెల్లించలేదతను. బిల్ కూడా తెచ్చివ్వలేదు సర్వర్. వెళ్ళిపోతున్న బిచ్చగాణ్ణి ఉద్దేశిస్తూ–

''ఓ ప్లేటు దేవుడిడ్లీ'' కౌంటర్ ముందు కూర్చున్న ఓనర్‌కి వినబడేట్టుగా గట్టిగా కేకేశాడు సర్వర్. గోడకి అంటించిన స్లిప్‌నొక దాన్ని తీసి, చించి, విసిరేశాడు. అప్పుడు అర్థమయింది, 'దేవుడిడ్లీ' సంగతి.

ధర్మం చెయ్యడానికి కూడా టైం చిక్కని ఈ వేగవంతమయిన జీవితంలో ధర్మానికి ఓ చక్కని అవకాశాన్ని కల్పించింది చలమయ్య హోటల్. ధర్మం చేసేందుకు అక్కడికో ఇక్కడికో వెళ్ళక్కర్లేదు. బిచ్చగాళ్ళను వెదుక్కోనక్కర్లేదు. డబ్బిచ్చి తృప్తి పరచలేం. అదే ప్లేట్ ఇడ్లీ పెట్టి తృప్తి పరచొచ్చు. ఆకలిని కాస్తలో కాస్తంత తీర్చొచ్చు. ఇదంతా ఓ ఎత్తయితే బిచ్చగాళ్ళను హోటల్‌కి రానివ్వడం, వాళ్ళని అందరి కస్టమర్ల మాదిరి కూర్చోబెట్టి, అడిగినంత చట్నీ, సాంబారు వడ్డించడం గొప్ప. అందుకు ఓనర్ చలమయ్యను అభినందించాల్సిందే అనుకున్నాం. వెళ్ళి అభినందించాం.

''మీరు చేయాల్సింది నన్ను అభినందించడం కాదు, మీ ఊరిలో ఇలాంటి వెసులుబాటు కల్పించండి. పేదలకి ఇంత తిండి పెట్టండి. ఆనందిస్తాను'' అన్నాడు చలమయ్య. సమాధానంగా ముందు అతనికి చేతులెత్తి దణ్ణం పెట్టాం.

# చిట్టితల్లి ఉత్తరం

అమ్మా!

నేనిప్పుడు స్వర్గంలో ఉన్నాను. దేవుడి ఒళ్లో పడుకుని ఉన్నాను. గుండెల్లో గునపాళ్ళతో గుచ్చిన బాధ నన్నింకా వదల్లేదు. తట్టుకోలేక ఏడుస్తున్నాను. నాతో పాటు పాపం, దేవుడూ ఏడుస్తున్నాడు. అందాల పాపాయిగా నీ కడుపున పుట్టాలనుకున్నాను. కాని, జరిగిందేమిటో నాకిప్పటికీ తెలియట్లేదు.

నీ కడుపున నేను ఎప్పుడు పడిందీ నాకు తెలియదు. కాని, నేను నీ కడుపులో ఉన్నానన్న సంగతి తెలిసి, ఎంతగా మురిసిపోయానో! నన్ను నేను చూసుకుని ఆశ్చర్యపోయాను. చీకటి, అయినా, నా బుల్లి బుల్లి కాళ్ళూ చేతులూ ఆ చీకటిలో కదలడం నా చిన్ని కళ్ళతో నేను చూశాను. అందంగా బాగున్నాననిపించింది. ఇంకెంత కాలం? కొద్దికాలమే ఈ చీకటి. తర్వాత కొండంత వెలుతుర్లో నీ చేతుల్లో ఉంటాననుకున్నాను. అందాకా నిద్ర లేదంటే నీ గురించిన ఆలోచనలతో రోజుల్ని గడిపేద్దామనుకున్నాను. ఎందుకో తెలీదమ్మా, నీ కడుపున పడిన దగ్గర్నుంచీ నువ్వంటే నాకు చెప్పలేనంత ఇష్టం. అందుకే నువ్వేడిస్తే నేనేడ్చాను. పెద్దగా కేకలేస్తూ నీ కడుపున నువ్వు పిడికిళ్ళతో కొట్టుకుంటుంటే బాధపడ్డాను.

గుర్తుందమ్మా! ఆ రాత్రి అంతా నాకు బాగా గుర్తుంది. నాన్న నీ మీద అంతెత్తున విరుచుకు పడ్డారు. అరిచారు. అయితే మర్నాటికి మామూలు అవుతారని, మీ ఇద్దరి మధ్యా గొడవలు ఉండవని అనుకున్నాను. కాని కాలేదు. మర్నాడు కూడా నువ్వు ఏడుస్తూనే ఉన్నావు. నిన్ను నేను బాధపెడుతున్నానా? అనిపించింది. ఎందుకు నువ్వూ, నాన్నా పోట్లాడుకుంటున్నారో అర్థం కాలేదు.

ఆ మధ్యాహ్నం జరిగిందది. వెచ్చగా, హాయిగా నీ కడుపులో ఉన్న నా దగ్గరికి రాచ్చసి వచ్చిందమ్మా! దాన్ని చూస్తూనే భయపడ్డాను. గట్టిగా అరిచాను. అయితే నా గొంతు నాకే వినిపించలేదు. నీకేం వినిపిస్తుంది? వినిపించలేదు కాబట్టే నన్ను నువ్వు పట్టించుకుని ఉండవు. లేకపోతే ఎందుకు పట్టించుకోవు? రాచ్చసి గునపాళ్ళతో నన్ను గుచ్చుతోంటే ఎంతగా ఏడ్చానో!

'అమ్మా అమ్మా! కాపాడమ్మా!' అంటూ నిన్నెంతగా పిలిచానో! పిలిచి పిలిచి అలసి పోయానమ్మా. స్పృహ పోయినట్టయిపోయాను. రాచ్చసి చేతికి చిక్కిపోయాను. ముందా రాచ్చసి నా చేతుల్ని మింగేసింది. తర్వాత నా కాళ్ళను మింగేసింది. నేను చచ్చిపోతున్నానని నాకు తెలిసిపోయింది. నువ్వెలా ఉంటావో నాకు తెలియదు. నువ్వు నన్నెంతగా ప్రేమిస్తున్నదీ నాకు తెలియదు. కాని, నీ కన్నీళ్ళు తుడవాలనీ, నువ్వు నవ్వితే చూడాలనీ ఎంతగా ఆశపడ్డానో! నా ఆశలన్నీ అడియాశలయిపోయాయి. నీ కూతురుగా పుట్టాలనుకున్నాను. నీ పోలికతో పుట్టాలనుకున్నాను. కాలేదు. కడతేరిపోయాను.

నేను మరణించిన మరుక్షణం నన్ను దేవతలందుకున్నారు. పొత్తిళ్ళలో పొదువుకున్నారు. ఇప్పుడు శారీకంగా బాధలేదు కాని, మానసికంగా కుంగిపోయానమ్మా! ఏడుస్తూంటే ఇదిగో, దేవుడి దగ్గరకి తీసుకుని వచ్చారు. అతని ఒళ్ళో పడుకోబెట్టారు. దేవుడు నన్ను ముద్దు పెట్టుకున్నాడు. తను నా తండ్రినన్నాడు. నీకేం భయం లేదని, భయపడవద్దన్నాడు. నా కన్నీళ్ళు తుడిచాడు. హాయనిపించింది. అప్పుడడిగాను, మా అమ్మ కడుపులో నన్ను మింగేసిందే రాచ్చసి, దాని పేరేమిటన్నాను.

'అబార్షన్' అన్నాడు దేవుడు.

అయిందేదో అయిపోయింది. చచ్చిపోయాను. అయినా నీకెందుకీ ఉత్తరం అంటే, నువ్వంటే నాకు చాలా ఇష్టం అమ్మా, ఎప్పటికయినా నీ కూతురుగానే పుట్టాలని ఉంది. అందుకు రాస్తున్నాను. జాగ్రత్తమ్మా! పదే పదే అబార్షన్ రాచ్చసి నీ కడుపులోకొస్తే నువ్వు తట్టుకోలేవు. చచ్చిపోతావు. రాకుండా చూసుకో! నాన్నకి కూడా చెప్పు, నిన్ను జాగ్రత్తగా చూసుకోమనీ!

ఉంటానమ్మా!
నీకు పుట్టాలని పుట్టలేకపోయిన
నీ
చిట్టితల్లి

# అమ్మ చెప్పిన ఎనిమిది అబద్ధాలు

అమ్మ కూడా అబద్ధాలాడుతుంది. మా అమ్మ ఎనిమిది అబద్ధాలు ఆడింది.

అప్పుడు నాకు ఆరేళ్ళు. రెండో తరగతి చదువు తున్నాను. పేదరికం. కడుపు నిండా తిండి ఉండేది కాదు. భోజనాల వేళ, తన కంచంలో అన్నాన్ని, నా కంచంలో పడేసిందమ్మ.

''తినమ్మా! నాకు పెద్దగా ఆకలి లేదు.'' అంది. అది అమ్మ ఆడిన మొదటి అబద్ధం.

పదేళ్ళ వయసులో అమ్మతో పాటు నాయుడిగారి పెరటిలో కాకరకాయలు ఏరేవాణ్ణి. కాకరకాయలు ఆరోగ్యానికి మంచివని, తింటే బాగా చదువొస్తుందని చెప్పేదమ్మ. కాకరకాయ కూర బాగా చేసేది. ఆఖరి ముక్క కూడా నాకు పడేస్తూ–

''తినమ్మా! నాకు కాకరకాయపడదు.'' అంది. ఇది అమ్మ ఆడిన రెండో అబద్ధం.

నేను హైస్కూల్లో జాయినయ్యాను. అమ్మ నా చదువు కోసం రాత్రీ పగలూ మిషను మీద జాకెట్లు కుట్టేది. రాత్రి పన్నెండయినా పడుకునేది కాదు.

''పడుకో అమ్మా'' అంటే–

''నాకు నిద్దర రాదురా'' అందమ్మ. ఇది అమ్మ ఆడిన మూడో అబద్ధం.

పదో తరగతి పరీక్షలు రాస్తున్నప్పుడు, నా కోసం స్కూలు గేటు ముందు, మండుటెండలో గోడ నీడలో కూర్చుని ఉండేదమ్మ. చెమటలు పట్టిపోయేది. పరీక్ష రాసి నేనొస్తే, కొంగులో చల్లగా దాచిన తాటి ముంజలిచ్చింది.

''తినమ్మా! అలసిపోయావు'' అంది.

''నువ్వు తిన్నావా?'' అడిగాన్నేను.

''నేను అలసిపోయానా చెప్పు, నీడ పట్టున హాయిగా కూర్చున్నాను'' అంది. అమ్మ ఆడిన నాలుగో అబద్ధం అది.

నాన్నకి తెలియని జబ్బు చేసింది. చనిపోయారు. నేను బాగా చదువుతానని, నన్ను చేరదీస్తూనే అమ్మను కూడా మా మాస్టారు చేరదీయాలనుకున్నారు.

''ఇలా అడుగుతున్నానని నువ్వేమీ అనుకోకు. మనిద్దరం పెళ్ళి చేసుకుందాం. బాబుని పెద్దగా చదివిద్దాం'' అన్నారో రోజు.

''మళ్ళీ పెళ్ళి నాకిష్టం లేదు మాస్టారు'' అంది అమ్మ. అది అమ్మ ఆడిన అయిదో అబద్ధం.

ఉద్యోగినయ్యాను. పట్నంలో పని చేస్తున్నాను. ఇక అమ్మ కష్టపడకూడదు. సుఖపడాలని, డబ్బు పంపిస్తే, తిరిగి నా డబ్బు నాకు పంపుతూ–

''నాకెందుకురా డబ్బు? నువ్వున్నావు చాలదూ'' అంది అమ్మ. ఇది అమ్మ ఆడిన ఆరో అబద్ధం.

నా పనితనాన్ని అమెరికా ఆహ్వానించింది. నేను అమెరికాలో స్థిరపడ్డాను. అమ్మను వచ్చేయమన్నానక్కడికి.

''నేనెందుకురా అక్కడ! నాకేం పనుందని?'' అందమ్మ. ఇది అమ్మ ఆడిన ఏడో అబద్ధం.

అమ్మ చావు బతుకుల్లో ఉంది. క్యాన్సర్ అని తెలిసి అమెరికా నుంచి పరిగెత్తుకొచ్చాను. ఆసుపత్రి బెడ్ మీద అమ్మ పుల్లలా ఉంది. బాధని పళ్ళ బిగువున అణచుకుంటోంది. ఏడుపొచ్చింది నాకు. ఏడ్చాను.

''ఎందుకమ్మా ఏడుస్తావు? నాకేం బాధ లేదు, ఊర్కో'' అందమ్మ. అలా అంటూనే చనిపోయింది. అమ్మ ఆడిన ఎనిమిదవ అబద్ధం అది. అదే ఆఖరి అబద్ధం. తొమ్మిదవ అబద్ధం ఆడేందుకు అమ్మ లేకుండాపోయింది. ఉంటే బాగుణ్ణనిపిస్తోంది.

# డైరీలో ఒక పేజీ

అమ్మ పోయింది. కర్మకాండ ముగిసింది. తనతో పాటుగా తండ్రిని పట్నానికి రమ్మన్నాడతను. వస్తానన్నాడు తండ్రి. ఆ మాట అని ఆరేళ్ళయింది. రాలేదు. మొన్నా మధ్య జ్వరం వచ్చింది. పది పదిహేను రోజులు మంచమ్మీదే ఉన్నాట్ట తండ్రి. వాళ్ళూ వీళ్ళూ చూడబట్టీ, సాయం చెయ్యిబట్టీ సరిపోయింది. లేకపోతే పోయేవాడేనని అన్నారు. అప్పుడిక ఆగలేదతను. తండ్రిని వెంటబెట్టుకుని వచ్చాడు. వచ్చిన దగ్గర్నుంచీ తండ్రిని గమనిస్తున్నాడు. ఏదో ఇబ్బంది పడుతున్నాడనిపించింది.

రాత్రి పదిగంటలు దాటింది. తండ్రేం చేస్తున్నాడో చూడ్డానికి వచ్చాడు. నిద్రపోతూ కనిపించాడు తండ్రి. తిరిగి వెళ్ళబోతుంటే అతని చూపు, తండ్రి తల కిందనున్న డైరీ మీద పడింది. చేతిలోకి తీసుకున్నాడు దాన్ని. పేజీలు తిరగేశాడు. ముందు పేజీలన్నిటా ఎవరెవరివో టెలిఫోన్ నంబర్లూ, అడ్రసులూ ఉన్నాయి. తర్వాత ఏదో ఉత్తరంలా ఉంది. వణికిన చేతితో రాశాడేమో తండ్రి, అక్షరాలు కూడా వణికిపోతున్నట్టుగానే ఉన్నాయి. అయినా అర్థం అవుతున్నాయి. చదవసాగాడతను.

నాన్నా!

అలసిపోయాను. నీరసపడిపోయాను. ముసలివాణ్ణి. దయచేసి నన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. ప్యాంటూ షర్టూ వేసుకోవడం కష్టం. వేసుకోలేను. తువ్వాలేదో చుట్టబెట్టుకుంటాను. దాన్ని కూడ గట్టిగా కట్టుకోలేను. తొలగిపోతుందది. కసురుకోకు. అన్నం తింటున్నప్పుడు చప్పుడవుతుంది. నోరు మూసుకుని

చప్పుడు కాకుండా తినలేను. అప్పుడు కూడా అసహ్యించుకోకు. గుర్తుపెట్టుకో! నీ చిన్నతనంలో నువ్వింతే! సరిగా బట్టలు వేసుకునే వాడివి కాదు. అన్నం కూడా అంతే! పెద్దగా శబ్దం చేస్తూ తినేవాడివి. ఒకే విషయాన్ని పదేపదే చెబుతుంటాను. విసుక్కోకు. చాదస్తం అని కొట్టి పారేయకు. ఓపిక పట్టు. పూర్తిగా విను. చిన్నప్పుడు నువ్వింతే! ఒకే మాటను పదేపదే చెప్పేవాడివి. నన్ను మధ్యలో మాట్లాడనిచ్చేవాడివి కాదు. నేను విన్నాను. కావాలంటే గుర్తు చేసుకో! స్నానం చేయాలనిపించదు. చెయ్యను. చెయ్యనందుకు నన్ను తిట్టకు. నువ్వు కూడా చిన్నప్పుడు స్నానం చెయ్యమంటే చేసే వాడివి కాదు. చెయ్యాలని పట్టుబడితే తెగ ఏడ్చేవాడివి. టీవి ఆన్ చేయలేను. ఫ్యాన్ వేసుకోలేను. సెల్ ఆన్ చేసి మాట్లాడలేను. 'ఇది కూడా తెలీదా' అంటూ ఒంటి కాలి మీద లేవకు. చెప్పు. వింటాను. ఒకటికి పదిసార్లు చెబితేనే గాని ఈ వయసులో బుర్రకెక్కదు. చిన్నప్పుడు నీకు నేను ఇలాగే చెప్పేవాణ్ణి. మాట్లాడుతూ మాట్లాడుతూ ఏం మాట్లాడుతున్నదీ మరిచిపోతాను. గుర్తు చేసుకునేందుకు తాపత్రయ పడుతుంటాను. అంతలోనే కోపం తెచ్చుకుని, నేను చెప్పేది వినకుండా పారిపోకు. తినాలని లేనప్పుడు తినను. తినమని బలవంతం పెట్టకు. ఎప్పుడు తినాలో, ఎప్పుడు తినకూడదో నాకు బాగా తెలుసు. కీళ్ళ నొప్పులు. నడవలేను. ఊతకర్ర క్షణక్షణానికీ అవసరం అవుతుంది. పక్కనే ఉండాలది. లేదనుకో, చేయి అందించి నన్ను నడిపించు. చిన్నప్పుడు నేను నిన్ను అలాగే నడిపించాను. ఏదో రోజు నాకు బతకాలని లేదు, చనిపోవాలని పిస్తోంది అంటాను. అందుకు నువ్వు కోపం తెచ్చుకోకు. ఆలోచించు. నీకే అర్థం అవుతుంది, నేనెందు కన్నానో! ఈ వయసులో నాకు బతకాలని ఉండదు. కాకపోతే బతకక తప్పదు. ముసలి కంపు కొడుతున్నానని, అసహ్యంగా ఉన్నానని దూరంగా పారిపోకు. దగ్గరగా తీసుకుని కూర్చో. నీ చిన్నప్పుడు నువ్వు ఎలా ఉన్నా నేను నిన్ను అలాగే దగ్గరగా తీసుకునేవాణ్ణి. నువ్వలా తీసుకుంటే ధైర్యంగా ఆనందంగా హాయిగా నవ్వుతూ చనిపోతాను. చంపాలని మాత్రం ప్రయత్నించకు!

–డైరీ మూసేశాడతను. కళ్ళు చెమర్చుకుని, తండ్రిని చూశాడు. చలికి వణికిపోతూ కనిపించాడు. దుప్పటి కప్పాడు. కప్పి, పండిన తండ్రి తలను ఆప్యాయంగా నిమిరాడు. నుదుటన ముద్దుపెట్టి, మురిసిపోయాడు.

# ఒంటి కన్ను రాక్షసి

రెండు కళ్ళుండాలి కదా! అమ్మకో కన్ను లేదు. కన్ను లేని చోట అక్కడంతా పూడుకుపోయి అసహ్యంగా కనిపిస్తుంది. అమ్మ మాట్లాడుతున్నా, నవ్వుతున్నా ఏదోలా ఉంటుంది. అమ్మ ముఖం కేసి చూడాలంటేనే భయం. అన్నం ముద్దలు తినిపిస్తున్నప్పుడు, స్నానం చేయిస్తున్నప్పుడు అమ్మ నా దగ్గరగా ఉండడాన్ని నేను తట్టుకోలేకపోయేవాణ్ణి.

స్కూలు పిల్లలందరికీ క్యారేజీలు తెస్తుందమ్మ. క్యారేజీకి నెలకీ వందరూపాయలు. ఇరవై ముప్పయి మంది పిల్లలకి క్యారేజీలు తెస్తుంది. నాకూ తెస్తుంది క్యారేజీ. అందరితో పాటు క్యారేజీ ఇచ్చి వెళ్ళిపోవడం తప్పా స్కూల్లో తినిపించలేదెప్పుడూ. ఆ రోజు నా పుట్టిన రోజు. పరీక్ష ఉందంటూ ఇంట్లో ఏమీ తినకుండా స్కూలుకి పరిగెత్తుకొచ్చేశాను. పాయసం చేసిందమ్మ. తెచ్చి తినిపించిందక్కడ. వద్దన్నా వినలేదు. అప్పుడడిగారు ఫ్రెండ్స్.

''ఆ ఒంటి కన్ను రాక్షసి మీ అమ్మా' అని. కోపం వచ్చింది. కాదన్నాను. సాయంత్రం ఇంటికొచ్చి అమ్మ మీద కేకలేశాను. ఈసారి స్కూల్లో తినిపిస్తానంటే ఒప్పుకోనన్నాను. అసలు స్కూలుకే రావద్దన్నాను.

''రాకపోతే ఎలారా? నిన్ను చదివించడం ఎలా? ఆ స్కూలే మనకి ఆదరువు'' అంది అమ్మ.

''సర్లే! ఎప్పటిలాగానే క్యారేజీ ఇచ్చి వెళ్ళిపోతాను. ఎవరికీ కనిపించను లే'' అంది మళ్ళీ. వాళ్ళకే కాదు, నాక్కూడా అమ్మ కనిపించకుండా ఉంటే బాగుణ్ణనిపించింది. అమ్మ చచ్చిపోతే ఇంకా బాగుణ్ణనిపించింది. అప్పుడెవరికీ కనిపించకుండా

ఉంటుందనిపించింది. ఆ ఆలోచన నాకు తప్పనిపించలేదు. స్కూలు చదువయిపోయింది. తర్వాత నా పీజి కూడా పూర్తయింది. అయినా అమ్మ చనిపోలేదు. నన్ను పట్టుకుని వేళ్ళాడుతోంది. నేనే తప్పుకోవాలనుకున్నాను. అమ్మకి దూరంగా... అమ్మకి కనిపించకుండా పారిపోయాను. పట్నానికి చేరుకున్నాను. అక్కడింకా పెద్ద చదువులు చదివి పెద్దవాణ్ణయ్యాను. మంచి ఉద్యోగం సంపాదించాను. అనాథనని చెప్పి, ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను.ఇప్పుడు నాకు ఇద్దరు పిల్లలు.

నేనెక్కడున్నదీ అమ్మకి తెలీదు. తెలియకుండా జాగ్రత్తపడ్డాను. అయితే ఒకరోజు హాల్లో ఆడుకుంటోన్న నా పిల్లలిద్దరూ గోల గోలగా అరుస్తోంటే వెళ్ళి చూశాను. అమ్మ! పిల్లల్ని ఆప్యాయంగా దగ్గరగా తీసుకునే ప్రయత్నం చేస్తోంది.

''దెయ్యం! దెయ్యం'' అని వణికిపోతున్నారు పిల్లలు. వాళ్ళను దగ్గరగా తీసుకుని అమ్మని దూరంగా నెట్టేశాను. వెళ్ళి వీధిలో పడిందమ్మ.

''మళ్ళీ ఈ గుమ్మం తొక్కావో చంపేస్తాను'' అన్నాను. ఆ రోజు నుంచీ మళ్ళీ ఎప్పుడూ అమ్మ కనిపించలేదు. కొన్నాళ్ళు గడిచింది. చిన్నప్పుడు చదివిన స్కూల్లో పూర్వ విద్యార్థులందరం కలిసే అవసరం ఏర్పడింది. దాంతో తప్పలేదు. ఊరికి వెళ్ళాల్సొచ్చింది. మూడురోజుల పాటు ఉత్సవాలు వైభవంగా జరిగి, ముగిశాయి. మర్నాడు పట్నానికి బయల్దేరుతోంటే... పెద్దాయన ఎవరో ' మీ అమ్మగారు నీకీ ఉత్తరం ఇమ్మన్నారు. ఈ ఉత్తరాన్ని నేనే రాసి పెట్టాను' అని వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ 'పాపం! తను చనిపోయి రెండ్రోజులయింది' అన్నాడు. రక్షించింది అనుకుని ఉత్తరాన్ని తీసి చదవసాగాను.

బాబూ!

నువ్వు ఊరిలోకి వచ్చావట కదా! అయినా నిన్ను చూడడానికి రాలేకపోతున్నాను. మాయదారి జబ్బు తినేస్తోంది. తప్పు చేశాన్రా! నిన్నూ, నీ పిల్లల్నీ భయపెట్టాను. నన్ను క్షమించు. నన్ను దెయ్యం అన్నా, ఒంటి కన్ను రాక్షసి అన్నా పర్వాలేదు. నిన్ను అనకూడదెవరూ. అంటే బాధపడతాను. అందుకే నువ్వు చిన్నతనంలో కోతికొమ్మొచ్చి ఆడుతూ కన్ను పోగొట్టుకుంటే నా కన్ను తీసి నీకు పెట్టాను. పెద్దవాడివయ్యావు. లోకాన్ని నిండుగా రెండు కళ్ళతో చూస్తున్నావు. ఆనందంగా ఉందిరా! నిన్ను కన్నందుకు గర్వంగా కూడా ఉంది.

ఉంటాను.

నీ

ఒంటి కన్ను రాక్షసి

# నాన్నకో ఆదివారం

ఎంతసేపూ ఉద్యోగం, మొగుడూ, పిల్లలే కాదు, నీకో తండ్రి ఉన్నాడన్న సంగతి కూడా నువ్వు గుర్తుపెట్టుకోవాలి. మీ అమ్మగారు పోయి పదేళ్ళయింది. ఈ పదేళ్ళలో పండగలూ, పబ్బాల్లో తప్ప మీ నాన్నగార్ని ఎప్పుడయినా ఏకాంతంగా ప్రశాంతంగా కలిశావా నువ్వు? ఎలా ఉన్నారో కనుక్కున్నావా? మళ్ళీ అంతా ఒకే వూళ్ళో ఉంటున్నాం. ఆయన రిటైరై రెణ్ణెళ్ల యిందట! మొన్ననే తెలిసింది నాకు. ఆడపిల్ల ఇంటికి రాకూడదని ఆయననుకోవచ్చు. ఆ ఇంటి ఆడపిల్లగా నువ్వు అక్కడికి వెళ్ళి రావచ్చు. నువ్వూ, నీ పిల్లలూ, నేనూ ఎప్పుడూ మనమేనా హాలీ డేని ఎంజాయ్ చేసేది? అప్పుడప్పుడూ మీ నాన్నగారు కూడా ఎంజాయ్ చెయ్యాలి. ఆయనికి కూడా టైమ్‌ను స్పేర్ చెయ్! కన్నవాళ్ళను కూడా మనం కనిపెట్టుకుని ఉండాలి. ఈ ఆదివారం నువ్వు ఆయన్తోనే గడుపుతున్నావు. పిల్లల్ని నేను చూసుకుంటాను. నువ్వు మీ నాన్నగారిని చూసుకో! వెళ్ళు.''

గట్టిగా భర్త చెప్పడంతో ఆ రాత్రికి రాత్రే తండ్రికి ఫోన్ చేసిందామె. పన్నెండు దాటిందప్పటికి. పడుకున్నాడాయన. ఇంతలో ఫోన్ రింగవడంతో అందుకున్నాడు. అట్నుంచి కూతురు మాట్లాడుతోంది. కంగారు పడ్డాడాయన.

'ఇంకేం లేదు డాడీ! రేపు ఆదివారం మీరూ నేనూ హోటల్లో లంచ్ తీసుకుంటున్నాం. తర్వాత ఇద్దరం కలిసి సినిమాకి వెళ్తున్నాం. మీరు రెడీగా ఉండండి. నేనొచ్చి పికప్ చేసుకుంటాను' అన్నదామె. ఫోన్ పెట్టేసింది. ఆదివారం ఆయన రెడీ అయ్యాడు. అప్పుడెప్పుడో తన పెళ్ళిచూపులకు కొనుక్కున్న సూట్, అది

వేసుకుని కూతురు కోసం ఎదురుచూడసాగాడు. లైబ్రరీకి వెళ్దాం రమ్మని మిత్రులొస్తే 'లేదు! మా అమ్మాయితో లంచ్‌కెళ్తున్నాను' అని గొప్పగా చెప్పాడు. సాయంత్రం పార్క్‌కి వస్తావా అంటే 'రాను! సినిమాకి వెళ్తున్నాం' అన్నాడు. కార్లో కూతురొచ్చింది. ఇద్దరూ హోటల్‌కెళ్ళారు. మెనూ చూడసాగిందామె. ఆయనకి చిన్న అక్షరాలు కనిపించవు. అందుకని మెనూ తండ్రికివ్వక తనే చూడసాగిందామె. కూతుర్ని నవ్వుతూ చూస్తూ గతాన్ని గుర్తు చేసుకున్నాడాయన. ఆమె చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఆయన మెనూ చూసేవాడు. ఇప్పుడు తనని చిన్నపిల్లాణ్ణి చేసిందనుకున్నాడు. లంచ్ అయిపోయింది. కబుర్లలో పడ్డారిద్దరూ. ఆరారా కాఫీ తాగుతూ అనేకానేకం గుర్తు చేసుకుని నవ్వుకున్నారు. సినిమా సంగతే మరచిపోయారు. ఇంతలో చీకటి పడింది. ఇంటి దగ్గర తండ్రిని డ్రాప్ చేసిందామె.

''వచ్చే ఆదివారం కాకుండా ఆ పై ఆదివారం మళ్ళీ కలుద్దాం డాడీ'' అంది.

'ఈసారి బిల్ నేను పే చేస్తాను' అన్నాడాయన. 'సరే'నని నవ్వి వెళ్ళిపోయిందామె. ఇంటికి వస్తూనే భర్తని గట్టిగా కౌగిలించుకుని ''ఐయాం వెరీ హ్యాపీ! థాంక్యూ'' అంది. నాలుగు రోజులు గడిచాయి. ఓ రాత్రి ఫోనొచ్చిందామెకు. హార్టెటాక్‌తో తండ్రి చనిపోయాడు. పక్కింటివాళ్ళు చెప్పారు. దహన కార్యక్రమాలు, దానాలూ అయిపోయాయి. ఓ మధ్యాహ్నం పోస్టొచ్చింది. కవర్ చించి చూసిందామె. హోటల్‌లో నలుగురికి టేబుల్ బుక్ చేసిన రిసీట్స్ ఉన్నాయందులో. ఏ హోటల్లో అయితే తనూ తండ్రీ లంచ్ తీసుకున్నారో అదే హోటల్లో రానున్న ఆదివారానికి టేబుల్ బుక్కయి ఉంది. తండ్రి రాసిన ఉత్తరం కూడా ఉందందులో. చదసాగిందామె.

నువ్వూ, అల్లుడూ, పిల్లలూ సరదాగా ఈ ఆదివారం గడపండి. మీ ఇష్టాయిష్టాలు నాకు తెలుసు. మీరు తీసుకునే లంచ్‌కి బిల్ పే చేసేశాను. నేనుంటే వస్తాను. లేదంటే క్షమించు. నీతో గడిపిన మొన్నటి ఆదివారాన్ని మాత్రం నేనెప్పటికీ మరిచిపోను.

నీ
డాడీ

ఆమె బాధగా కళ్ళు మూసుకుంది.

# చేజారిన క్షణాలు...

భార్యనీ, బిడ్డలిద్దర్నీ పోషించాలంటే వచ్చే జీతం చాలదు. పార్ట్‌టైం చూసుకోవాల్సిందే! చూసుకున్నాడతను. రాత్రి పన్నెం డింటి వరకూ పని చేసేవాడు. నిద్ర కమ్ముకొస్తోంటే ఇంటికి ఒంటి గంటకొచ్చేవాడు. పడుకున్నాడో లేదో తెల్లారిపోయేది. లేచాడంటే మళ్ళీ పరుగే! ఆదివారాలు తప్ప భార్యతోనూ, బిడ్డలతోనూ మాట్లాడే అవకాశమే ఉండేది కాదతనికి. కుటుంబం అంతా కలసి సరదాగా భోంచేసేది ఆదివారం నాడే! పండగలా ఉండేదారోజు. ఎప్పుడూ పండగలా ఉండాలంటే ఇంకొంచెం కష్టపడాలను కున్నాడతను. పార్ట్‌టైం వద్దు, క్వాలిఫికేషన్ పెంచుకుంటే ఉన్న చోటే మంచిస్థాయికొచ్చి రెట్టింపు జీతం సాధించవచ్చనుకున్నాడు. అందుకోసం ఒంటిగంటకు ఇంటికొచ్చి పడుకోకుండా తెల్లారి అయిదు వరకు చదువుకునేవాడు. అయిదు తర్వాతే పడుకునే వాడు. కష్టం ఫలించింది. క్వాలిఫై అయ్యాడు.

ఉన్న చోటే ఓ స్థాయికి చేరుకున్నాడు. స్థాయికి తగ్గట్టుగా మంచి ఇంట్లో ఉండాలి. పిల్లల్ని మంచి స్కూల్లో వెయ్యాలి. వెయ్యాలంటే మరి కొంచెం కష్టపడాలనుకున్నాడు. కష్టపడితే ప్రమోషన్ కొట్టొచ్చనుకున్నాడు. అందుకు ఆఫీసు తరఫున ట్రయి నింగ్ తీసుకోవాలి. రెండేళ్ళు ట్రయినింగ్. ఎక్కడ? అక్కడెక్కడో అస్సాంలో. భార్యా పిల్లలకి రెండేళ్ళు దూరంగా ఉండాలి. ఉంటా ననుకున్నాడు. వాళ్ళ బాగు కోసమే కదా! అనుకున్నాడు. ట్రయి నింగ్‌కి వెళ్ళిపోయాడు. రెండేళ్ళు గడిచిపోయాయి. పెద్దస్థాయికి చేరుకున్నాడు.

స్థాయిననుసరించే పని కూడా ఉంటుంది. ఆఫీసరయినా ఇంటికి వచ్చేసరికి పన్నెండు దాటేది. తప్పదు. ఏం చేస్తాం అనుకున్నాడతను. కారు, అపార్ట్‌మెంట్ కొన్నాడు. డబుల్ బెడ్ రూం ఫ్లాటది. పిల్లలు పెద్దవాళ్ళవ్వడంతో ట్రిబుల్ బెడ్ రూం కావాల్సొచ్చింది. ఇంకో కారు కూడా కావాలనుకున్నాడతను. కావాలంటే జీతం పెరగాలి. ఉద్యోగం మారితేనేగాని జీతం పెరిగే అవకాశం లేదు. పైగా ఏవేవో పరీక్షలు పాసవ్వాలి. పరీక్షలకు సిద్ధంకాసాగాడు. చదువులో పడ్డాడతను. ఆదివారాలు కూడా భార్యా బిడ్డలతో గడిపే అవకాశం లేకుండా పోయింది.

''ఏంటండీ ఇది? ఈ వయసులో ఈ చదువులేమిటి, అర్థం లేకపోతే సరి'' అంది భార్య.

''ఇంకో కారు, ట్రిబుల్ బెడ్‌రూం ఫ్లాట్ అవసరమా డాడీ? ఉన్నవి చాలు, వీటితోనే ఎడ్జస్టవుదాం'' అన్నారు పిల్లలు.

''ఉన్న నలుగురం సరదాగా గడపకుండా ఏంటిదంతా? ఎప్పుడూ మీరూ మీ గోలా'' చిరాకో బాధో తెలీదు. అనాల్సిన నాలుగు ముక్కలూ ముఖమ్మీదే అనేసి అతని ముందు నుంచి వెళ్ళిపోయింది భార్య.

''చెప్పింది వినండి డాడీ! ప్లీజ్'' అన్నారు పిల్లలు. వినలేదతను. పైగా నవ్వుకున్నాడు. సరిపెట్టుకోవడంలో ఆనందం లేదు. కోరుకున్నది సాధించడంలోనే ఆనందం ఉంది. సాధించాల్సిందేననుకున్నాడు. పట్టుబట్టి రాత్రీ పగలూ చదివి పరీక్షలు పాసయ్యాడు. ఉద్యోగం మారాడు. కొత్త ఉద్యోగం. ఊపిరి తీసుకునేందుకు కూడా తీరిక లేదు. ఇప్పుడు చేతి నిండా డబ్బుంది కాని, కారూ ఫ్లాటూ కొనేందుకు తీరికే లేకుండాపోయింది. భార్యాబిడ్డలతో కాలక్షేపం కూడా అందని ద్రాక్షయింది. కనీసం పాతరోజుల్లోలా ఆదివారాలయినా కుటుంబం అంతా కలిసి భోంచేయాలని పదే పదే అనుకుంటూ నెలలూ సంవత్సరాలూ గడిపేశాడతను. ఇంతలో రిటైరయిపోయాడు.

'అమ్మయ్య' అనుకున్నాడు. కొత్త కారు కొనేశాడు. ట్రిబుల్ బెడ్‌రూం ఫ్లాట్ కూడా కొనేశాడు. పిల్లలకో కారు, తనకో కారు, పిల్లలిద్దరికీ చెరో రూమ్, తనకీ భార్యకీ ఒక రూమ్. ఇక వారం అంతా కుటుంబంతోనే అనుకున్నాడు.'హాయ్ హాయి' అనుకున్నాడు. పడుకున్నాడు. తెల్లారింది. లేవలేదతను. అంత వరకూ పని చేసి పని చేసి అలసిన అతని గుండె విశ్రాంతి కోరుకుంది. ఆగిపోయింది.

# ఆదివారం అంటే అయిదు వేలు

ఆ రోజు ఆదివారం. మమ్మీ, డాడీ, తనూ ముగ్గురూ జూకి వెళ్ళారు. పక్షులను చూశారు. పాముల్ని చూశారు. పులులు, సింహాల్ని చూశారు. కోతుల్ని కూడా చూశారు. మమ్మీ అరటి పండిచ్చి కోతి ముందుకు విసరమంటే విసిరేడు తను. గాలిలోనే ఉంది అరటి పండు. ఎగిరి అందుకుంది కోతి. అందుకుని తిన సాగింది. అది అరటి పండు తింటుంటే చెప్పలేనంత నవ్వొచ్చింది తనకి. ఎంతగా నవ్వాడో! నవ్వి నవ్వి పొలమార్చుకున్నాడు. దగ్గసాగాడు. ఏకబిగిన దగ్గుతోన్న తనని చూసి మమ్మీ డాడీ చాలా ఆందోళన పడ్డారు. నీళ్ళు తాగి తను మామూలయ్యేంత వరకు వాళ్ళు మనుషులు కాలేదు. మామూలయిన తర్వాత మమ్మీ తనని ప్రేమగా దగ్గరగా తీసుకుంటే, తల మీద చేయుంచి డాడీ, నవ్వుతూ తన జుత్తంతా చెరిపేశారు. చాలా హాయనిపించిందప్పుడు.

మంచి కల! పదే పదే వస్తోంది ఇటీవల. నిజమయితే బాగుణ్ణనిపిస్తోంది. కాదు. ఫిఫ్త్‌క్లాసుకి వచ్చిన దగ్గర్నుంచి జూకి వెళ్ళాలనిపిస్తోంది తనకి. ఏ ఆదివారం అయినా మమ్మీ డాడీ తీసుకుని వెళ్తే బాగుణ్ణనిపిస్తోంది. ఆదివారాలు వచ్చి వెళ్తున్నాయి కాని, మమ్మీ డాడీ తనని జూకి తీసుకుని వెళ్ళడం లేదు. కారణం? డాడీకి ఆదివారాలు కూడా ఆఫీసే! దాంతో తను అన్ని వారాల్లాగే ఆదివారాలు కూడా ఆఫీసుకి వెళ్ళిపోయి, ఏ రాత్రో ఇంటికి వస్తున్నారు.

''ఒక్క ఆదివారం డాడీ! ఒకే ఒక్క ఆదివారం ఆఫీసుకి సెలవు పెట్టండి డాడీ! సరదాగా మీరూ, నేనూ, మమ్మీ జూకి వెళ్దాం'' అని ఎన్నిసార్లడిగాడో! అడిగిన ప్రతీసారి డాడీ సమాధానం ఒకటే!

''జూకి వెళ్తే ఓ రోజంతా పోతుంది. ఓ రోజంటే మూడు వేలు పోతాయి. అందులోనూ ఆదివారం. ఆదివారం అంటే అయిదు వేలు పోతాయి. ఎవరిస్తారు? నువ్విస్తావా?''

అయిదు వేలు తనకెక్కడివి? కాని సంపాదించాలి. చాక్‌లెట్స్ అవీ కొనుక్కోమని మమ్మీ రోజుకి ట్వంటీ రుపీస్ ఇస్తోంది. దాచాలి. దాచి అయిదు వేలు చెయ్యాలి. చేస్తే డాడీతో కలసి మమ్మీ తనూ జూకి వెళ్ళొచ్చనుకున్నాడు. దాచసాగాడు. నెలలో ఆదివారాలు తీసేస్తే మిగిలిన రోజుల్లో మమ్మీ ఇచ్చిన డబ్బులు దాచి లెక్కపెడితే అయిదు వందలు పైబడే తేలింది. అయిదువేలు కావాలంటే ఇంకా తొమ్మిది నెలలు కష్టపడాలనుకున్నాడు. ఇంతలో ఊరి నుంచి తాతయ్యా, అమ్మమ్మా వచ్చారు. తాతయ్యకి వంట్లో బాగోలేకపోతే పట్నం ఆసుపత్రిలో చూపించడానికి తీసుకొచ్చారు. చూపించారు. పర్వాలేదంటే తిరిగి  వెళ్ళిపోతూ వాళ్ళు రెండు వేలిచ్చారు తనకి. దాచాడు వాటిని. తర్వాత ఆఫీసు పని మీద మామయ్య వచ్చాడు. పొద్దున్నొచ్చి రాత్రి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ అయిదు వందలిచ్చాడు. అలాగే పిన్ని వచ్చిందోసారి. ఆమె కూడా అయిదువందలిచ్చింది. ఇలా వాళ్ళూ వీళ్ళూ అందరిచ్చిందీ కలిపితే నాలుగు వేలు కూడాయి. ఇంకొక్క వెయ్యి కావాలి. వెయ్యంటే అయిదువేలవుతాయి. అయిదువేలు డాడీకిచ్చేస్తే ఎంచక్కా జూకి వెళ్ళొచ్చనుకున్నాడు. మమ్మీనడిగాడు వెయ్యి కావాలని.

''వెయ్యి రూపాయలా! ఎక్కణ్ణుంచి తేను? నేనేం మీ డాడీలా ఉద్యోగం చేస్తున్నాననుకున్నావా?'' అంది. లేవంది.

''డాడీనడుగు, ఇస్తారేమో'' అంది. కరెక్ట్! డాడీనే అడుగుదామనిపించింది. డాడీ కోసం కాచుక్కూర్చున్నాడు రాత్రంతా. పదయింది. వచ్చార్డాడీ.

''ఏంట్రా ఇంకా నిద్రపోలేదా'' అడిగారు డాడీ.

''మీ కోసమే డాడీ! నాకో థౌజెండ్ రుపీస్ కావాలి'' అడిగాడు. ఎందుకని అడగలేదు. వెయ్యి నోటిచ్చార్డాడీ. ఇవ్వడమే ఆలస్యం. పరుగు పరుగున గదిలోకి వచ్చాడు తను. బ్యాగులో దాచుకున్న డబ్బు తీసి లెక్క పెట్టాడు. ఎక్కువా తక్కువా లేదు. సరిగ్గా అయిదు వేలున్నాయి. తీసుకుని ఒక్కుదుటున వచ్చాడు. డాడీ డిన్నర్‌కి కూర్చున్నారు.

''ఇదిగోండి డాడీ అయిదు వేలు! రేపు మీరూ నేనూ మమ్మీ జూకి వెళ్దాం'' అన్నాడు తను. డబ్బుని చూసి ఆనందపడలేదు డాడీ. ఏడ్చారు. ఏడుస్తూనే ఉన్నారు.

# నమస్కారం

స్కూల్లో వేశారు. స్కూలుకి వెళ్ళేందుకు డ్రస్ వేసుకుంటున్నాను. నిక్కరు తొడుక్కున్నాను. చొక్కా వేసుకున్నాను. చొక్కా గుండీలు పెట్టుకోవడం చాతకావట్లేదు. నువ్వు వస్తావని, గుండీలు పెడతావని ఎదురు చూశాను. నువ్వు రాలేదు. నేనే కష్టపడి, చేతి వేళ్ళు నొప్పి పెడుతున్నా గుండీలు పెట్టుకున్నాను. డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాను. ఒక్కణ్ణే కూర్చున్నాను. ప్లేట్లో టిఫిన్ పెడతావని, పంచదారలో ముంచి నా నోటికి అందిస్తావని నీ కోసం చూశాను. నువ్వు రాలేదు. స్కూలుకి టైమవుతోంటే నేనే గబగబా టిఫిన్ చేసేశాను. ఎంత గబగబా తిన్నా ప్లేటు చుట్టూ తునకలు పడకుండా జాగ్రత్తపడ్డాను. నీట్‌గా చేతులు కడుక్కున్నాను. తడి చేతులు చొక్కాకి రాసుకోలేదు. టవల్‌తో తుడుచుకున్నాను. నేనలా చేసినందుకు నువ్వుంటే ఎత్తుకుని ముద్దుపెట్టుకునేవాడివి. లేవుగా! అయితేనేం? నా అంతట నేను టిఫిన్ తినడం నేర్చుకున్నాను. స్కూలు బ్యాగ్‌తో వచ్చి, కారు దగ్గర నిల్చున్నాను. కార్లో స్కూలు దగ్గర నన్ను డ్రాప్ చేస్తావని ఆశపడ్డాను. రాలేదు నువ్వు. పిల్లలంతా కార్లలో స్కూళ్ళకి వెళ్ళిపోతుంటే బాధపడ్డాను. ఏడుపొచ్చింది. 'డాడీ' అంటూ పెద్దపెట్టున ఏడ్చాను. అయినా నువ్వు రాలేదు. స్కూలు బస్సొచ్చింది. ఎక్కి వెళ్ళిపోయాను. రాత్రి, ఒక్కణ్ణే పడుకున్నాను. నువ్వుంటే బాగుండేది. నాతో పాటుగా పడుకుని, కథలు చెప్పేవాడివి. జోకొట్టేవాడివి. కితకితలు పెట్టి నవ్వించేవాడివి. గట్టిగా కౌగిలించుకునే వాడివి. లేవుగా! అందుకని నేనే దుప్పటి కప్పుకుని ఒంటరిగా పడుకున్నాను. పడుకునే ముందు బెడ్‌ల్యాంప్ స్విచాఫ్ చేశాను. అలాగే నువ్వు చెప్పిన ప్రార్థన కూడా చేశాను.

'దేవుడా! హాయిగా నిద్రపోవాలి. మంచి కలలు రావాలి. నీ దీవెనలు కావాలి' అంటూ నోటికి వచ్చింది వల్లించాను. అది తప్పో ఒప్పో తెలీలేదు. ఆదివారం. పార్కులో పిల్లల్ని ఆడిస్తున్న తండ్రుల్ని చూస్తోంటే ఈర్ష్య కలిగింది. జంటలు జంటలుగా తండ్రీ కొడుకుల్ని చూస్తోంటే బాధ కలిగింది. మొదటిసారి అనిపించింది, నేను తండ్రి లేనివాణ్ణిని, దిక్కులేనివాణ్ణిని. అందుకు చేతుల్లో ముఖాన్ని దాచుకుని, ఎవరికీ కనిపించకుండా ఏడ్చాను. అలా చాలాసార్లు ఏడ్చాను.

పెరిగి పెద్దవాణ్ణయ్యాను. ఇప్పుడు నాకు నీ బూట్లు సరిపోయాయి. నీ కళ్ళద్దాలు, నీ టై అన్నీ సరిపోయాయి. నీలా తయారయి, ఊరవతలికి సరదాగా వస్తే, ఎవరో ఇద్దరు రౌడీలు నన్ను అడ్డగించి, డబ్బులడిగారు. లేవన్నాను. కొట్టొచ్చారు. ధైర్యం చేశాను. తిరగబడ్డాను. లాగి రెండిచ్చేసరికి పరుగుదీశారు వాళ్ళు. కొట్టినందుకు చేతులు నొప్పి పెడుతోంటే అప్పుడు తెలిసింది, ఒంటరి పోరాటానికి చిన్నప్పుడే చొక్కా గుండీలు పెట్టుకుంటున్నప్పుడే నువ్వు నన్ను సిద్ధం చేశావని. ఉద్యోగంలో జాయినయ్యాను. పనిలో చిన్న తప్పు చేశాను. ఆఫీసరు నానా మాటలూ అన్నాడు. కోపం వచ్చింది నాకు. అయినా పల్లెత్తు మాట అనలేదు. తల వంచుకునే నిల్చున్నాను. జరిగిన పొరపాటుకి 'సారీ' చెప్పాను. 'ఇట్సోకే' అని ఆఫీసరు శాంతించాడు. అప్పుడు తెలుసుకున్నాను, నా తప్పు నేనే తెలుసుకోవాలి, సరిదిద్దుకోవాలని. ఒంటరిని. ఒంటరి ప్రయాణం నాది. నా తిండి నేనే తినాలి. నా కథలు నేనే చెప్పుకోవాలి. నా కలలు నేనే కనాలి. దేవుణ్ణి ప్రార్థించి, నాకు నేనే ధైర్యం చెప్పుకుని, నా బతుకు నేనే బతకాలి.

అలాగే బతుకుతున్నాను డాడీ! నాకిప్పుడు భయాలు లేవు. భ్రమలు లేవు. నువ్వు నన్ను ఎంత ఏడిపించినా, నన్ను తండ్రి లేని వాణ్ణి చేసినా మనిషిని చేశావు డాడీ! మగాణ్ణి చేశావు. అందుకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను.

# ఎక్కడ ఉన్నా.. ఏమైనా...

తొలకరి.

సన్నగా వాన పడుతోంది. పిల్లలంతా కేరింతలు కొడు తున్నారు.

ఆకాశం బాగా మబ్బుపట్టి ఉంది. అనుమానం లేదు, వర్షం పుంజుకుంటుంది. ఈ రోజంతా వర్షం కురిస్తే చాలు! రేపో, ఆ మర్నాడో  పొలం దున్నుకోవచ్చు. తర్వాత విత్తుకోవచ్చు అను కున్నాడు సీతయ్య. రెండెకరాల పొలంకేసి చూస్తూ కూర్చున్నాడు.

రెండేళ్ళ కిందట భార్యా, కొడుకు రాజుగాడూ, తనూ ముగ్గురూ కష్టపడ్డారు. పండించారు. ఏడాది కిందట తనూ, రాజుగాడూ కష్టపడ్డారు. ఈ ఏడాదే...ఒక్కడైపోయాడు. దున్నడం తన వల్ల కాదనుకున్నాడు సీతయ్య. కన్నీళ్ళు పెట్టుకున్నాడు. భార్య ఉంటే–

''ఏంటయ్యా కన్నీళ్ళు? మగాడు ఏడవకూడదు. తుడుసుకో'' అనేది. తుడుచుకోకపోతే తుడిచేది. లేదిప్పుడు. తన కన్నీటిని తనే తుడుచుకున్నాడు సీతయ్య. ఏం జబ్బో! పాడు జబ్బు! ఒక్కసారిగా మీదపడింది. మందులు వాడుతూనే ఉంది. ప్రాణం పోయింది. ఎసరు పెట్టి, బియ్యం కడుగుతోంది. గుప్పిట బియ్యాన్ని పిసుకుతోంది. భరించలేని నొప్పితో–

''ఏఁవయ్యా'' అని కేకేసి కుప్పకూలిపోయింది. చని పోయింది. నలభై అయిదేళ్ళు తోడుగా ఉండి, ఇక ఉండలేనంటూ వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోవడంతో తనూ రాజుగాడూ ఇద్దరే మిగిలారు.

గత తొలకరి కూడా ఇలాగే ప్రారంభమయింది. అప్పుడు కూడా ఇప్పటిలాగే సన్నగా జల్లు పడి, తర్వాత పుంజుకుంది. రెండు రోజుల పాటు వర్షం కురిసింది. తెరిపిచ్చింది. పొలాన్ని రాజుగాడు ఆటగా దున్నేశాడు.

''అయిపోయిందయ్యా, ఇత్తుకో'' అన్నాడు. ఆ రాత్రి నిద్ర వస్తున్నా, ఆపుకుంటూ ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. తను చూస్తూనే ఉన్నాడు. ఇంతలో ఎక్కణ్ణుంచి వచ్చారో పోలీసులు వచ్చారు. రాజుగాణ్ణి పెడరెక్కలు విరిచి కట్టి పట్టుకుపోయారు. ఎందుకెందుకంటే–

''నీ కొడుకు పెద్ద తీవ్రవాది'' అన్నారు. రాజుగాడు జైలుపాలయ్యి ఏడాది అయిపోయింది అనుకున్నాడు సీతయ్య.

అల్లూరిసీతారామరాజు ఏకపాత్రాభినయం అన్నా, శ్రీశ్రీ కవితలన్నా రాజుగాడికి చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే ఎదిగాడు. ఎదిగెదిగి జైలుపాలయ్యాడు. ఎలా ఉన్నాడో ఏమో? ఉత్తరం రాసి చాలా రోజులయింది. ఓ చిన్న ఉత్తరం ముక్క రాద్దామనుకున్నాడు సీతయ్య. రాజుకి ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరంలో తొలకరి వర్షం గురించి, రెండెకరాల పొలం గురించి, దాన్ని దున్నడం తన వల్ల కాదంటూ రాసి పోస్ట్ చేశాడు. రెండురోజులకే జవాబు వచ్చింది. రాజు రాశాడు ఉత్తరం.

'అయ్యా! పొరపాట్న కూడా పొలం దున్నే ప్రయత్నాలు చెయ్యకు. చేస్తే పొలంలో నేను దాచిన తుపాకులూ, బాంబులూ  బయటపడతాయి.  నాకింకా ప్రమాదం.'

ఉత్తరం చదివి, ఎదురుగా ఉన్న పొలాన్ని భయం భయంగా చూశాడు సీతయ్య. దున్నని పొలం తుపాకులూ బాంబులూ ఉన్న తడిసిన దుప్పటి మూటలా కనిపించింది. అమ్మో! అనుకున్నాడు. అంతలో రెండు ట్రాక్టర్లతో  పన్నెండు మంది పోలీసులొచ్చారక్కడికి.

''ఇదేనా నీ పొలం'' అడిగారు. అవునన్నట్టుగా సీతయ్య తలూపాడంతే! ట్రాక్టర్లు పొలం మీద దాడి చేశాయి. పొలాన్ని దున్ని దున్ని వదిలిపెట్టాయి. బాంబుల కోసం, తుపాకుల కోసం అడుగంటా మట్టిని పెళ్ళగించాయి. అయితే వారికక్కడ చిన్న సూది కూడ దొరకలేదు. ఛ అనుకున్నారు పోలీసులు. నిరుత్సాహంగా వెళ్ళిపోయారు. రెండురోజులకి రాజు నుంచి మళ్ళీ ఉత్తరం వచ్చింది.

'అయ్యా! నేనేడున్నా మన పొలం దున్నిపెడతాను. బయపడమోకొ'

ఉత్తరం చదివి, దాన్ని ముద్దుపెట్టుకున్నాడు సీతయ్య.

# నర్స్

టేబుల్ మీది స్టెతస్కోప్ అందుకుని గబగబా ఆ రూం వైపుగా నడిచిందామె. ఆ రూంలో యాభై ఏళ్ళ రామ్మూర్తి మాస్టారు పేషెంట్‌గా ఉన్నారు. నాలుగయిదు గంటల క్రితం ఆయనికి హార్టెటాక్ వచ్చింది. స్లయిట్‌గా వచ్చింది. జాయి నయ్యారిక్కడ. కావాల్సిన వారు ఎవరూ దగ్గరలో లేరంటూ, ఒంటరినంటూ జాయినయ్యారు.

''నిజం చెప్పండి మాస్టారు'' అనడిగితే–

''ఓ కూతురు ఉందమ్మా'' చెప్పారు. ఎక్కడుందో చెప్పలేదు.

గదిలోకి వచ్చిందామె. స్టెతస్కోప్ అతని గుండెల మీద ఉంచి వినసాగింది. గుండె మెల్లగా ప్రయాస మీద కొట్టు కుంటోంది.

''నర్స్''

''చెప్పండి మాస్టారు'' అడిగిందామె. ఆయన చెప్పడానికి ఇష్టపడలేదు. ఏడుస్తున్నారు. ఓదార్పుగా ఆయన చేతిని గట్టిగా పట్టుకుందామె.

''మా అమ్మాయి, ఫోన్ నెంబర్ 99...'' అంటూ పది నె ంబర్లు ఒకొక్కటిగా గుర్తు చేసుకుంటూ చెప్పారు.

''అమ్మాయిని కలవాలి. ప్లీజ్! పిలిపించమ్మా. చాలా కాలంగా ఒంటరిగా బతుకుతున్నాను. ఒక్కగానొక్క కూతురు నాకు'' అన్నారు. చూస్తూండగానే ఉచ్ఛ్వాస నిశ్వాసలు వేగంగా తీసుకో సాగారు. ఆక్సిజన్‌ని పెంచిందామె. పరిస్థితి నెమ్మదించింది.

''పెన్నూ, పేపర్ కావాలి'' అడిగారు మాస్టారు. ఇచ్చిం దామె. రూం బయటికి నడిచింది. మాస్టారు చెప్పిన నెంబర్‌కి ఫోన్ చేసింది. మాస్టారుకి హార్టెటాక్ వచ్చిందని, ఆసుపత్రిలో ఉన్నారని చెప్పింది.

''అయ్యయ్యో'' ఏడ్చింది కూతురు.

''నేనూ, మా నాన్నగారూ మాట్లాడుకోమండి. మూడేళ్ళయ్యింది మా మధ్య మాటలు లేవు. నేను ప్రేమించి పెళ్ళి చేసుకున్నానని కోపం. బాగా అసహ్యించుకున్నారు నన్ను. నేనూ అంతే! నాన్నగారిని బాగా అసహ్యించుకుని 'నీలాంటి తండ్రి ఉన్నా ఒకటే! పోయినా ఒకటే' అన్నాను. తప్పు చేశానండీ! ఇప్పుడెలా ఉంది మా నాన్నకి. వస్తున్నానండీ! బయల్దేరుతున్నాను. ఓ రెండు గంటల్లో అక్కడుంటాను'' ఫోన్ పెట్టేసింది కూతురు. గంటన్నరకే పాపం ఆత్రంగా పరిగెత్తుకు వచ్చింది.

అప్పటికే అంతా అయిపోయింది. మాస్టారులో కదలిక లేకుండా పోయింది. కార్డియాక్ అరెస్ట్. మాస్టారు చనిపోయారు. అప్పుడు వచ్చింది కూతురు. భోరు భోరున ఏడుస్తూ తండ్రి గుండెల మీద వాలిపోయింది.

''మాట్లాడండి నాన్నా! మాట్లాడండి! తిట్టండి నాన్నా! గట్టిగా తిట్టండి! తప్పు చేశాను. దానికింత శిక్షా.''

మాస్టారుగారమ్మాయిని ఓదార్చ చూసిందామె. దగ్గరగా తీసుకుంది.

''ఉన్నా ఒకటే పోయినా ఒకటే అన్నాను. పోయిన తర్వాత ఇప్పుడు తెలుస్తోంది బాధ'' కన్నీరుమున్నీరుగా ఏడ్చింది కూతురు. అప్పుడు అప్రయత్నంగా చూసింది టేబుల్ మీది ఉత్తరాన్ని. అది ఎగిరిపోకుండా దాని మీద పెన్ను ఉంది. అందుకుంది ఆ ఉత్తరాన్ని. తనని ఉద్దేశిస్తూ తండ్రి రాసిందది.

తల్లీ! తప్పయిపోయిందమ్మా! నిన్ను దూరం చేసుకున్నాను. నన్ను క్షమించు!

ప్రేమతో
నీ
నాన్న

ఉత్తరాన్ని చదివి ఆనంద విషాదాలు కలగలుపుగా మళ్ళీ ఏడ్చిందా పిల్ల.

''చాలు! ఈ జీవితానికిది చాలు'' అంటూ పొంగిపోయింది. మాస్టారుగారమ్మాయిని చూసి, సంతోషించిందామె. తను తప్పు చేయలేదు. ఇద్దరు మనుషుల్ని కలిపింది. రెండు మనసుల్ని కలిపిందనుకుంది. పాపం కూతురుకేదో రాద్దామనుకున్నారు మాస్టారు. రాయలేకపోయారు. ఖాళీ కాగితం పెన్నూ అలానే ఉండిపోయాయి. పోయిన మాస్టారుని కూతురు క్షమించాలి. అలాగే తండ్రి తనని క్షమించాడని కూతురు అనుకోవాలి. అనుకోవాలంటే తను పూనుకోవాలి. పూనుకుంది. ఉత్తరం రాసి పెట్టింది. ఫలించిందది.

'నర్స్ అంటే మనిషిని చక్కదిద్దడమే కాదు, మనసును కూడా చక్కదిద్దడం' అని ఎప్పుడో చదివిన వాక్యాలు గుర్తొచ్చి దీర్ఘంగా నిశ్వసించిందామె.

# బొమ్మల పుస్తకం

రాజుగాడు చెప్పినట్టే ఉన్నాడు వాళ్ళ నాన్న. పెద్ద పెద్ద మీసాలన్నాడు. ఉన్నాయి. నుదుటి మీద పులిపిరి కాయ అన్నాడు. ఉంది. చెవిలో బాల్‌పెన్ పెట్టుకుని ఉంటాడన్నాడు. పెన్నుంది. పేరు అప్పారావు అన్నాడు. ఆ పేరుతోనే అతన్ని పిలుస్తున్నారంతా. పక్కా చేసుకుని, హోటల్లో ఓ టేబుల్ దగ్గరగా కూర్చున్నాడు రాము.

తండ్రి కొని ఇచ్చిన రంగు రంగుల బొమ్మల పుస్తకం చూపిస్తే, చూసి, చాలా పొంగిపోయాడు రాజు. రెండు మూడు కథలు చదివి, బాగున్నాయని సంబరపడ్డాడు.

''ఎంతరా'' అడిగాడు.

''వందరూపాయలు'' అన్నాడు రాము.

''నేనూ కొనుక్కుంటా. మా నాన్ననడుగుతా'' అన్నాడు రాజు. వారం రోజులయినా కొనలేదు. ఇంకా కొనలేదెందుకు? అనడిగితే, హోటల్ సర్వర్‌గా నాన్న జీతం, ఇంటికి సరిపోతోందని, పుస్తకం కొనాలంటే, టిప్ బాగా రావాలని, అమ్మ చెప్పిందని చెప్పాడు. టిప్‌గా వందరూపాయలు ఎవరిస్తారు? అన్నాడంతలోనే!

''మీ నాన్న ఎప్పుడు కొంటాడో ఏమో! నేను చదివేశాను. తీసుకో! అచ్చంగా తీసుకో'' అన్నాడు రాము. వద్దన్నాడు రాజు. వాళ్ళ నాన్న కొనాలి. తను చదవాలి అన్నాడు. పైగా రాము పుస్తకంలో పదిహేడవ పేజీ నలిగిపోయిందన్నాడు. తను కొంటే పేజీలు చక్కగా ఉన్నదీ లేనిదీ చూసుకుని మరీ కొంటానన్నాడు.

రాజంటే రాముకి ప్రాణం. పేదవాడయినా బాగా చదువుతాడని, దస్తూరి బాగుంటుందని, కబడ్డీ బాగా ఆడతాడని ఇష్టం. ఎప్పుడడిగినా నోట్స్ ఇస్తాడు రాజు. రాసి పెట్టమంటే రాసి పెడతాడు కూడా. అలాంటి వాడికి బొమ్మల పుస్తకం ఇవ్వాలి. కొనివ్వాలి. ఎలా? ఆలోచించాలోచించి ఆరాలు తీసి తీసి ఆఖరికి ఇలా హోటల్లోకొచ్చి కూర్చున్నాడు రాము.

''ఏం కావాలి?'' దగ్గరకొచ్చి అడిగాడు అప్పారావు.

''దోసె కావాలి. ఎంత?'' అడిగాడు రాము.

''ఇరవై రూపాయలు.''

''ఒక్క క్షణం'' అని, తాతయ్యా, మామయ్యా, పిన్నీవాళ్ళు అప్పుడప్పుడూ ఇచ్చిన డబ్బులు టేబుల్ కింద లెక్క చూసుకున్నాడు రాము. నూట పద్దెనిమిది రూపాయలు ఉన్నాయి. చాలదనుకున్నాడు.

''దోసె వద్దు. వడ కావాలి. ఎంత?'' అడిగాడు.

''అదీ ఇరవయ్యే'' అన్నాడు అప్పారావు.

''వద్దు.''

''మరేం కావాలి?'' విసుక్కున్నాడు అప్పారావు.

''ఇడ్లీ...ఇడ్లీ కావాలి. ఎంత?'' అడిగాడు రాము.

''పదిహేను రూపాయలు.''

''సరే.''

తెచ్చిపెట్టాడు అప్పారావు. తిన్నాడు రాము.

''బిల్'' అడిగాడు. దీనికి బిల్ ఒకటా! హేళనగా కోపంగా రాముని చూశాడు అప్పారావు. అడిగిన తర్వాత తప్పదు కాబట్టి తెచ్చి పెట్టి, ఎవరో పిలిస్తే అటుగా వెళ్ళిపోయాడు. లెక్కపెట్టి నూట పదిహేను రూపాయలు బిల్ కింద పెట్టి ఆనందంగా గబగబా వెళ్ళిపోయాడు రాము. వాడలా వెళ్ళిపోవడం అనుమానం కలిగించింది అప్పారావుకి. బిల్ చెల్లించలేదేమో అనుకున్నాడు. చూస్తే బిల్‌తో పాటు అక్కడ నూట పదిహేను రూపాయలు ఉన్నాయి.

''ఏయేయ్'' అంటూ రాము కోసం కేకేశాడు అప్పారావు. వినిపించుకోలేదు రాము. పరుగు పరుగున బయటికి వచ్చేశాడు. వందనోటుని ఆప్యాయంగా తీసి చూశాడు అప్పారావు. కొడుక్కి బొమ్మల పుస్తకం కొనిపెట్టాలనుకున్నాడు.

# ట్రాజెడీ

గణేశ్ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. చనిపోయి నెల రోజులయింది. పెద్ద సంస్థలో ఉద్యోగం, మంచి జీతం, పదిమందీ కోరుకునే హోదా...ఉద్యోగిగా అందరూ ఆశించే స్థాయిలో ఉండేవాడు గణేశ్. పేరుకి తగినట్టుగా లావుగా కూడా ఉండేవాడు. అన్నయ్యకి స్నేహితుడు. రెండు మూడు సార్లు ఇంటికొచ్చాడు. ఓసారి అన్నయ్య ఇంట్లో లేనప్పుడు, కాసేపట్లో వస్తాడు, కూర్చోండి అన్నప్పుడు, కూర్చుని ఆమెతో సరదాగా కబుర్లు చెప్పాడు. తనవి, చిన్ననాటి ఫోటోలు చూస్తోందప్పుడు. అన్నయ్యతో ఆడుకుంటున్నవీ, అల్లరి చేస్తున్నవీ ఆల్బంలో చూసి మురిసిపోతోంది.

''ఫోటోలా'' అడిగాడు. ''అవును. మీకు లేదా ఇలాంటి ఆల్బం'' అడిగింది.

''మాకిలాంటి చిన్న చిన్న ఆల్బంలు ఉండవు. మాకన్నీ పోస్టర్లే ఉంటాయి'' అని నవ్వాడు. తన భారీ శరీరమ్మీద తనే జోక్ వేసుకున్నాడు. నవ్వొచ్చింది. కాని, నవ్వలేదామె. సినిమాల మీదకు మళ్ళాయి కబుర్లు. ''సింగిల్ సీటు మీకు సరిపోదేమో'' అని నోరు జారి నాలిక కరుచుకుంది.

''దానికెందుకు నాలిక కరుచుకుంటారు. నిజమే నాకు సింగిల్ సీటు సరిపోదు, డబుల్ సీటే కావాలి. అందుకే రెండు టిక్కట్లు తీసుకుంటాను. తీసుకుని, కామన్ ఆర్మ్‌రెస్ట్‌ను తీసేసి కూర్చుంటాను'' అన్నాడు.

''ఓసారి అలాగే రెండు టిక్కెట్లు తీసుకున్నాను. పక్క పక్క సీట్లనుకున్నాను, కాదు, ఒకటి 19 అయితే ఇంకొకటి 27

అయింది'' అని పెద్దగా నవ్వాడు. అప్పుడు నవ్వకుండా ఉండలేకపోయిందామె. నవ్వింది. ''మీరు నవ్వితే బాగుంటారు. ఐ లవ్ యు.'' అన్నాడు. కోపం వచ్చిందామెకు. అప్పణ్ణుంచి మాట్లాడడం మానేసింది. మాట్లాడింది మళ్ళీ ఎప్పుడంటే...నెల క్రితం అన్నయ్య పెళ్ళిలో. పెళ్ళికూతురుకి పెట్టాల్సిన బంగారు గొలుసు, ఉంగరం, గాజులు, మంగళసూత్రాలు ఉన్న బ్యాగు రూంలో టేబుల్ మీద మరిచిపోయానని అన్నయ్య చెప్పినప్పుడు, ఫంక్షన్ హాలు నుండి ఇంటికి తప్పనిసరిగా బయల్దేరాల్సి వచ్చినప్పుడు, అప్పుడు మాట్లాడింది గణేశ్‌తో. అతనితో బైక్ మీద బయల్దేరింది. చాలా స్పీడ్‌గా పోనిస్తున్నాడు బైక్‌ని.

''ఎందుకంత స్పీడు?'' అడిగిందామె.

''అవతల పెళ్ళిముహూర్తం ముంచుకొస్తోంది, మంగళసూత్రాలవీ ఉండాలి కదా'' అన్నాడు గణేశ్. చున్నీ ఎగిరిపోయింది. ''గణేశ్'' కోపంగా అరిచిందామె. బైక్ వేగానికి భయపడి పోయింది. '' స్పీడ్ తగ్గించు'' బతిమాలింది. ''తగ్గించాలంటే, నువ్వు నాకు ఐ లవ్ యు చెప్పాలి.'' అన్నాడు గణేశ్. ఇష్టం లేదు. కష్టం అనిపించింది. అయినా బతికి బట్టకట్టడానికి, ''ఐ లవ్ యు'' అంది. అయినా స్పీడు తగ్గించలేదు గణేశ్. పైగా ''నన్నొకసారి గట్టిగా కౌగిలించుకో'' అన్నాడు. తప్పదు. కౌగిలించుకుంది. స్పీడు అలాగే ఉంది. అప్పుడన్నాడు మళ్ళీ. ''చూడూ! హెల్మెట్ నాకు ఇబ్బందిగా ఉంది. తీసి, నువ్వు పెట్టుకో'' హెల్మెట్ పెట్టుకుందామె. తర్వాత. ఊహించిందే! యాక్సిడెంట్ అయింది. గణేశ్ చనిపోయాడు. గాయాలయి ఆమె కోలుకుంది. గణేశ్ పోయినా అతని మీద కోపం చల్లారడం లేదామెకు.

నిజానికి గణేశ్ తప్పులేదప్పుడు. స్పీడుగా పోతున్న బైక్‌ను స్లో చేసే ప్రయత్నం చేశాడతను. వీలుకాలేదు. బ్రేకులు ఫెయిలయ్యాయి. తెలుసుకున్నాడది. ప్రమాదం తప్పదు. ప్రాణాలు పోయినా పోవచ్చు. పోయే ముందు ఓ చల్లని మాట, ఓ వెచ్చని కౌగిలింత ఆశించాడు. నెరవేరింది. తర్వాత ఆమెను కాపాడాలనుకున్నాడు. హెల్మెట్ ఇచ్చి కాపాడాడు. ఇది తెలియదు ఆమెకు. తెలిసే అవకాశం కూడా లేదు. అదే ట్రాజెడీ!

# చూసునా!

తాతయ్య కాలేజీ లెక్చరర్‌గా రిటైరయ్యారు. అమ్మమ్మ స్కూల్ టీచర్‌గా రిటైరయ్యింది. అయినా ఇద్దరికీ క్షణం తీరిక ఉండదు. ఎప్పుడూ బిజీగానే కనిపిస్తారు. లేచింది మొదలు పడుకునే వరకూ ఏదో పని చేస్తూనే ఉంటారు. ఏదో ఓ ఆట ఆడుతూనే ఉంటారు. ఎక్కువగా 'చూసునా' పదాన్వేషణ ఆడతారిద్దరూ. ఆట అర్థం కాలేదు కదూ! ఏం లేదు. 'చూసునా' అన్న ఈ పదాన్ని తాతయ్య ఇంట్లో ఎక్కడో ఏ మూలో రహస్యంగా రాస్తాడు. తను ఎక్కడ రాసిందీ అమ్మమ్మ అన్వేషించి కనుక్కోవాలి. అలాగే అదే పదాన్ని అమ్మమ్మ రాస్తే తాతయ్య వెతికి పట్టుకోవాలి. పందెం ఉంటుంది దానికి. గెలిచిన వాళ్ళు ఆ పూట వంట చెయ్యాలనో లేదంటే హోటల్‌కో సినిమాకో తీసు కెళ్ళి పూర్తి  ఖర్చులు భరించాలనో ఉంటుంది. ఇద్దరికీ పెన్షనొ స్తూంది. దాన్ని ఖర్చు చేస్తారు. ఇంటి నిండా 'చూసునా'లే! వంటింటి డబ్బాల కింద, బెడ్‌రూం పరుపుల కింద, కిటికీల వెనుక, పుస్తకాల మధ్య, సోఫాల కింద ఎక్కడ పడితే అక్కడ 'చూసునా'లే! కనుక్కోవడం అంత ఈజీయేం కాదు. చాలా కష్టంగా ఉంటుంది ఒకొక్కసారి. కనుగొనేందుకు రోజులు కాదు, వారాలు కూడా పడుతుంది. అయితే మరీ కష్టం అనిపిస్తే చిన్న చిన్న క్లూలివ్వాలి. అది కండిషన్. వాళ్ళిద్దరూ కలిసి తీసుకున్న ఫోటో వెనుక, హాల్లో అంత ఎత్తున ఉన్న ఫోటో వెనుక రాశారో సారి తాతయ్య. ఫ్రేం తొలగించి, రాసి మరీ పెట్టారు. కనుగొనేం దుకు అమ్మమ్మకి నెల రోజులు పైనే పట్టిందట! అలాగే అమ్మమ్మ ఓసారి గదిలో అద్దం వెనుక'చూసునా' రాసి పెట్టిందట! దాన్ని

కనిపెట్టడానికి తాతయ్యకి రెణ్ణెల్లు పట్టిందట! రోజుకి నాలుగైదుసార్లు దాని అవసరం పడుతున్నా క్లూ ఇస్తేగాని తాతయ్య కనుక్కోలేకపోయారంటుంది అమ్మమ్మ.

తాతయ్యను అమ్మమ్మ ప్రేమించి పెళ్ళి చేసుకుంది. యాభైయేళ్ళ కిందట ప్రేమ వివాహాలంటే ఎంత తెగింపు ఉండాలి? పైగా కులాంతర వివాహం. తాతయ్య ముక్కు చెక్కినట్టుగా ఉంటుందట! కళ్ళు బలే కబుర్లాడుతాయట! అందుకే ప్రేమించిందట! అరవై ఎనిమిదేళ్ళా, అయినా చూడు, ఎంత బాగున్నాడో! జున్నులా లేడూ మీ తాతయ్య అంటుంది అమ్మమ్మ. తాతయ్య కూడా అమ్మమ్మ గురించి అలాగే అంటాడు. ఇద్దరూ క్షణం విడిచి ఉండరు. ఎక్కడికి వెళ్ళినా ఇద్దరూ కలిసే వెళ్తారు. ఆఖరికి రైతుబజార్‌కి కూడా కలిసి వెళ్ళాల్సిందే! కొత్తగా పెళ్ళయిన జంటలా చేతులు పట్టుకుని నడుస్తారిద్దరూ. ఒకరికి నచ్చని పని ఒకరు చేయరు. నచ్చిన పనులే చేస్తారు. చేసిన ప్రతి పనికీ ఒకరికొకరు ప్రతి క్షణం కృతజ్ఞతలు చెప్పుకుంటారు. మెచ్చుకుంటూ ముద్దులు కూడా పెట్టుకుంటారు. పొద్దున సాయంత్రం ఇద్దరూ తప్పనిసరిగా గుడికి వెళ్ళాల్సిందే! ఎందుకంటే ఒకరి గురించి ఒకరు ప్రార్థించుకుంటారట!

ఈ మధ్య తాతయ్య ఒక్కడే గుడికి వెళ్ళి వస్తున్నాడు. కారణం అమ్మమ్మ మంచమ్మీద నుంచి లేవట్లేదు. పాపం క్యాన్సర్. అప్పుడెప్పుడో పదేళ్ళ కిందటొచ్చింది ఆ మహమ్మారి. ఆపరేషన్ చేశారు. మందులు వాడారు. తగ్గిపోయింది. ఇన్నాళ్ళకి మళ్ళీ తిరగబెట్టింది. మంచమ్మీద మూడు నెలలుందంతే! తర్వాత చనిపోయింది. చనిపోయిన తర్వాత తాతయ్య దేనికోసమో వెతుకుతూ కనిపించాడు. అర్థమయిందందరికీ. అమ్మమ్మ 'చూనునా' ఎక్కడో రాసి పెట్టి ఉంటుంది. వెతుక్కుంటున్నాడు. రేపు చనిపోతుందనగా ముందురోజు రాత్రి అమ్మమ్మ క్లూ కూడా ఇచ్చిందట! అయినా కనుక్కోలేకపోతున్నాడు. ఆఖరికి అర్థమయింది. అమ్మమ్మ నుంచి తొలగించిన గాజులు, మెట్టెలు, మంగళసూత్రాలున్న బ్యాగ్ అందుకుని, మంగళసూత్రాలు విప్పి చూశాడు. అందులో ఉంది 'చూనునా'. యురేకా యురేకా అంటూ తాతయ్య ఒకటే గంతులు.

''ఇంతకీ 'చూనునా' అంటే ఏంటి తాతయ్యా'' అడిగారెవరో.

''చూనునా అంటే 'చూడు నువ్వంటే నాకెంతిష్టమో' అని, మూడు పదాల్లోని ముందక్షరాలు మూడు కలిపితే 'చూనునా'' అన్నాడు తాతయ్య. కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

# గాలిపటం

పెళ్ళయి పదహారు రోజులు కూడా కాలేదు. వేరింటి కాపురం పెడతామని కొడుకూ కోడలూ అన్నారు. పుట్టి పెరిగిన పల్లెను కాదని పట్నం వెళ్ళిపోతామన్నారు. ఎలా బతుకుతా[్రా? అడిగారు. ఇక్కడ ఈ యేటిగట్టున చేసిన గాలిపటాలే అక్కడ హుస్సేన్‌సాగర్ గట్టున చేస్తామన్నారు. ఇక్కడ పటానికి అయిదు రూపాయలే! అక్కడయితే పటాన్ని పాతిక రూపాయలక్కూడా అమ్మొచ్చుననీ, హాయిగా బతకొచ్చుననీ అన్నారు.

ఒక్కగానొక్క కొడుకు. పెంచి, పెద్ద చేశారు. తాము తిన్నా తినకపోయినా, వాడికి పెట్టారు. ఎండా వానలకు గొడుగయ్యారు. చలికి దుప్పటి అయ్యారు. ఆటకి తోడయ్యారు. పాటకి వంతయ్యారు. ఇన్ని తాము అయినందుకు, రేపు ముసలితనాన్న వాడు ఊతకర్ర అవుతాడనుకున్నారు. కాని, అయ్యే అవకాశం లేకుండాపోయింది. పెళ్ళాంతో పట్నం వెళ్ళిపోతున్నాడు కొడుకు. బాధగా ఉంది తల్లికి. కన్నీళ్ళొస్తున్నాయి.

ఏడుస్తూన్న భార్యని చూశాడు భర్త. సన్నగా నవ్వుకున్నాడు. గాలిపటం తయారు చేయడంలో మునిగిపోయాడు. తూనిక చూశాడు. తోక పెట్టాల్సిందే, తప్పదు అనుకున్నాడు. పటానికి తోక పెట్టాడు.

''బాగుందిది! ఎంత'' అడిగాడో కుర్రాడు. అయిదు రూపాయలన్నాడతను. చెల్లించి, పట్టుకుపోయాడు దాన్ని.

ఇంతలో కొడుకూ కోడలూ వచ్చారు. ఇద్దరి చేతుల్లోనూ సంచులు ఉన్నాయి.

''వత్తాం అత్తమ్మా! ఎల్లొత్తాం మావయ్యా.''

కొడుకు వస్తానని కూడా చెప్పలేదు. వెళ్ళిపోయాడు భార్యతో.

''ఏటయ్యా, ఆళ్ళలా ఎల్లిపోతుంటే పట్టించుకోవేటి?'' భర్త మీద కోపగించుకుందామె. సమాధానం కోసం చూడలేదు. కొడుకూ కోడలూ కనుమరుగయ్యేంత వరకూ చూస్సూసి, తర్వాత మళ్ళీ తగువులోకి దిగింది.

''ఆడెల్లిపోడం నీకూ ఇష్టవేఁనేమో! సరదాగా ఉన్నావు.'' అంది. ఈసారి కూడా జవాబు లేదు అతని దగ్గర్నుంచి.

''ఆడి కోసం ఎన్ని రాత్రులు నిద్దర మానుకున్నాను. ఎన్ని పూటలు ఉపాసం ఉన్నాను. నీ కోప తాపాలే కాదు, ఆడి కోప తాపాలు కూడా బరించాను కదయ్యా! దానికిదా మిగిలింది?'' కళ్ళొత్తుకుందామె. పట్టించుకోలేదతను.

''పద, బడిపిల్లలొచ్చే ఏళయింది. యేటిగట్టున పటాలమ్ముకుందాం.'' లేచాడతను. చంకలో గాలిపటాలను పెట్టుకుని బయల్దేరాడు. వెళ్ళడం ఇష్టం లేదామెకి. అయినా బతుకు కోసం దారాలు పట్టుకుని తోడు నడిచింది.

తీసుకొచ్చిన పటాలు ఇట్టే అమ్ముడుపోయాయి గట్టున. చీకటి పడకుండానే చెల్లిపోయాయి. ఇద్దరికీ ఇంటికి వెళ్ళాలనిపించక అక్కడే కూర్చున్నారింకా.

''ఏటయ్యా, ఎల్లిపోనాళ్ల గురించి ఏటీ మాట్లాడవేటి?'' అడిగిందామె.

''ఏటి మాటాడాల? అటు సూడు, ఊపిరి బిగబెట్టి పిల్లలెలా గాలిపటాలెగరేత్తున్నారో! కొట్టుకుంటున్నాయి. కిందపడిపోతున్నాయి. సిరిగిపోతున్నాయి. అయితే మాత్రం పిల్లలు ఆటిని ఒగ్గేశారా? తోకలంటిస్తున్నారు. గాలివాటు సూస్తున్నారు. ఎగరేత్తున్నారు. ఎగిరితేనే గాలిపటాలంటారాటిని. ఇంకా ఎత్తుకు ఎగరేసేందుకు దారాలు ముడేసి మరీ రెచ్చిపోతున్నారు.

అక్కడాకాశంలో అయి ఒకదాన్నొకటి కొట్టుకుంటాయి. ఒకదాన్నొకటి కోసుకుంటాయి. కొట్టుకుని కోసుకుంటేనే ఆనందం. దూరంగా... దూరంగా ఎల్లాలయి. ఎల్లి సుక్కలయిపోవాల. కనిపించకుండా పోవాల. పోతేనే సరదా'' అని కళ్ళు తుడుచుకున్నాడతను.

''రాత్రనక, పగలనక సేసిన గాలిపటాలు ఎగరాలి. ఎగిరితేనే మన డూటీ మనం సరిగా సేసినట్టు. దానికి ఏడకూడదు. పద'' అన్నాడు. భార్యని వెంటబెట్టుకుని, ఇంటిదారి పట్టాడు.

# బాకీ

జారిలోకి సర్కస్ వచ్చి నాలుగు రోజులయింది. ప్రచారంలో భాగంగా ఒంటెల్నీ, ఏనుగుల్నీ మార్కెట్ రోడ్డులో తిప్పి చూపించారు. పులులూ, సింహాలూ కూడా ఉన్నాయట! అయితే వాటిని సర్కస్‌లోనే చూపిస్తారన్నాడు రాము. వాడికి సర్కస్ అంటే చాలా ఇష్టం. తనకి కూడా ఇష్టమే! కోతులు సైకిల్ తొక్కడం, ఏనుగులు వాలీబాల్ ఆడడం వినడమే కాని, చూడ లేదింత వరకూ. ఇప్పుడు చూడాలనిపిస్తోంది. టిక్కెట్ పదిరూపా యలు. తనకి పది, రాము స్నేహితుడు కదా, వాడికి కూడా టిక్కెట్ తనే భరించాలి. అంటే ఇంకో పది కావాలి. మొత్తం ఇరవై రూపాయలు కావాలి. ఇరవై రూపాయలు అమ్మనడిగితే ఇస్తుందా? ఇవ్వదు. కష్టపడి సంపాదించుకోమంటుంది. సంపాదించాలి. ఎలా? అనుకున్నాడు క్రిష్ణుడు.అనుకుని బాగా ఆలోచించాడు. ఆలోచించి, లేచిన్దగ్గర్నుంచీ చాలా పనులు చేసి పెట్టాడు. చేసిన పనులకి అమ్మ ఆశ్చర్యపోయింది. బుగ్గన వేలేసుకుంది. నాలుగు గంటల వరకూ చెమటోడ్చాడు క్రిష్ణుడు. అప్పుడు ఆపేశాడు పనుల్ని. సాయంత్రం ఆరుగంటలకు మొదటాట. మొదటాటకే సర్కస్‌కి వెళ్ళాలి. రెండో ఆటకి అమ్మ పంపించదు. పంపించినా తను వెళ్ళలేడు. నిద్రొచ్చేస్తుంది. నిద్రమత్తులో సింహాల్నీ, పులుల్నీ చూడడం కష్టం కదా అను కున్నాడు క్రిష్ణుడు.

వంటింట్లో టిఫిన్ చేస్తోందమ్మ. రాత్రి పూట నాన్నగారు అన్నం తినరు. టిఫిన్ చేస్తారు. అందుకని చేస్తోంది. అప్పుడు అమ్మ దగ్గరకి వెళ్ళాడు. చేతిలోని కాగితాన్ని అమ్మకందించాడు. కాగితంలో రాసినదాన్ని అమ్మ చదవాలి. చదివిందామె.

| | |
|---|---|
| దేవుడి పూజకోసం పువ్వులు ఏరినందుకు | : రూ. 2.00 |
| నావి తమ్ముడివీ బట్టలూ బొమ్మలూ సర్దిపెట్టి గదిని శుభ్రం చేసినందుకు | : రూ. 5.00 |
| కిరాణాకొట్టుకు వెళ్ళి నూనె ప్యాకెట్ తెచ్చినందుకు | : రూ. 2.00 |
| నువ్వు పూజ చేసుకుంటుంటే తమ్ముణ్ణి ఆడించినందుకు | : రూ. 3.00 |
| ఇంట్లోని చెత్త ఎత్తి పారేసినందుకు | : రూ. 2.00 |
| మేథ్స్‌టెస్ట్‌లో ఈసారి క్లాసు ఫస్టొచ్చినందుకు | : రూ. 4.00 |
| నాన్నమ్మని డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్ళి తీసుకొచ్చినందుకు | : రూ. 2.00 |
| మొత్తం | : రూ. 20.00 |

''ఇవ్వాలా'' అడిగిందమ్మ. తప్పదన్నట్టుగానే చూశాడు క్రిష్ణుడు. ఇవ్వలేదు అమ్మ. ఇవ్వకుండా కాగితాన్ని వెనక్కి తిప్పింది. ఏవేవో గుర్తు చేసుకుంటూ నవ్వుకుంటూ ఇలా రాసింది.

తొమ్మిది నెలలు నిన్ను కడుపులో మోశాను.

పైసా ఇవ్వలేదు నువ్వు.

జ్వరం వస్తే నిన్ను జాగ్రత్తగా చూసుకుంటూ, నీకేం కాకూడదంటూ రాత్రులసలు నిద్రపోయేదాన్ని కాదు. దేవుణ్ణి ప్రార్థిస్తూ కూర్చునేదాన్ని.

పైసా కూడా ఇవ్వలేదు నువ్వు.

ఎంత అల్లరి చేశావో, చేస్తున్నావో! అందరితోనూ గొడవలే! భరిస్తున్నాను.

పైసా ఇవ్వవు.

నీకు కావాల్సిన బట్టలు కొనిపెడుతున్నాను. కావాల్సిన బొమ్మలు కొనిపెడుతున్నాను. కావాల్సిన చిరుతిళ్ళు చేసి పెడుతున్నాను. అంతెందుకు, నీ ముక్కుని ప్రతి క్షణం చీరకొంగుతో తుడిచి పెడుతున్నాను.

పైసా ఇస్తున్నావా? లేదే!

వాటి సంగతి వదిలేద్దాం! నువ్వంటే పిచ్చిపడే ఈ తల్లిప్రేమకు ఏమిస్తావురా నువ్వు?

ఏమివ్వగలవు?

అమ్మ రాసింది చదివి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు క్రిష్ణుడు. అమ్మను గట్టిగా కౌగిలించుకున్నాడు. ఆమె బుగ్గ మీద ముద్దుపెట్టాడు.

''మొత్తం ఇచ్చేశాను. బాకీ లేను'' అన్నాడు. పొంగిపోయిందమ్మ.

# మనకెందుకులే!

ఎవరితోనూ గొడవలొద్దు. ఎవరి జోలికీ వెళ్ళొద్దు. మన మానాన మనం ఉందాం. అలా ఉండడమే సుఖం అనుకుంటూనే అతను ఏభై అయిదేళ్ళు గడిపేశాడు. టైమయిపోయిందని పుస్తకాల బ్యాగుతో స్కూలుకి పరిగెడుతోన్న కుర్రాడు, కాళ్ళు తడబడి కింద పడితే పట్టించుకోలేదతను. లేవలేక ఏడుస్తూ 'అంకుల్, అంకుల్' అంటున్నా తనని కాదన్నట్టుగానే వెళ్ళిపోయాడు. వర్షంలో బైక్ స్కిడ్ అయింది. పడిపోయాడా యువకుడు. నడుం విరిగినట్టుగా ఉంది. లేచేందుకు ప్రయత్నిస్తూ ఆసరా లేక ఒరిగిపోతున్నాడు. చేయందించి ఆసరా ఇద్దామన్న ధ్యాసే లేదతనికి. చూస్తూనే వెళ్ళిపోయాడు. పక్కింటాయనకి అర్ధరాత్రి హార్ట్అటాక్ వచ్చింది. గాబరాపడుతున్నారు భార్యాబిడ్డలు. తెలుస్తోందంతా. వెళ్ళి సాయం చేద్దామన్న తపనే లేదు. తెల్లారి తేల్చుకుందాం. ఇప్పుడా గోల దేనికనుకున్నాడతను.

దేన్నీ తవ్వి తలకెత్తుకోకూడదు. ఎందులోనూ తల దూర్చకూడదు. బొప్పి కడుతుంది. ఎందుకొచ్చిన గొడవ అనుకుంటాడతను. అలా అనుకోవడంలోనే హాయి ఉందనుకుంటూ ఆ రోజు రాత్రి పదిగంటల వేళ ఒంటరిగా నడుస్తున్నాడు. పని ఒత్తిడి కారణంగా అప్పటి వరకు ఆఫీసులో పని చేసి, ఇంటికొస్తున్నాడు. కిలోమీటర్ దూరంలో ఇల్లుంది. నడవాలి. కొత్తగా కట్టుకున్నాడా ఇల్లు. చెట్లూ పుట్టలూ ఉన్న ఆ దారిలో ఓ కిలోమీటర్ నడిస్తే ఇంద్రభవనం లాంటి ఇంటికి చేరుకోవచ్చు. తలుపేసుకుంటే మన లోకం మనది. ఎవరితోనూ సంబంధ బాంధవ్యాలు ఉండవు.

''హెల్ప్! హెల్ప్'' ఎవరిదో స్త్రీ గొంతు వినిపించింది. నోరు నొక్కేస్తోన్నా అరుస్తోందామె. స్పష్టంగా తెలుస్తోందది. ఎక్కణ్ణుంచి వినవస్తోందా గొంతు? ఎటు నుంచి వినవస్తోంది? జాగ్రత్తగా విన్నాడతను. ఎదురుగా పొదలోంచి వినవస్తోంది. అప్రయత్నంగా నాలుగు అడుగులు అటుగా వేసి ఆగిపోయాడు.

''వద్దు! వద్దు! వదులు'' నొక్కుకుపోయిన గొంతుని పెగల్చుకుని పోరాడుతోందామె.

రేప్ జరుగుతోంది. అనుమానం లేదు. తను కల్పించుకుంటే లేనిపోని కష్టాలు. విననట్టే ఉందాం.వెళ్ళిపోదాం అనుకున్నాడు.

ఊపిరి ఆడడం లేదామెకు. పెద్దగా శబ్దం చేస్తూ ఊపిరి తీస్తోంది.

అంటే చనిపోతోందా? చంపేస్తున్నారా? జేబులో ఫోన్ తీసి పోలీసులకి ఫోన్ చేస్తే? అమ్మో! అనుకున్నాడతను. పోలీసులతో ఎవరు పడతారు? క్షణక్షణం సాక్ష్యానికి రమ్మంటే ఉద్యోగం ఏం కాను? మనకొద్దీ బాగోతం అనుకున్నాడు. రెండడుగులు ముందుకు నడిచాడు. ఎగిరొచ్చి రాయి తలకి తగిలింది. భరించలేని నొప్పి కలిగింది. ఆ నొప్పితో కోపం కట్టలు తెంచుకుంది.

''ఎవడ్రా అది'' పొద మీదకు దూకాడతను. ఆమెను బలాత్కరిస్తోన్న వ్యక్తిని ముందుకు లాగాడు. కిందికి తోసేశాడు. లేచాడా వ్యక్తి. మీది మీది కొచ్చాడు. వచ్చిన వ్యక్తిని గట్టిగా పట్టుకుని ''నిన్ను...నిన్ను'' అంటూ వాడితో పెనుగులాడాడతను. ఆ పెనుగులాటలో చొక్కా చిరిగిపోయింది. కళ్ళద్దాలు ఎక్కడో పడిపోయాయి. ఏదీ కనిపించడం లేదు. అయినా తెగించి పోరాడాడు. దొరికిన చోట పిడిగుద్దులు గుద్దాడు. ఎక్కడ పడితే అక్కడ తన్నాడు. కరిచాడు. దాంతో పారిపోయాడా వ్యక్తి. పరిగెడుతున్న శబ్దం వినిపించింది. ఊపిరి పీల్చుకున్నాడతను.

ఎప్పుడూ లేదు. ఎందుకిలా ఆవేశపడ్డాడు? దెబ్బ తనకి తగిలిందనా? అసలా రాయి ఆ వ్యక్తే విసిరాడని ఎందుకనుకున్నాడు? తనని చంపబోతున్న వ్యక్తిని ఎదుర్కొనేందుకు చేతికి అందిన రాయిని ఆమె విసిరి ఉండవచ్చు. గురి తప్పి అది తనకి తగిలి ఉంటుంది. ఛఛ! ఆవేశం అనర్థం అనుకున్నాడతను. ఆమె ఏడుస్తోంది. పెద్ద గొంతుతో ఏడుస్తోంది. ప్రమాదం తప్పిందన్న ఆనందంలోనో, తనని కాపాడారన్న సంతోషంలోనో నిండుగా ఏడుస్తోందామె. మాట్లాడాలని లేదు. కాని మాట్లాడాడు.

''రండమ్మా! భయపడకండి! రండి'' అన్నాడతను.

''నాన్నా'' అందామె.

అతను చేష్టలుడిగిపోయాడు.

# విడాకులు

అర్ధరాత్రి. మంచి నిద్రలో ఉన్నాడతను. ఫోన్ రింగయింది. వచ్చీరానట్టుగా మెలకువ వచ్చింది. ఫోను ఆగుతుందేమోనని చూశాడు. ఆగలేదు. రింగవుతూనే ఉంది. తప్పదనుకున్నాడు. ఫోనందుకున్నాడు. చూశాడు. ఇండియా నుంచి తండ్రి.

''చెప్పండి డాడీ'' అన్నాడు.

''ఏంటి చెప్పేది. మీ అమ్మతో నేను వేగలేకపోతున్నాను. ఒకటే నస. రిటైర్ అయిన తర్వాత ఎక్కడుంటార్రా? ఇంట్లోనే కదా ఉండేది. ఉండొద్దు అంటుంది. కాలూ చెయ్యి బాగానే ఉన్నాయి కదా, ఎక్కడేనా చిన్న పని చూసుకోండి అంటోంది. పెద్ద ఆఫీసర్‌గా రిటైరయ్యాను. చిన్నపని ఏం చేస్తాను? సేవింగ్సు న్నాయి. వడ్డీ వస్తుంది. సరిపోతుంది కదా అంటే సరిపోదం టుంది. డబ్బు పిచ్చి బాగా పట్టుకుందిరా! దాంతో పాటు నగల పిచ్చి కూడా పట్టింది మీ అమ్మకి. మొన్ననేం చేసిందో తెలుసా? బ్యాంకులోంచి మూడు లక్షలు డ్రా చేసి, బంగారు గాజులూ, గొలుసూ కొనుక్కుంది. ఎందుకు కొనుక్కున్నావు? ఎవరిని అడిగి కొనుక్కున్నావని అడిగాను. దానికేవందో తెలుసా? నా డబ్బు, నా ఇష్టం అంది. మాటా మాటా పెరిగింది. చెయ్యి చేసుకున్నాను. మీ అమ్మని కొట్టాను. ఒకటే దెబ్బ. అంతే! ఇంట్లోంచి వెళ్ళి పోయింది. మీ పిన్నీ వాళ్ళింట్లో ఉంటోంది. వారం అయింది. ఇంటికి రాదు. పిలిస్తే పలకదు. పైగా 'నేనిక ఆయనతో కలిసి ఉండలేను. నాకా మొగుడు వద్దు' అందట! నాకేన్రా మీ అమ్మ కావాలి. నాకూ వద్దు. అందుకని విడాకులు తీసుకుందామను కుంటున్నాను. ఉంటాను.''

ఫోన్ పెట్టేశాడు తండ్రి. నిద్రమత్తు వదిలిపోయిందతనికి. ఈ వయసులో విడాకులా? తండ్రికి ఫోన్ చేశాడతను. మాట్లాడాడు. ఎంతగా నచ్చజెప్పినా వినడం లేదు తండ్రి. ఏం చెయ్యాలో అంతుచిక్కలేదతనికి. వారం రోజుల్లో ఇండియాకొస్తున్నాను. తొందరపడకండి అన్నాడు. ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

* * *

ఫోన్ రింగవుతూంటే అందుకుందామె. ఇండియా నుంచి తల్లి.

''హాయ్ మమ్మీ'' అంది.

''మీ నాన్నతో నేను వేగలేక పోతున్నానే! రిటైరయి ఇంట్లో కూర్చుని పనీపాటా లేక అయిందానికీ కాని దానికీ నాతో గొడవ పడుతున్నారు. మొన్న చెయ్యి చేసుకున్నారు కూడా. కొట్టారే! నాకేదో అనుమానంగా ఉంది. ఆయనకెవరో ఉన్నారే, ఆఫీసులో కొలీగ్‌నెవర్నో పట్టుకున్నారు. ఉంచుకున్నారని అంటున్నారంతా. మొన్న మాంఛి పట్టుచీర కొన్నారు. ఎవరి కంటే చెప్పలేదు. ఆ విషయంలోనే గొడవయింది. ఆ గొడవతో నన్ను ఇంట్లోంచి గెంటేశారు. నువ్వు నాకొద్దన్నారు. విడాకులు కావాలట! ఇచ్చేస్తాను. చెయ్యలేనే! నేనాయన్తో కాపురం చెయ్యలేను. ఉంటాను.''

ఫోన్ పెట్టేసింది తల్లి. అమ్మానాన్నా విడిపోతున్నారు. విడాకులు తీసుకుంటున్నారు. ఊహకంద లేదామెకి. తల్లికి ఫోన్ చేసింది. వద్దు! విడాకులు ఇవ్వొద్దంది. వినలేదు తల్లి. నేను ఇండియాకొస్తున్నాను. తొందరపడకంది. బయల్దేరిందామె.

* * *

అమెరికా నుంచి అన్నాచెల్లెళ్ళిద్దరూ ఇండియాకొచ్చారు. నాలుగేళ్ళయ్యింది ఇండియాకొచ్చి. పరుగు పరుగున ఇంటికొచ్చారు. తల్లిదండ్రుల్ని చూశారు. తల్లి పట్టుచీరలో, కొత్త బంగారు గాజులూ, గొలుసుతో మహాలక్ష్మిలా ఉంది. తండ్రి కూడా తలస్నానం అదీ చేసి మెరిసిపోతున్నాడు.

''ఏంటిదంతా?'' ఆశ్చర్యపోయారు పిల్లలు.

''ఈ రోజు మా మ్యారేజ్ డే! మీతో గడుపుకోవాలనుకున్నాం. ప్రేమగా పిలిస్తే మీరొస్తారా? రారు. అందుకని నటించాం. మీరొచ్చారు. సక్సెసయ్యాం. డబ్బే కాదు, అనుబంధాలు కూడా అవసరం. ఆలోచించండి'' అన్నారు తల్లిదండ్రులు. పిల్లలు నవ్వుకున్నారు.

# ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది

ఇద్దరు పిల్లలూ, నేనూ, మావాళ్ళిచ్చిన అవీ ఇవీ అన్నీ పట్టుకుని ట్రయిన్‌కొస్తున్నాను. మీరు స్టేషన్‌కి రండి! వీలుపడదు, కుదరదు అనకండి. సూట్‌కేసులు రెండూ, పిల్లల కోసం మా తమ్ముడిచ్చిన క్యారమ్‌బోర్డూ, పచ్చడి జాడీలు రెండూ పట్టుకుని మరీ వస్తున్నాను. మీరు తప్పకుండా రండి! సిటీబస్సు దొరక లేదు, ఆటోవాడు రెండొందలడిగాడు, అందుకే రాలేకపోయా నంటూ కబుర్లు చెప్పొద్దు. పిల్లల్ని దించి, సామాన్లు దించడం నా వల్ల కాదు. పది నిమిషాలపాటు రైలాగుతుందంటారు కాని, ఎప్పుడాగిందని? ఏడెనిమిది నిమిషాలకే ఉడాయించేస్తోందది. ఎన్నిసార్లు జరగలేదలా. అందుకనే మరీ మరీ చెబుతున్నాను. మీరు స్టేషన్‌కి తప్పకుండా రండి! అదిగో రైలు, ఇదిగో నేనంటూ దిగబడకండి! చిరాకు పడకండి! ఓ అరగంట ముందుగానే స్టేషన్‌కి రండి. ఊసుపోదని భయపడకండి. వాళ్ళనీ వీళ్ళనీ చూస్తోంటే కాలం ఇట్టే గడిచిపోతుంది. ఏవంటారంటూ అడిగి, సమాధానం కోసం చూడకుండానే కాల్ కట్చేసిన శ్రీమతిగారి ఆజ్ఞ మేరకు స్టేషన్‌కి తగలడ్డాను. తనన్నట్టుగానే అరగంట ముందుగానే వచ్చాను. వాళ్ళనీ వీళ్ళనీ చూడసాగాను. ఇద్దరు పిల్లలతో ఒకామె కనిపించింది. ఆమెకు నలభై యేళ్ళుంటాయి. పెద్దగా అందంగా లేదుకాని, పర్వాలేదు, బాగానే ఉంది. పిల్లలిద్దరూ బాగున్నారు. అన్నాచెల్లెలనుకుంటాను, సరదాగా ఆడుకుంటున్నారు. ప్రయా ణించేందుకు రాలేదు వాళ్ళు. లగేజీ లేదు. ఎవర్నో రిసీవ్ చేసు కునేందుకు వచ్చినట్టున్నారు.

ఏదో రైలొచ్చింది. ఢిల్లీ నుంచి వచ్చిందది. ప్లాట్‌ఫారమ్మీద ఇలా ఆగిందో లేదో కంపార్ట్‌మెంట్‌లోంచి దూకినట్టుగా వచ్చి

పడ్డా డతను. పరుగు పరుగున వచ్చి, చేతిలో బ్యాగును పక్కన పడేసి ముందు పిల్లలిద్దరినీ దగ్గరగా తీసుకున్నాడు.

''డాడీ డాడీ'' అంటూ వాళ్ళతన్ని చుట్టుకుపోయారు.

''హౌ ఆర్ యూ'' కొడుకునడిగాడతను. బాగున్నానన్నట్టుగా నవ్వాడబ్బాయి.

''మై బోయ్'' అంటూ కొడుకు క్రాఫ్‌ని చెరిపేశాడతను.

''హాయ్'' అంటూ అమ్మాయిని దగ్గరగా తీసుకున్నాడు. ఆ పిల్ల నుదుట మీద ముద్దుపెట్టాడు.

''మీ ఇద్దరికీ ఏం తెచ్చానో తెల్సా?''

''ఏం తెచ్చారు?''

''నీకేమో క్రికెట్ బ్యాట్'' అబ్బాయికి చెప్పాడు.

''నీకేమో మంచి డ్రస్, అద్దిరిపోయే డ్రస్'' అన్నాడమ్మాయితో.

''మరి నాకు'' అడిగిందామె.

''నీకేమో'' అని, ఆమె చేతిని అందుకున్నాడు. తర్వాత తన కుడిచేతిని గుండెల మీద ఉంచుకుని, అందులోంచి తన మనసును తీసి ఇస్తున్నట్టుగా అందుకున్న ఆమె చేతిలో ఉంచి నవ్వాడు.

''ఐ లవ్ యు'' అన్నాడు.

నెలలకు నెలలు ఢిల్లీలో ఉండిపోయి ఉంటాడు. భార్యాబిడ్డలు కనిపించగానే రెచ్చిపోతున్నా డనిపించింది. నవ్వొచ్చింది.

''కమాన్'' అని భార్యాబిడ్డలను తోడ్కొని వెళ్ళిపోతున్న అతన్ని చూసి, అడగాలనిపించి అడిగేశాను.

''ఎన్నాళ్ళయింది సార్, ఢిల్లీ వెళ్ళి.''

''మూడు రోజులయింది.''

''మూడు రోజులా'' ఆశ్చర్యపోయాను. 'మూడురోజులకే ఇంత మోజా' అనిపించింది. మూడు నెలలయింది, నా భార్యాబిడ్డలు ఊరుకి వెళ్ళి. తమ్ముడి పెళ్ళికని వెళ్ళి ఇప్పుడొస్తోంది. ఆఫీసు పని మీద నేనేవూరు వెళ్ళినా, పెళ్ళికీ పురిటికీ నా భార్యా పుట్టింటికి వెళ్ళినా రెండు మూడు నెలలు ఉండాల్సొస్తుంది. తిరిగి ఊరికి వచ్చినప్పుడు వాళ్ళను నేనుగాని, నన్ను వాళ్ళుగానీ ఇలాగే రిసీవ్ చేసుకుంటే బాగుణ్ణనిపిస్తుంది. అయితే ఇప్పటి వరకూ ఎప్పుడూ జరగలేదలా. ఆ మాటనేశాను బయటికి.

''ఎందుకు జరగదు. జరుగుతుంది. అనిపించడం కాదు, ఆచరించండి. అప్పుడే హాయిగా ఉంటుంది. కొత్త సంవత్సరంలో కొత్తగా ప్రవర్తించండి! ప్రేమ, ప్రేమని ప్రేమిస్తుంది. మరిచిపోకండి' అన్నాడతను. భార్యాబిడ్డలతో వెళ్ళిపోయాడు. మా వాళ్ళున్న రైలొస్తోంది. పాతరైలే! కొత్తగా ఉందిప్పుడు.

# కలవరించి... కల వరించి...

అక్కడ అడ్మిషన్ దొరికితే చాలు! ఆశించినట్టుగా రూపుదిద్దుకోవచ్చు. డాక్టర్ కావాలంటే డాక్టర్. యాక్టర్ కావాలనుకుంటే యాక్టర్. ఇంజినీర్ కావాలనుకుంటే ఇంజినీర్, టీచర్ కావాలనుకుంటే టీచర్. ఏదయినా కావచ్చు. ప్రైమరీ స్కూలు దగ్గర్నుంచి యూనివర్సిటీ దాకా అన్నీ ఉన్నాయక్కడ. రెండు వందల ఎకరాల్లో ఎన్నో విద్యాసంస్థలు. కాలనీలు, హాస్టళ్ళు, ఆసుపత్రులు, మార్కెట్లు...లేనివి లేవక్కడ. 'నాయుడు స్కూల్స్' అంటే చాలు, గొప్పగా చెబుతారు. అరవై ఏళ్ళ నాయుడు గారంటే చేతులెత్తి నమస్కరిస్తారంతా. తెల్లగా, సన్నగా, నెరిసిన జుత్తుతో, చెట్ల నీడల్లో నడుస్తున్నారే, అదిగో, ఆయనే నాయుడు గారు. ఇంత పెద్ద విద్యావ్యవస్థని ఎలా సృష్టించారండీ అని అడిగితే ఆయనేమంటారో తెలుసా? ఓ టీనేజ్ కుర్రాడు దీనికి ప్రేరణ అంటారు.

ఆ కుర్రాడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కలలూ కోరికలూ హెచ్చు వాడికి. 'భవిష్యత్తులో ఎవరెవరు ఏమేమి కావాలనుకుంటున్నారో రేపు వ్యాసంగా రాసి పట్టుకురండి' అని టీచరంటే ఆ కుర్రాడు రాత్రంతా కూర్చుని బొమ్మ గీసి తెచ్చాడు. వ్యాసం అడిగితే చేతికి బొమ్మ ఇచ్చాడేమిటా? అని టీచర్ ఆశ్చర్యపోయింది. కోపం కూడా వచ్చిందామెకు. వ్యాసాలు రాసిచ్చిన పిల్లలందర్నీ మెచ్చుకుని పంపేసి, ఆఖరుగా కుర్రాణ్ణి పిలిచిందామె.

''ఏంటీ బొమ్మ?'' అడిగింది.

''స్కూల్స్ టీచర్! రకరకాల స్కూల్స్. రెండొందల ఎకరాల్లో అన్ని స్కూల్సూ ఉంటాయక్కడ. మీలాంటి టీచర్స్, స్టూడెంట్స్

అందరూ అక్కడే ఉంటారు. వారి కోసం ఆసుపత్రులూ, మార్కెట్లూ అన్నీ ఉంటాయి. కేజీ నుంచి పిజీ దాకా చదువుకోవడమే కాదు, ఇష్టమయితే అక్కడే ఉద్యోగం కూడా చెయ్యొచ్చు. ఇదంతా నా కల టీచర్. నా కలనే ఇలా బొమ్మ గీశాను'' చెప్పాడా కుర్రాడు.

''మీరున్న పరిస్థితేంటీ? మీ నాన్నగారు చేస్తోన్న ఉద్యోగం ఏంటీ... ఇవన్నీ ఆలోచించావా? దురాశ దుఃఖానికి చేటన్నట్టుగా పిచ్చి పిచ్చి ఆశలు పెంచుకోకు. అలాగే పగటి కలలు కనకు'' అని, 'పూర్' అని ఇంగ్లీషులో రాసి వెళ్ళిపోయిందామె.

''నాన్నా నువ్వు చేస్తోన్న ఉద్యోగం ఏంటి?'' తండ్రిని రాత్రి అడిగాడా కుర్రాడు.

''గుమాస్తాగిరీ'' అన్నాడు తండ్రి.

''మన పరిస్థితేంటీ?'' అడిగాడు.

''ఏవుందిరా? ఉంటే తింటాం. లేకుంటే పస్తుంటాం'' అన్నాడు.

''రాత్రి నువ్వు గీసిన బొమ్మను చూసి టీచర్ ఏవందిరా'' అడిగాడు అంతలోనే. కుర్రాడు జరిగింది చెప్పలేదు. కాని, గ్రహించాడు తండ్రి. వాడి చేతిలోని బొమ్మని తీసుకుని చూశాడు. 'పూర్' అని రాసి ఉండడాన్ని చూసి కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

''నీ కోరికా నీ కలా ఇవాళ 'పూర్' కావచ్చు. నువ్వు కష్టపడితే రేపు వెరీ గుడ్, వెరీ వెరీ గుడ్ అవుతావు'' అన్నాడు. కుర్రాడి భుజం తట్టాడు. ఆ రాత్రే చనిపోయాడాయన. తండ్రిగా తను చనిపోయాడేకాని, కుర్రాడి కలను చంపలేదతను. తండ్రి చెప్పినట్టుగానే ఆ కుర్రాడు నలభై సంవత్సరాలు రాత్రీపగలూ కష్టపడ్డాడు. అనుకున్నది సాధించాడు. గ్రేట్.''

''ఆ కుర్రాణ్ణి, సారీ! అతన్ని చూడాలని ఉంది సార్'' అంటే–

''ఇదిగో ఇక్కడే ఉన్నాడు! నేనే ఆ కుర్రాణ్ణి'' అంటూ నవ్వుతారు నాయుడుగారు.

''మీ కల నిజం కావడాన్ని మీ టీచర్ చూశారా? చూస్తే ఏవన్నారు?'' అంటే–

''చూశారు. చూసి ఏవన్నారంటే 'నీ కలనే కాదు, చాలా మంది పిల్లల కలల్ని నేను అపహాస్యం చేశాను. వీళ్ళేం సాధిస్తారనుకున్నాను. నేను అనుకున్నదే నిజమయింది. చాలా మంది సాధించలేదు. వాళ్ళంతా నేను చెప్పినట్టుగా విన్నారు. నువ్వు సాధించావు. అంటే నేను చెప్పింది నువ్వు వినలేదు, నీ మనసు చెప్పింది నువ్వు విన్నావు. విని వృద్ధిలోకి వచ్చావు. వెరీ గుడ్! వెరీ వెరీ గుడ్' అన్నారు'' అని నాయుడుగారు గర్వంగా తలెగరేస్తారు.

# ఇలవేల్పు

వాళ్ళిద్దరికీ కొత్తగా పెళ్ళయింది. మాటకి కొత్తగా పెళ్ళయిందేగాని, ఆ భార్యాభర్తలిద్దరూ కొత్తగా ఏం లేరు. ఇద్దరికీ ఎప్పటి నుంచో పరిచయం ఉన్నట్టుగా, స్నేహంగా ఉంటున్నారు. ఒకరినొకరు తెగ ఏడిపించుకుంటున్నారు. పిల్లల్లా ప్రవర్తిస్తున్నారు.

''చూడండాంటీ! మీ అబ్బాయి, ఎలా గిచ్చి పారిపోతున్నారో'' కోడలుపిల్ల ఫిర్యాదు చేస్తుంది.

''తనే నన్ను గిచ్చింది మమ్మీ! చూడు, బుగ్గ ఎలా కందిపోయిందో'' అంటాడబ్బాయి. వాళ్ళ అల్లరికి అంతులేకుండా పోతోంది.

అత్తగా, అమ్మగా ఆమెకు కావాల్సింది అదే! పిల్లలిద్దరూ ఇలా వెయ్యేళ్ళుండాలనుకుంటోందామె. భర్తపోయాడు. తల్లీ తండ్రీ తానే అయి అబ్బాయిని పెంచుకొచ్చిందామె. వాణ్ణి ఓ ఇంటివాణ్ణి చేసింది. ఇల్లు ఇన్నాళ్ళకు కళకళలాడుతోందనుకుంది. అల్లరి చేస్తుందేగాని, కోడలుపిల్ల చాలా అందంగా ఉంటుంది. ఆ మాట తనంటే కోడలుపిల్ల ఒప్పుకోదు.

''మీ ముందు నా అందం ఏపాటిదాంటీ! చెవుల మీంచి జుత్తు దువ్వుకుని మీరు అచ్చు ఎలా ఉంటారో తెలుసా? ఒకప్పటి అందాలనటి సావిత్రిలా ఉంటారు'' అంటుంది.

''చాల్లే'' అని తనంటే–

''ఆంటీ సిగ్గుపడుతోందోచ్'' అంటూ గోలగోల చేయడం కోడలికి అలవాటయిపోయింది.

ఓ రోజు ముగ్గురూ టీవీ చూస్తున్నారు. 'మమ్మీ' అని గట్టిగా అరిచాడు అబ్బాయి.

''ఏమయిందిరా'' ఆందోళన చెందిందామె.

''చూడేం చేసిందో? చెవి తమ్మి మీద వేలితో గట్టిగా కొట్టింది. ఎంత నొప్పెడుతుందో'' అన్నాడబ్బాయి. కళ్ళల్లో నీళ్ళు పెట్టుకున్నాడు.

''తప్పమ్మా'' అందామె.

''సారీ'' చెప్పింది కోడలుపిల్ల. మర్నాడు అబ్బాయి చెవికి ఏదో ఆయింట్‌మెంట్ రాసుకుంటుంటే చూసింది తను. గుండె 'గుభేల్' మంది.

''ఏఁవయిందిరా?'' అడిగింది.

''ఏం లేదేం లేదు'' అన్నాడబ్బాయి. నవ్వుతూ వెళ్ళిపోయాడు. అర్థం చేసుకుంది తను. కోడలుపిల్ల వాడి చెవి కొరికి ఉంటుందనుకుందామె. చెప్పాలి అలాంటి పనులు చేయొద్దని అనుకుని, అంతలోనే మళ్ళీ 'తప్పు' అని సరిపెట్టుకుంది.

ఇంకో రోజు గోలగోలగా అబ్బాయిని ఆట పట్టిస్తోంటే ''ఏంటమ్మా'' అని అడిగింది.

''ఆంటీ! మీ అబ్బాయి చెవులకి రంధ్రాలున్నాయి. అంటే చిన్నప్పుడు ఆయనికి చెవులు కుట్టించారు కదూ! నిజమేనా?'' అడిగింది. అవునని, కాదని అనలేదామె.

''నా జుంకాలిస్తాను పెట్టుకోండి'' అని పగలబడి నవ్వుతోంది కోడలుపిల్ల. అబ్బాయి నవ్వడం లేదు. తల్లిని చూసి తలొంచుకున్నాడు.

శనివారం ఆ రోజు. ముగ్గురూ కలసి దేవాలయానికి వెళ్దామనుకున్నారు. కోడలుపిల్ల. అబ్బాయిల స్నానాలయిపోయాయి. రెడీగా ఉన్నారు. తనే రెడీ కానిది. రెడీ అవ్వాలి. స్నానం చెయ్యాలి. తొందరపడిందామె. బాత్‌రూంలోకి వెళ్తూ చెంపల మీది జుత్తును ఎత్తి ముడిపెట్టుకుంది. ఏదో అడిగేందుకు వస్తూ అత్తగారిని చూసి ఆశ్చర్యపోయింది కోడలు పిల్ల.

''ఆంటీ'' అంది అంతుచిక్కని దానిలా. 'ఏమిటి' అని తను అడగలేదు. అర్థం చేసుకోగలిగిందామె. తనకి చెవులు...అదే చెవి డొప్పలు లేవని కోడలుపిల్లకి తెలిసిపోయిందని నిర్ధారించుకుంది.

''బైబర్త్...మీరిలాగే పుట్టారా ఆంటీ?'' అడిగింది కోడలుపిల్ల.

''అమ్మకాదు, నేనలా పుట్టాను. చెవిడొప్పలు లేకుండా పుట్టాన్నేను. స్కూల్లో అందరూ ఏడిపిస్తూంటే తన చెవులు నాకిచ్చి, తనలా జుత్తులో రహస్యాన్ని దాచుకుంటూ వస్తోంది'' అన్నాడబ్బాయి.

''ఏం అందంగా లేనా?'' అడిగిందామె.

''చాలా అందంగా ఉన్నారాంటీ! అందం అంటే కను ముక్కు చెవులూ కాదు, మనసు అని అర్థమయింది'' అంది కోడలుపిల్ల. అత్తగారికి చేతులు జోడించి దణ్ణం పెట్టింది.

# ఏది ముందంటే...

జూకి వెళ్దామని ఎప్పటి నుంచో పిల్లలు పోరుపెడుతోంటే ఆఖరికి ఒప్పుకున్నాడతను. అంతా కార్లో వెళ్దామన్నారు. సరేనన్నాడతను. టిఫిన్, లంచ్ అంతా హోటల్లోనే! సాయంత్రం సినిమాకి కూడా తీసుకుని వెళ్ళాలన్నారు. ఓకే అన్నాడతను. అంతా రెడీ అయిపోయారు. ఇంతలో ఓ చిన్న మొహమాటం అడ్డుపడింది. బాస్ బంధువుకి తమ కాలనీలోనే అద్దెకు ఇల్లు చూస్తానని ఎప్పుడో మాట ఇచ్చాడతను. ఆ బంధువు ఇప్పుడొచ్చాడు. తప్పనిసరి అయింది. ఇళ్ళ వేటలో పడ్డారిద్దరూ. పొద్దుననగా వెళ్ళిన వాడు, మధ్యాహ్నం నాలుగు గంటలకు ఇంటికి వచ్చాడు. అప్పుడిక జూకి వెళ్ళే అవకాశమే లేకుండా పోయింది. దాంతో భార్య అంతెత్తున లేచింది. పిల్లలు కోపంగా చూస్తూ దూరంగా నిల్చున్నారే కాని, 'డాడీ' అంటూ ఎప్పటిలా దగ్గరకి రాలేదు. దగ్గరకు తీసుకోబోతే అందకుండా పరిగెత్తారు. తల్లితో పాటు బెడ్‌రూంలోనికి వెళ్ళి, తలుపేసుకున్నారు. ఆ నిరసనను భరించలేకపోయాడతను. కోపం వచ్చింది. కసిగా తలుపులు బాది బయటికి నడిచాడు. ఫ్రెండింటికి వచ్చాడు. ఫ్రెండ్ ఫిలాసఫీ ప్రొఫెసర్.

''ఏం జరిగింది?'' అడిగాడు ప్రొఫెసర్. జరిగిందంతా చెప్పుకొచ్చాడతను.

''ఇందులో నా తప్పేం ఉంది చెప్పు? బాస్ బంధువు. మాటిచ్చాం. తప్పలేదు.'' అన్నాడతను. నవ్వాడు ప్రొఫెసర్.

''ఎందుకా నవ్వు?'' కోపగించుకున్నాడతను.

''సారీ'' చెప్పాడు ప్రొఫెసర్. 'ఇప్పుడే వస్తాను' అని వెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగొచ్చాడు. వచ్చినప్పుడు తనతో పాటుగా ఓ గాజుపాత్రనూ, రాళ్ళనూ, చిన్న చిన్న గులకరాళ్ళనూ, ఇసుకనూ తీసుకుని వచ్చాడు. అవన్నీ టేబుల్ మీద పెట్టాడు.

''ఏంటివన్నీ'' అడిగాడతను. 'చెబుతాను' అన్నట్టుగా చేత్తో సైగ చేసి, గాజుపాత్రలో రాళ్ళను ఒకొక్కటిగా జాగ్రత్తగా వేశాడు ప్రొఫెసర్. రాళ్ళతో పాత్ర నిండిపోయింది.

''నిండిపోయింది కదా'' అడిగాడు.

''అనుమానమా'' అన్నాడతను. నవ్వాడు ప్రొఫెసర్. చిన్న చిన్న గులకరాళ్ళను ఏరేరి పాత్రలోకి జార విడిచాడు. అవి, రాళ్ళ సందుల్లో ఇరుక్కుని కూర్చున్నాయి.

''ఖాళీ ఉందా?'' అడిగాడు ప్రొఫెసర్.

''ఎక్కడ ఉంది? అంతా నిండిపోతేను'' అన్నాడతను. నవ్వాడు ప్రొఫెసర్. గాజుపాత్రలో ఇసుకను సన్నగా పోశాడు. రాళ్ళ మధ్య, గులకరాళ్ళ మధ్య ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ చొరుకుని ఇసుక తిష్ట వేసింది.

''ఇప్పుడు పూర్తిగా నిండిందనుకుంటాను'' అన్నాడు ప్రొఫెసర్.

''అవును. మరింక ఖాళీ లేదు'' అన్నాడతను.

''కదా! ఇప్పుడీ గాజుపాత్రే జీవితం అనుకుంటే ఈ జీవితాన్ని ముందు రాళ్ళతో అంటే... కుటుంబంతో, భార్యాబిడ్డలతో, ఆరోగ్యంతో, ఆనందంతో నింపే ప్రయత్నం చెయ్యి. ఖాళీ ఉంది కదా, అప్పుడు ఆ ఖాళీని గులకరాళ్ళతో అంటే...మంచి సంస్థలో ఉద్యోగం, విశాలమయిన ఇల్లు, చూడచక్కని కారు లాంటి వాటితో నింపు. ఆ తర్వాత ఇంకా ఖాళీ ఉంది కదా, అప్పుడు ఇసుకతో అంటే...చిన్న చిన్న మొహమాటాలు తీర్చడం, తప్పనిసరి ఇబ్బందులు ఎదుర్కోవడం చెయ్యి. అంతేకాని, ముందే ఇసుకతో గాజుపాత్రను నింపేస్తే చిన్న చిన్న మొహమాటాలతో, ఇబ్బందులతో తలమునక లయితే అప్పుడు నీ భార్యాబిడ్డలకూ, స్వర్గసీమలాంటి ఇంటికీ చోటు ఉండకుండాపోతుంది. ఆలోచించుకో'' అన్నాడు ప్రొఫెసర్.

ఆలోచనలో పడ్డాడతను.

''దేనికి ప్రాధాన్యత ఇవ్వాలో ముందు మనం తెలుసుకోవాలి. తెలుసుకోగలిగితే ఈ గొడవలే ఉండవు. అయిపోయిందేదో అయిపోయింది. ఇప్పటికీ మించిపోయింది లేదు. ఇంటికి వెళ్ళి అందరికీ సారీ చెప్పి, సినిమాకి తీసుకుని వెళ్ళు. డిన్నర్ హోటల్లో చేసి రండి'' అన్నాడు ప్రొఫెసర్. అతను అక్కణ్ణుంచి పరుగుదీశాడు.

# రహస్యం

పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాడు. ఉద్యోగం చేయాలని లేదు. ఏదైనా వ్యాపారం చేయాలనుకున్నాడు. ఉద్యోగాలు చేస్తే గొర్రె తోక బెత్తెడులా జీవితం ఉంటుందని అసహ్యించుకున్నాడు. వ్యాపారం చేస్తే ఎత్తులకు ఎదగొచ్చని ఆశపడ్డాడు. పెట్టుబడి తండ్రిని అడిగాడు. ఐస్‌క్రీం పార్లర్ పెట్టాడు. రెండు మూడు నెలలు బాగానే గడిచింది. తర్వాత సమస్యలు ప్రారంభ మయ్యాయి. మూసేయాల్సి వచ్చింది. ఓడిపోయాననుకున్నాడు. తర్వాత క్లాత్ స్టోర్స్ పెట్టాడు. భారీ ఎత్తున పెట్టాడు. ప్రచారం కోసం హైదారాబాద్ నుంచి సినిమా హీరోయిన్‌ని ఆహ్వానించి ఆమె చేతనే ప్రారంభోత్సవం జరిపించాడు. ఏడాది తిరగకుండానే అప్పులపాలయిపోయాడు. వేరొకరికి క్లాత్ స్టోర్స్ అమ్మాల్సి వచ్చింది. కన్నీళ్ళొచ్చాయతనికి. మూడోసారి ముడి పడుతుందని ముచ్చటగా హోటల్ పెట్టాడు. ఆరు నెలలకే చేతులెత్తేశాడు. తండ్రి ముందు తల దించుకుని నిలబడ్డాడు.

''మళ్ళీ వ్యాపారమే చేస్తావా?'' అడిగాడు తండ్రి.

''వ్యాపారమే చేస్తాను. ఉద్యోగం చెయ్యను'' అన్నాడతను.

''కాకపోతే విజయరహస్యం తెలుసుకోవాలి. ఓటమి భరించ లేకపోతున్నాను'' అన్నాడు.

''అయితే చక్రవర్తి అంకుల్‌ని కలువు. వెళ్ళు'' అన్నాడు తండ్రి. బయల్దేరాడతను. పేరుకే చక్రవర్తి కాని, అంకుల్ సాదాసీదా మనిషి. పల్లెటూరులో ఉంటున్నాడు. అరవై ఏళ్ళు పైబడి ఉంటుంది వయసు. పుస్తకాలు చదువుకుంటూ తాతలు కట్టిన

పాత ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. పిల్లలు అమెరికాలో సెటిల్ అయ్యారట! భార్య ఈ మధ్యనే పోయిందని చెప్పాడు.

''వ్యాపారం చేస్తావు. విజయరహస్యం కావాలి. అంతేనా?'' నవ్వుతూ అడిగాడు అంకుల్.

''అంతే'' అన్నాడతను.

''రేపు నదిగట్టుకి రా'' అన్నాడు అంకుల్. వచ్చాడతను. ఎండలో ఇద్దరూ ఇసుకలో నడవసాగారు. ఇసుకలో నడవడం ఇబ్బందిగా ఉంది. అయినా భరించాడతను. తర్వాత నదిలోకి దిగారు. చల్లగా అనిపించి, హాయనిపించింది. మోకాళ్ళ లోతు వరకు నడిచారిద్దరూ. ఇంకా నడవాలన్నాడు అంకుల్.

''మునిగిపోతాం అంకుల్'' అన్నాడతను.

''మునిగిపోం. పద.''

ఇద్దరూ నడవసాగారు. అంకుల్‌కి భయం లేదు. అతనికి చాలా భయంగా ఉంది. మెడలోతు నీళ్ళలోకి దిగిపోయాడతను. ముందుకు మరో అడుగు వెయ్యాలంటే మునిగిపోతాడు. అనుమానం లేదు. వెయ్యలేదతను.

''నడువు'' అంటూ అంకుల్ అతని జుత్తు పట్టుకుని ముందుకు తోశాడు. మునిగిపోయాడతను. మునిగిపోవడం కాదు, ముంచేస్తున్నాడంకుల్. ముఖాన్ని పైకెత్తనివ్వకుండా అదిమి పెడుతున్నాడు. ఊపిరి ఆడడం లేదు. గింజుకుంటున్నాడతను. ప్రాణాలు పోతున్నట్టనిపించింది. అప్పుడు పైకి లాగాడు అంకుల్. ఊపిరి తీసుకున్నాడతను. ప్రాణం లేచొచ్చింది. వెనక్కి తిరిగారిద్దరూ. మోకాళ్ళ లోతు దగ్గరగా వచ్చారు.

''ఏంటంకుల్ నన్ను చంపేద్దామనుకున్నారా?'' అడిగాడతను.

''లేదు. నీకో రహస్యం చెబుదామనిపించి అలా చేశాను.''

''నీళ్ళలో నీకేమనిపించింది?'' అడిగాడు అంకుల్.

''ఊపిరి తీసుకోవాలి. గాలి కావాలి. బతికి బట్టకట్టాలనిపించింది.''

''విజయం కావాలంటే ఇంతకింతా కష్టపడాలి. ప్రాణాలు పణం పెట్టాలి. నీళ్ళలో ప్రాణవాయువు కోసం ఎంతగా గింజుకున్నావో అలాగే ప్రాణవాయువు కంటే ఎక్కువైన విజయం కోసం ప్రతిక్షణం నిన్ను నువ్వు కష్టపెట్టుకోవాలి. అదే విజయరహస్యం'' అన్నాడు అంకుల్. అతను నవ్వుతూ దోసిట నీళ్ళు తీసి విసిరాడు. చుక్క చుక్కనా ఇంద్రధనుస్సు విరిసిందప్పుడు.

# అమాయకుడు

క్షణానికో కోరిక. నెరవేరవు. బాధపడతాం. కోపం వస్తుంది. కనిపించని దేవుని మీద కన్నెర్ర చేస్తాం. తిడతాం. అతనిపై దుమ్మెత్తి పోస్తాం. న్యాయమా ఇది? అంటే కాదంటాడు కాంతా రావు. పైగా తప్పంటాడు.

కార్పెంటర్ కాంతారావుకి నలభై అయిదేళ్ళు. గత అయిదేళ్ళుగా ఆ అపార్ట్‌మెంట్‌లో అతను అందరికీ బాగా తెలుసు. యాభై ఫ్లాట్స్. ఏదో ఫ్లాట్‌లో ఉడ్‌వర్క్ చేస్తూ గ్యాంగుతో కనిపించేవాడు. తన పని తాను శ్రద్ధగా చేసేవాడు. ఇతరుల పనిలో జోక్యం చేసుకునేవాడు కాదు. పొద్దున పదిగంటలకు పనిలో పడితే సాయంత్రం ఆరు గంటల వరకు దించిన తల ఎత్తకుండా పని చేసేవాడు. అందరూ టీకంటూ, సిరగెట్‌కంటూ పని వదిలిపెట్టి బయటికి వెళ్ళిపోయేవారు. కాంతారావు పని వదిలే ప్రసక్తే లేదు. వదిలి పెట్టాడంటే ఆ పూటకి పని పూర్తయి నట్టే లెక్క. చేసిన పనిలో తప్పుందేమో అని పదేపదే చూసేవాడు. తప్పుంటే సరిదిద్దుకునేవాడు. చిన్న లోపం కనిపించినా తట్టు కోలేకపోయేవాడు. పనే జీవితంగా బతికేవాడు. పని కోసమే పుట్టాడేమో అనిపించేది అతన్ని చూస్తే.

అప్పుడెప్పుడో కాంతారావు ముఖమ్మీద చిన్న గడ్డ లేచిందట. కొద్ది రోజుల్లోనే అది పెరిగి పెద్దదయిందట. నొప్పి లేదు. డాక్టర్‌ని కలిస్తే కేన్సర్ అన్నారట. గడ్డను తొలగించారు. ముఖం తొస్సిపోయింది. తర్వాత మళ్ళీ గడ్డ లేచింది. మళ్ళీ తొలగించారు. ముఖం మరింతగా ముడుచుకుపోయింది. ఆర్నెళ్ళకీ ఏడాదికీ ముఖంలో ఎంతో కొంత భాగం పోతూనే

ఉంది. ముఖమ్మీద బ్యాండేజీతోనే కనిపిస్తున్నాడు కాంతారావు. తెలిసీ తెలిసీ అడుగుతున్నారంతా. ఏంటీ బ్యాండేజీ? ఎందుకలా ఉన్నావంటూ. దానికి కాంతారావు నవ్వే సమాధానమయ్యేది.

''దేవుడికి బుద్ధి లేదయ్యా! నీలాంటి వాడికా ఇలాంటి శిక్ష'' అంటే–

''దేవుడు చాలా గొప్పవాడయ్యా. మంచివాడు కూడా. నాకెలాంటి హానీ చెయ్యలేదతను. దయచేసి తిట్టకండి.'' అనేవాడు కాంతారావు.

కళ్ళు తప్ప ముఖంలో మరే భాగమూ కనిపించని స్థితికి వచ్చేశాడు కాంతారావు. ముఖాన్ని బ్యాండేజీ కప్పేసింది. బాగా నీరసించిపోయాడు. అయినా పని మానుకునేవాడు కాదు. దృష్టి కూడా మందగిస్తూ వస్తోంది. కళ్ళు పెద్దవి చేసుకుని పని చేసేవాడు. చేతులకి బలం తగ్గింది. గంటలో పూర్తయ్యే పని, రెండు మూడు గంటలక్కాని పూర్తయ్యేది కాదు. కాంతారావు కలసి రాలేదు మేస్త్రీకి. గ్యాంగులోంచి తీసేశాడతన్ని.

''వాడిచ్చేదేమిటి నీకు పని? మేమిస్తాం. చెయ్యి'' అన్నారు అపార్ట్‌మెంటు వాసులు. చిన్న చిన్న పనులు చేయించుకోసాగారు. పనిముట్లు మేస్త్రీవట! అవి దగ్గర ఉంచుకోవాలంటే, తాను పంపిన కుర్రాడికి పని నేర్పాలన్నాడు మేస్త్రీ. నేర్పసాగాడు కాంతారావు. పని నేర్పుతూ ఎన్నడూ కుర్రాణ్ణి కసిరిన పాపాన పోలేదు. చిన్న తప్పు చేస్తే సరిదిద్దేవాడు. పెద్ద తప్పు చేస్తే తన మీద వేసుకునేవాడు. అంతేకాని, కుర్రాడి కళ్ళు చెమర్చనిచ్చేవాడు కాదు. నడవలేని స్థితికి వచ్చాడు కాంతారావు. ఆసరా ఉంటేనే కాని, నిలబడలేకపోతున్నాడు. అప్పుడు చేతికర్ర చెక్కి ఇచ్చాడు కుర్రాడు. డిజైన్ బాగుందని తెగ మెచ్చుకున్నాడు వాణ్ణి. కర్రని ముద్దుపెట్టుకున్నాడు.

''పనే ప్రాణం. పనే దైవం. పనే శాంతి. విశ్రాంతి.'' అని పనిముట్లు ఇచ్చేసి, అప్పణ్ణుంచే సెలవు తీసుకున్నాడు కాంతారావు. మర్నాడే చనిపోయాడు.

ఎవరో అన్నారట కాంతారావుతో.

''దేవుడు దుర్మార్గుడయ్యా! నిన్ను క్షణక్షణం చంపాడు.''

''లేదమ్మా! దేవుడు చల్లగా చూశాడు కాబట్టే హాయిగా వెళ్ళిపోతున్నాను. అమాయకుడమ్మా దేవుడు.''

కాంతారావు మాట నిజం. దేవుడు అమాయకుడే! అమాయకుడు కాబట్టే పని తెలిసినవాణ్ణి పట్టుకుపోయాడంటున్నారిప్పుడు.

# గుర్తు

కొంటే కారే కొంటానంటూ ఆఖరికి ఎలాగయితేనేం కారు కొన్నాడతను. ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో తీసుకున్నాడు. చేతికి కారొచ్చేసరికి మధ్యాహ్నం రెండయింది. ఆకలి వేస్తున్నా లంచ్ చెయ్యకుండా ఆలయానికి పోనిచ్చాడు కారుని. కునుకు తీస్తున్నారు పూజారిగారు. దాన్ని చెడగొట్టి మరీ పూజ చేయించాడు. తర్వాతే గర్ల్‌ఫ్రెండ్ సుమతితో కలిసి హోటల్లో లంచ్ చేశాడు. హోటల్ దగ్గర పార్కింగ్ బాగా ఇరుగ్గా ఉంటుంది. అక్కడ పార్కింగ్ చేస్తే కారుకి ఏదో రకంగా డామేజీ తప్పదు. అందుకని కిలోమీటర్ దూరంలో ఓ చెట్టు కింద కారుని పార్కింగ్ చేసి, సుమతితో ఎంచక్కా చెమటలు పట్టిపోతూ ఎండలో నడిచొచ్చాడు హోటల్‌కి. సాయంత్రం సన్నగా వాన పడితే బాగుణ్ణనుకున్నాడు. సిగరెట్ తాగుతూ, వానలో కారు డ్రైవ్ చేయడం అంటే సరదా అతనికి. అనుకున్నట్టుగానే వాన ప్రారంభమయింది. సన్నగా కురుస్తోంది. ఆ వానలో చిన్ననాటి స్నేహితుణ్ణి చూడ్డానికీ, వాడికి కారు కూడా చూపించడానికీ బయల్దేరాడు. కారు కొన్న సందర్భంగా అతని పేరుని ఎంబ్రాయిడరీ చేసిన కర్చీఫ్‌ని ప్రెజెంట్ చేసింది సుమతి.

''దీన్ని పాడు చేయకు'' అంది. కర్చీఫ్‌ని ముద్దుపెట్టుకుని మరీ ఇచ్చింది. రేడియోలో పాటలు వింటూ కారు డ్రైవ్ చేస్తున్నాడతను. ముప్పయ్... నలభై.... యాభై.... అరవై... డెబ్భై... ఎనభై కిలోమీటర్ల వేగంలో పోతున్నాడు. సిగరెట్ తాగుతూ డ్రైవ్ చేస్తున్నాడు. ఎందుకో స్లో చేస్తే బాగుణ్ణనిపించింది. అయినా పట్టించుకోలేదు. స్పీడుగా వెళ్తున్నాడు. 'ఫట్' మంటూ శబ్దం అయింది. కారుకేదో తగిలింది. స్లో చేసి, కారాపాడతను. దిగి

చూశాడు. ముందు భాగంలో సొట్ట పడి ఉంది. ఎవరో రాయితో కొట్టారు, అనుమానం లేదనుకుంటూ చూశాడు. రాయి కనిపించింది. కొట్టింది ఎవరంటూ చూస్తే పన్నెండేళ్ళ కుర్రాడు కనిపించాడు. వాడి చేతిలో ఇంకో రాయి కూడా ఉంది. పట్టుకున్నాడు వాణ్ణి. నెత్తి మీద రెండిచ్చాడు. తిట్టాడు. విసురుగా లాక్కొచ్చి, కారు సొట్టని చూపించాడు.

''కొత్త కారురా, చూడేం చేశావో'' అన్నాడు.అసలెందుకు కొట్టావన్నాడు. సమాధానంగా చేయెత్తి అటుగా చూపించాడా కుర్రాడు. చూశాడతను. అక్కడ వాలులో కింద ఓ మనిషి పడిపోయి ఉన్నాడు. అతని పక్కన వీల్‌చైర్ ఉంది.

''మానాన్న సార్. పాపం! పక్షవాతం. ఆసుపత్రికి తీసుకెళ్తున్నాను. కాలికి రాయి తగిలింది. తూలి పడ్డాను. దాంతో నాన్న కూడా అలా పడిపోయారు. లేపి, నాన్నని చైర్‌లో కూర్చోపెడదామంటే నా వల్ల కావడం లేదు. సాయానికి పిలుద్దామంటే అంతా కార్లలోనే వెళ్తూ కనిపిస్తున్నారు. కేకేసి ఆపమంటే ఆపట్లేదు. చేసేది లేక, రాయి విసిరాను. తప్పే! కాని...'' ఏడుస్తున్నాడు కుర్రాడు.

''ఏడవకు'' అన్నాడతను. కుర్రాడి కన్నీళ్ళను తుడిచాడు. వెళ్ళి పడిపోయిన కుర్రాడి తండ్రిని లేపాడు. చైర్లో కూర్చోపెట్టాడు. కాలూ చెయ్యీ రక్కుకుపోయాయి. రక్తం వస్తూంది. సుమతి ఇచ్చిన కర్చీఫ్ అందుకున్నాడు. దాంతో గాయాల దగ్గర తుడిచి, దాన్నే కట్టుగా కట్టాడు.

''వెళ్ళిరా'' అన్నాడు. కృతజ్ఞతలు చెప్పి, కుర్రాడూ, తండ్రీ వెళ్ళిపోయారు. అతను కారు దగ్గరకి వచ్చి సొట్టపోయిన భాగాన్ని ప్రేమగా నిమిరాడు. కారెక్కాడు. వెళ్ళిపోయాడు. ఇది జరిగి సంవత్సరం అయింది. నేటికీ ఆ సొట్టని సరి చేయించలేదతను. దాన్ని అలాగే గుర్తుగా ఉంచుకున్నాడు. నిస్సహాయులను ఓ కంట కనిపెట్టమని దేవుడు హెచ్చరిస్తూనే ఉంటాడు, వినరెవరూ. అప్పుడు కోపాన్ని రాయిగా చేసి విసిరి, కేకేస్తాడు. అప్పుడయినా వినాలి. వినకపోతే ప్రమాదం తప్పదు.

# సందేహం

జానకిరావు ఇవాళో రేపోలా ఉన్నాట్ట! పొద్దున గుడికి వచ్చిన అతని కూతురు చెప్పింది. అన్నం అదీ తినడం లేదుగానీ, మాటలు తగ్గలేదంది. తండ్రి హాయిగా పోవాలి. ఓసారి ఇంటికి వచ్చి అతని ముందు దేవుణ్ణి ప్రార్థించమంది. పూజారిగా మీరెప్పుడూ దేవుడితోనే ఉంటారు. మీరు పిలిస్తే దేవుడు పలుకుతాడు. తండ్రి ప్రాణాన్ని చిత్రవథ చేయకుండా తీసుకుపొమ్మని చెప్పండి! ఈ సాయం చేసిపెట్టండంది. సరేనన్నాడు పూజారి. అంతెత్తు దేవుని విగ్రహాన్ని లేచింది మొదలు పడుకునే దాకా గుడిలో పూజిస్తూనే ఉంటాడు పూజారి. అనుక్షణం దేవుని సమక్షంలోనే ఉంటూ, దేవుడికి అతనెంత చెబితే అంత అన్న పేరు పడ్డాడు. ఎవరి శ్రేయస్సు కోసం ప్రార్థించాలో వారెదురుగా దేవుణ్ణి ఉంచుకుని ప్రార్థిస్తే, పూజారి మాట దేవుడు వింటాడని ఊరిలో పెద్ద ప్రచారం ఉంది. అందుకే జానకిరావు కూతురు అతన్ని అర్థించింది. కాదనలేక పోయాడతను. అయితే జానకిరావు ఎన్నడూ గుడికి వచ్చిన పాపాన పోలేదు. దేవునికి దణ్ణం పెట్టడం, దేవుణ్ణి అతను ప్రార్థించడం కూడా చూడలేదు. అటువంటప్పుడు ఇప్పుడీ ప్రార్థన ఫలిస్తుందా? అనిపించింది పూజారికి. వెళ్ళక పోతేనే మంచిది అనుకున్నాడు. అంతలోనే ఆడపిల్ల, అడిగింది, వెళ్ళి తీరాల్సిందేననుకున్నాడు. దేవుడి బొమ్మను పట్టుకుని వెళ్ళాడు. గదిలో మంచమ్మీద పడుకుని ఉన్నాడు జానకిరావు. మంచం ప్రక్కగా ఖాళీ కుర్చీ ఉంది.

''ఎలా ఉన్నావు జానకిరావు?'' పలకరించి, కుర్చీలో కూర్చోబోయాడు పూజారి. వారించాడు

జానకిరావు. కుర్చీలో కూర్చోవద్దని చెప్పాడు.

''ఏం?'' అడిగాడు.

''ఆ కుర్చీలో దేవుడున్నాడు.''

''దేవుడా!'' ఆశ్చర్యపోయాడు పూజారి. కుర్చీ వైపు చూశాడు. ఎవరూ లేరక్కడ. అంతా ఖాళీ.

''నిజం పూజారీ! నాతో మాట్లాడుతూ ఎప్పుడూ ఆ కుర్చీలోనే కూర్చుంటాడు దేవుడు'' అన్నాడు జానకిరావు.

''నీకు దేవుడంటే నమ్మకం ఉందా?'' అడిగాడు.

''ఎందుకు లేదు? కాకపోతే బొమ్మలంటేనే నమ్మకం లేదు. అలాగే ప్రార్థనంటే కూడా తెలీదు. దేవుణ్ణి ఎలా ప్రార్థించాలో తెలియక తికమకపడుతోంటే చిన్నతనంలో మా అమ్మ చెప్పింది. 'ప్రార్థనంటే ఏమీ లేదురా. ఎదురుగా దేవుడు ఉన్నాడనుకుని, మాట్లాడడమే' అంది. అప్పణ్ణుంచి అదే అలవాటు. అందుకే నేను ఏ గుళ్ళకీ గోపురాలకీ రాను'' అన్నాడు జానకిరావు.

''మరి, నీ గురించి దేవుణ్ణి అడిగావా?''

''అడిగాను. అంతా హాయిగా సజావుగా సాగిపోతుందన్నాడు'' చెప్పాడు జానకిరావు.

''దేవుడితో మాట్లాడుతోంటే నాలో నేను మాట్లాడుకుంటున్నాననుకుంటోంది నా కూతురు. అది ప్రార్థన అని తెలీదు దానికి. పిచ్చివాగుడు అనుకుంటోంది ఆ పిచ్చిది'' అని నవ్వాడు జానకిరావు. అప్పుడిక జానకిరావు గురించి దేవుణ్ణి ప్రార్థించడం, హడావుడి చేయడం అనవసరం అనుకున్నాడు పూజారి. తెచ్చిన దేవుని బొమ్మతో పాటుగా వెళ్ళిపోయాడక్కణ్ణుంచి.

రెండు రోజులు గడిచాయి. జానకిరావు పోయాడని చెప్పారెవరో. వెళ్ళి చూశాడు పూజారి. గదిలో మంచమ్మీద పోలేదు జానకిరావు. దేవుడు కుర్చీలో తల పెట్టుకుని కింద కూర్చుని పోయాడు. అంటే దేవుని ఒడిలో తలపెట్టుకుని చనిపోయాడన్నమాట! పూజారికి బాగా అర్థమయింది.

''నాన్న ఎప్పుడు మంచమ్మీద నుంచి లేచాడో, ఎప్పుడు ఇలా కుర్చీలో కూలబడి ప్రాణం పోగొట్టుకున్నాడో తెలీదు. అయితే ఏ మాత్రం తను హింసపడలేదన్నది అర్థమయింది. మీ ప్రార్థన ఫలించింది'' అంది జానకిరావు కూతురు.

''పూజారిగారు ప్రార్థిస్తే అంతే! అయితీరుతుంది'' అన్నారు అక్కడి వాళ్ళు. 'అబద్ధం' అనలేకపోయాడు పూజారి. పెద్ద సందేహంలో పడ్డాడతను. దేవుడంటే శూన్యమా? ప్రార్థనంటే మాటలా? మరి ఈ మంత్ర తంత్రాలూ, ఈ విగ్రహాలూ ఏమిటి?

# బర్త్‌డే కేక్

నోరారా నవ్వడాన్ని, కళ్ళ నిండుగా నవ్వడాన్ని ఎప్పుడయినా చూశావా? అది చూడడం ఓ అదృష్టం. ఆ అదృష్టానికి నోచుకున్న వాళ్ళని దేవతలంటారు.

–అనేవాడు తాతయ్య. చిన్నతనంలో ఆ మాటలకు అర్థం తెలిసేది కాదు. ఇప్పుడు తెలిసిన తర్వాత అలా నవ్వే వాళ్ళ కోసం ఆమె వెదకని రోజంటూ లేదు.

సాయంత్రం ఆరు అయింది. చలిగా ఉంది. చేతులు కట్టుకుని, బేకరీలో కూర్చుందామె. అతని కోసం నిరీక్షిస్తోంది. అతను వస్తే వేడి వేడిగా ఓ సమోసా తిని, కాఫీ తాగితే బాగుంటుందనుకుంటోంది. అంతలో కేకలు వినవచ్చాయి. ఇద్దరు కుర్రాళ్ళను బేకరీ సర్వర్లు ''పో! బయటకు పో'' అని కర్రతో అదలిస్తూ గెంటేస్తున్నారు. లోపలికి వాళ్ళని రానివ్వట్లేదు. పద్నాలుగు, పదిహేనేళ్ళ వయసుంటుంది వాళ్ళకి. అడుక్కునే వాళ్ళలా ఉన్నారు. చిరిగిన దుస్తుల్లో వణికిపోతున్నారు.

''కేకు కావాల్సార్! కేకు'' అంటున్నా వినిపించుకోవట్లేదు సర్వర్లు.

''నడు! బయటికి నడు.'' అంటున్నారు. లేచి నిల్చుందామె.

''ఆగండి'' అని సర్వర్లను వారించింది.

''అది కాదు మేడం'' ఏదో చెప్పబోయారు సర్వర్లు. విన దలచుకోలేదామె.

''ఏం కావాలమ్మా?'' అడిగింది కుర్రాళ్ళని.

''ఇవాళ వీడి పుట్టినరోజు. కేకు కొని తిందామనుకుంటున్నాం'' చెప్పాడో కుర్రాడు. 'వీడు' అన్న కుర్రాడికి కళ్ళు లేవు. వాణ్ణి గురించి చెప్పిన కుర్రాడి చేయి పట్టుకుని 'వీడు' అటూ ఇటూ తల వేగంగా ఊపుతున్నాడు.

''మీ పేర్లేంటి?'' నవ్వుతూ అడిగిందామె. చెప్పారు. కళ్ళు లేని కుర్రాడి పేరు రాజేష్. ఇంకో కుర్రాడి పేరు శంకర్.

''మీరేం చేస్తారు?'' అని అడగలేదామె. ముందే అర్థమయింది. ఇప్పుడు స్పష్టమయింది. శంకర్ చేతి నిండా చిల్లర ఉంది.

''రండి! ఇక్కడ కూర్చోండి'' తన టేబుల్ దగ్గరగా వాళ్ళను కూర్చోబెట్టిందామె. ''మేడం'' అంటూ బేకరీ వాళ్ళు వారించబోయారు.

''పిచ్చిపిచ్చిగా ప్రవర్తించవద్దు. పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి'' అందామె. కేక్ ఆర్డర్ చేసింది. బర్త్‌డే కేక్. తెచ్చి టేబుల్ మీద ఉంచింది. చాకు కూడా తీసుకొచ్చింది. రాజేష్ చేతికి ఇచ్చింది.

''హేపీ బర్త్‌డే టు యూ! హేపీ బర్త్‌డే టు యూ'' అని పాడింది. శంకర్‌ని కూడా పాడమంది. శంకర్‌తో కలిసి పాడుతూ, రాజేష్ చేతిని పట్టుకుని కేక్‌ను కట్ చేయించిందామె. కేక్‌ని రాజేష్‌కి తినిపించింది. తర్వాత రాజేష్ చేత శంకర్‌కి తినిపించింది. చప్పట్లు చరిచింది.

అడుక్కునే వాళ్ళను చేరదీయడం, సర్వర్లతో ఆమె గొడవ పడడాన్ని వింతగా చూసిన అక్కడి కస్టమర్లు, ఇప్పుడు ఆమె ప్రవర్తనకి సంతోషిస్తున్నట్టుగా సన్నగా నవ్వారు. ఆ నవ్వు కాదు, తనకి కావాల్సింది అనుకున్నదామె. శంకర్‌ని చూసింది. కేక్ మీది క్రీమ్‌ని రాజేష్ ముఖానికి రాస్తూ శంకర్ నోరారా నవ్వుతున్నాడు. రాజేష్ సంగతి చెప్పనక్కర్లేదు. వాడు కళ్ళ నిండుగా నవ్వుతున్నాడు. వాడి కళ్ళకు చూపు లేదు కాని, వాడి కళ్ళల్లో చెప్పలేనంత ఆనందం ఉంది.

ఎప్పుడు వచ్చాడో వచ్చాడతను. జరిగిందంతా చూసినట్టుగా ఉన్నాడు. ఆమె దగ్గరగా చేరాడు.

''నో డౌట్! నువ్వు దేవతవోయ్'' అన్నాడతను.

''మేడం'' అంటూ వచ్చారు రాజేష్–శంకర్. పిడికిళ్ళు విప్పి ఆమె ముందుంచారు. పిడికిళ్ళ నిండా చిల్లరే! కొన్న కేక్‌కీ, తిన్న కేక్‌కీ డబ్బు ఇవ్వజూపారు వాళ్ళు. కన్నీళ్ళొచ్చాయామెకు. ఏడుస్తూ వాళ్ళని దగ్గరగా తీసుకుంది. తాతయ్యని గుర్తు చేసుకుంది.

# ప్లీజ్! చిదిమేయొద్దు!

తను సినిమాకు రానంది. వినలేదు. నాలుగు గంటలకు సినిమా అయిపోతుంది. స్కూల్ నుంచి రాజీని తెచ్చుకొనేందుకు ఎలాంటి ఇబ్బందీ ఉండదన్నారు. తోడుకుని వెళ్ళారు స్నేహితులు. చెప్పినట్టుగానే సినిమా నాలుగు గంటలకు అయిపోయింది. రాజీని తెచ్చుకునేందుకు కార్లో స్కూలుకి బయల్దేరింది. ట్రాఫిక్ జాం. అరగంటక్కాని ట్రాఫిక్ క్లియర్ కాలేదు. ఆలస్యం అయిపోయింది. స్కూలు నుంచి ఫోనొచ్చింది, 'మమ్మీ' అంటూ రాజీ ఏడుస్తోందట! తప్పంతా తనదేననుకుంటూ కారుని వేగంగా పోనిస్తోంది పవిత్ర. అంతలో ఫోన్, శ్రీవారి దగ్గర్నుంచి. రాజీ గురించి ఆయనకు కూడా స్కూలు వాళ్ళు ఫోన్ చేశారట! తొందరగా వెళ్ళంటూ చీవాట్లు. ఒక పక్క సెల్‌లో మాట్లాడుతూ, మరో పక్క కారు డ్రైవ్ చేస్తోంది పవిత్ర. రెడ్ సిగ్నల్ చూసుకోలేదు. దాటింది. అంతే! పోలీసులొచ్చి అడ్డం పడ్డారు. కారుని పక్కకి తీసుకుని రమ్మన్నారు. తీసుకుని వచ్చింది. వాళ్ళతో చర్చించడం అనవసరం. టైం లేదు. వాళ్ళకి ఇవ్వాల్సింది ఇస్తే సరి, అనుకుంటూ వందనోటు తీసి, ఇవ్వబోయింది.

''సారీ మేడం! సార్‌తో మాట్లాడండి'' అంటూ వెళ్ళిపోయారు పోలీసులు. సారెవరు? అటుగా చూసింది పవిత్ర. శ్రీధర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా చలానా రాస్తూ కనిపించాడు. నుదుటన ఇంత పులిపిరి కాయ, మధ్యపాపిడి...ఇట్టే గుర్తు పట్టిందతన్ని. కాలేజీలో కలసి చదువుకున్నారిద్దరూ.

''అది కాదు శ్రీధర్...'' అంటూ ఏదో చెప్పబోతుంటే వినిపించుకోలేదతను.

''లైసెన్స్ ఉందా?'' అడిగాడు. ఉంది. కాని, ఇప్పుడు లేదు. హ్యాండ్‌బ్యాగ్ ఇంట్లో మరచిపోయింది.

''లే..లేదు'' అంది పవిత్ర. కోపంగా చూశాడు శ్రీధర్. ఆ చూపంటే చాలా భయం పవిత్రకి. కాలేజీ రోజుల్లో తనకి అతను రాసిన లవ్ లెటర్ చించి పోగులు పెట్టినప్పుడు ఇలాగే చూశాడు శ్రీధర్. నమిలి మింగేసేలా చూశాడు. వెయ్యి రూపాయలకు చలానా రాసిచ్చాడు.

''అన్యాయం'' అంది. కసి తీర్చుకుంటున్నాడు. కావాలనే పెద్ద మొత్తం రాశాడనుకుంది పవిత్ర. కార్లో సిడీల కవర్లో రెండు వేలుంటే, తీసి వెయ్యి ఇచ్చింది. విసురుగా వెళ్ళబోతుంటే చేతిలో ఇంకో కాగితం పెట్టాడు శ్రీధర్. పట్టించుకోలేదు పవిత్ర. కార్లో ఆ కాగితాన్ని పడేసి, స్కూలుకి బయల్దేరింది. రాజీని పికప్ చేసుకుంది. ఇంటికి వచ్చింది. కారు దిగుతూనే ఇంట్లోకి పరుగు తీసింది రాజీ. కార్ డోర్ లాక్ చేస్తోంటే శ్రీధర్ ఇచ్చిన ఇంకో కాగితం కనిపించింది పవిత్రకి.

ఇంత వయసొచ్చినా బుద్ధి రాలేదు. మళ్ళీ లవ్‌లెటర్ రాసి ఉంటాడు. ఇడియెట్! అనుకుంటూ కాగితాన్ని తెరచి చూసింది.

పవిత్రా!

నాకో కూతురుండేది. అయిదేళ్ళు. నీలాగే స్పీడుగా డ్రైవ్ చేసి, నా కూతుర్ని కడతేర్చాడో రాస్కెల్! వాడికి శిక్ష పడింది. కొన్నాళ్ళు జైల్లో ఉన్నాడు. తర్వాత విడుదలయి నా కళ్ళ ముందే తిరుగుతున్నాడు. ఆరేడేళ్ళ ఇద్దరి కూతుళ్ళతో కలసి, మొన్న వాడు ఎగ్జిబిషన్‌లో కన్పించాడు. 'డాడీ డాడీ' అంటూ ఆ పిల్లలు అవి కొని పెట్టమని, ఇవి కొనిపెట్టమని అడుగుతోంటే, వాడి ఆనందాన్ని చూస్తోంటే నేను తట్టుకోలేకపోయాను. ఎంతగా వాణ్ణి క్షమించాలనుకుంటున్నా నా వల్ల కావట్లేదు. కసి, కోపం రేగుతూనే ఉన్నాయి. మనిషిని కాలేకపోతున్నాను. పదే పదే పిల్లల్ని ప్రేమగా వాడు దగ్గరగా తీసుకుంటుంటే ఏడుపొచ్చింది. నా కూతుర్ని నేను ప్రేమగా దగ్గరగా తీసుకునే అవకాశం ఈ జన్మలో లేదుగా. ఆ అవకాశం నాకు ఉంటే గింటే మళ్ళీ పైలోకంలోనే!

వద్దు పవిత్రా! కారు అంత స్పీడుగా పోనీయొద్దు! పువ్వుల్నీ, నవ్వుల్నీ చిదిమేయొద్దు! ప్లీజ్!

–శ్రీధర్

కన్నీళ్ళొచ్చాయి పవిత్రకి. గబగబా ఇంట్లోనికి పరుగుదీసి తెలియని బాధతో రాజీని దగ్గరగా తీసుకుంది. అలాగే శ్రీధర్ రాసిన ఉత్తరాన్ని కూడా గుండెలకు హత్తుకుంది.

# గాంధీనగర్

సోషియాలజీ అంటేనే సర్వేలు, స్టడీలు. దాంతో సిటీలోని గాంధీనగర్ మురికివాడ యువతను పరిశోధించాల్సి వచ్చింది. పదహారు-ఇరవై రెండేళ్ళ మధ్య యువతను గూర్చి ఏదో శోధించి, సాధించాలి. విద్యార్థులంతా బయల్దేరారక్కడికి.

మురికివాడలోకి ప్రవేశించడమే కష్టం అనిపించింది. రౌడీ ల్లాంటి వ్యక్తులు వాడ ముంగిట కూర్చుని 'ఎక్కడికి? ఎందుకు?' అని చాలా ప్రశ్నలు వేశారు. భయం భయంగానే విద్యా ర్థులంతా సమాధానం చెప్పారు. యూనివర్సిటీ స్టడీ అన్నారు. సర్వే అన్నారు. ప్రవేశాన్ని సంపాదించారు. వాడలో అడుగు పెడితే తీసే పరిస్థితి లేదు. వర్షాకాలం కాకపోయినా, డ్రైనేజీలు పొంగి పొర్లుతుండడంతో నేలంతా చిత్తడి చిత్తడిగా అసహ్యంగా ఉంది. భరించలేని దుర్గంధం. గుడిసెలన్నీ ఒకదాంట్లోకి ఒకటి చొచ్చుకునిపోయి దగ్గర దగ్గరగా ఉన్నాయి. నడిచేందుకు దారే లేదు. యువతంతా ఇంకా నిద్రపోతూనే ఉంది. మేల్కొన్న నలుగురైదుగురు సిగరెట్లు తాగుతూ పేకాటకు సిద్ధమయ్యారు. ప్రశ్నిస్తే, వారి దగ్గర్నుంచి ఎలాంటి సమాధానాలూ లేవు. అంతలో నలభై ఏళ్ళ వ్యక్తిని, ఓ ఇరవై ఏళ్ళ యువతి బూతులు తిడుతూ గుడిసె లోంచి లాక్కొచ్చింది.

''ముందు యాభై ఇస్తానని చెప్పి, పనయ్యాక ఇప్పుడు ఇరవై సేతిలో ఎడతావా, నీ జిమ్మడిపోను. తియ్‌రా, తియ్యి, డబ్బులు తియ్యి'' మాటలతోనే కాదు, కాళ్ళు చేతుల్తో కూడా అతన్ని ఆ యువతి కొడుతోంది.

''ఏమయిందేమయింది?'' కల్పించుకోజూశారు విద్యార్థులు.

''ఏటౌద్ది? బుక్కైంది యాభైకి. సేతిలో ఎట్టింది ఇరవై. అర్థం కాలేదా?'' నవ్వాడో కుర్రాడు. వాడు నవ్వుతోంటే సారా వాసన గుప్‌మంది. విద్యార్థులకి కడుపులో దేవినట్టయింది. పరుగుదీశారు అక్కణ్ణుంచి.

సిటీలో అతి పెద్ద మురికివాడ అది. పొద్దున పదిగంటలకు మొదలు పెడితే అంతా చుట్టబెట్టేసరికి సాయంత్రం ఆరు గంటలయింది. అయిపోయింది అనుకున్న సమయంలో పోలీసులు వచ్చారక్కడకి. ఏడెనమండుగురు యువకుల్ని జీపులో వేసుకుని వెళ్ళిపోయారు. గతరాత్రి నగల దుకాణంలో చోరీ చేసిందీ, అక్కడి వాచ్‌మేన్‌ని హత్య చేసిందీ వారేనని అనుమానంట! భయం వేసింది విద్యార్థులకి. గబగబా బయటపడ్డారంతా. వారం రోజుల పాటు కష్టపడి స్టడీ రిపోర్టు తయారు చేసి, అందజేశారు.

గాంధీనగర్‌లోని 16–22 ఏళ్ళ ఇప్పటి యువతంతా పాతికేళ్ళ నాటికి అంటే వారంతా 41–47 ఏళ్ళ వయసులో ఉన్నప్పుడు ఒక్కరు కూడా వాడలో గుడిసెలో ఉండే అవకాశం లేదు. అంతా రక రకాల కారణాల రీత్యా జైల్లోనే మగ్గాల్సి వస్తుంది.

పాతికేళ్ళు గడిచిపోయాయి. పూర్వ విద్యార్థులంతా సరదాగా కలుసుకున్నారు. కబుర్లాడుకున్నారు. గాంధీనగర్‌ని గుర్తు చేసుకున్నారు. ఆనాటి తమ స్టడీ ఏ మేరకు నిజమయిందీ తెలుసుకోవాలనుకున్నారు. బయల్దేరారక్కడికి. వారినెవరూ అడ్డుకోలేదిప్పుడు. వాడ కూడా పరిశుభ్రంగా ఉంది. బాగుంది. ఎక్కడా ఏ గొడవలూ లేవు. పనీ పాటా చేసుకుంటున్నారంతా. ఆరా తీస్తే 41–47 వయసున్న వారంతా ఉద్యోగాల్లో ఉన్నారు. లేదంటే చిన్న చిన్న వ్యాపారాలు సొంతంగా చేసుకుంటూ బాగానే సంపాదిస్తున్నారు. నూటికి తొంభై శాతం బాగుపడ్డారు. అయిదుశాతం మంది పాపం చనిపోతే, మరో అయిదు శాతం మంది మాత్రమే జైల్లో ఉన్నారు.

''ఇదెలా సాధ్యం?'' ఆశ్చర్యపోయింది విద్యార్థి బృందం.

''మీరు వారిని పరిశోధించారు. నేను వారిని ప్రేమించాను'' జవాబుగా వినవచ్చిందో గొంతు. అటుగా చూశారంతా. ఒకనాటి సోషియాలజీ ప్రొఫెసర్, నాటి స్టడీని తమకు ఎసైన్ చేసిన వ్యక్తి, పండిపోయి కనిపించాడు.

చేతులెత్తి నమస్కరించింది విద్యార్థి బృందం.

# కాగితం పడవలు

అయిదేళ్ళలో తనెంతగా ఎదిగాడు? ఊహకందడం లేదు. సొంత కంపెనీ పెట్టాడు. మేనేజింగ్ డైరెక్టరయ్యాడు.

మూడంతస్తుల మేడ కట్టాడు. కోటి రూపాయలు ఖరీదు చేసే కార్లో తిరుగుతున్నాడు.

సుజీ తననిప్పుడు చూడాలి. చూస్తే కసి తీరేది. ఎంత మాటంది?

''సుజీ'' కోపంగా పెదవి కొరుక్కున్నాడతను.

పెద్దగా వర్షం కురుస్తోంది. రోడ్డు మీద జనం లేరు. కార్లో ఉన్నాడేమో! వర్షాన్ని అనందిస్తున్నాడతను. వర్షంతో పోటీ పడుతూ కారుని నడుపుతున్నాడు.

అప్పుడూ ఇలాగే వర్షం. పార్కులో చెట్టు కింద నిల్చున్నారు తనూ సుజీ. జీతం పాతిక వేలు పైబడే వస్తోంది. ఇంకెందుకు ఆలస్యం? పెళ్ళి చేసుకుందాం అన్నాడు. సుజీ జవాబు కోసం ఎదురు చూశాడు. తబ్బిబ్బయి తనని కౌగిలించుకుంటుందను కున్నాడు. సిగ్గుపడుతుందనుకున్నాడు. అవేవీ లేవు. పైగా సూటిగా కఠినంగా ఇలా అంది.

''పాతిక వేలతో పెళ్ళేంటి ప్రసాద్! ఛఛ! అయినా ఈ పెళ్ళి, ఈ ఇండియా ఛీఛీ... నాకొద్దు. త్వరలో అమెరికా వెళ్ళిపోతు న్నాను. అక్కడే సెటిల్ అవుదామని ఉంది. ఉంటాను.''

గబగబా వెళ్ళిపోయింది సుజీ. వర్షంలో తడుచుకుంటూనే వెళ్ళిపోయింది. తనని ఒంటరిని చేసి, వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. అయిదేళ్ళు గడిచిపోయాయి.

వృద్ధదంపతులెవరో కారుకి అడ్డం పడ్డారు. వర్షానికి గొడుగు ఆగడం లేదు. గొడుగుని సరి చేసుకోవడంలో వస్తోన్న కారుని చూడలేదు వాళ్ళు. తను కూడా చూసి ఉండకపోతే పెద్ద ప్రమాదం జరిగేది. చూశాడు కాబట్టి సరిపోయింది. సడన్‌బ్రేకుతో కారాపి, వాళ్ళని తిట్టేందుకు కిందికి దిగాడు. గొడుగు తొలగించి చూశాడు. సుజీ తల్లిదండ్రులు. కోపాన్ని అణచుకున్నాడు.

''ఎక్కడికి?'' అడిగాడు. మఠానికి అన్నారు వాళ్ళు. 'రండి' అంటూ వాళ్ళని కారెక్కించాడు. కావాలనే వాళ్ళని ఆహ్వానించాడు. తన స్థితిని వాళ్ళకి తెలియజెయ్యాలనే కారెక్కించాడు. ఎక్కించిన దగ్గర్నుంచీ తన ఎదుగుదలను కథలు కథలుగా చెప్పుకొచ్చాడు. దారి పొడవునా చెప్పాడు.

మఠానికి చేరుకున్నారు. ఇంత వర్షంలో ఇక్కడికి రాకపోతే నష్టమేమిటో? అనుకున్నాడు.

''రండి రండి, మీ కోసమే చూస్తున్నాను'' ఎదురొచ్చాడు తద్దినం పెట్టే బ్రాహ్మడు. సుజీ తల్లిదండ్రులను తోడుకుని లోపలికి నడిచాడు. అనుసరించాడతను. అక్కడ సుజీ ఫోటో ఉంది. ఆ ఫోటోకి దండ వేసి ఉంది. తద్దినం సుజీకి పెడుతున్నారు. గొల్లుమన్నాడతను.

సుజీ ఎప్పుడు పోయింది? ఎలా జరిగిందిది?

''నాలుగున్నర ఏళ్ళయింది సుజీ చనిపోయి. పాపం క్యాన్సర్. నువ్వు పెళ్ళి ప్రస్తావన తెచ్చిన నాటికే తనకి క్యాన్సర్. ఆ విషయం నీకు చెప్పలేకపోయింది. అమెరికా అని అబద్ధం ఆడింది.''

సుజీ ఫోటో దగ్గర వందనోట్లతో చేసిన చిన్న చిన్న కాగితం పడవలు ఉంచారు.

అవి..అవి..సుజీకి తను ఇచ్చినవే! సుజీ పుట్టినరోజు సందర్భంగా వెయ్యి పడవలు కావాలంటే చేసి ఇచ్చాడు. కరెన్సీ నోట్లతో పడవలు చేసి, దాచుకోవడం ఇష్టమనేది సుజీ. అలా దాచుకుంటే అనుకున్నది అవుతుందని ఏదో దేశంలో ప్రచారంలో ఉందట! దాచుకుంటానంటే కానుకగా ఇచ్చాడప్పుడు. ఇప్పు డెందుకు పెడుతున్నారు?

''వచ్చే జన్మలోనయినా ప్రసాద్‌కి భార్యనవుతాను. నా కోరిక నెరవేరాలి. పడవలు పాడు చెయ్యకండి. పదేపదే నాకు చూపిస్తూ ఉండండి.''

సుజీ కోరిక తీరుస్తున్నారు తల్లిదండ్రులు.

ప్రేమ మనసులో పుడుతుంది. మనసులో పెరుగుతుంది. మనిషి చనిపోయినా మనసు చనిపోదు. మనసులోని ప్రేమా చనిపోదు. ప్రేమ ఓ వస్తువు కాదు, చిరునామా అంతకంటే కాదు మరచిపోవడానికి. అది బాధ. అనంతానంత హృదయ గాథ.

# గులాబీ

ఆ బస్సంటేనే అసహ్యం. కాని ఎక్కక తప్పదు. ఆఫీసుకి టైంకి ఆ బస్సే దిక్కు. కిక్కిరిసిపోయి ఉంటారు ప్రయాణికులు. గబ్బిలాల్లా వేలాడుతుంటారు. ముందు రెండు మూడు సినిమా హాళ్ళున్నాయి. పార్కు ఉంది. బాబా టెంపుల్ ఉంది. పెద్ద లైబ్రరీ ఉంది. దాంతో పనీపాటా లేని గ్యాంగంతా వాటికి తగలడడంతో బస్సు బియ్యం బస్తాలా పిటపిటలాడుతుంటుంది. సీటు దొరకడం కష్టం. వారికీ వీరికీ ప్రత్యేకం అంటూ పేరుకే రాసి ఉంటాయక్కడ. కాని ఆ సీట్లలో ఎవరు పడితే వారు కూర్చుంటారు. తప్పంటే గొడవకొస్తారు. అందుకని ఎవరికెవరూ మాట్లాడుకోరు. పలకరించుకోరు. పలకరిస్తే చోటడుగుతారని భయం. ఈ బస్సునే కావాలని ఎక్కుతాడా ముసలోడు. డెబ్బయ్యేళ్ళుంటాయి అతనికి. మనిషి ఒంగిపోయి ఉంటాడు. చెప్పుల్లేని కాళ్ళూ, చేతిలో కర్రా, చింపిరి జుత్తూ చూడ్డానికే అసహ్యంగా ఉంటాడతను. బాబా టెంపుల్ స్టేజ్‌లో ఎక్కుతాడు. లైబ్రరీ స్టేజ్‌లో దిగిపోతాడు. అక్కడ ఎక్కి, ఇక్కడ దిగే ఇరవై నిముషాల ప్రయాణంలో అతన్నెవరూ పట్టించుకోరు. డ్రైవర్ పక్కగా నిల్చుంటాడు ముసలోడు. కుదుపులకి పడతాడనుకుంటారంతా. పడడు. నిలదొక్కుకుని, నవ్వుతూ ఉంటాడు. ఒకరోజు బలే హుషారుగా ఉన్నాడు ముసలోడు. బస్సెక్కుతూనే 'గుడ్ మార్నింగ్' అంటూ డ్రైవర్ని పలకరించాడు. 'చాల్లే' అనుకున్నాడు డ్రైవర్. పట్టించుకోలేదు. మర్నాడు కూడా పలకరించాడు ముసలోడు. డ్రైవర్‌కి గుడ్‌మార్నింగ్ చెప్పాడు. తప్పనిసరి అయింది డ్రైవర్‌కి. 'వెరీ గుడ్ మార్నింగ్' చెప్పాడతనికి. ఆ మర్నాడు బస్సులో అందర్నీ

చూస్తూ ముసలోడు 'గుడ్ మార్నింగ్' అని గట్టిగా అరిచాడు. సమాధానంగా ఎవరో అరిచారు, 'వెరీ గుడ్ మార్నింగ్' అని. అంతే! ఆ తర్వాత ముసలోడు బస్సెక్కితే చాలు, అందరూ అతనికి గుడ్‌మార్నింగ్ చెప్పడం అలవాటు చేసుకున్నారు. ఆ అలవాటులో ఒకరినొకరు పలకరించుకోవడం, 'రండి, సర్దుకుని కూచుందాం' అనుకోవడం కూడా అందరికీ అలవాటయింది.

ఒక రోజు ముసలోడు టిప్‌టాప్‌గా తయారయ్యాడు. మంచి ఫాంటూ, షర్టూ వేసుకున్నాడు. తల దువ్వుకున్నాడు. చేతిలో కర్ర లేదు. గులాబీపువ్వు ఉంది. ధైర్యంగా బస్సెక్కాడు. అతన్ని చూస్తూనే డ్రైవర్ 'గులాబీ పట్టుకున్నారేటి సుందరం గారూ, కొంపదీసి గర్ల్‌ఫ్రెండ్ దొరికిందా?' అడిగాడు. సమాధానంగా నవ్వి వూరుకున్నాడు ముసలోడు. అతని పేరు సుందరం అని అప్పుడందరికీ తెలిసింది. ఆ రోజు నుంచీ సుందరం ప్రతిరోజూ గులాబీపువ్వుతోనే బస్సెక్కసాగాడు. అతను బస్సెక్కితే చాలు, జోకులే జోకులు.

రెండుమూడు రోజులయింది. ముసలోడు కనిపించడం మానేశాడు. ఏమయిందతనికి? అందరూ ఆందోళన చెందారు. వూళ్ళో లేడా? జ్వరపడ్డాడా? చనిపోయాడా? రకరకాలుగా ఊహాగానాలు చేశారు. వాకబు చేశారు. చేస్తే తెలిసింది, లైబ్రరీలో ముసలోడు ఓ ముసలామెను చేరదీశాడని. కొడుకూ, కోడలూ పొమ్మంటుంటే, లైబ్రరీకి వచ్చి కూర్చుని ఏడుస్తోంటే, 'నీకేం పర్వాలేదు! నేనున్నాను.' అన్నాట్ట ముసలోడు. తన పెన్షన్‌తో హాయిగా బతికేయొచ్చని ముసలామెకు భరోసా ఇచ్చాట్ట! ఇద్దరూ కలిసి ఉందామనుకున్నార్ట. ఇంతలోనే జరగరానిది జరిగిపోయింది. మూడురోజుల క్రితం హార్టెటాక్‌తో ముసలామె చనిపోయింది. ఆ బాధలోనే సుందరం లైబ్రరీకి రావడం మానుకున్నాట్ట! బాధపడ్డారంతా.

అలాంటి సుందరాన్ని ఓదార్చడం కోసం ప్రతి ప్రయాణికుడూ ఇప్పుడు గులాబీతో బస్సెక్కుతున్నాడు. వారం అయింది. పది రోజులయింది. సుందరం రావట్లేదు. బస్సెక్కట్లేదు. అయినా ప్రయాణికులు గులాబీలు తేవడం మానలేదు. ఇప్పుడు బస్సంతటా గులాబీ పరిమళాలే!

# జీవిత సత్యం

చిన్నప్పటి నుంచీ సత్యం తెలుసందరికీ. కష్టాల్లో ఉన్నట్టే కనిపించడు. నవ్వుతూ ఉంటాడెప్పుడూ. దాంతో ఆఫీసు స్టాఫంతా కోరి కోరి మరీ వాడికి తమ కష్టనష్టాలు చెప్పుకునేవారు. పరిష్కారాలు ఏం సూచించేవాడో ఏమో! వాడంటే దేవుడిలా భావించే వారంతా. అలాంటి దేవుడు ఓ అమ్మాయిని ప్రేమించాడు. కొలీగ్‌నే ప్రేమించాడు. పెళ్ళి వరకూ వచ్చింది ప్రేమ. ఇంతలో పెళ్ళి కాన్సిల్ అయింది. ప్రేమించిన సత్యాన్ని కాదని, అమ్మాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ని పెళ్ళి చేసుకుని అమెరికా చెక్కేసింది. సత్యానికి కష్టాలు మొదలయ్యాయి అనిపించింది. కాని, మొదలు కాలేదు. ఎప్పటిలా ఆఫీసుకొస్తూ తన పని తను చేసుకుంటూ నవ్వుతూ కనిపించాడు సత్యం.

''ఇదెలా సాధ్యంరా? ప్రేమలో ఫెయిలయి కూడా ఎలా నవ్వగలుగుతున్నావు?'' అడిగారు. దానికిలా సమాధానం చెప్పాడు సత్యం.

''పొద్దున నిద్రలేస్తూనే ఇలా అనుకుంటాను. ఈ రోజు నా ముందు రెండు మూడ్సున్నాయి. ఒకటి:గుడ్‌మూడ్. రెండు: బ్యాడ్‌మూడ్. ఏది ఎంచుకుంటానంటే గుడ్ మూడ్‌నే ఎంచుకుంటాను. అలాగే అన్ని వేళలూ మనవి కావు. కొన్ని కొన్ని వేళల్లో కొన్ని కొన్ని అనుకోనివి జరుగుతాయి. అప్పుడు ఏమనుకుంటానంటే జరిగిన దాన్ని తలచుకుంటూ కుమిలి కుమిలి ఏడవడమా? లేదంటే జరిగిన దాంట్లోంచి ఓ నీతిని గ్రహించడమా? అనుకుంటే నీతినే గ్రహిస్తాను. అలాగే మీరంతా నా దగ్గరకొచ్చి మీ కష్టనష్టాలు చెప్పుకున్నప్పుడు, మీతో పాటు బాధపడడమా?

లేదంటే పాజిటివ్ సైడ్ చెప్పి, మిమ్మల్ని ఓదార్చడమా అనుకుంటే పాజిటివ్ సైడ్‌నే ఎన్నుకుంటాను. అదే చెబుతాను. హాయిగా ఉంటుంది.''

''కబుర్లు చెప్పకు'' అన్నారు.

''కబుర్లు కాదు, నిజం. జీవితం ఛాయిస్‌లిస్తుంది. పరిస్థితుల్ని బట్టి ఎలా ప్రవర్తించాలో మనమే నిర్ణయించుకోవాలి. అలాగే నీ మూడ్‌ని కూడా నువ్వే నిర్ణయించుకోవాలి. ఒక్కటి గుర్తు పెట్టుకోండి. ఇది నా జీవితం. నా జీవితాన్ని నాకిష్టమయిన విధంగా నేను జీవిస్తాను అనుకోవాలి. అనుకుంటే అంతా సుఖమే'' అన్నాడు సత్యం.

''చాల్లే'' అన్నారంతా. తర్వాత సత్యానికి ట్రాన్స్‌ఫరయి, హైద్రాబాద్ వెళ్ళిపోయాడు. ఏడెనిమిదేళ్ళు వాడి గురించే తెలీదెవరికీ. పట్టించుకోలేదు కూడా. ఒకరోజు ఓ వార్త తెలిసింది. సత్యం అయిదో అంతస్తు మీంచి కింద పడిపోయాడనీ, పెద్ద ఆపరేషన్ జరిగిందనీ, ఎంతో కాలం బతికే అవకాశం లేదనీ. పరిగెత్తారంతా.

ఇంట్లో బెడ్ మీద ఉన్నాడు సత్యం. పెళ్ళయినట్టుంది. భార్య కనిపించింది. కూతురు కూడా ఉంది. మూడేళ్లుంటాయేమో! ముద్దుగా బొద్దుగా ఉందాపిల్ల.

సత్యానికి పెద్ద ప్రమాదమే అయిందట! పద్దెనిమిది గంటలు ఆపరేషన్ జరిగిందట! వెన్నెముక విరిగిపోయిందట! రాడ్ వేశారని తెలిసింది.

''చూస్తారా, మేధావుల్రా డాక్టర్లు. రాడ్‌ని బలేగా ఫిట్ చేశారు. చూడండి.'' అంటూ వీపుని చూపించాడు సత్యం. మీద నుంచి కింది వరకూ గాయమే! చూసేందుకే భయం వేసింది.

''అయిదో అంతస్తు నుంచి కింద పడి ఎలా బతికావురా?'' ఆశ్చర్యపోయారు.

''బతకాలనిపించింది. బతికాను. నా కూతురి కోసం బతకాలనుకున్నాను. తల కిందులుగా అంతెత్తు మీంచి కిందికి పడిపోతూ రెండు ఛాయిస్‌లున్నాయనుకున్నాను. ఒకటి: చచ్చిపోవడం. రెండు: బతకడం. చచ్చిపోవాలని ఎంత మాత్రం అనుకోలేదు. బతకాలనుకున్నాను. బతుకుతాననే అనుకున్నాను. బతికేశాను'' అని నవ్వాడు.

''మన గాయం చూసి పాపం! డాక్టర్లు కళ్ళు తిరిగి పడిపోయారు. ఆపరేషన్ అవసరమా? బతుకుతాడా? అని చర్చించుకుంటుంటే, బతుకుతాను, ఆపరేషన్ చేయండన్నాను. అప్పుడు చేశారు. ఆపరేషన్‌కి ముందు, అడిగారు, 'చెప్పండి, మీకు పడని మందులున్నాయా?' అని. ఉన్నాయన్నాను. బ్రాందీ, విస్కీలు పడవన్నాను, వైన్ ఓకే అన్నాను. నవ్వేశారు'' అన్నాడు.

ప్రతి సమస్యా ఓ కానుకే! అదే సత్యం! జీవిత సత్యం!

# ఆనందం అంటే...

మూర్తి మంచి రచయిత. నాథ్ వ్యాపారి. చిత్రంగా వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు. వ్యాపారంలో ఒడిదుడుకులు కలిగినప్పుడు, ఏం చెయ్యాలో పాలుపోనప్పుడు, మూర్తిని కల వడం నాథ్‌కి అలవాటు. ఎప్పుడూ సాయంత్రాలే కలుస్తాడు నాథ్. తనని కలిసినప్పుడల్లా నాథ్‌ని తీసుకుని అలా బయటికి నడవడం, నడిపించడం బాధ్యతనుకుంటాడు మూర్తి. నడిస్తే శరీరానికే కాదు, మనసుకి కూడా మంచిదంటాడతను. అది నిజమేననిపించింది నాథ్‌కి చాలాసార్లు. బాధతో, బరువుతో వచ్చి, మూర్తితో నడిచి, ఆ రెండూ మరిచిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి నాథ్‌కి.

* * *

శీతకాలం. సాయంత్రం ఆరుగంటల వేళ. చలి చలిగా ఉంది. మూర్తి, నాథ్ నడుస్తున్నారు.

''ఈ మధ్య ఆనందం అంటే ఏమిటో, సంతోషం అంటే ఏమిటో బొత్తిగా తెలీకుండా పోయింది. నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే అంటారు కదా, అవి రాకుండా పోయాయి. తెచ్చుకోవాలి. ఏం చేద్దాం?'' అడిగాడు నాథ్.

''నువ్వే చెప్పు, ఏం చేద్దామో'' అన్నాడు మూర్తి. ఏం చెయ్యాలి? ఏం చేస్తే ఆనందించొచ్చు? ఏం చేస్తే సంతోషించొచ్చు? రకరకాలుగా ఆలోచించాడు నాథ్. ఏదీ తట్టలేదు. 'ఛ' అనుకున్నాడు. అప్పుడు అప్రయత్నంగా అతని కళ్ళు చెప్పులు కుట్టే సీతయ్య మీద పడ్డాయి. బేరాలేవీ లేనట్టున్నాయి. సీతయ్య డీలాగా ఉన్నాడు. గుడిసెకి వెళ్ళిపోయేందుకు సిద్ధమవుతున్నాడు. అతని వెనగ్గా పాత బూట్లున్నాయి. చిరిగిన కోటుంది. అవి అతనివే! అనుమానం లేదనుకున్నాడు నాథ్.

''ఆ బూట్లను దాచేద్దాం. మనం ఆ గోడ వెనగ్గా దాక్కుందాం. ఏమవుతుందో చూద్దాం. కాసేపు ఆనందిద్దాం'' అన్నాడు నాథ్.

''అదేం ఆనందం? పేదవాణ్ణి ఏడిపించి ఆనందించడం ఆనందం అనిపించుకోదు. వాణ్ణి నవ్వించాలి. ఆశ్చర్యపోయేటట్టు చెయ్యాలి. అదీ ఆనందం అంటే'' అన్నాడు మూర్తి.

''అయితే ఏం చేద్దామో చెప్పు?''

''ఆ బూట్లలో ఒకో దాంట్లో ఒకో వెయ్యి నోటుంచు. చూడు.''

మూర్తి చెప్పినట్టుగానే వెయ్యి నోట్లు రెండు తీసి, ఒకోదాన్నీ రెండు మడతలుగా పెట్టి బూట్లలో ఉంచాడు నాథ్. మూర్తితో పాటుగా గోడ వెనక దాక్కున్నాడు. సామాన్లు సర్దుకుని, బయల్దేరేందుకు సిద్ధమయ్యాడు సీతయ్య. కోటు వేసుకున్నాడు. బూట్లు వేసుకునేందుకు ఒకదాంట్లో కాలు దూర్చాడు. బూట్లో కాలికేదో తగిలినట్టనిపించింది. కాగితంలా ఉందనిపించింది. తీసి చూశాడు. వెయ్యినోటు! ఆశ్చర్యపోయాడు. బూటునీ, చేతిలో నోటునీ మార్చి మార్చి చూశాడు. తర్వాత చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. నోటుని జేబులో పెట్టుకున్నాడు. ఇంటికి వెళ్ళేందుకు ఆత్రపడ్డాడు. రెండో బూటులో కాలు పెట్టాడు. దాంట్లో కూడా ఇందాకటి బూటులో ఉన్నట్టే అనిపించి, తీసి చూశాడు. మరో వెయ్యినోటు! తట్టుకోలేకపోయాడు సీతయ్య.

''దేవుడా'' గట్టిగా కేకేశాడు. మోకాళ్ళ మీద కూర్చుని ఆకాశం కేసి చూస్తూ దండం పెట్టాడు.

''నువ్వున్నావయ్యా, ఉన్నావు. ఉండబట్టే నా కష్టాలు గట్టెక్కేలా చేశావు. ఇల్లాలికి రెండు రోజులుగా జ్వరం. దాన్ని ఆసుపత్రికి తీసుకెళ్ళాలి. మనవడి పుట్టిన్రోజు రేపు. ఏటివ్వాలి? ఎలాగ అనుకుంటున్నాను. నువ్వు కరుణించావు. నువ్వున్నావు తండ్రీ, నువ్వున్నావు'' అన్నాడు. నవ్వుకుంటూ పరుగుదీశాడక్కణ్ణుంచి. సీతయ్య వెళ్ళిపోగానే గోడ చాటు నుంచి బయటికి వచ్చారు, మూర్తి, నాథ్.

''ఆనందం అంటే అదిరా! సంతోషం అంటే అదీ! ఇప్పుడు తెలిసిందా?'' అడిగాడు మూర్తి. మాట్లాడడం లేదు నాథ్.

''ఏంటి? ఏమయింది?'' తన వైపునకు నాథ్ ముఖాన్ని తిప్పుకుని చూశాడు మూర్తి. నాథ్ కళ్ళ నిండుగా నీళ్ళున్నాయి.

''ఐ యాం వెరీ హ్యాపీ'' అన్నాడు నాథ్. కన్నీళ్ళతో నవ్వాడు.

# పాపం! పప్పీ!

తనని వెంటబెట్టుకుని వచ్చినప్పుడు ఆ ఇంట జరిగిన గొడవ ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టే ఉంది. తనని గుండెలకు హత్తుకుని లోపలికి అడుగుపెడుతోంటే బాబు మీద వాళ్ళ బాబు అరిచిన అరుపులు...అమ్మో! తలచుకుంటే వణుకు పుట్టుకొస్తోంది.

''దాన్ని ఇంట్లోకి తీసుకొస్తానంటే నేనొప్పుకోను'' అరిచాడు తండ్రి.

''ఒప్పుకోకపోతే నేనూ ఈ ఇంట్లో ఉండను'' గట్టిగానే సమాధానం ఇచ్చాడు బాబు.

''వీధికుక్కను ఇంట్లోకి తెస్తానంటావేంట్రా? ఛీ'' అన్నాడు కూడా.

అప్పుడు కల్పించుకుంది ఆ ఇంటి మాలక్ష్మి. భర్తకి నచ్చజెప్పి ఎలాగయితేనేం బాబుతో పాటుగా తనని ఇంట్లోకి రానిచ్చింది. బాబు రూంలో మకాం. అయితే రూం దాటి బయటికి రాకూడదు తను. వస్తే పెద్దాయన ఒప్పుకోడు. తన మీద ఆయనకు ఎందుకంత కోపమో తెలీదు. ఆయన సంగతి వదిలేస్తే బాబుకి మాత్రం తనంటే ప్రాణం. కాలేజీకి వెళ్తున్నప్పుడు తప్పించి ఫ్రెండ్సిళ్ళ కెళ్ళినా పార్క్‌కెళ్ళినా ఎక్కడికెళ్ళినా తనని వదిలి వెళ్ళేది లేదు బాబు. ఆటలన్నీ తనతోనే! షేక్‌హ్యాండ్ ఇమ్మంటే ఇచ్చేది. దూరంగా బాల్ విసిరి తెమ్మంటే తెచ్చేది. సైకిల్ టైర్‌లోంచి దూకమంటే దూకేది. చెరువులో వదిలి ఈదమంటే ఈదేది. అవన్నీ బాబు కోసమే! బాబు ఆనందం కోసం ఏం చెయ్యమంటే అది తను చేసింది. ప్రాణం పెట్టే బాబంటే పిచ్చిగా అభిమాన పడింది. జీవితాంతం బాబు ఒడిలోనే ఉండాలనుకుంది. బాబు

ఒడిలోనే ప్రాణం పోవాలనుకుంది. అనుకున్న ముహూర్తం బాగులేదేమో! బాబుకి వాళ్ళ బాబు ల్యాప్‌ట్యాప్ తెచ్చిచ్చాడు.

''డిగ్రీకొచ్చావు. కంప్యూటర్‌తో టచ్చుండాలి. పైగా ప్రపంచం అంతా ఇందులోనే ఉంది. చూస్కో'' అన్నాడు. వద్దనలేదు బాబు. ముద్దు ముద్దుగా అందుకుని మురిసిపోయాడు. దాన్నేక్షణాన్న అందుకున్నాడో ఆ మరుక్షణమే బాబు ఒడిలో తన స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. తన స్థానంలో ల్యాప్‌టాప్ తిష్ట వేసుక్కూర్చుంది. గొప్ప స్నేహితుడయిపోయింది బాబుకది. తనెగిరి ఒడిలో కూర్చుందామంటే...ఎప్పుడూ లేనంత కోపం బాబుకిప్పుడు. కసిరి దూరంగా పొమ్మంటున్నాడు. దగ్గరికొస్తే చిరాకు పడుతున్నాడు. కాలేజీ నుంచి రావడం ఆలస్యం, దాని ముందే కూర్చుంటున్నాడు బాబు. ఆన్ చేసి ఆటలే ఆటలు. గంటలగ్గంటలు దాంతోనే కాలక్షేపం. తననసలు పట్టించుకోవడం మానేశాడు. తన మనిషి తనకు కాకుండాపోతున్నాడు. పిచ్చి పెట్టైతో ముడిపడిపోతున్నాడు. అతన్ని ఎలాగయినా తన వైపునకు తిప్పుకోవాలి. అందుకు నానా అల్లరీ చేసింది. అరిచింది. గీ పెట్టింది. తిండి మానుకుంది. లేచి తిరగడం మానుకుంది. అయినా పట్టించుకోలేదు బాబు.

''ఏంటో పాపం! ఏదోలా తయారవుతోందిది. జబ్బు చేసిందేమో! చూడ్రా'' బాబుకి చెప్పింది తల్లి.

''జబ్బు చేస్తే పోతుంది. దాన్నెవడు పట్టించుకుంటాడిప్పుడు'' చెప్పాడు బాబు. ఛ్యాట్ చేస్తూ కూర్చున్నాడు. అంతే! చాలా కోపం వచ్చింది తనకి. ఒకప్పుడు తననెలా చూశాడు? ఇప్పుడెలా చూస్తున్నాడు? దీనంతటికీ కారణం ఆ ల్యాప్‌టాపే కదా! దాన్ని...దాన్ని పాడు చేసేయ్యాలి. పనికి రాకుండా చేసేయ్యాలి. బాబుకి దానిని లేకుండా చేసేయ్యాలనుకుంది. అనుకున్నదే ఆలస్యం. ఎంత వేగిరం రాత్రవుతుందా అని చూడసాగింది. అయింది. రాత్రయింది. బాబు మంచి నిద్రలో ఉన్నాడు. ల్యాప్‌టాప్ తెరిచి ఉంచే నిద్రపోతున్నాడు. అదే అదనుకుంది. అడుగులో అడుగు వేసుకుని వెళ్ళింది. ముందు రెండు కాళ్ళనీ ఎత్తిపెట్టి ల్యాప్‌టాప్ మీద ఉంచి దాన్ని అదిమి పట్టింది. తర్వాత ఒక్క గెంతులో చేరుకుని నాలుగు కాళ్ళతో నిలబడింది దాని మీద. నిలబడి ఓ కాలెత్తి ఎంచక్కా మూత్ర విసర్జన చేసింది. కడుపుబ్బరం తగ్గించుకుంది. కసి తీర్చుకుంది.

❀

# బామ్మ మాట! బంగారు బాట!

బామ్మ చనిపోయింది. రాత్రి పడుకున్న బామ్మ, పొద్దున మరి లేవలేదు. నిద్రలోనే పోయింది. మధ్యాహ్నం అంత్య క్రియలయిపోయాయి. సాయంత్రానికి చిత్రంగా ఇల్లంతా చిన్న బోయింది. ఏడేళ్ళ వయసులో అమ్మానాన్న, తాతయ్యా ప్రమా దంలో పోతే బామ్మే అన్నీ అయ్యి తనని పెంచుకొచ్చింది. చేతిలో చిల్లిగవ్వ లేదు. చేసాయం చేసే మనిషి కూడా లేడు. ఆడది. అయినా నెట్టుకొచ్చింది. పకోడీలమ్మింది. పచ్చళ్ళమ్మింది. తర్వాత స్వగృహ ఫుడ్స్ పెట్టి లక్షలార్జించింది. బాధపడడం బామ్మకి తెలీదు. భయపడడం అంతకన్నా తెలీదు. ఎప్పుడూ ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండేది.

''ఇంత హాయిగా ఆనందంగా ఎలా ఉండగలుగుతున్నావు బామ్మా? నాకయితే అన్నీ అనుమానాలే! భయాలే'' అంటే దాని కెన్నడూ సమాధానం చెప్పలేదు సరికదా పైగా పగలబడి నవ్వేది. బామ్మను తలచుకొంటుంటే ఏడుపొస్తోంది. ఉన్న ఒక్కగానొక్క బామ్మా పోయింది. దిక్కులేదు. ఇప్పుడెలా బతకడం? భయం భయంగా ఉందామెకు. సన్నగా వణుకు పుట్టుకొచ్చింది. వణికి పోతూ బామ్మ ఎప్పుడూ చదివే భగవద్గీత అందుకుంటే... అందులో తన పేరుతో ఓ కవరు కనిపించింది. బామ్మ చేతివ్రాతే! అందులో అనుమానం లేదు. కవరు తెరిచి అందులో ఉన్న ఉత్తరాన్ని చదవసాగిందామె.

కల్యాణీ!

'ఇంత హాయిగా ఆనందంగా ఎలా ఉండగలుగుతున్నావు బామ్మా' అని నువ్వు అడిగినప్పుడల్లా నేను నవ్వాను తప్పా నీకు సమాధానం చెప్పలేకపోయాను. చెప్పడానికి నా దగ్గరప్పుడు

సరయిన సమాధానం లేకపోవడమే కారణం. కాని నీకు ఎప్పటికయినా సమాధానం చెప్పాలనిపించి నన్ను నేను చూసుకుంటే... పరిశీలించుకుంటే... అర్థం చేసుకుంటే ఇదిగో ఇవి నేను ఆనందంగా హాయిగా ఉండడానికి కారణాలనిపించాయి.

★ కన్నీరు, కోపం, ఆనందం, విషాదం...అన్నీ మనిషికి తప్పవు. అనుభవించాల్సిందే!

★ మంచివాళ్ళకే కష్టాలొస్తాయి. అందులో అనుమానం లేదు.

★ అవగాహన లేకపోతేనే సంశయాలు. అలాగే భయంతోనే సందేహాలు.

★ గాయాల్ని కాలమే మాన్పుతుంది. వాటిని తలచుకుంటూ కూర్చోడం అవివేకం.

★ అంది వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదు.

★ అజాగ్రత్త ఓటమికి దారి తీస్తుంది. అందుకని అన్నిటి పట్లా జాగ్రత్త వహించాలి.

★ నేటి నిర్ణయాలే రేపటి జ్ఞాపకాలు. రేపీ జ్ఞాపకాలే చరిత్రలవుతాయి. కాబట్టి ఆచితూచి అడుగెయ్యాలి.

★ సవాళ్ళు స్వీకరించక తప్పదు. స్వీకరిస్తేనే మరింత బలవంతులమవుతాం.

★ ఏది కావాలో...ఏం కావాలో స్పష్టంగా తెలుసుకోవాలి. తెలుసుకుంటే దాని మీదే దృష్టి పెట్టాలెప్పుడూ. అప్పుడు విజయం మనదవుతుంది.

★ ఆశించినవి అందాయని తృప్తి పడితే అభివృద్ధి ఉండదు. అభివృద్ధి కోసం అనుక్షణం కష్టించాలి.

★ జీవితం అంటే...అంతా అశ్చర్యం. అద్భుతం. దాన్ని క్షణక్షణం గమనించి ఆనందించాలి.

నీ

బామ్మ

బాధంతా బామ్మ చేత్తో తీసినట్టనిపించి తేరుకుంది కల్యాణి. చీకటి గదిలోనికి దీపాన్ని తెచ్చారెవరో. వెలుగు పరుచుకుందంతటా. చేతిలోని ఉత్తరాన్ని కళ్ళకద్దుకుని యథాస్థానంలో ఉంచింది కల్యాణి. ఇప్పుడామెకు భయం లేదు. బాగా ధైర్యంగా ఉంది. వణుకు పోయిందామెలో. కన్నీళ్ళు తుడుచుకుని దీపాన్ని సూటిగా చూడసాగింది.

# తన కోపమే తన శత్రువు

అప్పుడు చేసింది తప్పో ఒప్పో తెలియదు గాని, తండ్రి అంటే ఇప్పటికీ తనకి కోపం పోలేదు. అప్పుడు తనేం చేశాడు? సరోజను ప్రేమించాడు. పిజి చదువుతున్నప్పుడు పట్నంలో పరిచయం అయింది సరోజ. ఆ పరిచయం ప్రేమగా మారింది. పెళ్ళి చేసుకుందామన్నాడు తను. ముందు పెద్దలని ఒప్పించాలిగా అంది నవ్వుతూ. పెద్దలంటే ఎవరున్నారు? నాన్నొక్కరే! అమ్మ ఏనాడో పోయింది. తండ్రిని తను ఒప్పిస్తానని, ఒప్పించి మీ పెద్దల్ని కూడా ఒప్పించేందుకు అతన్ని పట్నానికి పంపిస్తానని పల్లెకు బయల్దేరాడు. తండ్రికంతా చెప్పాడు.

''ముందు మీరీ పెళ్ళికి ఒప్పుకుని తర్వాత సరోజ తల్లి దండ్రుల్ని ఒప్పించే పూచీ మీదే'' అన్నాడు. విని వూరుకున్నాడు తండ్రి. ఏం మాట్లాడలేదు. మర్నాడయితే పట్నానికి వెళ్ళొచ్చాడతను.

''సరోజ అమ్మానాన్న ఏవన్నారు?'' ఇంట్లో అడుగుపెడు తున్న తండ్రిని ప్రశ్నించాడు. జవాబుగా చేతిలోని భగవద్గీతని ఓసారి చూసి, దాన్ని తనకిచ్చి వెళ్ళిపోయాడు తండ్రి. చిర్రెత్తు కొచ్చింది.

''పెళ్ళిమాట చెప్పమంటే పుస్తకం చేతిలో పెడతారేంటి'' కోపగించుకున్నాడు తను. సమాధానంగా నవ్వాడు తండ్రి.

''నా ప్రేమా పెళ్ళీ మీకు నవ్వు తెప్పిస్తోందా? ఛీ! నీలాంటి తండ్రి ఉన్నా ఒకటే! పోయినా ఒకటే'' అని చిందులు తొక్కాడు. భగవద్గీతను టేబుల్ మీద పడేసి వెళ్ళిపోయాడు. ఒక రకంగా

పారిపోయాడు. పూణేకి పారిపోయాడు. మిత్రుడొకడు అక్కడుంటే వాణ్ణి పట్టుకుని రకరకాల ఉద్యోగాలు చేసి ఆఖరికి ఇదిగో ఇప్పుడీ పెద్ద ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఈ స్థితికి రావడానికి ఎనిమిదేళ్ళు పట్టింది. ఈ ఎనిమిదేళ్ళుగా తండ్రికి తనెక్కడున్నదీ చెప్పలేదు. అలాగే తండ్రిని గురించి కూడా వాకబు చేయలేదు. సరోజ సంగతి సరేసరి! ఆమెనెప్పుడో మరిచిపోయాడు. పెద్దల్ని ఒప్పించలేని ఆమె ప్రేమ ఒక ప్రేమా అనుకున్నాడు. ఇన్నేళ్ళ తర్వాత మొన్న తెలిసింది, తండ్రిపోయాడని. పోయి ఏడాది పైనే అయిందట! వినగానే బాధనిపించింది. పల్లెకు బయల్దేరాడు.

ఇల్లు తాళం పెట్టి ఉంది. తనొచ్చినట్టు తెలిసి పూజారిగారు పరిగెత్తుకొచ్చి ఇంటి తాళం ఇచ్చి వెళ్ళారు. తాళం తీసి ఇంట్లో అడుగు పెట్టాడు. బూజు పట్టిపోయి ఉంది ఇల్లు. నేల మీద దుమ్ము పేరుకుని ఉంది. అడుగులో అడుగు వేసుకుంటూ మెల్ల మెల్లగా ఇల్లంతా కలియ తిరిగాడు. ఎక్కడా ఎలాంటి మార్పులూ లేవు. ఎనిమిదేళ్ళ క్రితం ఎలా ఉందో ఇప్పుడూ అలాగే అన్నీ ఉన్నాయి. కాకపోతే నాన్న లేడు. టేబుల్ మీద భగవద్గీత కనిపించింది. ఎందుకో ప్రేమగా చేతిలోకి తీసుకోవాలనిపించింది దాన్ని. తీసుకున్నాడు. కళ్ళకద్దుకోవాలనిపించింది. కళ్ళకద్దుకున్నాడు. పేజీలు తిరగేశాడు. అలా తిరగేస్తోంటే పేజీల మధ్య సరోజ ఫొటో కనిపించింది. ఆత్రంగా అందుకుని చూశాడు దాన్ని. వెనుక ఏదో రాసి ఉన్నట్టనిపిస్తే తిప్పి చూశాడు.

మనపెళ్ళికి మీ నాన్నగారితో పాటు మా అమ్మానాన్న కూడా ఒప్పుకున్నారు. నా ఫొటో కావాలని అడిగావ్‌గా! ఫొటో మీ నాన్నగారి చేతికిస్తే బాగోదని, భగవద్గీతలో పెట్టి నీకీ పుస్తకం ఇమ్మన్నాను. ఉంటాను.

నీ

సరోజ

సరోజ సంతకంతో పాటు ఆనాటి తేదీ కూడా వేసి ఉంది. ఎనిమిదేళ్ళ నాటి తేదీ. గుండె జారిపోయింది. చేతిలోని ఫొటో గాలికెగిరిపోయింది. ఎంతపని జరిగింది? ఆవేశం ఎంత అనర్థానికి దారి తీసింది. తనేడుస్తున్నాడా? ఏడుస్తున్నాడు. అనుమానం లేదు.

# మేలిమి బంగరు మెలిక తిరిగినా..

జరగరానిది జరిగిపోయింది. రోడ్డు ప్రమాదంలో వేణు కాలు విరిగిపోయింది. ఆర్నెళ్ల పాటు మంచమ్మీదే ఉండాల్సొ స్తోందతను. మంచమ్మీదుంటే... చేస్తోన్న ఉద్యోగం పోతుంది. జరగాల్సిన పెళ్ళి తప్పి పోతుంది. పెళ్ళితో పాటు అమెరికా అవకాశాలు కూడా అంతే సంగతులు. చేతికందినవన్నీ చేజారి పోతున్నాయి. ఖాళీ దోసిట కన్నీరు తప్ప మిగిలేది లేదు. ఏడు పొస్తోంది వేణుకి. కన్నీరు పెట్టుకున్నాడు. అంతలో స్నేహితు లొచ్చారు. ఇద్దరొచ్చారు. కాలున్నప్పుడు ఎంతమంది స్నేహి తులో! కాలువగట్టు మీద, ఆఫీసులో, క్లబ్బులో...లెక్క లేనంత మంది. ఇప్పుడు ఇద్దరే మిగిలారు. మళ్ళీ ఏడుపొచ్చింది వేణుకి. గత నెల రోజుల నుంచీ ఇంతే! ఏడుస్తూనే ఉన్నాడు. అందాలు పోయాయి. ఆనందాలు పోయాయి. ఎందుకూ పనికి రాకుండా ఎవరికీ అక్కరలేకుండా పోయాడు. అయ్యయ్యో! నెత్తికొట్టు కున్నాడు వేణు. స్నేహితులు వారిస్తే ఆగాడు. తలపట్టుకున్నాడు.

ఎవరూ ఏం మాట్లాడలేని స్థితి. ఓదార్పునకు అందని స్థితి. పిచ్చెక్కిపోతున్నాడు వేణు. అతన్ని దారిలో పెట్టాలి. బాబాయ్‌ని కలిశారు స్నేహితులిద్దరూ. జరిగింది చెప్పి చేతులు జోడించారు.

''మీరు ముందు వెళ్ళండి! నేను తర్వాత వస్తాను'' అన్నాడు బాబాయ్. అన్నట్టుగానే వచ్చాడక్కడికి. అతనొచ్చే వేళకి వేణు తలపట్టుకుని అన్నీ పోగొట్టుకున్న వాడిలా ఉన్నాడు. ఇంకేం ఉంది. అంతా అయిపోయింది అన్నట్టుగా ఉన్నాడు. చూసి సన్నగా నవ్వుకున్నాడు బాబాయ్. అతనలా నవ్వుకోవడాన్ని చూశాడు వేణు.

''అనుకున్నాను, నన్ను చూస్తే మీకు నవ్వొస్తుందని'' బాధపడ్డాడు.

''చెల్లని రూపాయంటే తీసికట్టే'' అన్నాడు మళ్ళీ. ఆ మాటకి బాబాయ్ బుర్ర చకచకా పని చేసింది. జేబులోంచి వెయ్యినోటు తీశాడతను. కొత్తనోటు. రెండు చేతులా నోటు పట్టుకుని దాన్ని కిందా మీదా చూడసాగాడు బాబాయ్. వేణుతో పాటుగా స్నేహితులిద్దరూ వెయ్యినోటునీ–బాబాయ్‌నీ మార్చి మార్చి చూడసాగారు.

''ఈ నోటు ఎవరికి కావాలి?'' అడిగాడు బాబాయ్. నాకంటే నాకంటూ స్నేహితులు ముందుకొచ్చారు.

''ఇస్తున్నా'' అన్నాడు బాబాయ్. నోటుని ఇష్టానుసారంగా నలిపేశాడు.

''ఇప్పుడూ కావాలా?'' అడిగాడు బాబాయ్.

''కావాలి'' అన్నారు వాళ్ళు.

నోటుని కింద పడేశాడు బాబాయ్. కాలితో తొక్కి తొక్కి పెట్టాడు. దుమ్ము కొట్టుకుపోయిన దాన్ని తీసి అడిగాడు.

''ఇప్పుడూ కావాలా?''

''కావాలి.''

నోటుని నాలుగు వైపులా సన్న సన్నగా చించి మళ్ళీ అడిగాడు బాబాయ్.

''ఇప్పుడూ కావాలా?''

కావాలన్నారు. అప్పుడు వేణుతో అన్నాడు బాబాయ్.

''నలిపేసినా, దుమ్ముకొట్టుకుపోయినా, చించేసినా వెయ్యినోటు విలువ తగ్గలేదు. కావాలంటున్నారు. అలాగే నువ్వు కూడా అందరికీ కావాలి వేణు. నీ విలువ తగ్గదు. తగ్గలేదు. కాలు విరిగిపోయింది, అంతా అయిపోయిందనుకుంటే ఎలా? ప్రమాదాలు చెప్పి రావు. ప్రమాదవశాత్తూ మనిషి కింద పడతాడు. దుమ్ముకొట్టుకు పోతాడు. కాలో చెయ్యో విరుగుతుంది. విరిగినంత మాత్రాన మనిషి విలువ తగ్గిపోతుందా? తగ్గిపోదు. కోలుకుంటే కొత్తనోటులా ఫెళఫెళలాడుతావు. జరిగిందానికి ఏడుస్తూ కూర్చోకూడదు. జరగబోయేది ఆలోచించాలి. ధైర్యం పుంజుకోవాలి'' అన్నాడు బాబాయ్. అవునవుననుకున్నాడు వేణు. ఆశగా చూశాడు. ఇప్పుడతనికి ఏడుపంటే 'ఛీఛీ' అనిపిస్తోంది.

# గొప్ప సలహా

అయిన వాళ్ళను చూడ్డానికి వచ్చాడతను. అమెరికా నుండి వచ్చాడు. చూసేశాడు. వెళ్ళిపోతున్నాడు. కొద్ది దూరం నడవాలి. నడిస్తే రోడ్డొస్తుంది. అక్కణ్ణుంచి పర్వాలేదు, రవాణా సౌకర్యా లున్నాయి. ఇక్కణ్ణుంచే లేనిది. నడుస్తున్నాడతను. అంతా అడవి ప్రాంతం. చల్లగా హాయిగా ఉంది. వ్యాపార లావాదేవీలతో క్షణం తీరిక లేని తనకి ఇంతగా తీరిక దొరికే సరికి ఏదోలా ఉంది. అంతలో కనిపించాడా వ్యక్తి. రెండు చేతుల్లోనూ రెండు మూటలుంచుకుని వస్తూ కనిపించాడు.

''నువ్వూ రోడ్డుకేనా?'' అడిగాడతను.

''అవును బాబయ్యా'' చెప్పాడా వ్యక్తి.

''ఏంటా సంచుల్నిండా?''

''ఉసిరికాయలు, సపోటాలు.''

''కొన్నావా?'' అడిగాడతను.

''అడవిలో కొనడాలుండవండి. కొట్టుకోడాలే! కొట్టుకుని యేరుకోడవేఁ! వూసుపోద్ది, ఓ ఉసిరికాయ తిని సూడండి'' ఇచ్చాడా వ్యక్తి. తిన్నాడతను. బాగుంది.

''దీని మీద నీళ్ళు తాగితే ఉంటాదండీ, అమృతం'' నవ్వాడా వ్యక్తి.

''వీటి కోసం ఎన్ని గంటలు కష్టపడ్డావు?'' అడిగాడతను.

''ఎన్ని గంటలెందుకండీ, ఓ గంట కష్టపడ్డాను. అంతే.''

''మరిన్ని గంటలు కష్టపడితే మరిన్ని మూటలు కట్టు కోవచ్చుగా.''

''కట్టుకోవచ్చు. కాని, ఇయాల్టికివి చాలనిపించింది. ఇద్దరు పిల్లలూ, పెళ్ళాం, నేనూ మాకివి సాలవా సెప్పండి?'' ఎదురు ప్రశ్నించాడు.

''సరిపోతాయి గాని, ముందీ సంగతి చెప్పు. రోజంతా నువ్వేం చేస్తావు'' అడిగాడతను.

''ఏం చేస్తానండి! రాత్రి పొద్దోయి పడుకుంటాను. అందుకని పొద్దు పొడిస్తేనే గాని లేవను. లేస్తే ఇదిగో ఇదే పని. అడవిలోకొచ్చి ఉసిరికాయలూ, సపోటాలూ...ఏ కాలంలో ఆ కాయలు యేరు కుంటాను. ఇంటిల్లిపాదికీ పెడతాను. సాయంత్రం పిల్లలతో ఆడుకుంటాను. రాత్రి కల్లు తాగాను. పెళ్ళాం పెట్టింది తిని, పాటలూ పద్యాలూ పాడుకుంటూ పడుకుంటాను. అంతే'' అని నవ్వాడా వ్యక్తి.

కాలాన్నంతా వృధా చేస్తున్నాడనిపించిందతనికి. అది సరికాదనిపించి ఇలా చెప్పాడతను.

''వ్యాపార వ్యవహారాలు నాకు బాగా తెలుసు. అమెరికా నుంచి వచ్చాన్నేను. నీ మేలు కోరి చెబుతున్నాను. విను. రోజుకి గంట కాదు, నాలుగైదు గంటలు కష్టపడు. ఏ కాలంలో ఆ కాయలు కొట్టి మూటలు గట్టి అమ్మకానికి పెట్టు. వ్యాపారం చెయ్! డబ్బొస్తుంది. ఆ డబ్బుతో రెండు మూడు వ్యాన్‌లు కొను. పనివాళ్ళను పెట్టుకో! అడవిలో కాయలన్నీ కొట్టేయ్. అమ్మేవి అమ్మగా మిగిలిన వాటితో మరో వ్యాపారం...మరో వ్యాపారం పెట్టు. లక్షలూ కోట్లూ సంపాదించు. సంపాదించి ఇక్కడ ఈ అడవిలో కాదు, అక్కడ పట్నంలో పెద్ద ఇల్లు కట్టుకుని పెద్దాడివయిపో.''

''బాగానే ఉంది బాబయ్యా! కాని ఇదంతా అయ్యేతలికి ఎన్నేళ్ళు పడుద్దో'' అడిగాడా వ్యక్తి.

''సుమారుగా పది పదిహేనేళ్ళు పట్టొచ్చు''

''అప్పుడేం సెయ్యాలి?''

''అదేం ప్రశ్న'' నవ్వాడతను. తర్వాత అన్నాడిలా.

''ఏం చేస్తావంటే...పది పదిహేనేళ్ళుగా వ్యాపారం చేస్చేసి అలసిపోతావు కదా! విశ్రాంతి కావాలనిపిస్తుంది. దాంతో వ్యాపారాన్నీ మూసేస్తావు. లేదంటే అమ్మేస్తావు. డబ్బు చేసుకుంటావు. కోట్లు...కోట్లు కుమ్మరించుకుంటావు.''

''కుమ్మరించుకుని'' తర్వాతేంటన్నట్టుగా అడిగాడా వ్యక్తి.

''కుమ్మరించుకుని...ఇదిగో ఇలాంటి చల్లచల్లని ప్రాంతంలో ఇల్లు కట్టుకుంటావు. రాత్రి నీ ఇష్టం వచ్చినప్పుడు పడుకుంటావు. పొద్దున నీ ఇష్టం వచ్చినప్పుడు లేస్తావు. అడవిలోకొచ్చి ఉసిరికాయలూ, జామకాయలూ కొట్టుకుంటావు. గంటే కష్టపడతావు. ఇంటిల్లిపాదికీ పెడతావు. సాయంత్రం మనవలతో ఆడుకుంటావు. రాత్రి మంచి మందు తాగుతావు. పెళ్ళాం పెట్టింది తింటావు. పాటలూ పద్యాలూ పాడుకుంటావు. ఇంతకంటే ఇంకేం కావాలి నీకు'' అడిగాడతను.

నవ్వాడా వ్యక్తి. అతన్ని చూస్తూ నవ్వుతూనే ఉన్నాడు.

# కోరిక

బోసుబాబు అంధుడు. అయిదేళ్ళ క్రితమే అతని కళ్ళు పోయాయి. కళ్ళు పోక ముందు అతను కబడ్డీ ఆటగాడు. అతను ఏ టీమ్‌లో ఉంటే ఆ టీమ్ గెలిచి తీరాల్సిందే! అనుమానం లేదందులో. అంతటి ఆటగాడు. అయితే ఆ ఆటలోనే అతని కళ్ళు పోయాయి. పోటీలో పాల్గొనేందుకు ముంబాయి వెళ్తూ రైలు ప్రమాదంలో కళ్ళను పోగొట్టుకున్నాడతను. ప్రమాదం నుంచి తను తప్పించుకున్నాడు. మిత్రుణ్ణి కాపాడే ప్రయత్నంలో పాపం అంధుడయి పోయాడు. అంధుణ్ణని ఎప్పుడూ బాధపడలేదు బోసుబాబు. కబడ్డీ ఆటకు దూరమయిపోయాననే బాధపడేవాడు. దాన్ని అధిగమించాలనుకున్నాడు. కొద్దిరోజులు కష్టపడ్డాడు. క్యారమ్ నేర్చుకున్నాడు. బోర్డునీ, స్ట్రయికర్‌నీ, కాయిన్స్‌నీ ఒక్కసారి తడిమి చూస్తే చాలు! ఆడేందుకు సిద్ధమయి పోతాడు. క్యారమ్‌లో మహామహుల్ని ఓడిస్తూ వచ్చాడు. ఛాంపియన్ అయిపోయాడు. అయినా ఇంకా ఏదో సాధించాలని తపన.

జాతీయస్థాయి క్యారమ్ ఛాంపియన్ వేణుగోపాల్‌ని ఓడించాలని బోసుబాబు కోరిక. అతనితో ఆడాలని పట్టుబట్టుక్కూర్చున్నాడు. అయితే ఆ అవకాశం అందిరావడం కష్టమే! అంధునితో వేణుగోపాల్ ఆడడు. ఆడడంటే ఆడడం భావ్యం కాదని ఆడడతను. చూపున్న తను అంధునితో ఆడడం పద్ధతి కాదంటాడు. వేణుగోపాల్ పేరు మీద ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. పాల్గొన్నాడు బోసుబాబు. ముందు బోసుబాబుకు ప్రవేశం లేదన్నా పదేపదే అభ్యర్థించడంతో నిర్వాహకులు ఒప్పుకున్నారు. ఒకొక్కరినీ ఓడించి ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకున్నాడు బోసుబాబు. విజయోత్సవ సభలో లక్ష రూపాయల నగదూ జ్ఞాపికను బోసుబాబుకి అందజేశాడు వేణు

గోపాల్. అతని పట్టుదలనీ, ఆట తీరునీ తెగ మెచ్చుకున్నాడు. మరింతగా అభిమానపడి ''కోరుకో! ఇంకేం కావాలో'' అన్నాడు. అవకాశాన్ని వదులుకోలేదు బోసుబాబు. అతనితో క్యారమ్ ఆడాలని ఉందన్నాడు.

''పద్ధతి కాదయ్యా! కాకపోతే నీ కోరిక తీర్చడం కోసం ఆడతాను'' అంగీకరించాడు వేణుగోపాల్.

''బ్లాక్ కాయిన్‌ని హోల్ చేస్తే అయిదు వేలు, వైట్‌ని హోల్ చేస్తే పది వేలు, రెడ్‌ని హోల్ చేస్తే పాతిక వేలు పందెం సార్'' అన్నాడు బోసుబాబు.

''నీతో ఆడడమే పద్ధతి కాదంటే ఇందులో పందాలొకటా? వద్దులేవయ్యా'' అన్నాడు వేణుగోపాల్. ఒప్పుకోలేదు బోసుబాబు.

''కాదనకండి సార్, ప్లీజ్'' అభ్యర్థించాడు. ఆ అభ్యర్థనకు గట్టిగా నవ్వాడు వేణుగోపాల్.

''ఛాంపియన్‌షిప్‌లో గెలుచుకున్న మొత్తాన్ని ఓడిపోవాలనుందా? వద్దు. నాతో నువ్వు ఆడలేవు. అసలు సంగతి, నాకు చూపుంది. నీకు లేదు. అందుకనీ ఈ పందాల్లాంటివి మనిద్దరి మధ్యా వద్దు. సరదాగా కాసేపు ఆడతాను. ఎంజాయ్ చెయ్'' అన్నాడు వేణుగోపాల్. బోసుబాబు కాదన్నాడు. పందెంగా డబ్బు కట్టి ఆడాల్సిందేనన్నాడు. బ్రతిమలాడాడు. అడగ్గా అడగ్గా ఆఖరికి ఒప్పుకున్నాడు వేణుగోపాల్.

''సరే, చెప్పు ఎప్పుడు ఎక్కడ ఎలా ఆడదాం'' ధీమాగా అడిగాడు.

''ఇప్పుడు ఇక్కడ ఇలా ఆడదాం'' అన్నాడు బోసుబాబు. జేబులోంచి నల్లని గుడ్డని తీశాడు. దాన్ని వేణుగోపాల్‌కి అందించాడు.

''దీన్ని కళ్ళకు కట్టుకుని ఆడండి'' అన్నాడు. వేణుగోపాల్‌కి నోట మాట లేదు. తన కోరిక తీరబోతున్నందుకు బోసుబాబుకయితే తెగ ఆనందంగా ఉంది. సంబరపడుతున్నాడతను.

# పండగంటే ఓరిమి

కొత్త ఉద్యోగం. హోదా పెరిగింది. హోదాకు తగినట్టుగా కారుంటే బాగుణ్ణనుకున్నాడు. దసరా పండక్కి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంటి ముందు కారుండి తీరాలనుకున్నాడు. అందుకు అన్ని రకాల ప్రయత్నాలూ చేశాడు. ఫలించాయవి. పండగ పూట కొత్త కారులో భార్యా, తన నాలుగేళ్ళ కొడుకు శీనూ, అత్తగారూ, మామగారూ అంతా కలసి అమ్మవారి ఆలయానికి వెళ్ళాలనుకున్నారు. అందుకోసమే ఈసారి పండక్కి తాము అత్తవారింటికి వెళ్ళక, వారినే ఇక్కడికి ఆహ్వానించాడతను. అనుకున్నట్టుగానే అన్నీ జరిగాయి. కారు పండగ రోజునే డెలివరీ చేస్తున్నారు. అదే రోజు పొద్దునే అత్తగారూ, మామగారూ వస్తున్నారు. ఆనందంగా ఉందతనికి. ఆ ఆనందంలో నిద్రపోతోన్న శీనుని ఆ రాత్రి లెక్కలేనన్ని ముద్దులు పెట్టు కున్నాడు.

''తప్పండీ! నిద్రపోతున్న వాణ్ణి పదే పదే ముద్దులాడకూడదు'' అన్నది భార్య. అయినా వినలేదతను.

తెల్లారింది. కారు తీసుకుని వచ్చేందుకు బయల్దేరాడతను. వచ్చేటప్పుడు పూజా సామగ్రిని కూడా తీసుకుని రండంటే 'సరే' నన్నాడు. భార్య అందించిన చిట్టీ చూశాడు. కొబ్బరికాయలూ, నిమ్మకాయలూ పసుపు-కుంకాలూ, పువ్వులూ ఎన్నెన్నో ఏకరువు పెట్టిందామె. మరొకప్పుడయితే అన్ని రాసినందుకు 'ఇన్ని కావాలా' అని ఆవేశపడేవాడే! ఇప్పుడు పడలేదు. ఎందుకంటే కారు సరదాలో నిండా మునిగి ఉన్నాడతను. షోరూమ్‌లో కారు ఎదురు చూస్తోంది. వెళ్ళి అందుకున్నాడు. నచ్చిన రంగులో మెరిసిపోతోంది కారు. ముట్టుకుంటే మాసిపోయేట్టుగా ఉంది.

ముద్దుపెట్టుకుందామనుకున్నాడు. చూస్తే బాగోదని వూరుకున్నాడు. పూజాసామగ్రితో పాటుగా కారులో ఇంటికి చేరుకున్నాడు. కింద పార్కింగ్‌లో కారుంచి, మీదికి తనింటికి యాభై రెండు మెట్లనీ అయిదు మెట్లన్నట్టుగా గబగబా ఎక్కేసి చేరుకున్నాడు.

''కారొచ్చేసిందా?'' అడిగింది భార్య.

''వచ్చేసింది'' చెప్పాడతను.

''మా అమ్మానాన్నా కూడా వచ్చేశారు. శీనుగాడికి క్రికెట్ బ్యాట్ తెచ్చారు. కింద వాణ్ణి ఆడిస్తున్నారు. కనిపించలేదా?'' అడిగింది.

''లేదుగాని, రారా కారు చూద్దూగాని'' అన్నాడతను. భార్యతో పాటుగా కిందికి దిగాడు. అంతలోనే ఏడుస్తోన్న శీనుని ఎత్తుకుని పరుగున వస్తోన్న అత్తమామల్ని అడిగాడు.

''ఎందుకేడుస్తున్నాడు''

''అక్కడ ఎవరిదో కొత్త కారుంది. క్రికెట్టంటూ బ్యాట్‌తో ఆ కారు హెడ్‌లైట్స్ పగలగొట్టేశాడు. రమ్మంటే రావట్లేదు. బలవంతంగా లాక్కొస్తున్నాం'' అన్నాడు మామగారు.

కొత్తకారంటే తనదే! దాని హెడ్‌లైట్స్ పగలగొట్టేశాడా? కోపం వచ్చిందతనికి. ఆవేశాన్ని అణచుకోలేకపోయాడు. మామగారి చేతిలో ఉన్న బ్యాట్ అందుకుని శీనుగాణ్ణి అతని దగ్గర్నుంచి విసురుగా తీసుకున్నాడు.

''చేయి చాపు! చాపు చెయ్యి! కారు లైట్లు పగలగొడతావా'' అంటూ వాడి చేతి మీద బ్యాట్‌తో గట్టిగా కొట్టసాగాడు. అడ్డుకున్న అత్తమామల్నీ, భార్యనీ దూరంగా నెట్టేశాడు. వాడి చేయి రక్తం ఓడుతుంటే ఆగాడప్పటికి.

బాగా గాయాలవ్వడంతో శీనుని హాస్పిటల్‌లో జాయిన్ చేయాల్సి వచ్చింది. ఎముకలు చిట్లి నుజ్జు నుజ్జు అయిన కారణంగా వేళ్ళు పనికి రావని తొలగించారు వాటిని. మూడు రోజులగ్గానీ శీను మనలోకంలోకి రాలేకపోయాడు. వచ్చిన తర్వాత ఏడుస్తోన్న తండ్రిని చూశాడు.

''సారీ డాడీ'' అన్నాడు.

''పర్వాలేదమ్మా! కొత్త లైట్లు పెట్టించానులే'' అన్నాడతను.

''మరలాగే నాకూ కొత్త వేళ్ళొస్తాయా డాడీ?'' అడిగాడు శీను, మొండి చేతిని తండ్రికి చూపిస్తూ. అతని ఏడుపుకి అంతులేకుండా పోయింది. ఆవేశం ఎంతపని చేసిందంటూ నెత్తికొట్టుకున్నాడు.

# పొట్టిబాబు పాట్లు

అడుగడుగో అతగాడే పొట్టిబాబు. పేరుకి తగ్గట్టుగా పొట్టిబాబు పొట్టిగానే కాదు, యాభైయ్యేళ్ళు పైబడినా బాబులాగానే ఉంటాడు. నిక్కరూ చొక్కా మీద ఉంటాడు. మెళ్ళో బోర్డొకటి వేళ్ళాడుతూ ఉంటుంది. దాని మీద ఇలా రాసి ఉంటుంది.

రూపాయికో జోకు.

మీకు నవ్వు రావడం ఖాయం.

లేదంటే మీ రూపాయి మీకు వాపసు.

విశాఖ బీచ్‌లో ఉదయం ఆరు నించి ఎనిమిది వరకూ, సాయంత్రం నాలుగు నించి రాత్రి ఎనిమిది వరకూ పొట్టిబాబు కనిపిస్తాడు. పిలిస్తే వస్తాడు. రూపాయిచ్చి అడిగితే జోకు చెబుతాడు. జోకు పాతదే కావచ్చు. కాని అతగాడు చెప్పే పద్ధతికి నవ్వొచ్చి తీరుతుంది. ఆ పద్ధతి అతను నిన్నో మొన్నో నేర్చుకోలేదు. ముప్పయ్యేళ్ళ కిందట బుర్రకథలు చెప్పేటప్పుడు నేర్చుకున్నాడు. దంపుడు లక్ష్మి బుర్రకథ దళంలో అతడు వంతలు పాడేవాడు. హాస్యగాడు. పొట్టిబాబు హాస్యం అంటే కళింగాంధ్రలో పెద్దపేరు. సినిమాలూ, టీవీ రావడంతో చాలా జానపద కళలు తుపాకీ దెబ్బకి చెట్టు మీది పిట్టలెగిరి పోయినట్టుగా ఎగిరి పోయాయి. అందులో బుర్రకథ కూడా బుర్రుపిట్టలా ఎగిరి పోయింది. పొట్టిబాబు మాత్రం పిట్టలదొరలా విశాఖనంటి పెట్టుకుని ఉండిపోయాడు. భార్య ఈ మధ్యనే పోయింది పాపం! ఓ కొడుకున్నాడు. వాడికి పెళ్ళయింది. కోడలి చేతిలో రోజుకి ఇరవై రూపాయలు పెడితేనే రెండు పూటలా తిండి.

పెట్టలేదనుకో! పొట్టిబాబుకి మంచినీరే ఆహారం. కడుపు నిండా నీరు తాగి పడుకోవాల్సిందే! అందులో మొహమాటం లేదు. అందుకని రోజుకి ఎలాగయినా ఇరవై రూపాయలు సంపాదించి తీరాలి.

సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకుందామని బీచ్‌కి వచ్చిన వాళ్ళని ఇట్టే గుర్తిస్తాడు పొట్టిబాబు. గుర్తించి రూపాయి ఇవ్వకపోయినా, వద్దన్నా జోకులు చెబుతాడు.

చావడానికి మూడు సులువయిన మార్గాలున్నాయి. ఒకటి: రోజుకో చుట్ట తాగండి! పదేళ్ళు ముందుగానే చనిపోతారు. రెండు: రోజూ విస్కీ తాగండి! ముప్పయి యేళ్ళ ముందుగా చనిపోతారు. మూడు: ఎవర్నయినా నిజాయితీగా ప్రేమించి చూడండి. రోజూ ఛస్తూ బతకొచ్చంటాడు. ఇప్పుడు అదే పరిస్థితిలో ఉంటే చావడం ఎందుకంటాడు. నవ్విస్తాడు. అప్పుడా సమయంలో రూపాయిస్తే తీసుకోడు. రేపివ్వండి, తీసుకుంటానంటాడు. రేపులోని తీపిని చూపించి వెళ్ళిపోతాడు. అలా చాలా మందిని బతికించాడు పొట్టిబాబు.

భార్యతో గొడవ పడుతున్న భర్తని చూశాడంటే చాలు! రహస్యం చెబుతున్నట్టుగా ఇలా చెబుతాడు.

'నోర్ముయ్' అని భార్య మీద ఒంటి కాలి మీద లేస్తే ఆవిడ నోరు ముయ్యదయ్యా!. నీ పెదవులు రెండూ దగ్గరగా ఉంటే, చిన్ని నోరూ నువ్వూ బలే ముద్దొస్తావు అను, చాలు! నోరు మూస్తుంది గొడవలుండవంటాడు. గర్ల్‌ఫ్రెండ్ కోసం వెతికే అబ్బాయిల్ని చూశాడంటే ఆటపట్టించి కాని వదలడు. గర్ల్‌ఫ్రెండ్ లేకపోతే జీవితంలో ఏదో కొంత కోల్పోయినట్టే! గర్ల్‌ఫ్రెండుంటే జీవితాన్నే కోల్పోయినట్టని తెలుసుకో అంటాడు.

పొరపాటు చేసినా అభినందనలు చెప్పే రోజొకటి ఉంది. అదెంటో తెలుసా? పెళ్ళిరోజంటాడు పొట్టిబాబు. అలాగే రెండు పెళ్ళిళ్ళు చేసుకోకూడదని గవర్నమెంట్ ఎందుకు గోల చేస్తుందంటే...మన రాజ్యాంగం ప్రకారం ఒకే తప్పుని రెండు సార్లు చేస్తే శిక్షించే అవకాశం లేదంటాడు. చీకటిలో ఉన్నాననుకుంటే వెలుతురు కోసం దేవుణ్ణి ప్రార్థించు. ఎంత ప్రార్థించినా దేవుడు నీ మొర వినలేదంటే...కరెంటు బిల్లు కట్టాలని గుర్తు పెట్టుకో అంటాడు.

అయిదు రూపాయలే ఆర్జించాడిప్పటికి. ఇంకా పదిహేను రూపాయలు సంపాదించాలి. జోకులు వినేవాళ్ళెవరు? వెతుకుతున్నాడు పొట్టిబాబు. అటూ ఇటూ తిరుగుతున్నాడు. అడుగడుగో అతగాడే పొట్టిబాబు!! ఇడిగిడుగో ఇటొస్తున్నాడు.

⌘

# ఆనందం

అతనికి ఎనభై యేళ్ళుంటాయి. సన్నగా ఉన్నాడు. వణికిపోతున్నాడు. ఊతకర్రను పట్టుకుని నిలుచున్నాడు. నిలుచుని, ఎదురుగా ఉన్న హోటల్ పుష్పక్‌ను చూస్తున్నాడు. పది అంతస్తుల హోటల్‌ని తల పైకెత్తి చూడడం కష్టంగా ఉందతనికి. అయినా చూశాడు. ఆకలిగా ఉంది. రెస్టారెంట్ వైపు నడిచాడు. వరుసగా నాలుగైదు రెస్టారెంట్స్ ఉన్నాయక్కడ. మొదటి దాన్ని వద్దనుకున్నాడెందుకో! రెండో దానికేసి నడిచాడు. డోర్ తెరుచుకుని లోపలికి ప్రవేశించాడు. బాగా రద్దీగా ఉందక్కడ. కాఫీ, టిఫిన్ తీసుకుంటూ గోల గోలగా ఉన్నారు కస్టమర్స్. సీటు కోసం చూడసాగాడు. అటూ ఇటూ చూడడంలో తిరగడంలో అదుపు తప్పి పడబోయాడు. అంతలో వచ్చిందామె. పేరు సుశీల. వేటరస్‌గా పని చేస్తోందక్కడ. వచ్చి, అతన్ని పడకుండా పట్టుకుంది. అతని నడుము చుట్టూ చేయుంచి ముందుకు నడిపించింది. ఖాళీగా ఉన్న సీటులో కూర్చో బెట్టింది. తిరగని ఫ్యాన్ వంక అతను చూస్తే ''సారీ'' అని నవ్వుతూ వెళ్ళి ఫ్యాన్ ఆన్ చేసింది. మెనూని పట్టించుకోని అతన్ని గమనించింది.

''చెప్పండి సార్! ఏం తీసుకుంటారు?'' అడిగింది. చెప్పాడతను. అతనలా ఆర్డర్ చేస్తోంటే పెదవుల చివర ఉమ్మి చేరి, బొట్టుగా కింద పడబోయింది. నాప్‌కిన్ అందుకుని సున్నితంగా అద్దిందక్కడ.

''థాంక్యూ'' అన్నాడతను.

సాంబారిడ్లీ, దోసె తెచ్చి పెట్టింది సుశీల. తినసాగాడతను. పొలమారింది. నీళ్ళందించిందామె. తాగాడు. కృతజ్ఞతగా కళ్ళార్చాడు.

''కాఫీ'' చెప్పాడు.

''కొంచెం షుగర్ వేస్తాను. ఇబ్బంది లేదు కదా?'' అడిగింది సుశీల. లేదన్నట్టుగా నవ్వుతూ తలూపాడతను. కాఫీ తెచ్చి పెట్టింది. తాగాడతను. బిల్ తెచ్చింది. రెండొందల రూపాయలు పైబడింది బిల్. అయిదు వందల నోటిచ్చాడతను. వెళ్ళి బిల్ చెల్లించి, మిగిలిన చిల్లర పట్టుకుని వచ్చింది. ఇంతలో కౌంటర్ దగ్గరి వ్యక్తి పిలిచాడెందుకో! పరుగుదీసిందక్కడికి. అక్కడి వ్యక్తితో మాట్లాడి ఇటు తిరిగేసరికి, అతను లేచి నడిచొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. గబగబా వచ్చి, అతన్ని పట్టుకుని, దగ్గరగా ఉన్న కుర్చీలు దూరం చేసి, నడిచేందుకు అతనికి వీలు కలిగించింది. ఒక చేత్తో ఊతకర్ర పట్టుకుని, మరో చేత్తో సుశీల్ని పట్టుకుని అతను అడుగులు వేశాడు. డోర్ దగ్గరికి చేరుకున్నాడు.

''థాంక్యూ'' అన్నాడు.

''వెల్‌కమ్ సార్'' నవ్వింది సుశీల.

''మీరు తరచూ రావాలిక్కడికి. మిమ్మల్ని మేము రోజూ చూడాలి'' అంది. చేతులు జోడించింది.

''ఓకే'' అని వెళ్ళిపోయాడతను.

తన టేబుల్ దగ్గరికి వచ్చింది సుశీల. క్లీన్ చేస్తూ టేబుల్ మీది మెనూ కేసి చూసింది. ఉబ్బెత్తుగా ఉందది. లోపల ఏముందని తెరిచి చూసింది. వెయ్యినోట్ల కట్ట ఉందందులో. లక్ష రూపాయలు. ఆశ్చర్యపోయి అందుకుంది. కింద నాప్‌కిన్ మీద ఏదో రాసి ఉండడాన్ని చూసి చదివింది.

సుశీల! కస్టమర్‌ని గౌరవించడమే కాదు, నిన్ను నువ్వు గౌరవించుకోవడం కూడా నీకు బాగా తెలుసు! ఉద్యోగధర్మంలో ఉన్న ఆనందం నీకు తెలిసినట్టుగా మరొకరికి తెలీదేమో! అందుకే నీకిది నా కానుక. తీసుకుంటావని ఆశిస్తూ ఆశీస్సులతో...

–హరిశ్చంద్రప్రసాద్

హరిశ్చంద్రప్రసాదంటే...నోట్ల కట్ట మధ్యలో ఉన్న విజిటింగ్ కార్డ్ తీసి చూసింది.

హరిశ్చంద్రప్రసాద్

ఛైర్మన్

పుష్పక్ హోటల్స్

సుశీలకేదీ అంతుచిక్కలేదు. చేష్టలుడిగిపోయింది.

# హ్యూమన్ లైబ్రరీ

అనుభవాన్నంతా రంగరించి రాసిన పుస్తకాన్ని మించింది మరొకటి లేదంటాడతను. జీవిత చరిత్రలంటే తెగ ఇష్టపడతాడు. నిండు నూరేళ్ళ జీవితాన్ని పండులా అందిస్తే అందుకోకపోవడం అవివేకం అంటాడు. మంచి పుస్తకం అంటే అది మనతో మాట్లాడు తుంది. మనల్ని లాలిస్తుంది. ఓదారుస్తుంది. నవ్విస్తుందంటాడు. అలాంటి పుస్తకాల్నే లైబ్రరీలో ఏరేరి తీసుకుంటాడతను. కొన్ని అట్టలు చిరిగిపోయి ఉంటాయి. మరికొన్ని పొగచూరిన గోడ రంగులో ఉండి, ముట్టుకుంటే చాలు! మెత్తగా మెత్తగా పిగిలి పోతుంటాయి. ఇంకొన్ని చెదలు తినగా మిగిలి మట్టిగొట్టుకుని పోయుంటాయి. అయినా అవే కావాలతనికి. అందులో బతుకును వెదుక్కుంటాడతను. చదువుతూ బాధల్ని, భయాల్ని మరచి పోతాడతను. ఎవరో చెప్పారు, గాంధీనగర్‌లో 'హ్యూమన్ లైబ్రరీ' పెట్టారని. రెండు మూడు నెలలయిందట ప్రారంభించి. అక్కడ మనుషులే పుస్తకాలు. రకరకాల అనుభవాలు కలిగిన మనుషులుంటారక్కడ. వెళ్ళి పుస్తకాన్ని తెరిచినట్టుగా ప్రశ్నల మీద ప్రశ్నలు సంధిస్తే చాలు! తెలిసిన మేరకు చెబుతారట! వారి అనుభవాన్నంతా వివరిస్తారట! విజయాలు, అపజయాలు, సుఖ దుఃఖాలు అన్నిటి గురించీ మాట్లాడతారు. అక్కడే ఏర్పాటు చేసిన కేఫ్‌లో కాఫీ తాగుతూ ఎంచక్కా మాట్లాడుకోవచ్చన్నాడు. వికలాంగులు, అంధులు కూడా ఉన్నారు. కావాలంటే వారి జీవితానుభవాలు కూడా తెలుసుకోవచ్చని చెప్పాడు. కెనడాలో ఇలాంటి లైబ్రరీలు ఉన్నాయట! వాటి ప్రేరణతోనే ఇక్కడ పెట్టా రన్నాడు. చిత్రమనిపించిందతనికి. పుస్తకాల్లా మనుషులుంటారు. మనతో మాట్లాడతారు. బాగుంది బాగుందనుకున్నాడతను. పరుగుదీశాడక్కడికి.

బాగానే ఉంది లైబ్రరీ. రెండంతస్తులున్నాయందులో. మొదటి అంతస్తులో అరవై యేళ్ళు పైబడిన వారుంటే, రెండో అంతస్తులో అరవై యేళ్ళ లోపు వారున్నారు. ఎందుకో అతనికి మొదటి అంతస్తు మనుషులే నచ్చారు. మవునంగా ఉన్నారంతా. కొందరు మడత నలగని బట్టల్లో ఉంటే, కొందరు నలిగిన బట్టల్లో ఉన్నారు. ఇంకొందరు చిరిగిన బట్టల్లో ఉన్నారు. అందరూ తెరవని పుస్తకాల్లా ఉన్నారు. ఒకాయనికి కాళ్ళు లేవు. మరొకాయనకి కళ్ళు లేవు. అయినా ఎవరో వస్తారని, తమను చదువుతారని నిరీక్షిస్తున్నారు.

''మీ పేరు?'' ఒకాయన్ని అడిగాడతను. ముఖచిత్రాన్ని ముట్టుకున్నాడు.

చెప్పాడాయన. పేజీలు తిరగేయాలనుకున్నాడు.

''జీవితం అంటే?'' అడిగాడతను.

''జీవితం అంటే పుట్టడం, తినడం, పడుకోవడం, ప్రేమించడం, చనిపోవడం. అంతే'' అన్నాడాయన.

''కాదు, ఇంకేదో ఉంది'' అన్నాడతను.

''ఉంది. తెలివైన వాడికి జీవితం అంటే ఒక కల. తెలివి తక్కువవాడికి అది ఓ ఆట. డబ్బున్న వాడికది నవ్వులాటయితే పేదవాడికది విషాదం'' అన్నాడాయన.

''ఇంకా?''

''ఇంకా అంటే కండ బలం ఉన్నవాడు చావుకి భయపడడు. గుండె బలం ఉన్నవాడు జీవితానికి భయపడడు.''

''బాగా చెప్పారు. తర్వాత'' అడిగాడతను.

''తర్వాతేముంది?జీవితం నిమ్మపళ్ళిచ్చిందనుకో! నిమ్మరసం చేసి అమ్ముకో! గ్లాసుకి అయిదు రూపాయలు. హాయిగా బతికేయొచ్చు'' అన్నాడాయన. నవ్వాడతను.

''జీవితం పదాలకు మాటలకు అందదయ్యా! వర్ణించలేం దాన్ని. అందుకని ఏం చెయ్యాలంటే బతికేయడమే! అదే జీవితం'' అన్నాడాయన.

''నమస్తే'' పుస్తకాన్ని మూసేశాడతను. ముందుకు నడిచాడు.

# చిన్న మాట! ఒక మంచి మాట!

గురజాడ నూట యాభయ్యవ జయంతి ఉత్సవాలను సాహితీ సమితి పెద్ద ఎత్తున నిర్వహించాలని తలపెట్టింది. మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా చేయాలనుకుంది. రాష్ట్రంలోని ప్రముఖ కవుల్నీ, రచయితల్నీ ఆహ్వానించింది. చిన్న వూరు. హోటల్స్ లేవు. ఆ కారణంగా అతిథులందర్నీ సాహితీ సమితి సభ్యులందరూ తలొకరూ పంచుకోవాల్సి వచ్చింది. ప్రముఖ కవి సత్యనారాయణగారు, మాస్టారింటి అతిథి అయ్యారు. మాస్టారికి చిన్నప్పటి నించి సత్యనారాయణన్నా, వారి కవిత్వం అన్నా చెప్పలేనంత ఇష్టం. సత్యనారాయణ రాసిన ప్రతి కవితా సంకలనం ఆయనింట ఉన్నాయి. బైండింగ్ చేయించి మరీ దాచుకున్నారు. సత్యనారాయణ ఫోటోలు కూడా ఉన్నాయి ఆయన దగ్గర. ఎక్కడెక్కడ ఏఏ సమావేశాల్లో సత్యనారాయణ పాల్గొన్నదీ, వారు అందుకున్న బిరుదులూ వివరాలతో సహా ఆల్బంగా తయారు చేసి జాగ్రత్త పరిచారాయన. సత్యనారాయణ రకరకాల కాగితాల మీదా, రూపాయి నోట్ల మీదా చేసిన ఆటోగ్రాఫులు కూడా దాచారాయన. మాస్టారు నోరిప్పితే చాలు, వచ్చేది సత్యనారాయణ పద్యమే! ఎవరి గురించి చెప్పినా, దేని గురించి చెప్పాల్సి వచ్చినా సత్యనారాయణ కవిత్వాన్ని కోట్ చేయకుండా మాస్టారుండలేరు. అభిమాన కవి కవిత్వమంతా ఆయనకి కంఠోపాఠం.

మాస్టారింట సత్యనారాయణ విడిది చేశారని తెలిసి ఊరిలో ఉన్న కవులంతా అక్కడికి చేరారు. రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం. ఉత్సవాలు ప్రారంభించేది సత్యనారాయణగారే! ఆ ముచ్చట్లే ముందంతా మాట్లాడుకున్నారు. తర్వాత కవితా

పఠనంలో పడ్డారు. కొత్తగా రాసిన పద్యాలను సత్యనారాయణకు వినిపించసాగారు. కొత్తగా రాశారన్న మాటేగాని ఆ కవిత్వం అంతా పాత చింతకాయ పచ్చడిలా ఉంది.. ఎక్కడా ఓ మంచి మాట లేదు. మంచి భావం లేదు. ముఖ్యంగా కవిత్వం లేదెందులోనూ. అయితే విమర్శించి ఇబ్బంది పెట్టడం ఇష్టం లేని సత్యనారాయణ, సాటి కవులు చదివిన ప్రతి పద్యాన్నీ మెచ్చుకుంటూ, అభినందిస్తూ ఆశీస్సులందజేశారు. ముఖమ్మీదే బాగా లేదని చెప్పడం, పనికిరావని కొట్టి పారేయడం మంచి లక్షణం కాదని అనుభవం మీద తెలుసుకున్నారాయన.

రాత్రి అయింది. 'రేపు సభలో కలుద్దాం' అంటూ అంతా విడిపోయారు. భోజనం చేసి, తనకంటూ కేటాయించిన గదిలోకి వచ్చారు సత్యనారాయణ. కూడా వచ్చిన మాస్టారితో బాధను పంచుకోకుండా ఉండలేకపోయారు.

''ఇందాక చదివిన పద్యాలేవీ బాగా లేవు మాస్టారు. కవిత్వంలోకి కొత్త రక్తం రావట్లేదు. సరయిన కుర్రాళ్ళు రావట్లేదు'' అన్నారు. జవాబుగా మాస్టారు నవ్వి వూరుకున్నారు. ఎదురుగా ఉన్న బుక్‌షెల్ఫ్‌కేసి చూశారు సత్యనారాయణ. చాలా పుస్తకాలు ఉన్నాయి అందులో. గురజాడ, శ్రీశ్రీ, అరుద్ర, తిలక్, కుందుర్తి, అజంతాలతో పాటుగా తన పుస్తకాలన్నీ ఉండడం ఆనందమనిపించింది సత్యనారాయణకి. ఆ పుస్తకాలతో పాటు అక్కడో నోట్‌బుక్ కూడా ఉంది. కావాలనే దాన్నందుకున్నారు సత్యనారాయణ. తిరగేశారు. పేజీ పేజీనా కవిత్వం ఉంది అందులో. ఆ కవిత్వం కొత్తగా ఉంది. ఆశను కల్పిస్తోంది. మాట బాగుంది. దాని బాట బాగుంది.

''ఎవరు రాశారు మాస్టారు? మీ అబ్బాయా?'' అడిగారు. మాస్టారేదీ చెప్పకుండానే మళ్ళీ ఇలా అన్నారు.

''కవిత్వం అద్భుతంగా ఉంది. కుర్రాణ్ణి సానబెడితే మంచి కవి అవుతాడు. అనుమానం లేదందులో. పిలవండోసారి, అభినందిస్తాను.''

''లేడుసార్! పాతికేళ్ళ కిందటే కవిగా చచ్చిపోయాడు. అప్పుడు మీరు ఈ కవిత్వాన్ని మెచ్చుకోలేదు. పైగా విమర్శించి హేళన చేశారు'' అన్నారు మాస్టారు.

''ఆ కుర్రాణ్ణి నేనే సార్'' అన్నారు మళ్ళీ. సత్యనారాయణకి నోట మాట లేదు.

# సంక్రాంతి సంబరం

ఈ పాటికి పెద్దన్నయ్యా, వదినా, పిల్లలూ; చిన్నక్కా, బావా, పిల్లలూ అందరూ వచ్చేసి ఉంటారు. పెద్దక్కా వాళ్ళూ, తనే.. సరిగ్గా పండగ నాటికి ఊరికి చేరుకుంటున్నది. పెద్దక్కా వాళ్ళు కూడా ముందుగానే ఊరికి చేరుకోవాల్సి ఉంది. అయితే వాళ్ళ మామగారికి వంట్లో బాగోలేదంటే ఆగిపోయారు. ఇప్పుడు బాగానే ఉందట! బయల్దేరామన్నారు. తనకేమో, డాక్టరయి నందుకు పొద్దున నుంచీ రాత్రి వరకు ఆపరేషన్లుంటాయి. సెలవు దినాలయినా ఎమర్జన్సీ అంటే పరిగెత్తక తప్పదు. అలాంటిది, వారం రోజుల పాటు ఊరిలో ఉండనంటే మేనేజ్‌మెంట్ ఒప్పు కుంటుందా? ఒప్పుకోదు. ఒప్పించేసరికి తల ప్రాణం తోక కొచ్చింది. పెళ్ళాం పిల్లలూ ఎప్పుడో వెళ్ళిపోయారు ఊరికి.

అమ్మా నాన్నా లేకపోయినా ఊరిలో ఇల్లు అలాగే ఉంది. ఏడాదంతా ఇంట్లో ఎవరూ ఉండకపోయినా ఈ పండగ నాలుగు రోజులూ నలుగురం కలిసి ఉంటాం. సంక్రాంతి పండగ చేసు కోవాలంటే మా ఊరులోనే చేసుకోవాలి. ముగ్గులూ, గొబ్బె మ్మలూ, కోడిపందాలూ, గాలిపటాలూ గొప్పగా ఉంటుంది వాతావరణం అనుకున్నాడతను.

రాత్రి ఒంటిగంటయింది. చలిగాలి కొడుతోంది. కారులో కాస్తంత వెచ్చగా ఉన్నా, గాలిని తట్టుకోలేకపోతున్నాడతను. ఎర్రగా మంట కనిపిస్తే బాగుణ్ణు, చలికాచుకోవచ్చనిపించింది. అనుకున్నదే ఆలస్యం భోగిమంట కనిపించింది. అదిగో అది మంటంటే, ఇదిగో ఇక్కడ కారాపి చలి కాచుకున్నాడతను. తెల్లారేసరికి, పుట్టిన ఊరిలో ఉంటాడు. హాయి హాయిగా ఉంటుందనుకుంటున్న క్షణంలో సెల్‌ఫోన్ మోగింది. జూనియర్

డాక్టర్ మాట్లాడాడు. ఎమర్జన్సీ కిందే లెక్క! ఎవరో స్త్రీ. ఆపరేషన్ చేస్తేనే కాని, బతికేటట్టు లేదు. ఊరికి దగ్గరగా ఉంటే దయచేసి రండన్నాడు. ఊరికి దగ్గరగా అయితే తను లేడు. బాగా దూరంగానే ఉన్నాడు. అయినా తప్పదు. వెళ్ళాల్సిందేననుకుని, బయల్దేరాడు. తెల్లారింది. అటు ఇంటికి చేరుకోవాల్సిన వాడు, ఇటు ఆసుపత్రికి చేరుకున్నాడు. పేషెంట్‌ని చూశాడు. పోల్చుకున్నాడు. ముక్కు కింద పెద్ద పుట్టుమచ్చ! అనుమానం లేదు. ఆమే అనుకున్నాడు. ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేయమన్నాడు. చకచకా ఏర్పాట్లు జరిగాయి. నాలుగు గంటలపాటు కష్టపడి, ఆమెని బ్రతికించాడు. బాగా అలసిపోయాడేమో! రూంలోకి వస్తూనే కుర్చీలో కూలబడి కళ్ళు మూసుకున్నాడు. గతం గుర్తుకు రాసాగిందతనికి.

తను టెన్త్ చదువుతున్నాడప్పుడు. ఇంట్లో ఎవరూ లేరు. అంతా బంధువులింట పెళ్ళికి పట్నం వెళ్ళారు. తనూ వెళ్ళాల్సిందే! కాని, పరీక్షలని ఉండిపోయాడు. మూడు రోజులక్కాని రారెవరూ. ఈమూడు రోజులూ పక్కింటి పిన్నిగారింట భోజనం చేసి, చదువుకోవాలి. మొదటి రోజు గడిచింది. రెండో రోజుకి పిన్నిగారు ఇంట్లో లేరు. వాళ్ళమ్మగారికి ఒంట్లో బాగాలేదంటే పక్క ఊరికి పరిగెత్తిందామె. పొద్దున నుంచీ పచ్చి మంచినీళ్ళు కూడా లేవు. ఆకలి దంచేస్తోంది. ఏడుపొస్తోంది. ఎవరయినా పిడికెడు అన్నం పెడితే బాగుణ్ణనుకుంటున్న సమయంలో ఆమె, ముక్కు కింద పెద్ద పుట్టుమచ్చ ఉన్న ఎదురింటి కొత్తకోడలు, తనని బాగా గమనించిందేమో! ఒకే కులం కాకపోవడంతో అన్నం పెట్టలేదు కాని, గ్లాసు నిండుగా పాలిచ్చింది.

''ఆకలి వేస్తే అడుగు! ఆరారా పాలిస్తాను. తాగి చదువుకో'' అంది. అలాగే తాగి చదువుకున్నాడు. రాత్రి గడిచి, తెల్లారింది. ఆమే తెలియజేసిందట! ముందుగా పట్నం నుంచి పెద్దక్క వచ్చేసింది.

అప్పుడు ఆకలి తీర్చి ఒక రకంగా తన ప్రాణాలు కాపాడిందామె. ఇప్పుడు తను ఆమె ప్రాణాలు కాపాడాడు. పండగంటే సంతోషం. ఇంతకంటే సంతోషం ఇంకేముంటుందనుకున్నాడతను. కంటి ముందు సంక్రాంతి ముగ్గులూ, గొబ్బెమ్మలూ, గాలిపటాలూ, పందెం కోళ్ళూ కనిపించాయి. సంబరమనిపించిందతనికి.

# బిస్కట్‌ప్యాకెట్

టిక్కెట్ వెయిటింగ్ లిస్ట్‌లో ఉంది. కన్‌ఫర్మ్ అయ్యే అవకాశమే లేదు. అయినా ప్రయాణించక తప్పదు. రేపు ఎట్టి పరిస్థితుల్లోనూ సిటీలో ఉండాల్సిందే! ఉండకపోతే ఉద్యోగానికే ప్రమాదం. టిటిఈని పట్టుకుని బతిమలాడాలి. కన్నీటి కథ ఏదో చెప్పాలి. చెబితే ఆడదాన్ని కాబట్టి కరిగిపోవచ్చు. కరిగాడా, బెర్త్ ఎలాట్ చేశాడా, జాక్‌పాట్ కొట్టినట్టేనని అనుకుందామె.

రాత్రి ఎనిమిది దాటింది. ట్రయిన్ రావడానికింకా గంట టైముంది. ఈ గంటా ఏం చెయ్యాలి? చక్కని పుస్తకం ఒకటి కొనుక్కుంటే బెటర్! చందమామ కొనుక్కుంటే ఎంచక్కా పిల్లల కథలు చదువుకోవచ్చు. దెయ్యాలూ, దేవుళ్లూ బలే ఉంటాయి కథలనుకుందామె. బుక్‌స్టాల్ కోసం చూసింది. కొద్ది దూరంలో కనిపించింది. గబగబా నడిచిందక్కడికి. చందమామ కోసం వెతికింది. దొరికింది. అందుకుందామె. వందనోటు తీసిచ్చింది. చిల్లర లేదన్నాడు. బిస్కట్‌ప్యాకెట్ తీసుకుంది. ఇప్పుడు ఇస్తాడు చిల్లర అనుకుందామె. అనుకున్నట్టే అయింది. చిల్లర ఇచ్చాడు. అమ్మకాలకిదో 'చిల్లర' టెక్నిక్ అని అసహ్యించుకుందామె. ముందు రెండు బిస్కట్స్ తిని, తర్వాత ఓ టీ తాగి, ఆ తర్వాత చందమామ చదువుకుందా మనుకుని, చందమామని భుజాన ఉన్న సంచిలో పడేసింది. వచ్చి, ప్లాట్‌ఫారం బెంచీ మీద కూర్చుంది. ట్రయిన్ గురించి ఎనౌన్స్‌మెంట్ వినవస్తుంటే శ్రద్ధగా ఉంది. గంటలో వస్తుందట ట్రయిన్. పాతపాటే పాడారు. బిస్కట్స్ తిందామనుకుంది. చూస్తే చేతిలో ప్యాకెట్ లేదు. ఏమయింది అనుకుంటుంటే...పక్కనే కూర్చున్న వ్యక్తి చేతిలో తన బిస్కట్

ప్యాకెట్ కనిపించింది. దొంగ రాస్కెల్! ఎనౌన్స్‌మెంట్ వింటుంటే బిస్కట్‌ప్యాకెట్ దొంగిలించేశాడు. అనుమానం లేదు. చూడ్డానికేమో పెద్దమనిషిలా ఫోజూ వీడూ!

కోపం వచ్చిందామెకు. చురచురా చూసిందతన్ని. ఆమె చూపుల్ని పట్టించుకోలేదతను. ప్యాకెట్ చించి, బిస్కట్స్ తీసి తాపీగా తినసాగాడు.

''ఏయ్'' అందామె. ఏంటన్నట్టుగా చూశాడతను.

''బిస్కట్.'' కోపంతో మాటలు రావడం లేదామెకు.

'కావాలా' అన్నట్టుగా చూశాడతను.

''ఊఁ'' అందామె. అప్పటికి సగం బిస్కట్స్ తినేశాడు. మిగిలిన సగం బిస్కట్స్ ఉన్న ప్యాకెట్ ఆమె చేతిలో ఉంచి, నవ్వుతూ వెళ్ళిపోయాడు. 'ఇడియెట్' తిట్టిందామె.వినిపించిందేమో! చూసి మరింతగా నవ్వాడతను. చేసిన పనికి సిగ్గు లేదు. నవ్వొకటి అనుకుందామె. రెండు మూడు బిస్కట్స్ తింది. వెళ్ళి టీ తాగింది. వచ్చి యథాస్థానంలో కూర్చుందో లేదో నిద్రొస్తున్నట్టనిపిస్తే కళ్ళు మూసుకుంది. తెరిచేటప్పటికి ప్లాట్‌ఫారమ్మీద ట్రయిన్ వచ్చి ఉంది. అదృష్టం బాగుండి మెలకువ వచ్చింది. లేకపోతే...అనుకుని, టిటిఈని కలిసింది. అనుకున్నట్టుగానే కన్నీటి కథ వినిపించింది. నమ్మలేదు టిటిఈ. కాకపోతే నమ్మినట్టు నటించి, కోచ్‌లో ముందు కూర్చోమన్నాడు. తర్వాత బెర్త్ ఎలాట్ చేసేదీ లేనిదీ ఆలోచిద్దామన్నాడు. కూర్చోమన్నాడు, అది చాలు అనుకుందామె. వెళ్ళి సీట్లో కూర్చుంది. తనలాగే ఇద్దరు ముగ్గురు ఉన్నారక్కడ. టిటిఈ కరుణాకటాక్ష వీక్షణాల కోసం వెయిట్ చేస్తూ పుస్తకాలు చదువుకుంటున్నారు. చందమామ గుర్తొచ్చిందామెకు. సంచిలో చేయి పెట్టి చందమామను తీస్తుంటే చేతికి ప్యాకెట్ లాంటిది తగిలింది. తీసి చూస్తే బిస్కట్ ప్యాకెట్. తన ప్యాకెట్ తన దగ్గరే ఉంది. మరి అతను తిన్నది? అతను కొనుక్కున్నదా? అయ్యయ్యో! ఎంత పని జరిగింది. అతన్ని దొంగనుకుంది తను. తిట్టింది. అయినా అతను ఏమీ అనలేదు. బిస్కట్స్ ఇచ్చి నవ్వుతూ వెళ్ళిపోయాడు. ఛఛ! తొందరపాటు! తొందరపాటుతనం ఎంత పని చేసిందనుకుని చందమామతో నెత్తి మీద 'ఫట్‌ఫట్' మంటూ రెండుసార్లు కొట్టుకుంది. ఎదురుగా కూర్చున్న వారికి ఆమె ఎందుకలా ప్రవర్తిస్తున్నదీ అర్థం కాలేదు. వింతగా చూడసాగారు.

# నేరం కలది కాదు, అయితే గియితే నీదే!

'కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు' అన్నపాట వినవస్తోంది. గుడిసెలో పడుకుని వింటున్నాడు రాజు. వీధి చివర పెళ్ళి పందిట్లోంచి వినవస్తోందా పాట. బాగుందనుకున్నాడు. రాజుకి పదహారేళ్ళుంటాయి. చదువు లేదు. తల్లిదండ్రులు కూడా లేరు. ఓ ముసలి గుడ్డి తాత ఉన్నాడు. ఆ తాతతో అడుక్కుని బతుకుతున్నాడు. అయితే ఆ బతుకు వాడికి ఇష్టం లేదు. కష్టపడి బతకాలని, ఏదో సాధించాలని తపన. ఆ మాటెత్తితే చాలు! ముసలి తాత అరుస్తూ మీది మీది కొస్తాడు. 'ఎల్లెహె, ఎదవ కబుర్లా నువ్వూ' అంటాడు.

''పెల్లోరు అన్నాలెడుతున్నారు. పరిగెత్తు''. కుంటి బిచ్చగత్తె చెప్పింది. గుడ్డి ముసలోడు గుడిసెలో లేడు. కూతురు దగ్గర కెళ్ళాడు. ఊరవతల మర్రిచెట్టు కింద ఉంటుందా కూతురు. దానికి కళ్ళూ కాళ్ళూ ఉన్నాయి. ఓ చెయ్యి లేదు. అది చూపించి అడుక్కుంటూ ఉంటుంది. ఈ రోజు కోడిమాంసం వండి పెడతానని పిలిస్తే ముసలోడు వెళ్ళిపోయాడు.

పెళ్ళివారు పడేసే అన్నం కోసం బకెట్ పట్టుకుని పరుగు దీశాడు రాజు. ఆసరికి అక్కడ ఏం మిగల్లేదు. పెద్ద గుండిగలో తోడిపెట్టిన పాలున్నాయి. ఆ పాలని కుక్క ముట్టిందని పారబోసేస్తోంటే, తనకిమ్మని బకెట్ పట్టాడు రాజు. బకెట్ నిండుగా పాలు పోశారు వాళ్ళు. దానిని మోయలేక మోయలేక గుడిసెకు తీసుకుని వచ్చి అలసిపోయాడేమో, నిద్రలోకి జారుకున్నాడు. ఎంత నిద్రలోకి జారుకున్నా పాలని మళ్ళీ ఏ కుక్కా ముట్టకుండా, ఏ పిల్లీ పీల్చకుండా కర్ర పట్టుకుని జాగ్రత్త పడ్డాడు రాజు. నిద్రలో కలలు కనసాగాడు.

రేపటికి ఈ పాలు తోడుకుని పెరుగవుతుంది. ఆ పెరుగుని చిలుకుతాను. చిలికి, వెన్న తీస్తాను. ఆ వెన్నను వెచ్చ చేస్తాను. నెయ్యి వస్తుంది. ఆ నేతిని అమ్ముతాను. అమ్మితే డబ్బు వస్తుంది. ఆ డబ్బుతో ముందో కోడిపెట్టను కొంటాను. కోడిపెట్ట గుడ్లుపెడుతుంది. వాటిని అమ్మను. పెట్ట చేత పొదిగిస్తాను. పిల్లలవుతాయవి. ఆ పిల్లలు పెద్దవయి, గుడ్లు పెడతాయి. అవి పిల్లలవుతాయి. వందలు...వేలు పిల్లలు. అవి పెరిగి కోళ్ళవుతాయి. అప్పుడు పెద్ద కోళ్ళ ఫారమ్ పెడతాను. దానికి యాజమానిని అవుతాను. కొన్నాళ్ళకు ఆ కోళ్ళఫారమ్‌ని అమ్మేసి, అవుల్ని కొంటాను. మిల్క్‌డైరీ ప్రారంభిస్తాను. వూరిలో అందరూ నా దగ్గరే పాలు కొంటారు. చక్కని చిక్కని పాలు అమ్మి బాగా డబ్బు సంపాదిస్తాను. ధనవంతుణ్ణవుతాను. అప్పుడిక పాల వ్యాపారం మానుకుని, బంగారు నగల వ్యాపారం పెడతాను. కోటీశ్వరులంతా నగలు నా దగ్గరే కొంటారు. పై వూరిలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీ ఓనర్ సీతారామయ్య గారు కూడా నా దగ్గరే నగలు కొంటారు. వారమ్మాయి నగలు కొనడానికి వచ్చి పోతూ నాతో ప్రేమలో పడుతుంది. నేను కాదు, కూడదంటాను. నేను లేకుండా తను జీవించలేనంటుంది. విషం తీసుకుని ఆత్మహత్యకు పాల్పడుతుంది. విషయం తెలుసుకుని, సీతారామయ్యగారు అమ్మాయిని ఇచ్చి నాకు పెళ్ళి చేస్తారు.

అంగరంగ వైభవంగా పెళ్ళవుతుంది. కొన్నాళ్ళకు బాబు పుడతాడు. అందంగా ముద్దుగా బొద్దుగా పుడతాడు. ఇంతా అంతా కాదు, అల్లరి తెగ చేస్తుంటాడు వాడు. ఓ రోజు ఇంటికి వస్తూనే వాడి అల్లరి గురించి చెప్పి, వాణ్ణి దండించమంటుంది శ్రీమతి. కర్ర పట్టుకుని పిల్లాణ్ణి కొట్టబోతే వాడు పరుగందుకుంటాడు. అప్పుడు తను కర్ర బలంగా విసరుతాడు, వాడికి తగలాలని.

చేతిలోని కర్రను విసిరాడు రాజు. ఫట్‌న తగిలింది పాలబకెట్‌కి. ఆ శబ్దానికి మెలకువ తెచ్చుకుని భయం భయంగా బకెట్‌ని చూశాడు. అదేం కిందపడలేదు.పాలేం ఒలికిపోలేదు. ధైర్యంగా ఆనందంగా బకెట్‌లోనికి చూశాడు రాజు. తెల్లగా గడ్డ పెరుగు తయారయి ఉంది. 'అహ్హా' అనుకున్నాడు రాజు.

# కండలు తిరిగిన గండర గండడు

ఆ టైంలో ఆ స్టాప్ దగ్గర పడుతోందంటే చాలు, కండక్టర్ రాజు గుండె వేగంగా కొట్టుకుంటుంది. బిపి పెరిగిపోతుంది. కళ్ళు జేవురిస్తాయి. పిడికిళ్ళు బిగుసుకుంటాయి. చిరుచెమటలు పడతాయి. కోపం...కోపంతో రగిలిపోతాడతను. పళ్ళు నూరుతాడు. బుసలు కొడతాడు.

రౌడీపేట బస్టాపంటేనే చాలు, రాజుకి ఎక్కడలేని చిరాకూ, కోపం ముంచుకొస్తాయి. ఆ స్టాప్‌కి ఆ పేరే నచ్చలేదతనికి.

''ఎందుకొచ్చిందీ పేరు?'' అడిగాడు డ్రైవర్ని.

''నాకూ పెద్దగా తెలీదు. అప్పుడెప్పుడో రాజుగారు పోషించిన రౌడీలు ఇక్కడ ఉండేవారట! రౌడీలను రాజుగారు పోషించడం ఏటో నాకిప్పటికీ అంతుసిక్కదు'' అన్నాడు డ్రైవర్.

పేరు మహాత్మ్యం. ఆ పేటలో ఎక్కే ఆ వస్తాదు అచ్చం రౌడీలాగానే ఉంటాడు. లాగానే కాదు, రౌడీనే! అందులో అనుమానం లేదు. గళ్ళలుంగీ, తెల్లలాల్చీ, చేతి మణికట్టుకో రుమాలు, మెడలో ఓ రుమాలు...వాణ్ణి చూడాలంటేనే అసహ్యం. పెద్దపెద్ద మీసాలు మెలి తిప్పుకుంటూ బస్సెక్కుతాడు వాడు.

''టిక్కెట్'' గొంతు పెగిలించుకుని అడుగుతాడు రాజు.

''ఎందుకు'' అని నవ్వుతాడు వస్తాదు. టిక్కెట్ తీసుకోడు. కిటికీ దగ్గర సీటు కోసం చూస్తాడు. వాడి అదృష్టం. ఎప్పుడూ కిటికీ దగ్గరో సీటు ఖాళీగా ఉంటుంది. ఒకవేళ లేకపోతే, కిటికీ దగ్గర కూర్చున్న వారిని ప్రాధేయపూర్వకంగా చూస్తాడు. వాడలా చూస్తున్నానని అనుకుంటాడు. కాని, వాడి చూపుల్లో 'తప్పుకో'

అన్న హెచ్చరికే కనిపిస్తుంది. దాంతో తప్పుకుంటాడు అక్కడి వ్యక్తి. వీడు కూర్చుంటాడు. గంట సేపు కూర్చుంటాడు. రామాలయం రాగానే దిగిపోతాడు.

''ఇక్కడే ఎందుకు దిగుతాడు?'' డ్రైవర్ని అడిగాడు రాజు.

''గుడి దగ్గరి కొబ్బరి దుకాణం ఆడిదే'' చెప్పాడు.

ఉదయం ఆరుగంటలకు బస్సెక్కి, ఏడు గంటలకి దిగుతాడు వస్తాదు. ఈ గంట సేపూ టిక్కెట్ తీయని వాడంటే రాజుకి తెగ కోపం. వాణ్ణి చంపేయాలన్నంతగా ఉద్రేకపడతాడతను. మూడు నెలలుగా భరిస్తున్నాడు వాణ్ణి. ఇక భరించకూడదనుకున్నాడు. టిక్కెట్ లేని ప్రయాణం చేస్తున్నాడని స్క్వాడ్‌కి చెప్పి, పట్టించవచ్చు. అయినా వాళ్ళ చేత బుద్ధి చెప్పించడం కాదు, తనే చెప్పాలి. ఎలా చెప్పాలంటే...

''టిక్కెట్'' అనడుగుతాడు.

''ఎందుకు?'' అంటాడు వాడు.

''ఇందుకు'' అని లాగి ఒకటిస్తాడు వాడికి. గూబ గుఁయ్ మంటుంది. కళ్ళు తుళ్ళిపోతాయి. కసి తీరుతుంద ప్పుడు. అలా కసి తీరాలంటే తను వాడిలా తయారవ్వాలి. కండలు తిరగాలి. బలం పుంజుకోవాలి. అందుకోసం రాజు తెల్లారు జాము నాలుగు గంటలకే మేల్కొంటున్నాడు. అంతా ఆశ్చర్యపోయేలా వ్యాయామం చేస్తున్నాడు. పెద్ద లోటాతో పాలు తాగుతున్నాడు. రోజూ రెండు కోడిగ్రుడ్లు తింటున్నాడు. బాదంపప్పూ, జీడిపప్పూ తింటూ నానా కష్టాలూ పడుతున్నాడు.

రోజు రోజుకీ బలాన్ని పుంజుకుంటూ, కండలు తిరిగిన రాజుని చూసి వస్తాదు ముచ్చటపడ్డాడు.

''మాంఛి దిట్టంగా తయారవుతున్నావు? ఎందుకు'' అడిగాడు.

''చెప్తా చెప్తా'' అన్నాడు రాజు.

''టిక్కెట్'' అడిగాడు.

''ఎందుకు?'' పాతపాటే పాడాడు వస్తాదు.

ఎందుకో చెప్తాన్రా! తొందర్లోనే చెప్తాను అనుకున్నాడు రాజు. ఏడాది గడిచింది. రాజుకి తన మీద తనకి పూర్తిగా నమ్మకం కలిగింది. వస్తాదుని సులువుగా ఎదిరించగలననుకున్నాడు. ఇవాళ ఇటో అటో తేల్చేస్తాననుకున్నాడు. రౌడీపేట వచ్చింది. వస్తాదు ఎక్కాడు.

''టిక్కెట్'' అడిగాడు రాజు.

''ఎందుకు?'' అన్నాడు వస్తాదు.

''ఎందుకా'' రాజు కోపంగా చేయెత్తాడు. పట్టుకున్నాడు దాన్ని వస్తాదు.

''ఎందుకంత కోపం? పాసయ్యా నాది! బస్‌పాసు ఉంది. కావాలంటే చూడు'' చూపించాడు వస్తాదు. రాజు కళ్ళు తుళ్ళిపోయాయి.

# కారు

ఊహించలేదు, ఇంతలా తుపాను ముంచుకొస్తుందని. వాయుగుండం అని చెబుతూనే ఉన్నారు. మబ్బుపట్టి ఉంది. చల్లగా ఉంది కదా అని బయల్దేరాడు. అప్పటికిలా గాలివాన లేదు. కార్లో రామాపురం చేరుకోవాలంటే నాలుగైదు గంటలు పడుతుంది. తను రెండు గంటల్లోనే చేరుకున్నాడక్కడికి. ఫ్రెండికి కారుని చూపించాడు. పాత మారుతి 800. చూడచక్కగా ఉంది. మోడల్ పాతదన్న మాటేగాని, కారుకేం? బ్రహ్మాండంగా ఉంది. రెండేళ్ళ క్రితం తను దాన్ని అరవై వేలకు కొన్నాడు. అప్పటికే అది నలుగురి చేతులు మారిందట! అయితేనేం కండీషన్‌లో ఉంది. డ్రైవ్ చేసి చూశాడు. నచ్చింది. కొనేశాడు. కొన్న తర్వాత ఇబ్బందులు తెలిసొచ్చాయి. తను అద్దెకు ఉంటూన్న అపార్ట్‌మెంట్‌కి కార్ పార్కింగ్ లేదు. పక్కవాళ్ళకి ఉంది. వాళ్ళనడిగాడు, పార్కింగ్‌లో పెట్టుకుంటానని. పెట్టుకోండి! కాకపోతే నెలకు మూడొందలు అద్దె కట్టండన్నారు. కారు కావాలి. కారులో ప్రయాణించాలి. 'సరే' అన్నాడు. ఆరు నెలలు గడిచాయి. ఈ ఆర్నెల్లలో చాలా బాధలు మూటగట్టుకున్నాడు. బెత్తెడు జీతగాడికి కారా? అన్నారు కొందరు. సెక్షన్ హెడ్‌కి లేదు, చూడు వీడి పొగరు. కారు వేసుకుని ఆఫీసుకి వస్తున్నాడన్నారు ఇంకొందరు. పప్పుకి దిక్కులేదు, పరమాన్నంట అన్నట్టుగా కొడుకుని వీధి బడిలో జాయిన్ చేశాడు. ఒక్కగానొక్క కొడుకు. డొనేషన్ కట్టి మంచి స్కూల్లో జాయిన్ చెయ్యాలి కదా! లేదు. కారు కొనుక్కుని తిరుగుతున్నాడన్నారు. పెట్రోలు ధర పెరిగిపోతోంది ఓ పక్క. పెరగని జీతం మరో పక్క. కష్టమనిపించింది. దాంతోపాటు పాడయిపోయిన పాత టీవీ చూస్తూ గడిపేకన్నా కొత్తటీవీ, కొడుకు

కోరిక మేరకు పెద్దది కొనుక్కుని హాయిగా ఉండడం బెటరనుకున్నాడు. టీవీ కోసం కారుని అమ్మే ప్రయత్నాల్లో పడ్డాడు. రామాపురం ఫ్రెండ్ కొంటాననంటే కారుని తీసుకొచ్చి చూపించాడు. నలభైవేలకు ఇచ్చేస్తానన్నాడు. ఫ్రెండ్ పాతిక వేలకు అడిగాడు. మరో మాట చెప్పమన్నాడు తను. ఫ్రెండ్ చెప్పలేదు. కోపంతో వెనుతిరిగాడతను.

రాత్రి పది దాటింది. హైవే మీద వేగంగా వస్తున్నాడు. గాలివానని లెక్క చేయడం లేదు. త్వరగా ఇంటికి చేరుకోవాలి. అంతే! ఇంతలో రోడ్డుకి అడ్డంగా నిలబడి చేతులు ఊపుతున్న స్త్రీమూర్తిని చూశాడు. కారాపాడు. గాలివానలో ఆమె ప్రతి మాటా వినిపించకపోయినా ఆమె అభ్యర్థనను అర్థం చేసుకున్నాడతను. ఆమె అర్జంట్‌గా పట్నం చేరుకోవాలి. ఆమె కారు చెడిపోయింది. అదిగో...అక్కడ రోడ్డు పక్కగా...చూపించింది. ఎక్కించుకున్నాడామెని. ముందుకురికాడు. కొడుకు ఫోన్ చేశాడప్పుడు, కొత్త టీవీ కొంటున్నావా? అని. కొంటానన్నాడతను. 'కొత్తటీవీట! కొత్తటీవీ! కారు అమ్ముడుపోతేగా' అన్నాడు చిరాగ్గా. పట్నం వచ్చేసిందంతలో. ఆమె హాస్పిటల్ దగ్గర దిగింది. లోపలికి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ అతని విజిటింగ్ కార్డు అడిగి మరీ తీసుకుంది.

వారం రోజులు గడిచాయి. ఓ మధ్యాహ్నం వేళ తలుపు కొట్టారెవరో. తెరిస్తే కొత్తటీవీ! పెద్దటీవీ! మీకేన ంటూ ఇంట్లో పెట్టారు. ఎవరిచ్చారంటే...ఓ ఉత్తరం ఇచ్చి వెళ్ళిపోయారు. తెరిచి చదివాడతను. పట్నంలో హార్ట్ అటాక్‌తో భర్త హాస్పిటల్‌లో జాయినయ్యాడు. రామాపురం నుంచి పట్నానికి వెళ్తున్నాను. గాలివాన. కారు చెడిపోయింది. ఒంటరిగా రోడ్డు మీద మిగిలిపోయాను. దిక్కులేదని ఏడుస్తున్నాను. మీరు దేవుడిలా కాపాడారు. మీరు చేసిన సాయాన్ని మరిచిపోలేను. మీ బాబుకో చిన్న కానుక ఈ టీవీ. స్వీకరిస్తారని ఆశిస్తాను.

అపార్ట్‌మెంట్ నుంచి పరుగు పరుగున కారు దగ్గరకి వచ్చాడతను. మనసారా ముద్దుపెట్టుకున్నాడు దాన్ని. చంటివాడి తలను నిమిరినట్టుగా కారుని ప్రేమగా నిమిరాడు.

# మాటరాని మౌనమిది!

అందాల ఓ చిలకా! అందుకో నా లేఖ! నా కనులతో రాశాను! నీ మదిలోన దాచాను!

–పాత పాట. దర్శన్‌కి ఆ పాటంటే ఇష్టం అని కాలర్ ట్యూన్‌గా పెట్టుకుంది. ఒకప్పుడు ఆ ట్యూన్ వినిపించిందంటే చాలు, పరుగుదీసేది. గంటలకి గంటలు మాట్లాడేది.

''దర్శన్‌ని ప్రేమిస్తున్నావా?'' అడిగింది అమ్మ. అవునంది తను.

''త్వరలో అతను అమెరికా వెళ్ళిపోతున్నాడు. అక్కడే సెటిల్ అవ్వాలని కోరుకుంటున్నాడు. అక్కడి అందాలు, అక్కడి జీవితం కోరుకునే వాడికి, నువ్వూ, నీ ప్రేమా కావాలంటావా? అవసరం అవుతాయా? ఊరిలో ఇలాంటి ప్రేమలు ఎన్ని చూడలేదు? ఇక్కడి మాటలిక్కడే! అక్కడకెళ్ళాక పట్టించుకోరు. ఆ లోకంలో నీ ఊసే ఉండదు.''

భయపడింది అమ్మ. భయపెట్టింది తనని. అయితే తను భయపడలేదు. పైగా అమ్మ అన్నది దర్శన్‌కి చెప్పి, ఆమె భయం పోగొట్టమంది. ఏం చెప్పాడో, ఎలా చెప్పాడో తెలీదు. ఆఖరికి 'కాబోయే అల్లుడు మంచివాడే' అన్న సర్టిఫికెట్ కొట్టేసి, అమెరికా వెళ్ళిపోయాడు. ఏడాదిపాటు తప్పనిసరిగా ఉండాలక్కడ. తర్వాతే ఇండియాకి తిరిగి రావడం. వచ్చింతర్వాత పెళ్ళే అన్నాడు దర్శన్. ఓకే అంది తను. దర్శన్ అమెరికాలో ఉన్నాడన్న మాటే గాని, కనిపించనిదెప్పుడు? వినిపించనిదెప్పుడు? తీరిక ఉంటే చాలు, స్కైప్‌లోకి వచ్చేవాడు. ఫోన్ సంగతి సరేసరి. తొమ్మిది నెలలు ఇట్టే గడిచిపోయాయి. ఇంకొక్క మూడు నెలలు. ఈ

మూడు నెలలూ గడిచాయంటే పెళ్ళే అనుకుంటున్న సమయంలో జరగరానిది జరిగిపోయింది. హోరున వర్షం. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. కారుని పక్కకి తీసి ఆగుదామన్నా వీలు కావడం లేదు. ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. అయోమయంగా ఉందంతా. యాక్సిడెంట్ అయిందప్పుడు. కారు మూడు పల్టీలు కొట్టి పొలాల్లో పడిపోయింది. చనిపోతున్నట్టనిపించింది. కళ్ళు మూతలు పడ్డాయి. కళ్ళు తెరిచేసరికి ఆసుపత్రిలో ఉంది. వారం పదిరోజులుగా స్పృహలో లేదట తను. ఆ రోజే స్పృహలోకి వచ్చిందిట! అమ్మ ఒకొక్కటీ వివరంగా చెప్పింది.

''దర్శన్‌కి తెలుసా నాకు యాక్సిడెంటయ్యిందని'' అడిగింది తను.

''తెలీదు.''

''ఎందుకు చెప్పలేదు? చాలా బాధపడతాడు'' అంటూ సెల్‌ఫోన్ అందుకుంది. రింగ్ చేయబోయింది.

''ఒక్క నిముషం'' అంది తల్లి. తన చేతిలోని సెల్‌ఫోన్ అందుకుని, పక్కన పెట్టింది. వాష్‌బేసిన్ దగ్గరిగా తీసుకుని వెళ్ళింది.

''అద్దంలోకి చూసుకో'' అంది. చూసుకుంది తను. భయంతో పెద్దగా కేకేసింది.

''ఇది...ఈ మొహం నాదేనా!?'' చేత్తో ముఖాన్ని తడుముకుంది. నవ్వితే సొట్టపడే బుగ్గలు లేవు. సూదిగా ఉండే ముక్కు లేదు. పెద్దపెద్ద కళ్ళనేవారు. ఏవవి? ముడుచుకుపోయాయి. గొల్లుమంది.

''నీ మొహం చూసి నువ్వే బెదిరిపోతున్నావే! దర్శన్ ఈ మొహం చూస్తాడంటావా? ప్రేమంటూ నిన్ను పెళ్ళి చేసుకుంటాడంటావా?'' అడిగింది తల్లి. చేసుకుంటాడో చేసుకోడో తర్వాతి సంగతి. చేసుకోమని ఇప్పుడడగడం తప్పు. పాపం కూడా అనుకుంది.

అందాల ఓ చిలకా! అందుకో నా లేఖ!

దర్శన్ ఫోన్. పరుగున వెళ్ళి అందుకుంది. కాని, లిఫ్ట్ చేయలేదు. ఏడుస్తూ మంచమ్మీద వాలిపోయింది. అప్పటి నుంచి దర్శన్ ఫోన్‌కి జవాబు లేదు. మూగబోయింది తను. రోజులు గడిచిపోయాయి. ఇండియాకొచ్చేశాడు దర్శన్. తల్లి చెప్పింది. అతనికి పెళ్ళి కూడా అంది. శుభలేఖ అందించింది. వణుకుతున్న చేతుల్తో శుభలేఖ తెరిచి చూసింది.

వధువు మధులతతో దర్శన్ పెళ్ళి. మధు...మధులతంటే తనే! ఆశ్చర్యపోయింది. అంతలో వచ్చాడక్కడికి దర్శన్.

''దాచేస్తే దాగవేవీ! అన్నీ తెలుస్తాయి. అయినా నేను నిన్ను ప్రేమించాను కాని, నీ అందాన్ని కాదు'' అన్నాడు దర్శన్. మధులతను ముద్దుపెట్టుకున్నాడు.

# ఐ లవ్ యు సిద్ధూ

వర్షం వెలిసింది. ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచుకున్న శబ్దం వినిపించింది. అటుగా చూసిందామె. డాక్టర్‌గారొస్తున్నారు. పరుగుదీసింది. డాక్టర్‌ని సమీపించింది.

''ఇంకో గంటలో సిద్ధూ బాడీ యూనివర్సిటీకి వెళ్ళిపోతుంది. అందాకా ఉంటానంటే వెళ్ళి కూర్చోండి. తోడుగా నర్సు కూడా ఉంది'' అని వెళ్ళిపోయాడు డాక్టర్. రూంలోనికి నడిచిందామె. అచేతనంగా ఉన్న సిద్ధూని చూసింది. పన్నెండేళ్ళకే నూరేళ్ళూ నిండిపోయాయని బాధపడింది. వాడి చేతిని అందుకుని ముద్దుపెట్టుకుంది. అప్పుడు చూసింది చేతికి ఉన్న రాఖీని. ఏడుపొచ్చిందామెకు.

''రాఖీ అంటే నాకిష్టం మమ్మీ! చెల్లెలు నాకు లేదు కదా, నువ్వే నా చేతికి రాఖీ కట్టు'' అంటే సిద్ధూ చేతికి రాఖీ కట్టిందామె. కట్టిన రాఖీ కట్టినట్టుగానే కొత్తగా ఉంది.

''బాబు జ్ఞాపకార్థం మీకు ఆ రాఖీ కావాలా?'' అడిగింది నర్సు. కావాలన్నట్టుగా సన్నగా తలూపిందామె. సిద్ధూ చేతికి ఉన్న రాఖీని కట్ చేసి అందించింది నర్సు. క్యారీబ్యాగ్‌లో దాన్ని దాచుకుందామె. ఇక అక్కడ ఉండడం ఇష్టం లేక ఆఖరిసారిగా సిద్ధూని చూసి వాడి తల నిమిరి అక్కణ్ణుంచి బయటపడింది. కారెక్కింది. ఇంటి దారి పట్టింది. రెండేళ్ళుగా నానా బాధలూ పడిందామె. సిద్ధూని బతికించుకోవాలని ఎంతగానో ప్రయత్నించింది. ఏదీ కలసి రాలేదు. ఆఖరికి కేన్సర్ సిద్ధూని తినేసింది. ఇంటికి చేరుకుందామె. సిద్ధూ గదిలోనికి నడిచింది. అక్కడ వాడు ఆడుకునే ఆటవస్తువులు సైకిల్, క్రికెట్‌బ్యాట్, బాల్ చాలా

కన్పించాయి. కన్నీళ్ళొచ్చాయామెకు. మంచం కేసి చూసింది. సిద్ధూ తలకింద పెట్టుకునే దిండు కనిపించింది. దాన్ని గుండెలకు హత్తుకుని గొల్లుమంది.

''నేను చచ్చిపోయినంత మాత్రాన పనికి రాకుండా పోను మమ్మీ! నా కళ్ళు పనికొస్తాయట! నా కిడ్నీలు పనికొస్తాయట! డాక్టర్ అంకుల్ చెప్పారు. నా బాడీ కూడా పనికొస్తుందన్నారు. ఇవన్నీ కావాల్సిన వాళ్ళకిచ్చేయ్!'' సిద్ధూ మాటలు గుర్తొచ్చి మరింతగా రోదించిందామె. అలా ఎంతసేపు రోదించిందో తెలీదు, నిద్రపట్టేసిందామెకు. ఓ రాత్రి 'మమ్మీ' అని పిలిచినట్టనిపిస్తే దిగ్గున లేచి కూర్చుంది. అప్పుడామె కాలి కింద కాగితం ఏదో ఉందనిపిస్తే తీసి చూసింది. తనకి సిద్ధూ రాసిన ఉత్తరం అది. ఆత్రంగా గబగబా చదవసాగింది.

మమ్మీ!

నేను కూడా నీకు దూరమయిపోయాను. ఒంటరిదాన్నయిపోయానని బాధపడకు. నాతో ఆడుకునే వాడు చూడు, అనాథ పిల్లాడు, వాడిలో నన్ను చూసుకో! వాణ్ణి పెంచుకో! వాడికి నా సైకిల్ అంటే ఇష్టం. క్రికెట్‌లో వాడికి బ్యాటింగ్ అంటే ఇంకా ఇష్టం. అందుకని వాడితో నువ్వెప్పుడు ఆడినా బౌలింగే చెయ్యి. నా సైకిల్ వాడికిచ్చేయ్. నేనిక్కడ స్వర్గంలో బాగానే ఉన్నాను. ఎంత వెతికినా అమ్మమ్మా, తాతయ్యా కనిపించడం లేదు. నువ్వేమో వాళ్ళు స్వర్గంలోనే ఉన్నారన్నావు. ఇక్కడందరూ బలేగా ఉన్నారు. పిల్లలందరికీ రెక్కలున్నాయి. తూనీగల్లా ఎగిరిపోతున్నారు. నాకూ త్వరలోనే రెక్కలొస్తాయట!

అన్నట్టు మమ్మీ! ఇక్కడేమో ఆంజనేయుడు కనిపించాడు. ఎర్రమూతీ, తోకా ఉంటాయి చూడు, ఆయన కనిపించారు. దండం పెడితే 'బాగున్నావా బుడుగూ' అన్నారు. నన్నెత్తుకుని ఆకాశంలోకి తీసుకెళ్ళారు. చందమామలో కాసేపు, నక్షత్రాల్లో కాసేపూ ఆడించారు. చల్లగా ఉంది మమ్మీ అక్కడ. దుప్పటి కావాలి, చలిగా ఉందంటేనూ, ఆంజనేయుడు 'ఛూ మంత్రకాళి' అన్నారు. అంతే! ముత్యాల దుప్పటి నన్ను చుట్టుకుంది. చలి అన్నదే లేకుండా పోయింది. ఆంజనేయుడూ రోజూ కలుస్తానన్నారు. ప్రామిస్ చేశారు.

మమ్మీ! నా బెడ్ కింద నువ్వు ఉతికి పెట్టిన స్వెట్టర్ ఉంది. అది అనాథపిల్లాడన్నానే, నిన్ను పెంచుకోమన్నాను చూడూ, వాడికిచ్చేయ్. చలి రోజులు కదా! తట్టుకోలేడు.

బెడ్ కింది స్వెట్టర్ తీసి చూసిందామె. దాని మీద 'సిద్ధూ' అని అల్లిక అక్షరాలున్నాయి. 'ఐ లవ్ యు సిద్ధూ' అనుకుందామె.

# ఊరవతల గుడి

వాళ్ళంతా ఊరవతల పాకల్లో ఉంటున్నారు. పాతిక ముప్పయి పాకల్దాకా ఉన్నాయక్కడ. పిల్లలూ, పెద్దలూ అందరూ కలసి, వందమంది దాకా ఉంటున్నారు. తోపుడుబళ్ళ వ్యాపారం చేసుకునే వారూ, రిక్షాలు లాగే వారూ, పూసలూ పువ్వులూ అమ్ముకునే వారూ, ఇంకా రకరకాలుగా బతుకుతున్నవారంతా ఉంటున్నారక్కడ. వాళ్ళకో గుడి కూడా ఉంది. ఆ గుడిలోని దేవుడంటే వాళ్ళకి గొప్ప భక్తి. కోరుకున్నది ఇస్తాడంటారు.

ఒకనాడు ఏమయిందో తెలీదు. పాకలకి నిప్పు అంటుకుంది. చూస్తూండగానే కర్రా కంపా కాలిపోయాయి. పాకలోకి దూరి పిడికెడు మెతుకులు తెచ్చుకునే వీలు లేకపోయింది. కట్టుబట్టలతో, కన్నీళ్ళతో నిల్చున్నారంతా. ఏ పాపం చేశామని తమకీ శిక్ష? దగ్గరుండి, మరీ నిలువ నీడ లేకుండా చేశాడే దేవుడు అనుకున్నారు. గుళ్ళోని దేవుణ్ణి కసిగా కోపంగా చూశారు. గమనించాడది పూజారి. ఆ రాత్రి రమ్మన్నా గుళ్ళోకి రాలేదెవరూ. ప్రసాదం తీసుకోమన్నా తీసుకోలేదు. వచ్చి గుళ్ళో పడుకోమన్నా పడుకోలేదు. అప్పుడు పూజారి ఓ కథ చెప్పాడు.

''ప్రయాణిస్తోన్న నౌక ముక్కలు ముక్కలయింది. మునిగిపోయింది. అతనొక్కడే బతికి బట్ట కట్టాడు. ఒకానొక ద్వీపానికి కొట్టుకొచ్చాడు. అతను తప్ప అక్కడా ద్వీపంలో మరో ప్రాణి లేదు. బతుకీడుస్తూ ప్రతిరోజూ దేవుణ్ణి ప్రార్థించేవాడతను. తనని రక్షించమని కోరుకునే వాడు. సముద్రపు ఒడ్డున నిలిచి సహాయం కోసం కేకలేసే వాడు. ఎదురు చూసేవాడు. ఫలితం లేకపోయింది. విసిగిపోయాడు. ఇక ఇంతేననుకున్నాడు. ఇక్కడే ఈ

ద్వీపంలోనే బతుకనుకున్నాడు. వెదికి వెదికి కర్రలూ, కంపా తెచ్చుకున్నాడు. చిన్నపాక వేసుకున్నాడు. అందులో అక్కడా ఇక్కడా ఏరుకున్న పళ్ళూ, దుంపలూ తెచ్చి ఉంచుకున్నాడు. రోజులు వెళ్ళదీస్తున్నాడు. ఒకనాడు ఆహారాన్ని ఆన్వేషిస్తూ వెళ్ళి వచ్చేసరికి, ఏమయిందో తెలీదు, ఎలా అంటుకుందో పాకకి నిప్పు అంటుకుంది. కాలిపోయింది. ఆకాశంలో సుడులు తిరుగుతూ పొగ లేచింది.

ఎంత నిర్దయ దేవుడికి? ఈ పాకా, ఈ తిండి కూడా తనకి లేకుండా చేశాడంటే దేవుడు లేడుగాక లేడనుకున్నాడతను. దేవుడి మీద గొంతు దాకా కోపాన్ని పెంచుకున్నాడు. దగ్గరలోని ఓ రాయి అందుకుని, దాన్ని దేవుడనుకుని, తిట్టరాని తిట్లు తిట్టాడు. నీళ్ళలో ముంచి తీస్తూ ఊపిరాడనీయకుండా చేశాననుకున్నాడు. ఛీ అన్నాడు. తర్వాత ఏడ్చేడ్చి నిద్రపోయాడు.

మర్నాడు దగ్గరగా ఇంజన్ శబ్దం వినవస్తోంటే మెలకువ తెచ్చుకుని, కళ్ళిప్పి చూశాడు. ద్వీపాన్ని సమీపిస్తూ నౌక కనిపించిందతనికి. తనని రక్షించడానికే వస్తున్నదది. అనుమానం లేదనుకున్నాడు. అది నిజమే!

నావికుడు అదే మాట చెప్పాడు.

''నేనిక్కడ ఉన్నట్టు మీకెలా తెలిసింది?'' అడిగాడతను.

''మీరు పొగపెట్టారు కదా, దాన్ని చూశాం. అదే గుర్తుగా వచ్చాం'' అన్నాడు నావికుడు.

'రక్షించావు దేవుడా' అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడతను. తన తప్పుని క్షమించమని దేవుణ్ణి మనసులోనే ప్రార్థించాడు.'' కథ ముగించాడు పూజారి.

''మనకి కష్టం కలిగించేదీ, మనకి నష్టాన్ని కలిగించేదీ ఏది జరిగినా మనం దేవుణ్ణి తిడతాం. అసహ్యించుకుంటాం. తప్పు లేదందులో. కాని, దేవుడి మీద నమ్మకాన్ని కోల్పోవడం మాత్రం మహా తప్పు. తల్లిలా దేవుడు మనల్ని వెన్నంటే ఉంటాడెప్పుడూ. మనకి మంచి చేయడం కోసమే రాత్రీపగలూ కష్టపడుతూ ఉంటాడు. మన కన్నీళ్ళూ, కష్టాలూ అన్నీ దేవుడికి తెలుసు. తెలియదనుకోవడం అవివేకం. రండి! నా మాట వినండి! అమ్మ గోరుముద్దలాంటి ప్రసాదం తినండి. అమ్మ ఒడిలాంటి గుళ్ళోకి వచ్చి పడుకోండి.'' బతిమలాడాడు పూజారి.

అంతా పరుగు పరుగున గుళ్ళోకి చేరారు. ప్రసాదం తిని పడుకున్నారు.

# వర్షంలో వినాయకుడు

పొద్దుటి నుంచి మబ్బు మబ్బుగా ఉంది. సన్నగా చినుకులు పడుతున్నాయి. గణపతి బొమ్మ కొనుక్కుని, పూజకు పువ్వులూ, పత్రీ కొంటుంటే అప్పుడు పట్టుకుంది వర్షం. హోరున కురవసాగింది. చాలా రోజులికి వర్షం కురుస్తోంది. ఆ వర్షంలో నిండుగా తడవాలని ఉందతనికి. అయితే చేతిలో ఉన్నది మట్టి గణపతి కావడంతో పరు గందుకున్నాడు. దట్టంగా కొమ్మలు అల్లుకున్న పేవ్‌మెంట్ మీద తలదాచుకున్నాడు. ఆసరికే అక్కడ పాతిక ముప్పయిమంది దాకా ఉన్నారు. అందరి దగ్గరా గణేశ్ ప్రతిమలు ఉన్నాయి. జల్లు కొడుతోంది గాని, మీది నించి ఒక్క చినుకు కూడా పడడం లేదు. అంతలా కొమ్మలు అంటిపెట్టుకుని ఉన్నాయి. కాలువలు కట్టి ప్రవహిస్తోంది నీరు.

అతని పక్కన ఓ తండ్రీ, కూతురూ నిల్చుని ఉన్నారు. ఆ పిల్లకి ఆరేడేళ్ళ వయసుంటుంది. బొద్దుగా ఉండి, ముద్దొస్తోంది. ఆ పిల్ల చేతిలోనూ మట్టి గణపతి ఉన్నాడు.

''ఎంతకి కొన్నావు?'' అడిగాడతను.

''తప్పు! దేవుడి ధర అడక్కూడదు. మా మమ్మీ చెప్పింది'' అందా పిల్ల. నవ్వింది. అతనూ నవ్వేశాడు.

''డాడీ! పదండి డాడీ, వర్షంలో తడుద్దాం'' అందా పిల్ల. తండ్రిచేయి పట్టుకుని లాగింది.

''వద్దమ్మా! చూడెలా వర్షం కురుస్తోందో! తడిసిపోతాం. తడిస్తే జలుబు చేస్తుంది. జ్వరం వస్తుంది.''

''రానీ! జ్వరం రావాలని రాసి ఉంటే వస్తుంది. దాని కోసం సరదాగా వర్షంలో తడవకుండా ఉంటామా? రండి డాడీ! మళ్ళీ వర్షం రాదు'' బ్రతిమలాడింది.

''ప్లీజ్'' అన్నాడు తండ్రి. అల్లరి చేయొద్దన్నట్టుగా ఆ మాటలో ధ్వనించాడు.

వర్షం తగ్గేట్టుగా లేదు. నిలువునా కురుస్తోంది. నిండుగా కురుస్తోంది.

''కురవాలి కురవాలి'' అంటున్నారంతా. అంతేకాని, వర్షంలో తడుస్తూ నడవాలనీ, చినుకుల్ని అరచేత పట్టి ఎగరేయాలనీ ఎవరికీ లేదు. నీటిని చిమ్ముకుంటూ వర్షంలో నడవడం ఎంత బాగుంటుందో? నడవరెందుకు? అనుకున్నాడతను. చేతిలో మట్టి గణపతిని చూసి, మనసు ముడుచుకున్నాడు.

''డాడీ'' మళ్ళీ మొదలుపెట్టిందా పిల్ల.

''వద్దమ్మా! చెప్పానుగా జ్వరం వస్తుంది'' విసుక్కున్నాడు తండ్రి.

''వస్తే వస్తుంది. మమ్మీకి ఒంట్లో బావులేదంటే ఏమన్నావు? ఎలా రాసి పెడితే అలా అవుతుంది. ఏదయినా అన్నీ మన మంచికే అన్నావా లేదా? అలాగే ఇదీను! జ్వరం వస్తే మన మంచికే! రండి డాడీ'' అంది పిల్ల. వర్షంలోకి దూకేసింది. తప్పదిక. తండ్రి కూడా వర్షంలోకి దూకేశాడు. నవ్వుతూ పరిగెడుతోన్న పిల్లను పట్టుకునేందుకు తనూ నవ్వుతూ పరుగుదీశాడు. వర్షానికి తడిసిపోకుండా వినాయకుణ్ణి గౌనులో దాచిపెట్టిందాపిల్ల. ఆ నేర్పు తనకీ ఉందనుకున్నాడతను. అంతే! అతనూ ఆనందంలోకీ, ఎడతెరిపి లేని వర్షంలోనికీ ఒక్కసారిగా దూకేశాడు.

* * *

కొనుక్కుని ఆనందించేందుకు అనుభూతుల్ని ఎవరూ అమ్మరు. ఎవరికి వారు వాటిని సాధించుకోవాల్సిందే!

# ఎమ్ ఫర్ మూర్తి

పీజీ కాలేజీ గురించి గొప్పగా ఊహించుకున్నాడతను. అందమయిన అమ్మాయి పరిచయం అవుతుందని, పగలే వెన్నెలగా ఉంటుందని, రెండేళ్ళ చదువూ ఇట్టే విహారయాత్రలా హాయిగా గడిచిపోతుందనుకుంటే జరిగిందేమిటి? మూర్తిగారు పరిచయం అయ్యారు. అరవై అయిదేళ్ళ మూర్తిగారికి, సోషియాలజీ అంటే ఇష్టమట! రిటైరయింతర్వాత చదువుకోవాలనుకున్నార్ట! అలా చదువుకోవడం కలంటూ, కాలేజీలో జాయినయి, వచ్చి పక్కన కూర్చున్నారు.

''బాధగా ఉంది సార్'' అన్నాడతను.

''కాని నాకు చాలా ఆనందంగా ఉంది'' అని నవ్వారాయన.

''నన్నే అందమయిన అమ్మాయనుకో! కబుర్లాడు'' అన్నారు. క్లాసు పూర్తయిన తర్వాత క్యాంటీన్‌కి తీసుకెళ్ళి టీ తాగించారు.

''పిల్లలా సార్?'' అడిగాడు.

''ఇద్దరు పిల్లలు. అమ్మాయి. అబ్బాయి. పెళ్ళిళ్ళయిపోయాయి. అంతా అమెరికాలో ఉంటున్నారు. మనవరాలు, మనవడు కూడా ఉన్నారు. ఆవిడ మాటంటావా? పోయి ఆర్నెల్లయింది.'' అన్నారు.

ఏడాది గడిచిపోయింది. ఈ ఏడాదిలో మూర్తిగారంటే ఇష్టపడని వ్యక్తంటూ లేకుండాపోయాడు. రెండో ఏడాది కూడా అయిపోయింది. పరీక్షలు అయిపోయాయి. అంతా పార్టీ చేసుకున్నారు. మూర్తిగారు రోజూ రెండు పెగ్గులే తీసుకుంటారు. అలాంటిది ఆ రోజు మరి రెండు పెగ్గులు ఎక్కువ తీసుకున్నారేమో! ఆయన్ని పట్టడం ఎవరి తరం కాలేదు.

‘‘ఇప్పుడు మూర్తిగారు మాట్లాడతారు.’’ అన్నారెవరో. మాట్లాడేందుకు లేచి నిల్చున్నారు మూర్తి గారు. మందు ఊపేస్తోంది. నిల్చోలేకపోయారు. పడిపోయారు. అంతా పగలబడి నవ్వారు. ఆయన కూడా నవ్వుతూ లేచి నిలదొక్కుకుని, మాట్లాడారు.

‘‘ముసలివాళ్ళు క్షణక్షణం ఆడుతూనో పాడుతూనో ఉండాలి. ఉండకపోతే నిజంగానే ముసలివాళ్ళు అయిపోతారు. ఈ ముసలిగోల పక్కన పెడితే, అసలు యవ్వనరహస్యం చెప్పనా? జీవితంలో ఓ నాలుగింటిని పాటించాలి. పాటిస్తే మిసమిసలాడిపోతారెవరయినా. ఒకటి: ఎప్పుడూ సంతోషంగా ఉండాలి. రెండు: విజయం, విజయం కోసం పరుగులు తియ్యాలి. మూడు: నవ్వుతూ గడపాలి. ప్రతి మాటా, ప్రతి చోటా హాస్యాన్ని వెతుక్కోవాలి. నాలుగు: బంగారు కలలు కనాలి. అదవ్వాలని, ఇదవ్వాలని కోరుకోవాలి. కోరుకుంటేనే బతుకు బాగుంటుంది. ఎప్పుడయితే కలలు లేవో, కోరికలు లేవో అప్పుడు చనిపోయినట్టే లెక్క! మళ్ళీ ముసలితనంలోకి వస్తున్నాను. ఎదగడం వేరు, ముసలితనం వేరు. ఇరవైరెండేళ్ళ మీరు ఒక ఏడాదిపాటు ఏరకంగానూ కృషి చేయక తిన్నామా, పడుకున్నామా, తెల్లారిందా అనుకుంటే ఇరవై మూడేళ్ళ వారవుతారు. నేనూ అంతే! ఓ ఏడాదిపాటు తిని, పడుకుని, తెల్లారిందనుకుంటే అరవై ఎనిమిదేళ్ళ వాణ్ణవుతాను. నన్ను ముసలి అంటే మిమ్మల్నీ ముసలి అనాలి. ఇద్దరి మధ్యా తేడా ఏమీ లేదు. ఎదగడం అంటే వయసు పెరగడం కాదు, మనసు పెరగడం. పెద్దమనసు చేసుకుని అందర్నీ ప్రేమించడం. అలాగే అవకాశాల్ని అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలి. ఈ వయసులో నాకెలాంటి బాధలూ, భయాలూ లేవు. చనిపోతానన్న బాధ కూడా లేదు. అందరూ చనిపోతారు. నేను కూడా చనిపోతాను. దానికి బాధ ఎందుకు?’’

తాగి వాగినట్టనిపించలేదు మూర్తిగారి మాటలు. తర్వాత ఆయనో పాట పాడారు. ‘జయమ్ము నిశ్చయమ్మురా, భయమ్ము లేదురా! జంకు గొంకు లేక ముందు సాగిపొమ్మురా’ అని. పాత పాట. బాగుందనిపించింది. ఆయనలా పాటలు పాడాలట! నేర్చుకోమన్నారు. రిజల్ట్స్ వచ్చాయి. యూనివర్సిటీ ఫస్టొచ్చారు మూర్తిగారు. నెల రోజులు గడిచాయి. ఓ రోజు మూర్తిగారు నిద్రలోనే పోయారని తెలిసింది. కాలేజీ కాలేజీ అంతా చూడ్డానికి పరుగుదీసింది. శవమై ఉన్నా ఆయన చిరునవ్వు చెరగలేదు.

# మారాలి! మారాలి!

తెల్లారితే వెలుతురు ఎందుకు వస్తుంది? రాత్రి అయితే చీకటి ఎందుకు పడుతుంది? నక్షత్రాలు ఆకాశంలోనే ఎందుకు ఉంటున్నాయి? నేల మీదనే చెట్లెందుకు మొలుస్తున్నాయి? అక్క డెక్కడో ఏదో దేశంలో తిన్నంత తిని, పారేసినంత పారేస్తున్నా రెందుకు? ఈ దేశంలో తినడానికి తిండి లేక, తాగడానికి నీరు లేక, నిలువ నీడలేక జనం దినదినగండం నూరేళ్ళాయుష్షుగా బతుకుతున్నారెందుకు? ప్రపంచంలో ఇన్ని తెగలెందుకు? ఇన్ని జాతులెందుకు? ఇన్ని మతాలెందుకు? దేవుడు ఒకడుంటే సరిపోదా? ఇంతమంది ఎందుకు? మార్చాలి! ప్రపంచాన్ని మార్చేయాలి. ఎప్పుడంటే అప్పుడు వెలుతురు రావాలి. ఎప్పు డంటే అప్పుడు చీకటి పడాలి. నక్షత్రాలు నేల మీద మొలవాలి. చెట్లు ఆకాశంలో చిగురించాలి. అన్ని దేశాల్లోనూ ప్రజలంతా కడుపు నిండా తిని, తాగి, నిండు నూరేళ్ళూ జీవించాలను కున్నాడతను. అనుకుంటూ చాలా కలలు కన్నాడు. కలల్లో దేశ దేశాల అధ్యక్షుల్నీ, ప్రధానుల్నీ కలిసి చర్చించాడు కూడా. ఏదీ కొలిక్కి రాలేదు. తర్వాత తెలిసింది. కలలు నిజం కావని. దాంతో ప్రపంచాన్ని మార్చే బుద్ధిని మార్చుకున్నాడు. అయితే గుండెలో ఆవేశాన్నీ, గొంతులో ఆక్రోశాన్నీ, కళ్ళల్లో ఎరుపు జీరల్నీ, పిడికిలిలో బిగించిన ధైర్యాన్నీ కోల్పోలేదతను. అల్లూరి సీతా రామరాజు, సుభాష్‌చంద్రబోస్ అంటే అభిమానపడి, నాయ కులంటే వారంటూ నినాదాలు చేయడం మానుకోలేదు. వివేకా నందస్వామి పట్ల కూడా గౌరవాన్ని కనబరిచేవాడు. ఈ దేశంలో కుళ్ళును కడిగేయాలి. అన్యాయాన్ని అంతమొందించాలి. అవి నీతిని రూపు మాపాలి. కులమతాలను కూకటి వేళ్ళతో

పెళ్ళగించాలనుకున్నాడు. అందుకోసం రకరకాల కార్యక్రమాలు చేపట్టాలనుకుంటూ, యువతరాన్ని కూడగట్టాలనుకుంటూ చాలా చాలా ఆలోచనలు చేశాడు. ఏ ఆలోచనా రూపుదిద్దుకోలేదు. ఒక్కడే ఎంతకని పరిగెడతాడు? తోడుంటే బాగుణ్ణనుకున్నాడు. తన ఆశయాలకీ, ఆలోచనలకీ ప్రతిబింబాన్ని పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరి పిల్లల్ని కన్నాడు.

అబ్బాయిని డాక్టర్ చేద్దామనుకున్నాడు. అమ్మాయిని లెక్చరర్ చేద్దామనుకున్నాడు. డాక్టరయితే అబ్బాయి పేద ప్రజలను ఆదుకుంటాడు. ఆరోగ్యం మహాభాగ్యం అని చాటి చెబుతాడు. నయం కాని జబ్బులను నయం చేస్తూ రోగుల కన్నీళ్ళను తుడుస్తాడనుకున్నాడు. అబ్బాయి డాక్టర్ కాలేదు సరికదా, సినిమాలంటే మోజుపడి, నటనంటే ఇష్టపడి, హీరో కావాలనుకుని ఫలించకపోవడంతో జీరోగా జూనియర్ ఆర్టిస్టుగా మిగిలిపోయాడు. అమ్మాయీ అంతే! లెక్చరర్ కాలేదు. ఇంటర్మీడియట్ పోగొట్టుకుని, డిగ్రీ కుర్రాణ్ణి ప్రేమించి, చాలీచాలని బతుకు బతుకుతోంది. టీవీ సీరియల్స్‌తో క్షణం తీరిక లేకుండా ఉంది.

ప్రపంచాన్ని మారుద్దామనుకున్నాడతను. కాలేదు. దేశాన్ని మారుద్దామనుకున్నాడు. కాలేదు. కనీసం కుటుంబాన్ని తన ఆశల మేరకు తీర్చిదిద్దుదామనుకున్నాడు. సాధ్యపడలేదు. అన్ని దిగువ మధ్యతరగతి కుటుంబాల్లాగే అతని కుటుంబమూ దిగజారిపోయింది. మార్పులేదు. వయసు ఉడిగిపోయింది. కాళ్ళూ చేతులూ కదలడం లేదు. చచ్చిపోయే స్థితిలో ఉన్నాడు. వాకిట్లో మంచంలో పడేశారతన్ని. రేపో మాపోలా ఉన్నాడు. అయినా ఆలోచనలు మాత్రం అనంతంగా సాగుతూనే ఉన్నాయి. ఏమయింది తనకి? ఎందుకిలా తయారయ్యాడు? ఏదీ మార్చకుండానే ఎవర్నీ మార్చకుండానే పోతున్నాడెందుకు? ఎక్కడ లోపం ఉంది? పరిపరి విధాల పరామర్శించాడు. లోలోతుల్లోకి వెళ్ళాడు. తెలుసుకున్నాడు. ఏం తెలిసిందయ్యా అంటే...కుటుంబాన్నీ, దేశాన్నీ, ప్రపంచాన్నీ మార్చడానికి ముందు తను మారాలి. మారాడా? లేదు. తను మారి ఉంటే తర్వాతన్నీ వాటంతటవే మారేవి. ఇది తెలుసుకున్నాడో లేదో బాధనిపించింది. ఆ బాధతో  చనిపోయాడతను.

# ఋణం

అయిపోయింది. ఆరేళ్ళ అనుబంధాన్ని తెంచేసుకుంది. 'నీతో ఇంకొక క్షణం కూడా కాపురం చేయను. నీకూ నీ తాగుడికో నమస్కారం. వస్తాను' అని బయటపడింది. రాత్రి రెండు గంటల వేళ. రోడ్డు మీద ఎవరూ లేరు. ఒంటరిగా నడుస్తోందామె.

పెళ్ళయిన దగ్గర్నుంచీ చూస్తోంది. ఒకటే తాగుడు. తాగుడికి బాగా అలవాటు పడ్డాడు. మానలేకపోతున్నాడు. బంగారాన్ని అమ్మేశాడు. ఇల్లమ్మేశాడు. ఉద్యోగం కూడా ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి. మందుకు డబ్బుంటుంది కాని, ఇంట్లో రెండు పూటలా తిందామంటే అతని దగ్గర డబ్బుండదు. నెలవారి సరుకులు కొనడం ఎప్పుడో మానేశారు. ఏ రోజుకారోజు కొంటే కొనడం లేకపోతే లేదు. రెండు రోజులయింది, ఇంత అన్నం తిని. ఎప్పటివో అటుకులు ఉంటే, వాసన వేస్తున్నా వాటితోనే ఆకలి తీర్చుకుందామె. చదువుకుంది తను. ఉద్యోగం చేసి, తనని తాను పోషించుకోగలదు. అలాంటప్పుడు కాపురం పేరిట కత్తుల్ని మింగడం ఎందుకు? అటో ఇటో తేల్చేస్తాననుకుంది. తేల్చేసింది.

ఎవరో తనని వెన్నంటి వస్తున్నారు. ఎవరై ఉంటారు? భయం భయంగా వెనక్కి తిరిగి చూసింది. దొంగ! మెళ్ళో చూశాడు. చేతులు చూశాడు. ఎక్కడా ఏదీ లేదు. 'ఛీ' అని వదిలేశాడు. పారిపోయాడు. దొంగ తనని వదిలేసినా భయం తనని వదల్లేదు. భయపడుతోందామె. బస్సులు లేవు. ఆటోలు లేవు. చేతిలో పైసలు లేవు. ఎలా వెళ్తుంది తను? ఎక్కడికి వెళ్తుంది? ఏదీ అంతుచిక్కడం లేదామెకు. దొరికిన ఆటో ఎక్కేయాలి.

రైల్వేస్టేషన్‌కి వెళ్ళిపోవాలి. స్టేషన్‌కి దగ్గరే స్నేహితురాలి ఇల్లు. ముందక్కడికి చేరుకుంటే తర్వాత సంగతి తర్వాత అనుకుంది. వర్షం ప్రారంభమయింది. ఒక్కసారిగా పెద్దగా కురవసాగింది. ఎక్కడా తలదాచుకునే అవకాశం లేదు. నడుస్తోందామె. నడుస్తూ నడుస్తూ ఆగిపోయింది. ఎదురుగా ముష్టోడు. తడవకుండా గొడుగేసుకుని ఉన్నాడు. చుట్ట తాగుతున్నాడు. సిల్వర్ క్యారేజీ కూడా ఉందతని చేతిలో. తాగినట్టుగా ఉన్నాడు. వాసన వేస్తున్నాడు. కావాలనే చేతిలోని క్యారేజీని ఊపుతున్నాడు. ఊపినప్పుడల్లా క్యారేజీలోని చిల్లర గలగలమంటూ శబ్దం చేస్తోంది. కాలనీలో చాలాసార్లు చూసింది వాణ్ణి. ఇప్పుడిక్కడ ఇలా ప్రత్యక్షమవుతాడనుకోలేదు. ఏం చేస్తాడు వీడు? దొంగలతో పర్వాలేదు. దోచుకుంటారు. లేదంటే వదిలేస్తారు. ఇలాంటి వాళ్ళే డేంజర్. పరుగుదీసిందామె. వాడూ ఆమెను అనుసరిస్తూ పరుగందుకున్నాడు. రెండుసార్లు పడిపోయేవాడే! నిలదొక్కుకున్నాడు. ఊపిరి అందడం లేదామెకు. అలసిపోయింది. ఆగిపోయింది. వాడూ అంతే! అలసిపోయి ఆగిపోయాడు, ఆమెకు కొద్ది దూరంలో.

అప్పుడు అదృష్టం బాగుంది. ఆటో దొరికింది. ఎక్కిందామె.

'ఎక్కడికి' అని అడగలేదు ఆటోవాలా.

'డబ్బులున్నాయా?' అని అడిగేడు. 'లేవు' అని ఆమె చెప్పేంతలోనే, 'ఉన్నాయి' అన్నాడు ముష్టోడు. క్యారేజీలోంచి చిల్లరతో పాటు, అయిదారు పదినోట్లిచ్చాడు. అప్పుడడిగాడు ఆటోవాలా. 'ఎక్కడికమ్మా?'

'స్టేషన్! రైల్వేస్టేషన్' చెప్పింది. ఆటో బయల్దేరుతుండగా గొడుగు మడిచి, దానిని ఆమె చేతికందించాడు ముష్టోడు. 'వెళ్ళిరా' అన్నట్టుగా చేత్తో సైగ చేశాడు. నవ్వాడు. ఆటో కదిలింది.

–నాలుగైదు నెలలు క్రితం జరిగిన సంఘటన ఇది. ఇప్పుడామెకు ఎలాంటి భయాలూ లేవు. తాగుబోతు భర్తని వదిలేసినట్టుగానే భయాన్ని కూడా వదిలేసిందామె. ఉద్యోగం చేసుకుంటూ ఒంటరిగా ధైర్యంగా బతుకుతోంది. అయితే ఆనాడు వర్షం కురిసిన రాత్రి వేళ సాయం చేసిన ముష్టివాడికి 'థ్యాంక్స్' చెప్పాలని, గొడుగూ, వాడికివ్వాల్సిన డబ్బులూ వాడికివ్వాలని ఎన్ని రాత్రులో తిరిగింది. కనిపించడం లేదు వాడు. ప్లీజ్! కనిపిస్తే చెప్పండి! ఋణం తీర్చుకుంటుందామె.

# కొండ గాలి తిరిగింది!
# గుండె ఊసులాడింది!

ఆమె తీసుకున్న నిర్ణయం తల్లిదండ్రులిద్దరికీ అంతు చిక్కడం లేదు. తమ కులం కాదు, మతం కాదు, అయినా ప్రేమించిన వాణ్ణి పెళ్ళి చేసుకుంటానంటే ఒకే దేశానికి చెందిన వారవడంతో'సరే' నన్నారు. కూతురు-అల్లుడు ఇద్దరూ కళ్ళ ముందు తిరుగుతోంటే హాయి హాయనిపించింది. ఆనందం కలిగింది. రోజులు గడిచిపోతున్నాయి.ఇంతలో ఈ నిర్ణయం తీసుకుందామె. ఒక్కగానొక్క కూతురు. దాంతో తను ఆడింది ఆట! పాడింది పాటయింది. ఎదురు చెప్పలేదెప్పుడూ. ఇప్పుడీ నిర్ణయానికి మాత్రం వారు ఎదురు చెప్పకుండా ఉండలేక పోయారు. ఇది భూతల స్వర్గం అని ఈ దేశంలోనే ఉండాలని కోరుకుంటారంతా. ఇక్కడి పౌరసత్వం కోసం పెనుగులాడతారు. ఇరవై ఏళ్ళ కిందట అలా పెనుగులాడే కూతుర్ని కన్నారు. సునాయసంగా ఆమెకు పౌరసత్వాన్ని అందజేశారు. తాము కూడా అన్ని రకాలుగా స్థిరపడ్డారు. అయిన వాళ్ళని మరిచి పోయారు. పుట్టి పెరిగిన ఊరునీ దేశాన్ని కూడా మరిచి పోయారు. ఏవీ గుర్తు లేని, గుర్తు రాని సమయంలో కూతురు వాటిని గుర్తు చేసింది. గుండె 'గుభేళ్'మనిపించింది.

''నేను ఇండియా వెళ్తున్నాను'' అంది.

''అక్కడికెందుకు? ఎవరున్నారని'' అడిగారు.

''నాకు నా భర్త అబ్దుల్ ఉన్నాడు. అబ్దుల్‌కి నేనున్నాను. ఇద్దరికీ ఇండియా ఉంది'' అంది కూతురు.

''ఇక్కడ పుట్టి ఇక్కడ పెరిగిన వాళ్ళు. అక్కడ మీరు బతకలేరు'' అన్నారు.

''అక్కడ పుట్టి అక్కడ పెరిగిన మీరు ఇక్కడెలా బతగ్గలుగుతున్నారు? అలాగే మేము కూడా అక్కడ బతుకుతాం'' అంది.

''మేము ఇక్కడి పౌరులమయినా మాకెందుకో ఇండియాలో స్థిరపడాలనిపిస్తోంది. అక్కడి నేల, గాలి కావాలనిపిస్తోంది'' అంది మళ్ళీ.

''మనుషులు కావాలి మమ్మీ! మంచికయినా చెడుకయినా పది మంది కావాలి. పిలిస్తే పలికేలా ఉండాలి. దగ్గర దగ్గరగా ఉండాలంతా. కోపాలు, తాపాలు, ఈర్ష్యలు, అసూయలు అన్నీ కావాలి. దేవుడు, దెయ్యం కూడా కావాలి. ఉంటేనే జీవితం. ఇరుకిరుకు బతుకుల్లోనే భద్రత ఉందనిపిస్తోంది. ఇండియా వెళ్ళాలనిపిస్తోంది. వెళ్ళిపోతాం'' అంది కూతురు.

''అక్కడేదో మేం పేద పేదగా బతుకుతామనుకోవద్దు! ఇక్కడెంత సంపాదిస్తున్నామో అక్కడ కూడా అంతే సంపాదించగలం. జీతాలేమీ తక్కువ ఇవ్వడం లేదక్కడ. పైగా ఇక్కడి జీవితం కంటే అక్కడి జీవితమే నాణ్యంగా గొప్పగా ఉంటోందనిపిస్తోంది. అందుకే వెళ్ళాలనుకుంటున్నాం'' అంది.

''మేమిద్దరమే కాదు, మరి నాలుగయిదు జంటలు, అక్కణ్ణుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారి పిల్లలే...మాలాంటి వాళ్ళే మాతోపాటు వస్తున్నారు. అంతా ఆనందంగా వెళ్తున్నాం. ఆశీర్వదించండి'' అంది. నమస్కరించి అబ్దుల్‌ని వెంటబెట్టుకుని బయల్దేరిపోయింది. 'వద్దు వద్ద'ని వెంట పడినా వినిపించుకోలేదు. వెళ్ళిపోయింది.

–అమెరికాలో 'గొప్ప'గా ఉంటున్నామన్న గొప్పతనాన్ని కాదనుకుని, ఇండియాకు ఇలా వలస వస్తోన్న వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగిందట! అక్కడి బర్గర్లు, చాక్‌లెట్లు కాదని ఇక్కడి ఆవకాయ, గోంగూర పచ్చడి మీద మనసు పడడం మెచ్చుకో దగ్గదే!! గాలి తిరిగింది. గమ్యం మారింది. రోజులు మారాయి!!

# అడుగులోన అడుగు వేసి నడవనీ!

సరళకి ఇద్దరు కూతుళ్ళు. ఇద్దరూ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. సొంతిళ్ళు, కార్లు... బాగానే సెటిలయ్యారక్కడ. గృహ ప్రవేశం, కారు కొనుక్కున్నాం, చూడడానికి రమ్మంటే భర్తతో వెళ్ళడం తప్పించి ఒంటరిగా ఎప్పుడూ సరళ కూతుళ్ళిం టికి వెళ్ళలేదు. భర్త పోయాడు. అప్పుడిక తప్పింది కాదు. సరళ హైదరాబాద్ వెళ్ళిపోయింది. ఇక అక్కడే కూతుళ్ళ దగ్గరే ఉండి పోతానంది. ఊరిలో ఇల్లు అద్దెకు ఇచ్చేసింది. ఒక నెల అద్దె చెల్లిం చారో లేదో రెండో నెలకు ఇల్లు ఖాళీ చేయమని సరళ ఫోన్ చేసి చెప్పిందట! ఎందుకంటే తాను ఊరికి తిరిగి వచ్చేస్తున్నానని అందట! అలాగే వచ్చేసింది. ఎందుకు వచ్చేసింది? అక్కడ ఏమయింది అన్నది ఎవరికీ తెలియదు. తెలుసుకుందామంటే సరళ ఎవరితోనూ మాట్లాడడం లేదు. గతంలో కూడా ఎవరి తోనూ పెద్దగా మాట్లాడే అలవాటు లేదు సరళకి. ఇప్పుడసలు లేదు. కనిపించడం కూడా మానుకుంది. మొన్ననెవరో చెప్పారు. సరళకి బాగా లేదని. అప్పుడిక తప్పదని ఆమెను చూడ్డానికి వెళ్ళాడు బాబాయ్. సరళ–బాబాయ్ చిన్నప్పట్నుంచి కలిసి చదువుకున్నారు. డిగ్రీ కాలేజీ కూడా ఇద్దరిదీ ఒకటే!

సరళ కళ కోల్పోయి కనిపించింది. ముసలితనం మీద పడ్డట్టుగా అయిపోయింది. నీరసంగా నిరాశగా కనిపించింది. 'జ్వరమా' అంటే కాదంది. 'మరేంటి' అంటే చెప్పలేకపోయింది. బాబాయ్ మరి ప్రశ్నించలేదు. 'రేపట్నించి మార్నింగ్ వాక్‌కి వెళ్తున్నాం. నాతో పాటు నువ్వు వస్తున్నావు' అన్నాడు. రానంది సరళ. బాగోదంది. 'రావాల్సిందే' అని పట్టుబట్టి సరళను

మార్నింగ్ వాక్‌కి సిద్ధం చేశాడు. తెల్లారగానే కలసి వాకింగ్‌కి బయల్దేరారు. నాయుడుగారి తోటలో నడక. బాబాయ్‌తో సరళను చూసి చాలా మంది చాలా రకాలుగా అనుకున్నారు. 'ఆంటీని బాబాయ్ బాగానే లైన్లో పెట్టాడు' అన్నారు. పట్టించుకోలేదు ఇద్దరూ. రోజూ అరగంట పాటు నడకే నడక! నెల రోజులు గడిచింది. సరళలో కళ వచ్చింది. ముసలితనం కూడా మరుగున పడింది. నీరసం, నిరాశలు కూడా పోయాయి. ఎప్పుడూ లేనిది గలగలా మాట్లాడసాగింది. ఉత్సాహంగా కనిపించింది. ఆనందించాడు బాబాయ్. 'నువ్విలా మారతావని నాకు ముందే తెలుసు! రోజూ అరగంట పాటు నడిస్తే 24 రకాల జబ్బుల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు. మధుమేహం, మానసిక ఒత్తిడి, క్యాన్సర్, గుండెజబ్బులు, రక్తపోటు...ఇవేవీ మనల్ని బెదిరించవు. ముసలితనం కూడా భయపడి పారిపోతుంది. పైగా పోజిటివ్‌గా ఆలోచిస్తాం. ఇవన్నీ నీకు అవసరం అనిపించి పట్టుబట్టాను. సక్సెస్ అయ్యాను. రేపట్నించి నీ దారి నీది! నా దారి నాది' అన్నాడు బాబాయ్. చెప్పుతో వేగంగా నడవడం వల్లనేమో తెగిపోయిందది. తెగిపోయిన చెప్పును విసిరేసి వెళ్ళిపోయాడు. అసలు చెప్పులతో మార్నింగ్ వాక్ చేయకూడదు.ఆ సంగతి తెలుసు బాబాయ్‌కి. కాకపోతే షూస్ ఇంత వరకు కొనలేదెప్పుడూ.

తెల్లారింది. అలవాటుగా మెలకువ వచ్చింది. మార్నింగ్ వాక్‌కి వెళ్ళాలి. సరళను తోడుకుని వెళ్ళాలి అనుకున్న బాబాయ్, 'నా దారి నాది' అన్నానుగా! అవసరం లేదు అనుకుని మళ్ళీ పడుకుందామను కునేంతలో తలుపు చప్పుడయింది. తీసి చూస్తే ఎదురుగా సరళ. ఆమె చేతిలో నిన్న విసిరేసిన బాబాయ్ చెప్పు, అదే నంబర్ గల షూస్ ఉన్నాయి. వాటిని అందజేస్తూ 'గురుదక్షిణ' అని నవ్వింది సరళ. 'మళ్ళీ ఏం పడుకుంటావ్! రా! సరదాగా వాక్ చేసొద్దాం' అంది. బాబాయ్‌ని తోడుకుని బయల్దేరింది. వాతావరణం చల్లగా ఉంది. హాయిగా ఉంది. పక్షులు అరుస్తోంటే ఉల్లాసంగా ఉత్సాహంగా ఉందంతా.

# వేళ చూస్తే సందె వేళ...

చాలా రోజులకి వాళ్ళింటికొచ్చాడు బాబాయ్. అబ్బాయ్–అమ్మాయి ఎలా ఉన్నారు? ఏ తీరున కాపురం చేస్తున్నారు? అబ్బాయి ఆఫీసులో ప్రమోటయ్యాడా? లేదా? అన్నీ వివరంగా కనుక్కునేందుకు వచ్చాడతను. రాగానే పెద్ద గొంతుతో అరచి మరీ ఆహ్వానించారతన్ని. ఆదివారం కావడంతో అబ్బాయి ఇంట్లోనే ఉన్నాడు. భోజనంలోకి రెండు కూరలు, పప్పు, పులుసు చేసిందమ్మాయి. రుచిగానే ఉన్నాయి. గుంటూరు పిల్ల కావడంతో కొంచెం కారం ఎక్కువగా వాడుతోంది. అంతే అనుకుని పడు కున్నాడు బాబాయ్. ఇంతలో–

''నోర్ముయ్'' పెద్దగా అబ్బాయి గొంతు వినిపించడంతో మెల కువ వచ్చింది బాబాయ్‌కి.

''ఎందుకు నోర్ముయ్యాలి? నేను చేసిన తప్పేంటి? ఫస్ట్‌షోకి సినిమాకు వెళ్దామంటే వద్దంటున్నారెందుకు?''

''బాబాయ్ వచ్చాడని చెప్పానా?''

''వస్తే! సినిమాకు వెళ్ళకూడదా?''

''కూడదని కాదు! సరదాగా మాట్లాడుకుందామంటున్నాను కదా.''

''సినిమా నుంచి వచ్చి కూడా సరదాగా మాట్లాడుకోవచ్చు.''

''వచ్చు! కాని అప్పుడు నిద్రొస్తుంది.''

''రేపుదయం మాట్లాడుకుందాం.'' అమ్మాయి వాదన పటి ష్ఠంగా సాగుతోంది. అబ్బాయి వాదించలేకపోతున్నాడు. అసహనంగా కేకలు వేస్తున్నాడు. గడియారం కేసి చూశాడు

బాబాయ్. అప్పుడు మూడున్నర గంటలయింది. కరెక్టయితే అనుకున్నాడు. నవ్వుకున్నాడు. ''ఏంటమ్మా గోల'' తను నిద్ర లేచినట్టుగా చెప్పక చెప్పాడు బాబాయ్. అబ్బాయ్-అమ్మాయి ఇద్దరూ ''ఏం లేదు బాబాయ్'' అంటూ కోరస్‌గా నవ్వుతూ చెప్పారు. ఏం జరగలేదన్నట్టుగానే వూరుకున్నారిద్దరూ. కాఫీలయ్యాయి. అబ్బాయి ఏదో తీసుకుని వచ్చేందుకు మార్కెట్‌కి వెళ్ళాడు. పది నిముషాల్లో తిరిగొస్తానన్నాడు. అప్పుడు సమయం ఆరు గంటల పదిహేను నిముషాలయింది. అమ్మాయి వంటింట్లో ఉంది. బాబాయ్ వెళ్ళాడక్కడికి.

''ఫస్ట్‌షో ఎన్నిగంటలకమ్మా?'' అడిగాడు.

''పావు తక్కువ ఏడుకి'' అంది అమ్మాయి.

''ఇప్పుడు అబ్బాయి వస్తాడు కదా! అడుగు! ఒప్పుకుంటాడు. వెళ్దాం'' అన్నాడు బాబాయ్. అతను చెప్పినట్టుగానే అబ్బాయి రాగానే అడిగిందమ్మాయి. అబ్బాయి ఒప్పుకున్నాడు. సినిమా చూసొచ్చారంతా. రాత్రి పడుకోబోతూ ఆఫీసు వ్యవహారాల్ని కదిపి చూశాడు బాబాయ్. రెండేళ్ళుగా ప్రమోషన్ లేదంటూ ఎప్పుడడిగినా బాస్ చిరాకు పడుతున్నాడని అబ్బాయి బాధపడ్డాడు.

''ప్రమోషన్ కావాలని మీ బాస్‌ని ఏ టైంలో అడుగుతున్నావు?'' అడిగాడు బాబాయ్.

''పొద్దున పొద్దునే ఫ్రెష్‌గా ఉంటాడని రాగానే అడుగుతున్నాను. బెడిసికొడుతోంది'' అన్నాడు.

''రేపు లంచ్ తర్వాత అడుగు! వస్తుంది'' చెప్పాడు బాబాయ్. అలాగే అడిగాడు అబ్బాయ్. ప్రమోషన్ వచ్చేసింది. బాబాయ్ మంత్ర రహస్యం తెలుసుకోవాలనుకుని ''ఏంటి బాబాయ్ ఈ టైమింగ్'' అనడిగాడు. అప్పుడు అసలు సంగతి చెప్పాడు బాబాయ్. బాస్ అభిమానాన్ని సంపాదించాలంటే అతన్ని పొద్దున పొద్దునే విసిగించకూడదట! లంచ్ తర్వాత అడిగితే కాదనడట! అలాగే మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఏ మగాడూ స్త్రీతో వాదించి గెలవలేడట! అప్పుడు నోరు మూసుకోవడమే క్షేమం అన్నాడు. సాయంత్రం ఆరుగంటల తర్వాత స్త్రీ అడిగిన ఏ కోరికనూ మగాడు కాదనడట...ఇవన్నీ చెబుతూ ఇదంతా బేయర్ ఫార్మా పరిశోధకుల అధ్యయనం అని వివరించాడు. బ్రిటన్‌లో వేయి మంది స్త్రీ పురుషులను అధ్యయనం చేసి మరీ తేల్చారని అన్నాడు. ఆచరిస్తే కాపురానికే కాదు, ఉద్యోగ జీవితానికి కూడా ఢోకా లేదన్నాడు బాబాయ్. అబ్బాయి నమస్కరిస్తే దీవించి వెళ్ళిపోయాడు.

# ఓం ఆదిత్యాయ నమః

ఆ నలుగురూ బాబాయ్‌కి ఎప్పట్నుంచో తెలుసు. వాళ్ళని స్టూడెంట్స్‌గా చూశాడు. ఉద్యోగులుగా చూశాడు. నలుగురికీ పెళ్ళిళ్ళయిపోయాయి. పిల్లలు కూడా. ఇప్పుడా నలుగురూ పెద్ద పెద్ద ఆఫీసర్ల స్థాయిలో ఉండి క్షణం తీరిక లేకుండా ఉంటున్నారు. స్టూడెంట్స్‌గా ఉన్నప్పుడు ఆ నలుగురూ బలే బాగుండే వారు. అందంగా ఆరోగ్యంగా కనిపించేవారు. ఉద్యోగాలొచ్చిన కొత్తలో కూడా అలానే కనిపించారు. పెళ్ళిళ్ళప్పుడు పర్వాలేదు. పిల్లలు కలిగి, ఆఫీసర్లయిన తర్వాత అందాలు పోగొట్టుకున్నారు. ఆరోగ్యాలు కూడా పోగొట్టుకున్నారని ఈ మధ్యే తెలిసింది. ఒకరికి ఆ మధ్య మైల్డ్‌గా హార్టెటాక్ వచ్చిందట! ఇంకొకరికి తిన్నది అరగడం లేదట! మరొకరు నిద్రలేమితో బాధపడుతుంటే ఇంకొ కరు ఊబకాయంతో నానా అవస్థలూ పడుతున్నాట్ట! 'పాపం' అనుకున్నాడు బాబాయ్. ఒకరోజు ఆ నలుగుర్నీ టీకి పిలిచాడు. సాయంత్రం వస్తామన్నారంతా. కాదు, పొద్దున పొద్దునే ఆరు గంటలకు రావాలన్నాడు బాబాయ్. అంత పొద్దునే రావడం అసాధ్యం అన్నారు. సాధ్యం చేసుకుని వీలున్నప్పుడే రండన్నాడు బాబాయ్. త్వరలో వస్తే మంచిది అన్నాడు. రెండు వారాల తర్వాత వాళ్ళొచ్చారు. వాళ్ళొచ్చే వేళకి లేలేత ఎండలో బాబాయ్ సూర్య నమస్కారాలు చేస్తున్నాడు. పలకరించి కూర్చోమన్నాడు. నమస్కారాలన్నీ అయ్యాక నలుగురికీ టీ ఇచ్చాడు.

''మీ ఆరోగ్య రహస్యం మాకు తెలిసిపోయింది'' అన్నారు వారు. బాబాయ్ నవ్వాడు.

''సూర్య నమస్కారాల వల్ల ఇంత తేడా ఉంటుందా?'' అడిగారు. వాళ్ళకన్నా బాబాయ్ వయసులో చాలా పెద్ద. అయితే వాళ్ళ కన్నా చిన్న వాడిలా కనిపిస్తున్నాడు.

''చాలా తేడా ఉంటుంది'' అన్నాడు బాబాయ్.

''గుండెకు చాలా మేలు చేస్తాయి ఈ నమస్కారాలు. రక్త సరఫరా చురుగ్గా ఉంటుంది. అలాగే రక్తంలో ఆక్సిజన్ శాతం కూడా చక్కగా ఉంటుంది'' అన్నాడు.

''అజీర్తి సమస్య ఉండదు. నాడి వ్యవస్థ చురుగ్గా పని చేస్తుంది. శ్వాసకోస సమస్యలు ఉండవు. ఒత్తిడి, మానసిక కుంగుబాటు కూడా మాయమవుతాయి. నిద్రలేమితో బాధపడేవారికివి చక్కని మందులా పని చేస్తాయి. రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండాలంటే ఈ నమస్కారాలకు మించినవి లేవు. చేస్తోన్న పని పట్ల శ్రద్ధ, ఏకాగ్రత కూడా పెరుగుతుంది. ఊబకాయానికి ఈ నమస్కారాలే సరయిన మందు. ఇవి చేస్తే పొట్ట చుట్టూ ఉన్న కొవ్వు ఇట్టే కరిగిపోతుంది. ఎండకి శరీరంలోని అధిక కేలొరీలు ఖర్చయిపోతాయి. వెన్నెముక దృఢమవుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీరం తాజాగా ఉంటుంది'' అని ఆగాడు బాబాయ్. నలుగుర్నీ పరిశీలించసాగాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నారంతా. గుండెను నిమురుకుంటూ ఒకరు. బొజ్జను నిమురుకుంటూ ఒకరు, కళ్ళను నులుముకుంటూ ఒకరుంటే ఇంకొకరు తాగిన టీకే సుష్ఠుగా భోంచేసినట్టుగా త్రేనుస్తున్నాడు.

''మరో విషయం! లేలేత నులి వెచ్చని సూర్య కిరణాలు శరీరానికి తాకడం వల్ల చర్మానికి చాలా మేలు జరుగుతుంది. ముడతలు పోతాయి. ముసురుకొచ్చే ముసలితనం కనిపించదు. జుట్టు రాలిపోదు. చుండ్రు రాదు'' అన్నాడు బాబాయ్.

''బాగుందే'' అన్నారంతా.

''మరి రేపట్నుంచి నాతో పాటు సూర్య నమస్కారాలు చేస్తారా? చేస్తానంటే పొద్దునే రండి! ఎంత? ఓ అరగంట చేస్తే చాలు! తర్వాత మంచి టీ ఇస్తాను. తాగి సరదాగా వెళ్ళిపోదురుగాని'' అన్నాడు బాబాయ్.

''అలాగే'' అన్నారు వారు. అన్నారు కాని, వస్తారన్న నమ్మకం బాబాయ్‌కి లేదు. అయితే నమ్మలేనట్టుగా ఆ నలుగురూ మర్నాడు పొద్దున పొద్దునే బాబాయ్ దగ్గరకొచ్చారు. సూర్య నమస్కారాలు ప్రారంభించారు. దేవుడని సూర్యునికి నమస్కరించడం కాదు, అందం–ఆరోగ్యం కలిగిస్తాడని చేతులు ముకుళించడంలో ముప్పులేదు.

# ఉపకారమే ఊపిరి

ఊహించలేదు. కంపెనీ కుప్పకూలిపోయింది. భాగస్వామిగా అందరితో పాటు అతనూ బజార్లో పడ్డాడు. నష్టాలు పూడ్చాలంటే, చేసిన అప్పులు తీర్చాలంటే ఉంటూన్న ఇల్లే కాదు, చేతిలో ఉన్న కారును కూడా అమ్మేయాలి. ఒక రకంగా కట్టు బట్టలు తప్ప మరింకేమీ మిగిలే పరిస్థితి లేదు. ఆదుకునే వారి కోసం అయిదారు రోజులయింది తిరుగుతూ. ఎవరూ కనికరించ లేదు. పైగా వేళకాని వేళ వచ్చావని విసుక్కున్నారు. బాధపడ్డా డతను. ఎక్కడున్నారు? ఎలా ఉన్నారంటూ భార్యా పిల్లలు ఫోను చేస్తూనే ఉన్నారు. 'బతికే ఉన్నాను' అంటున్నాడే కాని, నిజంగా తను బతికి ఉన్నాడా? అన్నది అనుమానంగానే ఉందతనికి. ఏడ్చేడ్చి కన్నీళ్ళింకిపోయాయి. ఆలోచించాలోచించి మెదడు మొద్దుబారిపోయింది. సిగరెట్లు తాగి తాగి నోరెండిపోయింది. అన్ని విధాలా అలసిపోయాడతను. నిద్రొస్తోంది. ఆకలి వేస్తోంది. ఏదో ఇంత తిని ఏ చెట్టు నీడనో కారాపి నిద్రపోదామనిపించి, పర్సు కోసం చూశాడు. జేబులో లేదది. ఎక్కడ పోయిందో పోయింది. బాధనిపించలేదతనికి. అంత నీరసంలోనూ నవ్వొచ్చింది. ఇంతలో కారులో పెట్రోలు అయిపోయినట్టుంది. కారాగిపోయింది. రోడ్డు మధ్యలో ఆగిపోయిందది. దాన్ని పక్కకి తీసుకు రావాలి. సాయం కోసం చూశాడతను. ఎవరూ కనిపించ లేదు. వచ్చీపోయే కార్లను బతిమలాడాడు. ఆపలేదు, సాయం చేయలేదు సరికదా రోడ్డు మీద కారు అడ్డంగా నిలిపి ఉంచినందుకు ఆంగ్లంలో అనరాని మాటలని వెళ్ళిపోయాయవి.

''ఏమయింది సార్! పెట్రోలయి పోయిందా? రండి సార్! మేం తోస్తాం, రండి'' అంటూ రోడ్డు కూలీలు–ఆడా మగ సాయానికి వచ్చారు. కారుని బలంగా నెట్టి రోడ్డు పక్కగా చెట్టు నీడన నిలిపారు. చెమటలు పట్టిపోయి స్పృహ కోల్పోతున్నట్టనిపించింది. డ్రైవింగ్ సీట్లో కూలబడ్డాడతను. కళ్ళు మూసుకున్నాడు. చాలా సేపటికిగాని మెలకువ రాలేదతనికి. వచ్చి చూస్తే ఇందాకటి ఆడా మగ ఇద్దరూ చెట్టు కింద భోజనానికి కూర్చున్నారు. మల్లెపువ్వులాంటి అన్నంలోకి వేడి వేడి పప్పుచారు పోస్తోందామె. తినబోతున్నాడు కూలి. తినబోతూ ఇటు చూశాడు. కారులోని వ్యక్తి తన కంచంలోని అన్నాన్ని కన్నార్పకుండా చూడడాన్ని గమనించాడు.

''ఆకలేస్తోందా సార్?'' అడిగాడు. వేస్తోందని చెప్పడానికి సిగ్గుపడ్డాడతను. నవ్వుతూ తన కంచాన్ని తెచ్చిచ్చాడు కూలి.

''తినండి సార్'' అన్నాడు. ఆబగా తినసాగాడతను. మరి కొంచెం అన్నం–మరి కొంచెం చారు అన్న సైగలు చేశాడు. తెచ్చి పెట్టిందామె. కడుపు నిండా తిని, కంటి నిండా నీళ్ళతో వాళ్ళని చూశాడు. ఎంగిలి చేతితోనే వాళ్ళకి దణ్ణం పెట్టాడు.

''ఛఛ! కూలోళ్ళం! పైగా పేదోళ్ళం. మాకు దండాలేటి బాబూ'' వారించారు.

''కంగారు పడకండి బాబూ! పెట్రోలు కూడా తెచ్చి ఉంచాం. ఊరిలోకి మీరు దయిర్యంగా ఎలిపోవచ్చు'' అన్నారు. చేయి కడిగారు. పెట్రోలు పోసి కారు కదిలించారు. కూలీలకు టాటా చెబుతూ బయల్దేరాడతను.

ఎక్కడో ఎప్పుడో చదివింది గుర్తొచ్చిందతనికి.

సంపన్నుల కంటే పేదవాళ్ళే మంచి వాళ్ళు! ఇతరుల కష్టాల్ని చూసి ఇట్టే కరిగిపోతారు. కష్ట సుఖాలను పంచుకోవడంలో వాళ్ళే ముందుంటారు. కొత్త వాళ్ళతో మాట్లాడేందుకు సంపన్నులు వెనకడుగు వేస్తే పేదవాళ్ళు ప్రేమపూర్వకంగా మాట్లాడడమే కాదు, అవసరమయితే ఆర్థికంగా ఆదుకుంటారు. అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం అధ్యయనంలో తేలిన అంశాలివి.

పేదయినందుకు అతనికిప్పుడు ఏ బాధలూ లేవు. మనిషినవుతున్నానని ఆనందంగా ఉంది. ఆ ఆనందంలో అతను గర్వంగా తలెగరేశాడు.

# స్మైల్ ప్లీజ్!!

చలి చలి వేళ అమ్మ లేవడం, చన్నీటి స్నానాలు చేయడం, తులసికోటకు పూజ చేస్తూ భక్తిగీతాలు పాడడం, అప్పుడే లేచిన అక్కని చూసి నవ్వడం, దగ్గరగా తీసుకుని అక్కని నవ్వించడం చాలాసార్లు చూశాను. అమ్మా అక్క అప్పుడే వీలయినంతగా నవ్వేవారు. తెలి తెలి వేళ వాళ్ళ నవ్వులు ముత్యాల్లా మెరిసి పోయేవి. తర్వాత వాళ్ళకి నవ్వే అవకాశాలు ఉండేవి కావు. నాన్న లేచే వేళకి వాళ్ళు నవ్వకూడదు. నవ్వితే 'ఏంటది' అని హెచ్చ రించేవారు. పొరపాటున నవ్వితే 'తప్పమ్మా! అయిన దానికి కాని దానికి నవ్వకూడదు' అనేవారు నాన్న. అయితే ఏది అయినదో ఏది కానిదో వివరించి చెప్పేవారు కాదు. పెళ్ళి చూపుల్లో బావని చూసి పగలబడి నవ్వింది అక్క. ఆ నవ్వుకి కారణం ఉంది. బావని చిన్నప్పుడంతా 'పోస్ట్ ఆఫీస్' అని ఏడిపించేవారట! నిక్కరు బటన్స్ బావ పెట్టుకునే వాడు కాదట! అది గుర్తొచ్చిందక్కకి. బావకి బాగా కోపాన్ని తెప్పించిందది. 'ఏడ్చే మగాణ్ణి, నవ్వే ఆడదాన్ని నేను నమ్మను' అన్నాడు. ఆ మాట అన్నాడో లేదో వెంటనే భోరున ఏడ్చాడు. బావ కాలి మీద వేడి వేడి కాఫీ గ్లాసు పడేసిందక్కయ్య. పడేసిందంటే పడేయ లేదు. బావ తనతో అలా మాట్లాడేసరికి వజవజా వణికిపోయి చేతిలోని కాఫీ గ్లాసుని జారవిడిచేసింది. అయ్యయ్యో అని అమ్మా నాన్న హైరానా పడుతోంటే పాపం అక్కయ్యే వెన్నరాసి, వెన్నెల్లాంటి నవ్వురాసి బావ బాధని తగ్గించింది. బాధ తగ్గడంతో పిల్ల నచ్చిందంటూ బావ వెళ్ళిపోతోంటే...అక్కయ్య అతన్ని పిలిచి 'ఏడ్చే మగాణ్ణి నేను నమ్మను బాబూ' అంది. పగలబడి నవ్వాడు బావ. 'ఇప్పుడు నమ్ముతాను బాబూ' అంది అక్కయ్య.

దాంతో ఇద్దరికీ పెళ్ళయిపోయింది. అత్తారింటికి అక్క వెళ్ళిపోయింది. అప్పణ్ణుంచి మా ఇంట్లో నవ్వులు కరవయిపోయాయి.

నాన్న నవ్వడం నేను ఎప్పుడూ చూడలేదు. ఆయన పోయిన తర్వాత అమ్మ కూడా నవ్వడం మానుకుంది. నవ్వకపోవడంతోనే నాన్న ఓ ఏడేళ్ళు ముందుగా చనిపోయారనిపించింది. నవ్వితే ఇంకా ఓ ఏడేళ్ళు బతికే వారా? అంటే బతికే వారే అంటున్నాయి అధ్యయనాలు. బాధను మరిపించే నవ్వు, భయాల్ని పోగొట్టే నవ్వు, శత్రుత్వాన్ని తుంచేసే నవ్వు ఆయుష్షను కూడా పెంచుతుందంటున్నారు. ఏడేళ్ళు అధికంగా బతికే అవకాశాన్ని ఇస్తుందంటున్నారు. మనస్ఫూర్తిగా నవ్వేవాళ్ళు ఎక్కువ కాలం జీవిస్తారని ఇటీవలే తేలింది. నోరు పెద్దగా చేసుకుని నవ్వేవాళ్ళు, కళ్ళ కింద ముడతలు ఉన్న వ్యక్తులు జీవితం పట్ల ఆశావహంగా ఉంటారని, ఫలితంగా ఆరోగ్యవంతంగా జీవిస్తారని పరిశోధకులు అంటున్నారు. ఎప్పుడూ నవ్వని వాళ్ళు 72 ఏళ్ళు మాత్రమే జీవిస్తారట! అప్పుడప్పుడూ నవ్వే వాళ్ళు 75 ఏళ్ళు జీవిస్తే, పగలబడి బిగ్గరగా నవ్వేవాళ్ళు 79 ఏళ్ళు జీవిస్తున్నట్టుగా తేలింది. హాయిగా ఆనందంగా నవ్వితే ఏడేళ్ళు ఎక్కువగా జీవించవచ్చని తేలింది. ఉత్తుత్తి నవ్వులు నవ్వేవాళ్ళు, మొహమాటం కోసం నవ్వేవాళ్ళ ఆయుష్షలో తేడాలుండవట! అసలు అందంగా ఉండాలంటే బాగా నవ్వాలట! నవ్వితే ముఖం పైగల కండరాలు సంకోచ వ్యాకోచాలు చెంది కాంతివంతంగా కన్పిస్తారంటున్నారు.

అమ్మకీ అక్కకి ఈ సంగతులు తెలియకపోయినా నవ్వడం వాళ్ళకి బాగా తెలుసు. కాని నాన్న పోవడంతో అమ్మ నవ్వడం మానుకోవడం నేను భరించలేకపోతున్నాను. అమ్మని నవ్వించాలి. కొత్త సంవత్సరంలో నేను తీసుకునే గట్టి నిర్ణయం ఇది. దయచేసి మీరు కూడా కొత్త సంవత్సరంలో బాగా నవ్వాలని ఒట్టు పెట్టుకోండి! కొత్త సంవత్సరంలో సరికొత్తగా జీవించండి! హేపీ న్యూ ఇయర్!!

# సంక్రాంతి సంబరం

వాణ్ణి 'చంటి' అని పిలిచేవారంతా. చంటి అంటే అల్లరికే కాదు, ఆటకీ పాటకి కూడ పెట్టింది పేరు. తెల్లారిందంటే చాలు! ఒరేయ్ శీను, కాశి, వెంకీ అంటూ చంటిగాడి కేకలు వినిపించేవి. పిల్లలందర్నీ పిలిచి వాకిలిలో వరుసుగా నిలబడమనే వాడు. అప్పుడు తండ్రిని కూడా కేకేసేవాడు. వచ్చేవారాయన. అయన అసలు పేరేమిటో ఎవరికీ తెలియదుగాని, ఆయన్నంతా 'నమస్కారాల మాస్టారు' అనే వారు. ఆయన సూర్యనమస్కారాలు నేర్పేవారు. ఓం మిత్రాయ నమః, ఓం రవయే నమః, ఓం సూర్యాయ నమః, ఓం భానవే నమః, ఓం ఖగాయ నమః, ఓం పూష్ణే నమః, ఓం హిరణ్యా గర్భాయ నమః, ఓం మరీచయే నమః, ఓం ఆదిత్యాయ నమః, ఓం సవిత్రే నమః, ఓం అర్కాయ నమః, ఓం భాస్కరాయ నమః అంటూ లేలేత ఎండలో దణ్ణాలు పెట్టించే వారు. అరగంట సేపు వ్యాయామం. అలిసిపోయేవారు పిల్లలు. చాల్చాలంటూ అప్పుడొచ్చేది చంటి వాళ్ళమ్మ. ఆవిడ చేతిలో చల్ది కుండా, గ్లాసు ఉండేవి. పిల్లలందరికీ ఆవిడ 'తరవాణి' ఇచ్చేది. గ్లాసుతో తరవాణి తాగుతోంటే చల్లగా గుండెల్లోకి దిగేదది. తర్వాత చేతిలో చల్ది ముద్దలు పెట్టేది. నాలుగయిదు ముద్దలు పెట్టేది. చల్లచల్లగా కడుపులో అవి తిష్టవేసుక్కూర్చుంటే కళ్ళు మూసుకుపోతుండేవి. నిద్రొచ్చేసేది పిల్లలకి. అప్పుడు పాట పాడేవాడు చంటి. ఆటలు కూడా ఆడే వాడు. ఆడించే వాడు. దెబ్బకి నిద్రలు ఎగిరిపోయేవి. స్నానాలు చేసి స్కూళ్ళకు పోయేవారంతా. అక్కడ చెప్పేది ఇట్టే తలకెక్కేది. అలా చదువుకునే అంతా పెద్దవారయ్యారు. పెద్దస్థాయిలకి చేరుకున్నారు. చంటి కూడా పెద్ద ఉద్యోగయ్యాడు.

వాణ్ణి చూడాలనిపించింది బాబాయ్‌కి. వెళ్ళాడు. అప్పుడు చంటి ఇంట్లో లేడు. ఆసుపత్రిలో ఉన్నాడు. ఏమయిందేమయిందంటే...చంటికి గుండె నొప్పి అన్నారు. ఎందుకెందుకంటే...అంత లావు మీదా రాదా అన్నారు. ఎంత లావంటే చూడండన్నారు. ఆసుపత్రిలో బెడ్ మీద చంటిని చూస్తే భయం వేసింది బాబాయ్‌కి. ఏనుగులా కనిపించాడు వాడు. ఏంటిదంతా అనడిగితే ఏమో అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. బాబాయ్ అడిగేడప్పుడు. సూర్య నమస్కారాలు చేస్తున్నావా? లేదు. చద్దన్నం తింటున్నావా? లేదు. పోనీ ఏదో ఒకటి పొద్దునపూట అల్పాహారంగా తీసుకుంటున్నావా? లేదుగాక లేదు. తినడానికి టైమేది? లంచ్‌కే టైముండదు అన్నాడు చంటి. బాబాయ్‌కి అర్థమయిపోయిందంతా. అందుకే ఇలా అయిపోయాడనుకున్నాడు. ఆసుపత్రి నుంచి చంటి డిశ్చార్జయ్యాక వాడి దగ్గరగా కూర్చుని ఇలా చెప్పాడు బాబాయ్.

పొద్దున పొద్దునే సూర్య నమస్కారాలు, చద్దన్నాలు చాలా గొప్పవిరా! అందుకే అప్పుడు అంతా ఆరోగ్యంగా ఆనందంగా ఉండేవారు. ఉదయాన్నే ఏదో ఒక అల్పాహారం తీసుకోవాలి. తీసుకుంటే గుండె జబ్బులు, మధుమేహం రావుగాకరావు. తీసుకోకపోతే ఏమవుతుందో తెలుసా? చెడు కొలెస్ట్రాల్ అధికంగా పెరగడంతో పాటు నడుం చుట్టు కొలత కూడా పెరిగి కొంప మునుగుతుంది. ఆటలు పాటలు అల్లరీ చిన్నతనంలోనే కాదు, పెద్దవయసుకు కూడా కావాలి. అప్పుడే అంతా ఆరోగ్యంగా ఉంటారు. ఇవన్నీ తెలుసు కాబట్టే అప్పట్లో మీ అమ్మానాన్న సూర్య నమస్కారాలు, తరవాణిలు అందజేసేవారు. ఇప్పుడవి మీకు చేదయ్యాయి. దాంతో ఏనుగులయి, ఆసుపత్రి పాలయ్యారు.

సంక్రాంతి. తెల్లారిందా రోజు. చంటి సూర్య నమస్కారాలు గుర్తు చేసుకుంటూ అతి కష్టం మీద ఒళ్ళు వంచసాగాడు. వాళ్ళావిడ 'తరవాణి' తయారీ ఏర్పాట్లలో పడింది. ఎసట్లో గుప్పెడు గుప్పెడుగా బియ్యం పోసింది. అన్నం కుత కుత ఉడుకుతూ గంజి పొంగి పొర్లుతోంటే మురిసిపోతోందామె.

# స్నేహమేరా జీవితం

ఇంతప్పట్నుంచి వాళ్ళిద్దరూ అందరికీ తెలుసు. ప్రసాద్ పదిమందితో కలిసే రకం కాదు. ఒంటిపిల్లి రాకాసి అంటారే ఆ టైప్ వ్యక్తి. ఒక్కడే చదువుకోవడం, ఒక్కడే తినడం, ఎక్కడికయినా ఒంటరిగా వెళ్ళి రావడం వాడికి అలవాటు. ఎప్పుడూ సీరియస్‌గా ఉంటూ తన పని తాను చేసుకుంటూ చిన్న వయసులోనే పెద్దరికాన్ని ఒంటబట్టించుకున్నట్టుండేవాడు. చదువులో మళ్ళీ ఫస్ట్. మూర్తి ఇందుకు భిన్నంగా ఉండేవాడు. వాడి చుట్టూ పదిమంది ఉండాలి. పదిమందితోనే చదివేవాడు. పదిమందిలోనే తినేవాడు. ఎక్కడికి వెళ్ళాలన్నా ఇటు అయిదుగురు అటు అయిదుగురు ఉండాల్సిందే! గ్యాంగ్‌లీడర్‌లా ఉండేవాడు. తన పని తాను చేసుకునే వాడు కాదు. ముందు స్నేహితుని పని చేసి తర్వాత తన పని చేసుకునే టైప్ వ్యక్తి. మూర్తిని సరదాగా టీకి పిలవాలన్నా, సినిమాకి పిలవాలన్నా మొత్తం గ్యాంగ్‌ని దృష్టిలో పెట్టుకుని పిలవాల్సిందే! ఒక్కణ్ణీ పిలిస్తే వచ్చేవాడు కాదు, అలా పిలవడం పద్ధతి కాదనే వాడు. చదువులో వీడూ ఫస్టే! ప్రసాద్–మూర్తి చదువులో పోటీ పడుతున్నట్టుండే వారు.

రోజులు గడిచిపోయాయి. అంతా పెద్దవాళ్ళయిపోయారు. ఉద్యోగాలు... పెళ్ళిళ్లు... పిల్లలు... మనవలతో బాగానే ఉన్నారంతా. ప్రసాద్ పెద్ద ఆఫీసర్‌గా రిటైరయ్యాడు. మూర్తి కూడా అదే స్థాయిలో రిటైరయ్యాడు. ఇద్దరినీ చూడాలనిపించింది బాబాయ్‌కి. వెళ్ళాడక్కడికి. ప్రసాద్‌ది పెద్ద ఇల్లే! నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడా ఎలాంటి అలికిడీ లేదు. అసలు మనుషులున్నట్టే అనిపించలేదు. కాస్సేపటికి అసలు సంగతి తెలిసింది. ప్రసాద్ చనిపోయాడు. నెల కూడా కాలేదన్నారు. అయ్యయ్యో అని

పించింది బాబాయ్‌కి. రెణ్ణెళ్ళలో మనవడి పెళ్ళి ఉందట! చూస్తాడనుకున్నారు! కాని చూడలేకపోయాట్ట పాపం. బాబాయ్‌కి ఇక ఒక్క క్షణం కూడా అక్కడ ఉండాలనిపించ లేదు. తిరిగి వచ్చేశాడు. మూర్తి ఇంటికి వెళ్ళాలనిపించలేదు. అక్కడెలాంటి వార్త వినాల్సి వస్తుందోనని భయపడ్డాడు. ఆ సాయంత్రం ఊసుపోక బీచ్‌కి వెళ్తే నవ్వుతూ అక్కడ కనిపించాడు మూర్తి. పదిమంది గుంపులో ఉన్నాడు.

''ఎలా ఉన్నావు బాబాయ్'' అంటూ ఎగురుతూ వచ్చాడు.

''నువ్వెలా ఉన్నావు?'' అడిగాడు బాబాయ్.

''నాకేం బాబాయ్! చూశావుగా'' అన్నాడు. బాగున్నాడు మూర్తి. ఆరోగ్యంగా ఉన్నాడు. ఆనందంగా ఉన్నాడు.

''పాపం ప్రసాద్'' అన్నాడు వాణ్ణి గుర్తు చేసుకుంటూ.

''వాడు చనిపోయినట్టు కూడా ఎవరికీ తెలియదు బాబాయ్'' అన్నాడు.

''మంచికైనా చెడుకైనా నలుగురు ఉండాలంటే వినేవాడు కాదు బాబాయ్'' అన్నాడు మళ్ళీ.

''నలుగురితో కలిసి ఉంటే నాలుగు పనులవుతాయి. ఒకరికొకరు సాయంగా ఉంటారు. అప్పులు పుడతాయి. ఆరోగ్యాలు కుదుటపడతాయి. పిల్లల పెంపకాలు, పెళ్ళి విషయాల్లోనే కాదు, పెద్దల గొడవల్లో కూడా ఓదార్పులందుతాయి. మానసికంగా ఒత్తిడి ఉండదు. పైగా హాయిగా ఉంటుంది'' అన్నాడు.

''అలా అని అందుకోసమే స్నేహం చేయకూడదు. కాకపోతే నలుగురితో కలిసి ఉంటే బావుంటుందని నా ఉద్దేశం'' అన్నాడు ప్రసాద్. అంతలో వాడి మనవడొచ్చాడు. కారు తీసుకొచ్చాట్ట! ఇంటికి పోదాం రమ్మంటున్నాడు. ఇరవయిదేళ్ళుంటాయి వాడికి. అచ్చు మూర్తిలాగానే ఉన్నాడు.

''వీడి పెళ్ళి కూడా చూసి మరీ పోతాను'' అన్నాడు ప్రసాద్.

''నాలుగయిదేళ్ళింకా ఈజీగా బతుకుతాను'' అన్నాడు. ఆ మాట నిజం. స్నేహితులెక్కువగా ఉన్నవారు లేనివారికంటే నాలుగైదేళ్ళు ఎక్కువ బతుకుతారు. ఇది బర్మింగ్‌హోమ్ పరిశోధకులు తేల్చి చెప్పిన మాట!

# పాస్‌బుక్

నీ కళ్ళు బాగుంటాయి. నీ నవ్వు బాగుంటుంది. నీ నడక బాగుంటుంది. నువ్వు అందంగా ఉంటావు. ఐ లవ్ యు!

నీ వంట బాగుంటుంది. సాంబారు నువ్వే చెయ్యాలి. బజ్జీలు నువ్వు చేసినట్టుగా ఇంకొకరు చెయ్యలేరు. ఐ లైకిట్!

నువ్వు బలేగా మాట్లాడతావు. నీకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఎక్కువ. ఎగతాళి చేయాలంటే నీ తర్వాతే! అయామ్ ప్రౌడ్ ఆఫ్ యు!

రాజేష్ ఎంతగా పొగిడేవాడు? నువ్వు లేకపోతే బతకలేననే వాడు. చావు మనల్ని విడదీయాలి కాని, మనం విడిపోకూడదు అనేవాడు. అసలు ఆ ఆలోచనే రాకూడదనే వాడు. అలాంటి వాడు ఎలా మారిపోయాడు. పెళ్ళయిన ఏడాదికే అసలు రంగు బయట పెట్టాడు.

ఏంటా చూపు? ఏంటా నవ్వు? పడిపోతున్నట్టుగా ఏంటా నడక? నా కర్మకి నువ్వు దొరికావు. ఐ హేట్ యు!

ఏంటీ వంట? ఇది సాంబారా? కుడితా? చచ్చిన చేపల్ని ప్లేట్‌లో పెట్టినట్టు ఏంటీ బజ్జీలు? ఇష్టం ఉంటే వంట చెయ్యి! కష్టం అయితే మానేయ్! అంతేగాని, రుచీ పచీ లేని వంటలు చెయ్యకు! ఛీఛీ!

ఏంటా మాట తీరు? నోటికి ఎంతొస్తే అంతా వాగుతావా? వ్యంగ్యం వద్దు! పిచ్చి పిచ్చిగా మాట్లాడకు! పళ్ళు రాలిపోతాయి!

కొట్టడానికి వచ్చాడు రాజేష్. భర్తయితే మాత్రం కొట్టడానికి వస్తాడా? అంతే! సూట్‌కేస్ తీసుకుని బయటపడిందామె.

''నీకూ నాకూ ఇక పడదు. విడాకులకు రెడీగా ఉండు! గుడ్ బై!'' అంది. తల్లి దగ్గరకి చేరింది. అత్తారిల్లూ, పుట్టిల్లూ రెండూ ఒకే ఊరిలో ఏడ్చాయి.

''తెంచుకోవడం ఎంతసేపు? నిమిషం. పెంచుకోవడమే కష్టం. ఆలోచించు'' అన్నది తల్లి.

''ఆలోచించడాలు లేవు. రాజేష్ నాకొద్దు'' గట్టిగా చెప్పిందామె.

''అయితే ఈ సేవింగ్ పాస్‌బుక్‌లో ఉన్నదంతా ఖర్చు చేసేయ్! ముందు ముందు మీ ఇద్దరికీ సంబంధించి ఏ జ్ఞాపకాలూ ఉండకూడదు'' అన్నది తల్లి. బ్యాంకు సేవింగ్ పాస్‌బుక్ ఆమె చేతికి అందించింది. అందుకుని బ్యాంకుకి నడిచిందామె. ఎకౌంట్ క్లోజ్ చెయ్యాలి. క్యూలో నిల్చుందామె. పాస్‌బుక్‌ని తేరిపార చూసింది. ఫస్ట్ మేరేజ్ డే గుర్తొచ్చిందామెకు. అప్పుడు తల్లి ప్రెజెంట్ చేసిందా బుక్.

''నీ ఫస్ట్ మేరేజ్‌డేకి గుర్తుగా ఈ బుక్ నీకు ఇస్తున్నాను. ఇందులో ఈ శుభ సందర్భంగా వెయ్యి రూపాయలు డిపాజిట్ చేశాను. ఇక మీదట ప్రతి ఆనందానికీ, శుభానికీ గుర్తుగా ఎంతో కొంత డిపాజిట్ చేసుకుంటూ రండి! డిపాజిట్ ఎందుకు చేసిందీ పక్కన రాసుకోండి! ఎప్పుడైనా ఈ పుస్తకం తెరిస్తే అందమైన జ్ఞాపకాలు గుర్తుకు రావాలి. ఓకేనా?'' తల్లి మాటలు గుర్తొచ్చి బుక్ తెరిచిందామె.

| | |
|---|---|
| 13 ఫిబ్రవరి. రాజేష్ బర్త్‌డే. | రూ. 500 |
| 11 మార్చి. రాజేష్ జీతం పెరిగింది. | రూ. 1000 |
| 10 మే. వేసవి విడిది ఊటీకి ప్రయాణం. | రూ.1000 |
| 5 జూన్. ప్రెగ్నెంట్ తను. | రూ. 2000 |
| 9 ఆగస్టు. రాజేష్‌కి ప్రమోషన్. | రూ.3000 |

ఇంకా అందులో అలాంటివి చాలా రాసి ఉన్నాయి. అయితే అక్షరాలూ, అంకెలూ కనిపించడం లేదు. కన్నీటి పొర అడ్డు పడిందామెకు. రాజేష్ అంతే! ఏదీ దాచుకోడు. అన్నీ బయటపెట్టేస్తాడు. అతని మాట తీరే అంత! ఆఫీసులో పని ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానన్నాడు. ఆవేశపడ్డాడు. దానికే విడాకులు తీసుకోవాలా? నో అనుకుందామె. పరుగు పరుగున రాజేష్‌ని చేరుకుంది. చేతిలోని పాస్‌బుక్ రాజేష్‌కి అందించి, చేతుల్లో ముఖం దాచుకుంది. ఎంతసేపు ఏడిచిందో తెలియదు. ఏడుస్తూనే నిద్రపోయింది. మెలకువ వచ్చి చూసేసరికి ఎదురుగా రాజేష్ నిల్చుని నవ్వుతూ కనిపించాడు. పాస్‌బుక్ అందించాడామెకి. తెరచి చూసింది.

పదివేలు డిపాజిట్ చేశాడు ఆ రోజు. ఇలా రాశాడు.

ఇన్ని అందాలు, ఆనందాలు నాకు దూరమయితే నేను తట్టుకోలేను. తప్పు చేశాను. క్షమించు!!

రాజేష్‌ని గట్టిగా కౌగిలించుకుందామె.

# అమ్మో హారన్!!

నాన్నతో బడికి వెళ్ళడం బలే బావుండేది. చద్దన్నం తిని సిద్ధంగా ఉంటే తనతో పాటు సైకిల్ మీద తీసుకుని వెళ్ళేవారు. సైకిల్ ఎక్కడం అంటే ఏనుగు ఎక్కినట్టుగా ఉండేది. ముందు మడ్‌గార్ మీద ఎత్తి కూర్చోబెట్టేవారు. హేండిల్‌కి ఉన్న అద్దంలో ముఖం చూసుకుంటుంటే 'చాల్లే' అని కసిరే వారు. 'చిన్న వెధవని కసరకండి' అనేది అమ్మ. చొక్కా జేబులో ఇన్ని వేరుసెనగ కాయలు పోసేది. రెండో తరగతి వరకు మడగార్ మీద కూర్చునే బడికి వెళ్ళాడు. పక్షిలా కాలు సాచుకుని నాన్న సైకిల్ ఎక్కేవారు. సైకిల్ పరుగుదీస్తోంటే కింద నేలను చూడడం సరదాగా ఉండేది. సర్‌సర్‌న నేల వెనక్కి పోతోంటే చూడముచ్చటనిపించేది. అయిదవ తరగతికి వచ్చేసరికి ముందు కూర్చుంటే నాన్నకి ఇబ్బందిగా ఉండడంతో సైకిల్ వెనుక క్యారేజీ మీద కూర్చునే వాడు తను. అప్పుడు నాన్న కాలు మడిచి ముందు నుంచీ సైకిల్ ఎక్కేవారు. అలా ఎక్కడం కొంచెం కష్టంగా ఉండేది. తనకయితే నాన్న వెనుక కూర్చుని గోడల మీది సినిమా పోస్టర్లు చూడడం, స్నేహితులకు టాటా చెప్పడం చాలా సరదాగా ఉండేది. ఏడవ తరగతికి వచ్చే సరికి నాన్నతో సైకిల్ మీద వెళ్ళడం సిగ్గనిపించి మానుకున్నాడు. నాన్న కూడా డబుల్స్ తొక్కలేనన్నాడు.

పెద్దవాడయి పట్నం వచ్చేశాడు తను. ఉద్యోగి అయ్యాడు. పెళ్ళయింది. ఇల్లు కొన్నాడు. కారు కూడా కొన్నాడీ మధ్యనే! కొత్త కారులో నాన్నని కూర్చోబెట్టుకోవాలనుకున్నాడు. నాన్నని పక్కన కూర్చోబెట్టుకుని డ్రైవ్ చేయాలనిపించింది. చిన్నప్పుడు అమ్మ తన జేబులో వేరుసెనగ కాయలు పోసినట్టే తను నాన్న జేబులో జీడిపప్పు పోసి 'తింటూ కూర్చోండి' అని చెప్పాలనిపించింది.

ఫోన్ చేసి రమ్మని ఆహ్వానించాడు. పదే పదే తిరగలేనని, రిటైరయిన తర్వాత పెద్దగా ప్రయాణాలు ఇష్టం లేదని ఎంత చెప్పినా వినలేదు. తప్పదని పట్టుబట్టాడు తను. తప్పించుకోలేకపోయాడు నాన్న. ఆఖరికి పట్నం వచ్చాడు.

కారులో నాన్నని ఎక్కించుకున్నాడు. అనుకున్నట్టుగానే నాన్న జేబులో ఇంత జీడిపప్పు పోశాడు. 'ఏంట్రా ఇది? ఈ వయసులో తినదగ్గదేనా' అని నాన్న అడిగితే 'తినాలంతే' అన్నాడు గట్టిగా. సీట్‌బెల్ట్ పెట్టుకోమన్నాడు. కారుని స్పీడ్‌గా ముందుకి పోనిచ్చాడు. సన్నగా నవ్వుతున్నాడు నాన్న. అంటే కారు ప్రయాణం అతనికి ఆనందంగా ఉన్నట్టే! చౌరస్తాకి చేరుకున్నారు. రెడ్ సిగ్నల్ పడింది. కారాపాడు తను. నాన్న జేబులోంచి జీడిపలుకు తీసుకుని తింటుంటే చూసి సంతోషిస్తున్నాడు. అంతలో గ్రీన్ సిగ్నల్ పడింది. కారు స్టార్ట్ చేశాడు. స్టార్ట్ కావట్లేదది. కీని అటు తిప్పి ఇటు తిప్పినా ఫలితం లేదు. కారు కదలట్లేదు. వెనుక నుంచి ఒకటే హారన్లు. కేకలు. గుండెలదిరిపోతున్నాయి. చెమటలు పట్టిపోతున్నాయి. కంగారు కంగారుగా ఉందంతా.రెండు నిముషాలు నరకం అనుభవించాడు. నాన్నని పట్టించుకోలేదు తను. కాని నాన్న పరిస్థితి కూడా అలాగే ఉండి ఉంటుందన్నారు డాక్టర్‌గారు. దాని ఫలితమే నాన్న గుండెపోటు అన్నారు. రోజు గడిస్తేనే కాని ఏమీ చెప్పలేనన్నారు. రోజు గడవలేదు. తెల్లారలేదు. చీకటి చీకటి వేళే నాన్న పోయారు. చనిపోయారు. కారణం ఎవరు? తనా? లేకపోతే ఈ పట్నం ధ్వని కాలుష్యమా? పద్నాలుగు శాతం గుండె జబ్బులకు ధ్వని కాలుష్యమే కారణమంటున్నారు పరిశోధకులు. అరవై ఏళ్ళు దాటిన వారి మీద దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందంటున్నారు. అర్థం చేసుకోండి సార్! ప్లీజ్! హారన్ మోగించకండి! అయినవాళ్ళని దూరం చేయకండి! దణ్ణం పెడుతున్నాను!

# శివరాత్రి వేళ! పెళ్లి గోల!

శివరాత్రి. సెలవు. ఇంటి కొచ్చాడతను. పెళ్ళి చూపు లన్నారు పెద్దలు. ఎవరికి అంటే నీకే అన్నారు. పిల్లని వెళ్ళి చూసి వస్తామా? అంటే అదేం లేదు. పిల్లలే ఇక్కడికి వస్తారు. చూడు అన్నారు పెద్దలు. ఎందుకొస్తారంటే? శివరాత్రి రోజు ఇంట్లో అభిషేకాలు, జాగారాలు ఉంటాయి కదా! అందుకొస్తారు. మర్నాడు అంతా ఇక్కడే భోంచేస్తారు కదా! అందుకొస్తారు. ఆ మర్నాడు కూడా పిల్లలొస్తారు. చూస్తూ ఉండు అన్నారు. వాళ్ళలో నీకు నచ్చిందెవరో చెబితే పెళ్ళన్నారు. నాకు నచ్చడం కాదు, పిల్లకు నేను నచ్చాలి. అలా నన్ను నచ్చుకున్న పిల్లనే నేను పెళ్ళి చేసుకుంటాను అన్నాడతను. అలాగే కానీయ్ అన్నారు.

ఓం నమశ్శివాయ! ఓం నమశ్శివాయ!

హర హర మహదేవ! శంభో శంకర!

పెద్ద గొంతుతో వినవస్తోంటే మెలకువ వచ్చిందతనికి. చూస్తే అప్పుడే తెల్లారుతోంది. ఎప్పుడు మేల్కొన్నారో, ఎప్పుడొచ్చారో ఇంటి నిండా జనం నిండిపోయారు. అందరూ అప్పటికే తలస్నానాలు చేసి అభిషేకాలకి సిద్ధమయిపోయారు. బాబాయ్ వచ్చి చెప్పాడు.

త్వరగా లేచి స్నానం చేసి రా! నీ కోసం పిల్లలు రెడీ!

గబగబా స్నానం చేసి పూజగదిలోకి వచ్చాడతను. శివుడికి అభిషేకమవుతోంది. దాన్ని చూస్తూ కూర్చున్నారంతా. కళ్ళు మూసుకుని శివుణ్ణి ధ్యానించసాగాడతను. ఏయ్! జాగ్రత్త అంటూ ఎవరో అరవడం వినిపించింది. కళ్ళు తెరిచి చూశాడు. ఎవరో

అమ్మాయి. ఇరవై-ఇరవై రెండేళ్ళ వయసుంటుంది. పట్టులంగా, జాకెట్టు, ఓణీలో ఉంది. అతన్నే చూస్తోంది. సారీ అంది. కళ్ళు దించుకుంది. చిన్నపిల్లాడెవరో బాగున్నాడు. ఏడాది వయసుంటుందేమో! చూడచక్కగా ఉన్నాడు. వాణ్ణి తీసుకుని ముద్దాడాడతను. కాస్సేపటికి ఇందాక అరిచిన పిల్ల వచ్చి బాబును తీసుకుంది. బాగున్నాడు కదూ! ముద్దొస్తున్నాడు అని వాణ్ణి ముద్దుల్లో ముంచెత్తింది.

అభిషేకం ముగిసింది. అందరికీ తీర్థప్రసాదాలు పంచసాగారు. చొరవ తీసుకుని ఆ అమ్మాయే అందరికీ ప్రసాదాలు ఇవ్వసాగింది. అతనికి ప్రసాదం ఇస్తూ అతని కళ్ళల్లోకి చూస్తూ ప్రసాదాన్ని కిందకి జారవిడిచింది. అయ్యయ్యో అంది. సారీ అంది. వణికిపోయింది. పర్వాలేదనగానే నవ్వింది. భయం పోయిందేమో! ఆమె కళ్ళలో నవ్వు కనిపించిందతనికి. బాబాయ్ వచ్చాడు. గదిలోనికి తీసుకుని పోయాడతన్ని.

చెప్పు! ఏ పిల్లయినా నచ్చిందా? అడిగాడు.

చెప్పాను కదా బాబాయ్! నాకు నచ్చడం కాదు, నేను నచ్చాలి అన్నాడతను మళ్ళీ. బాబాయ్ ఈజీచైర్లో సాగారాడు. బాబాయ్‌కి దగ్గరగా అతను కూర్చున్నాడు. అతన్నే చూస్తోంది అమ్మాయి. ఆ అమ్మాయి అతనికి ఎదురుగా కొద్ది దూరంలో కూర్చుంది. తన పాదాలు అతని వైపే పెట్టుకుని మరీ కూర్చుంది. కూర్చుని, పొడుగాటి తన జడను ముందు వేసుకుని, దాన్ని విప్పుతూ అల్లుతూ ముంగురులు సవరించుకుంటూ స్నేహితులతో మాట్లాడుతోంది. కావాలనే గొంతు పెంచి మాట్లాడుతోందామె. అతనికి వినిపించాలని తపన పడుతోంది. అవన్నీ గ్రహించాడు బాబాయ్.

నిన్ను నచ్చుకున్న పిల్లని నీకు చూపించనా!

చూపించు బాబాయ్‌ని అడిగాడతను.

అదిగో ఆ పిల్ల అని చూపించాడు బాబాయ్. జాగ్రత్తంటూ అరిచిన పిల్ల. చిన్న పిల్లాణ్ణి ముద్దులతో ముంచెత్తిన పిల్ల. సారీ చెప్పిన పిల్ల. కళ్ళతో నవ్వగలిగే పిల్ల, జడను రకరకాలుగా అల్లే పిల్ల...అల్లరి పిల్ల తనని నచ్చుకుందంటే ఆనందించాడతను. ఎలా కనిపెట్టగలిగావు బాబాయ్ అనడిగితే ఏ ఆడపిల్లయితే ఇప్పుడీ అమ్మాయి చేసిన చేష్టలన్నీ పిల్లాణ్ణి చూసి చేస్తుందో ఆ పిల్లకు ఆ పిల్లాడు నచ్చినట్టని, ఆ పిల్లాణ్ణి ఆ పిల్ల ప్రేమిస్తున్నట్టని మనస్తత్వ శాస్త్ర నిపుణులంటున్నారన్నాడు బాబాయ్. హాయ్ హాయ్ అనుకున్నాడతను.

# ఎంత హాయి!

నాన్నమ్మ చనిపోయింది. దినం కూడా అయిపోయింది. తాతయ్యను తమతో పాటు తీసుకుని వెళ్ళేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మెల్ల మెల్లగా చెప్పి చూస్తున్నారు కొడుకులూ కోడళ్ళూ. పుట్టి పెరిగిన ఊరినీ, ఇంటినీ వదలి రారని తెలుసు. అయినా ప్రయత్న లోపం లేకుండా కష్టపడుతున్నారు.

''అసలు కంటే వడ్డీ ఇష్టం అని...పిల్లలం మేము చెబితే ఆయన వినరు. మనవలు మీరు చెబితే వింటారేమో! చెప్పి చూడండి'' అన్నారు పెద్దలు. ఆ మాట పట్టుకుని తాతయ్యను కలిశారు మనవలు. ఇద్దరు మనవలూ ఒద్దిగ్గా నిల్చున్నారు గదిలో. మంచం అంచున తాతయ్య కూర్చుని ఉన్నాడు. తదేకంగా అటుగా చూస్తున్నాడు.

ఏముంది అటు?

కింద ముఖమల్ తివాచీ పరిచి ఉంది. దాని మీద వీణ ఉంది. ఏకాండీ వీణ. నాన్నమ్మకి ఇష్టమయిన వీణ. దాని ముందు చిన్న టేప్ రికార్డర్ ఉంది. అందులోంచి వీణావాదన విన వస్తోంది. అది నాన్నమ్మ వాదనే అయి ఉంటుందనుకున్నారు మనవలిద్దరూ. బాగుంది. వింటుంటే వినబుద్ధి కలుగుతోంది.

కీర్తనేదో ముగిసింది. ముగిసిందని ఎలా తెలిసిందంటే తాతయ్య చప్పట్లతో పాటు రికార్డర్‌లో చప్పట్లు వినవచ్చాయి. రికార్డర్లో చప్పట్లు కూడా తాతయ్యవే! అనుమానం లేదనిపించింది.

''నాన్నమ్మ వీణావాదన బాగుంది. చాలా హాయిగా ఉంది'' అన్నారు మనవలిద్దరూ.

''హాయి అన్నారు కదా, ఆ హాయిని ఎలా చెప్తార్రా?'' అడిగాడు తాతయ్య. ఎలా చెప్పాలి?. ఎలా చెబితే తాతయ్యకి 'హాయి' అనిపిస్తుంది? బాగా ఆలోచించారు మనవలిద్దరూ. ఆలోచించా లోచించి, ఒకడిలా చెప్పాడు.

''చలిలో ట్యాంక్‌బండ్ మీద మా ఫ్రెండ్‌తో కూర్చున్నట్టుంది?''

''ఫ్రెండ్ పేరు?'' తెలివిగా అడిగాడు తాతయ్య. తెగించి చెప్పాడు మనవడు.

''ఐశ్వర్య.''

''నువ్వేం అంటావు?'' రెండోవాణ్ణి అడిగాడు.

''ఆలయం మెట్ల మీద కౌసల్యతో కబుర్లాడుకుంటున్నట్టుగా ఉంది.''

''కదా! ఇరవై ఇరవై రెండేళ్ళ వయసులో ఉండి, ప్రేమించుకుంటూ హాయి ఏమిటో ఎలాంటిదో తెలుసుకున్న మీరు, ఇంకా హాయి హాయిగా ఉండాలంటే రేపు పెళ్ళిళ్ళు చేసుకుంటారు. పిల్లల్ని కంటారు. ఆ తర్వాత మనవల్ని ఎత్తుకుంటారు. ఎత్తుకుని, హాయికి అంకురార్పణ చేసిన ట్యాంక్‌బండ్‌ని గాని, ఆలయం మెట్లుగాని మరచిపోతారా? మరచిపోరు. ఒకవేళ మరచిపోయారంటే అంతకంటే కృతఘ్నత ఇంకొకటి ఉండదు.'' అన్నాడు తాతయ్య.

''అంటే?'' అని మనవలిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

''మీ నాన్నమ్మని మొట్టమొదటిసారిగా ఈ ఊరిలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో చూశాను. ఇక్కడే సీతారామస్వామి ఆలయంలో తనని పెళ్ళి చేసుకున్నాను. ఇద్దరం ఇక్కడే అంజలి థియేటర్‌లో సినిమాలు చూస్తూ గడిపాం. కూరగాయలక్కూడా ఇద్దరం కలిసే వెళ్ళేవాళ్ళం. తను వీణయితే నేను తీగనయ్యాను. తను పాటయితే నేను పదం అయ్యాను. యాభై ఏళ్ళుగా కలసి బతికాం. ఇప్పుడు భగవంతుడు విడదీసేశాడు. ముందుగా తనని తీసుకుని పోయాడు. అయినంత మాత్రాన విడిపోతామా? ఈ ఇంటిలో అణువణువునా మీ నాన్నమ్మ ఉంది. నా గుండెల్లో కూడా నిండుగా ఉంది. జ్ఞాపకాలు గొప్పవి. ఏనుగంత బలాన్నిస్తాయి. ఆ జ్ఞాపకాలతో బతికేస్తాను. నన్నిక్కడే ఉండిపోనీయండి. హాయిగా ఉంటాను. మీరంతా వెళ్ళి రండి'' అన్నాడు తాతయ్య.

మంచం మీద నుంచి లేచి, వీణ దగ్గరగా నడిచి వచ్చాడు. కూర్చున్నాడక్కడ. వీణ మెట్ల మీద తలాన్చాడు. నాద రంధ్రం దగ్గర పెదవులూని 'సరస్వతీ' అని పిలిచాడు. అది నాన్నమ్మ పేరు. ఆమె పలుకుతున్నట్టుగా గది అంతా ఆ మాట ప్రతిధ్వనించింది.

తాతయ్యను తరలించడం తప్పు అనుకున్నారు మనవలు. ఆ సంగతి పెద్దలకు చెప్పేందుకు ముందుకు కదిలారు.

ⵘ

# జలకాలాటలలో...

చాలా రోజులకి పుట్టి పెరిగిన వూరికి వస్తున్నాడతను. పాతికేళ్ళు పైనే అయింది ఆ వూరొదిలేసి. చదువుకుని స్థిరపడ్డాక అడుగు తీసి అడుగు వేయాలంటే కారు. అడక్కుండానే అన్నీ అమరిపోయే హోదా. ఇంటా బయటా ఏసి. బాగా డబ్బు చేశాడు. బరువెక్కాడు. లావయ్యాడు. నలభైయ్యేళ్ళ వాడయినా అరవైయ్యేళ్ళ వాడిలా కనిపిస్తున్నాడు. పాపం! మధుమేహం, రక్తపోటు, కీళ్ళనొప్పులు, నడుం నొప్పి... లేని జబ్బంటూ లేదు. ఎప్పుడు ఏమవుతాడో తెలియని పరిస్థితి. ఆ పరిస్థితిలో చిన్ననాటి స్నేహితుల్ని కలిసి వస్తానని బయల్దేరాడతను. తోడుగా వస్తామని భార్యాబిడ్డలన్నా వద్దంటూ ఒంటరిగా బయల్దేరాడు. కార్లో ఒక్కడే వస్తున్నాడు. బిందెలూ, కుండలూ పట్టుకుని దారికడ్డంగా ఆడవారొస్తే కారు స్లో చేసి, పక్కకి చూశాడు. చెరువు కనిపించింది. కలకలంగా ఉందక్కడ. అంటే పల్లెకు చేరుకున్నాననుకున్నాడు. ఆ పల్లెలో నీటి కోసం అంతా చెరువు మీదే ఆధారపడతారు. నీటి కోసం తెల్లవారిన్దగ్గర్నుంచే హైరానా పడతారు. చిన్నప్పట్నుంచి చూస్తున్న దృశ్యమే! పల్లెకు అయిదారు కిలోమీటర్ల దూరంలోనే వూరు ఉండేది. ఇంకాసేపట్లో అక్కడికి చేరుకోబోతున్నాననుకున్నాడు.

చాలా ఆనందంగా ఉంది అతనికి. ఉత్సాహంగా ఉంది. చిన్ననాటి చేష్టలూ, స్నేహితులూ గుర్తుకొచ్చారు. స్నేహితులు వూళ్ళోనే ఉన్నారా? లేదంటే తనలాగే వూరి విడిచి వెళ్ళిపోయారా? ఆలోచనలో పడ్డాడతను. అంతలోనే వాళ్ళతో కలసి తిరిగిన ప్రదేశాలూ, తిన్న తినుబండారాలూ గుర్తు చేసుకుని సంతోషించాడు. 'కొత్త చెరువు' అనేవారు దానిని. పుట్టినప్పటి నుంచి చూస్తోన్న చెరువయినా, పాతదయినా దానికి ఆ పేరు

ఎందుకొచ్చిందో అర్థం కాదుగాని, ఆ చెరువంటే తనతో పాటు తన చిన్ననాటి స్నేహితులందరికీ ఎంతో ఇష్టం. తెల్లారిన్దగ్గర్నుంచి సాయంత్రం దాకా అంతా అక్కడే గడిపేవారు. అందులో దిగుడుబావులు ఉన్నాయన్నా, పాములున్నాయన్నా పట్టించుకునేవారు కాదు. గట్టు మీది మర్రిచెట్టు ఊడలు పట్టుకుని ఊగుతూ చెరువులోకి దూకడం, ఈదుతూ చెరువు మధ్యలో ఉన్న స్తంభాన్ని ముట్టుకుని ముద్దుపెట్టుకుని తిరిగి రావడం అంటే ఉత్సాహంగా ఉండేది. పోటీలు పడేవారంతా. అంతసేపు నీటిలో ఉన్నా జలుబు చేసేది కాదు, జ్వరం వచ్చేది కాదు. హాయిగా ఆనందంగా ఉండేదంతా. ఇప్పుడో?!

కారాపాడతను. ఎందుకంటే చిన్ననాటి చెరువు కనిపించిందతనికి. తెల్లగా తెల్లారిపోయిందప్పటికే! అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. పేరుపెట్టి చిన్ననాటి స్నేహితుల్ని పిలిచాడు. వచ్చారంతా. ఎవరూ వూరు విడిచి పోలేదు. పుట్టిన చోటే ఉన్నారు. చెరువుగట్టునే ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్నారు. నలభైయ్యేళ్ళ వారయినా ముప్పయి ఏళ్ళ వారిలా ఉన్నారు. పరిగెత్తుకుని వచ్చారు. కీళ్ళనొప్పులూ, నడుంనొప్పీ లేదు వాళ్ళకి.

''ఇలా ఎలా ఉన్నార్రా?'' అడిగాడతను.

''ఈతకొడుతూ'' అన్నారు మిత్రులు.

''నువ్వేంటి ఇలా'' అన్నారు ఆశ్చర్యపోతూ. తనకి ఉన్న జబ్బుల చిట్టా అంతా విప్పి చెప్పాడతను.

''పోతాయి రా'' అన్నారు మిత్రులు. అతన్ని ఈతకు తీసుకుని వెళ్ళారు. ఈత కొడితే శరీరం చల్లగా ఉంటుంది. మనసు మహదానందంగా ఉంటుంది. అలసట కూడా ఎగిరిపోతుంది. బరువు తగ్గుతారు. హృదయ కవాటాలు ధృడమయి, హృద్రోగాలు దూరమవుతాయి. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. మధుమేహం ఊసే ఉండదు. కాలేయ సమస్యలు తలెత్తవు. కీళ్ళనొప్పులుండవు. నడుం నొప్పి కూడా ఉండదన్నారు. ఆరోగ్యం కోసం, ఆనందం కోసం అతన్ని అక్కడే ఉండిపొమ్మన్నారు. చెరువు–చిన్ననాటి స్నేహం తీయనన్నారు.

⌘

# అందెను నేడే! అందని జాబిల్లి!

ఆదివారం సాయంత్రం అయిదు గంటలకల్లా ఉండాలి. సరదాగా వచ్చేయ్ అన్నాడు బాబాయ్. దాంతో వచ్చేశా డబ్బాయ్. చూస్తే ఇంట్లో బాబాయ్ లేడు. ఎక్కడికి వెళ్ళాడంటే 'కళాక్షేత్రంలో ఉంటాడు, చూడండి' అన్నారు. అక్కడికి వెళ్ళాడు అబ్బాయ్. స్టేజి మీద నానా హైరానా పడుతూ బాబాయ్ కనిపించాడు.

'ఏంటి హడావుడి?' అడిగాడబ్బాయ్.

'సాంస్కృతిక కార్యక్రమాలు జరగబోతున్నాయి! చూద్దు గాని' అన్నాడు బాబాయ్. స్టేజి మీది కార్య క్రమాలు చూసి చాలా రోజులయింది. వెరైటీ! బాగానే ఉంటుంది అనుకున్నా డబ్బాయ్.

'ప్రోగ్రామ్సేంటి?' అడిగాడు.

'పాటలు పాడతారు. ఆటలాడతారు. నృత్యాలూ నాటకాలూ అన్నీ ఉంటాయి' అన్నాడు బాబాయ్.

'అంతా పెద్ద పెద్ద వాళ్ళేనా పాల్గొనేది?'' అడిగాడబ్బాయ్.

'చాలా పెద్దవాళ్ళు! అయినా తినబోతూ రుచి ఎందుకు చెప్పు' అని నవ్వాడు బాబాయ్. నాటకం కోసం సెట్ వేస్తున్నారు. సహకరిస్తున్నాడు బాబాయ్. అక్కడుంటే తనకీ పని చెబుతాడని దాన్ని తప్పించుకునేందుకు అబ్బాయ్ స్టేజి వెనక్కి తప్పు కున్నాడు. గ్రీన్‌రూం దగ్గరిగా నడిచాడు. ఎవరో ముసలాయన చుట్ట తాగుతూ దగ్గుతూ కనిపించాడక్కడ. జాలరి వేషంలో ఉన్నాడు.

'నాటకం వేస్తున్నారా?' అడిగాడబ్బాయ్.

'నాటకం కాదు, నృత్యం. జాలరి నృత్యం చేద్దామనుకుంటున్నాను' అన్నాడా ముసలి. ఆశ్చర్యపోయి చూశాడు అబ్బాయ్. ముసలి వ్యక్తికి సుమారుగా డెబ్బయి ఏళ్ళ వయసుంటుంది. ఆ వయసులో జాలరి నృత్యం! చేయదగ్గదేనా?

'ఇప్పుడీ నృత్యం మీకు అవసరమా?' అడిగాడబ్బాయ్.

'చాలా అవసరం' అన్నాడా వ్యక్తి. దగ్గుతూ వణికిపోయాడు.

సడి సేయకే గాలి!

సడి సేయబోకే!

బడలి ఒడిలో

రాజు పవ్వళించేనే!

–పాత పాట వినవచ్చింది. బాగా వణికిపోతోంది గొంతు. ప్రాక్టీసు చేస్తున్న బామ్మను చూశాడబ్బాయ్. అరవై పైనే ఉంటుంది వయసు. తలంతా నెరిసి పోయింది. నుదుటన బొట్టు లేదు.

'పాట ఇక్కడ వినకూడదబ్బాయ్. వెళ్ళి హాల్లో కూర్చో! స్టేజి మీద పాడతానుగా. అప్పుడు విందూగాని' అని బోసినోటితో నవ్వింది. అదోలా అనిపించి అక్కణ్ణుంచి కదిలాడబ్బాయ్.

సాయంత్రం ఆరయింది. ప్రేక్షకులు ఒకొక్కరుగా రాసాగారు. వచ్చిన వారు, వస్తున్న వారంతా అరవై పైబడ్డవారే! హాలంతా అరగంటలో నిండిపోయింది. కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చెప్పినట్టుగానే స్టేజి మీదికొచ్చి 'సడి సేయకే గాలి' పాట పాడింది బామ్మ. ఒకటే చప్పట్లు కొట్టారంతా. సిగ్గుల మొగ్గయింది బామ్మ. వణికిపోతూ వయ్యారంగా తెర వెనక్కి వెళ్ళిపోయింది. తర్వాత తాతయ్య గారి జాలరి నృత్యం ప్రారంభయింది. ఆ వయసులో కూడా రెండు మూడు స్టెప్పులు బాగానే వేశాడు తాతయ్య. మరేదో స్టెప్ వేయబోతూ బోర్లాపడ్డాడు. ప్రేక్షకులంతా ఒకటే నవ్వులు! చప్పట్లు. నాటకం ప్రారంభమయింది తర్వాత. నాటకంలో యుక్తవయసులో ఉన్న పాత్రలను కూడా ముసలి వారే ధరించారు. ఆ వయసుకి తగ్గట్టుగా జీన్‌ఫ్యాంటు, షర్టు వేసుకుని మరీ నటించారు. మాట మాటకీ చప్పట్లే! గోల గోలగా తయారయింది హాలంతా. రాత్రి తొమ్మిది గంటలకి కార్యక్రమాలు ముగిశాయి. అందరూ బాబాయ్‌కి నమస్కరించి, కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయారు.

'ఏంటీ ముసలి కంపు?' అడిగాడబ్బాయ్.

'తీరని కోరికలు తీర్చుకోడం. చిన్నతనంలో ఆడాలని, పాడాలని, నటించాలని ఎన్నెన్నో కోరికలుంటాయి. కొందరికి అవి తీరవు. బాధపడుతూ ఉంటారు. అవి తీర్చి ఆనందింప చేయాలన్నదే నా ఆలోచన. అందుకే ఈ కార్యక్రమం. మిగిలిన జీవితాన్ని హాయిగా గడిపేందుకు ఓల్డేజ్ పీపుల్‌కిదో టానిక్'' అన్నాడు బాబాయ్. అతని ఆంతర్యం అర్థమయి అబ్బాయి కళ్ళు చెమ్మగిల్లాయి. 'బాబాయ్' అంటూ చేతులు జోడించాడు.

# ఉగాది ప్రయాణం

శని ఆదివారాలు సెలవు దినాలు. సోమవారం ఉగాది. ఆ రోజు కూడా సెలవే! వరుసగా మూడ్రోజులు సెలవులు. కాబట్టి ఎంచక్కా మనం ఊరికి చెక్కేయొచ్చు! నువ్వు నీ కారులో రా! నువ్వంటే నువ్వొక్కడివే కాదు, నీ భార్యా, నీ పిల్లలూ కలసి అని అర్థం. నేను నా కారులో వస్తాను. రెండు కుటుంబాలూ శుక్రవారం రాత్రి పదిగంటలకు బయల్దేరితే శనివారం తెల్లారు తూనే ఊరికి చేరుకోవచ్చు. శని ఆదివారాలు అమ్మా నాన్నా, బాబాయ్, బంధువులతో గడపడమే! ముచ్చట్లన్నీ వాళ్ళతోనే! సోమవారం పొద్దున పొద్దునే సరదాగా సైకిల్ మీద అలా ఊరి చివరి దాకా వెళ్ళామనుకో! చక్కని సూర్యోదయాన్ని చూడొచ్చు. వేపపుల్లతో దంతధావనం చేయొచ్చు. ఇంత వేపపువ్వు కోసుకుని రావచ్చు. వస్తూ వస్తూ మడిలో ఓ చెరుకుగడను కొట్టుకొచ్చామా... పచ్చడిలోకి సరిపోతుందది. ఉగాది పచ్చడిలో అరటిపండు, ద్రాక్ష కూడా వేస్తుందమ్మ. అందుకని అవి కూడా అలా బజారుకెళ్ళి కొనుక్కొచ్చుకుంటే సరి! పిల్లలు కూడా మనతో పాటుగా వస్తా మని అల్లరి చేస్తారు. వద్దనొద్దు! తీసుకుని వెళ్దాం. అందుకేం చేద్దా మంటే నాన్నగారి సైకిల్ నేను తీసుకుంటాను. బాబాయ్ సైకిల్ నువ్వడిగి తీసుకో! స్నానాలు ఇంటిలోనే చెయ్యాలంటుందమ్మ. 'పండగ పూటా నా చేత్తో మీ నెత్తినింత కుంకుడు పుల్ల పోస్తానా' అంటుంది. వద్దంటే ఏడుస్తుంది. అందుకని 'పోసేదేదో స్నానాల రేవుకొచ్చి పొయ్యి' అందాం. వేపపవ్వు, చెరకు, అరటి, ద్రాక్ష.. ఇవన్నీ మనం తీసుకొచ్చేటప్పటికి అమ్మ కోడళ్ళతో పాటుగా రేవు దగ్గర ఉంటుంది. అక్కడే అందరికీ తలంటుతుంది. గోదావరిలో ఈత కొట్టి చాలా రోజులయింది. ఈత కొడదాం. పిల్లలకీ ఈత నేర్పుదాం.

మన కుటుంబాలు రెండూ వేణుగోపాలస్వామిని దర్శించుకుని ఇంటికి వచ్చే సరికి అమ్మ ఉగాది పచ్చడి చేసి ఉంచుతుంది. కళ్ళకద్దుకుని పచ్చడిని ముందు తిందాం. తర్వాత పులిహోర, బొబ్బట్లు ఉండనే ఉన్నాయి. లాగించేద్దాం. మామిడికాయ పులిహోరలో ఉగాదిపచ్చడి నంజుకు తింటే ఉంటుం దిరా! ఆ రుచే వేరు! మధ్యాహ్నం పప్పు అన్నంలో కూడా ఉగాదిపచ్చడే నంజుకోవాలి. పప్పుముద్దని పచ్చడిలో అద్దుకుని నోటిలో పెట్టుకుంటే ఉంటుందీ...అమృతం...గడ్డ కట్టిన అమృతాన్ని గొంతులో పెట్టుకున్నట్టుగా ఉంటుంది. అలా రెండు ముద్దలు నోట్లో పడగానే నిద్రొస్తుంది. పడుకుందాం. ఇంటి ముందు తురాయి చెట్ల నీడలో పడుకుందాం. చల్లగా హాయిగా ఉంటుందక్కడ. ఏ సాయంత్రవోఁ లేద్దాం. అప్పుడు అమ్మ చంద్రకాంతాలు చేసి పెడుతుంది. తియ్యగా బాగుంటాయవి. పెసరపప్పు, నేతితో చేసిన చంద్రకాంతాల్ని ఆరేడు ముక్కల్దాకా అణచేయొచ్చు! రాత్రి తిరుగు ప్రయాణమవుతున్నామని తెలిసి, చిన్ననాటి మిత్రులంతా వస్తారు. పదిగంటల వరకు కబుర్లాడుకుందాం. ఆసరికి పిల్లలు, పెద్దల భోజనాలయిపోతాయి. మనం కూడా అమ్మ చేతి ముద్దలు రెండు తిని కార్లెక్కావాఁ...అంతే సంగతులు!

తెల్లారేసరికి మన పొల్యూషన్‌లో...సిటీలో మనం ఉంటాం. మామూలే! అయితే ఊరికి ఇలా వెళ్ళి రావడం వల్ల ఉత్సాహంగా ఉంటుంది. నిత్య జీవితంలో ఆరోగ్యకరమయిన మార్పులు చోటు చేసుకుంటాయి. యాంత్రిక జీవితం నుంచి కొంచెం ఆటవిడుపుగా ఉంటుంది. సైకిల్ తొక్కడం, ఈత కొట్టడం, పిల్లలతో ఆడుకోవడం లాంటివి చేస్తాం కదా! దాంతో మానసికంగా ఊరట చెందుతాం. ఎన్నాళ్ళగానో వేధిస్తోన్న ఒత్తిడి మాయమవుతుంది. భార్యాబిడ్డలతో కబుర్లాడుతూ ప్రయాణం చేస్తే ఆనందమే కాదు, మెదడు మీద అది సానుకూలంగా పని చేస్తుంది. ఫలితంగా చురుగ్గా తయారవుతాం. ఉద్యోగాల్లో విజయాలు సాధిస్తాం. అందుకే చెబుతున్నాను. ఉగాది ప్రయాణానికి రెడీ అయిపో!!

# మనసు విరిగి తునకలయితే....

అందరిలాగే పద్దెనిమిదేళ్ళ జ్యోతి ప్రేమలో పడింది. కుర్రాడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. జ్యోతి ప్రేమలో పడిందన్న సంగతి ఇరుగు-పొరుగువారికి తెలిసింది కాని, ఆమెను కన్న తల్లి దండ్రులకు తెలిసి రాలేదు. వాళ్ళకు తెలిసే నాటికి కుర్రాడు అమెరికాలో ఉన్నాడు. కుర్రాడు అమెరికా ఎందుకు వెళ్ళాడు? ఎలా వెళ్ళగలిగాడంటే...అక్కడేదో మాంఛి కంపెనీలో ఉద్యోగం రెడీగా ఉందంటే...తనకున్న రెండు బంగారు గాజుల్నీ, మెళ్ళో గొలుసునీ, మూడు ఉంగరాలనీ అమ్మి జ్యోతే అతన్ని అక్కడికి పంపించింది. కుర్రాడు వెళ్ళి ఆరు మాసాలయింది. వెళ్ళిన మొదటి నెలలో ప్రతిరోజూ ఫోన్ చేసేవాట్ట! రెండో నెలకి వారం వారం ఫోన్ చేసి మాట్లాడేవాట్ట! మూడో నెలలో ఓ సారి మాత్రమే ఫోన్ చేసి తర్వాత మరి చేయడం మానుకున్నాట్ట! జ్యోతి ఫోన్ చేస్తే పలకడం లేదు. అయిదో నెల నుంచి అయిపూ అజా లేకుండాపోయాడు. ఆరో నెలకి అక్కడెవరో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడని తెలిసింది. దాంతో మనసు గాయపడి జ్యోతి ఆత్మహత్యకు ప్రయత్నించింది. చనిపోయేదే! కాకపోతే అదృష్టం బాగుండి బతికింది. బతికింది కాని, బతుకు తున్నట్టుగా జ్యోతి లేదు. ఏదీ పట్టించుకోదు. ఎవరితోనూ మాట్లాడదు. ఏడుస్తూ...ఏటో చూస్తూ...పిచ్చిదయిపోతోంది.

జ్యోతి గురించి అంతా చెప్పి భోరుమన్నారు తల్లిదండ్రులు. ఏం చెయ్యాలో పాలుపోవట్లేదన్నారు బాబాయ్‌తో. తలలు పట్టుకుని కూర్చున్నారు. ఆలోచించాడు బాబాయ్. ఆలోచించా లోచించి ఆఖరికి ఇలా అన్నాడు.

''జ్యోతీ, మీరిద్దరూ, నేనూ మొత్తం నలుగురం మా పల్లెకు పోదాం, పదండి'' అన్నాడు బాబాయ్. ఎందుకు అని ప్రశ్నించలేదు. బాబాయ్ చెప్పినట్టుగానే అంతా ప్రయాణమయ్యారు. పల్లెలో పొద్దున పొద్దునే జ్యోతిని లేపాడు బాబాయ్.

''యోగా నేర్పుతాను, రా'' అన్నాడు. ఇష్టం లేదు జ్యోతికి. అయినా పట్టుబట్టి పిలవడంతో బాబాయ్‌ను అనుసరించిందామె. గంట సేపు రకరకాల యోగాసనాలు వేసి చూపించాడు బాబాయ్. జ్యోతిని కూడా వెయ్యమన్నాడు. తన వల్ల కాదంటే, ఎందుక్కాదంటూ ఆసనాలు ఎలా వెయ్యాలో చెప్పాడు. రెండు మూడు ఆసనాలకే అలసిపోయింది జ్యోతి. తర్వాత కళ్ళు మూసుకుని ధ్యానంలో కూర్చున్నాడు బాబాయ్. జ్యోతిని కూడా ధ్యానం చెయ్యమన్నాడు. శ్వాస మీద ధ్యాస ఉంచితే చాలన్నాడు. రెండు గంటలపాటు ధ్యానంలో కూర్చున్నాడు బాబాయ్. జ్యోతి పది నిముషాలు కూడా కూర్చోలేకపోయింది. అయితే ఆ రోజు జ్యోతి బాగా నిద్రపోయింది. మర్నాడు మళ్ళీ పాత పాటే ప్రారంభించాడు బాబాయ్. జ్యోతి చేత ఆసనాలు వేయించాడు. ధ్యానం చేయించాడు. అలా నెల రోజులు శిక్షణతో జ్యోతి గంట సేపు ఆసనాలు వేయడం, మూడు నాలుగు గంటలపాటు ధ్యానంలో కూర్చోవడం అలవాటు చేసుకుంది. దాంతో ఇప్పుడు తల్లిదండ్రుల్ని పట్టించుకుంటోంది. వారితో మాట్లాడుతోంది. ఏడవడాలు, పిచ్చి చూపులు చూడడాలూ పోయాయి. మునుపటిలా పన్ను మీది పన్ను కనిపించేలా సన్నగా నవ్వుతోంది కూడా. ఊపిరి పీల్చుకున్నారు తల్లిదండ్రులు. బాబాయ్‌ని కలిశారు.

''మీరు దేవుడు'' అన్నారు.

''మనసు గాయపడితే దానికి మందు ధ్యానం, యోగా అని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్స్ వారు తేల్చారు. వారు దేవుళ్ళు. గాయపడిన మనసు కలత చెందడం మామూలే! దాన్నుంచి బయట పడాలంటే వారంలో కనీసం మూడు రోజుల పాటు గంట సేపు యోగా చెయ్యాలి. వీలయినంత ఎక్కువ సేపు ధ్యానం చెయ్యాలి. చేస్తే ఒత్తిడి తగ్గి, ముఖం విప్పారుతుంది. ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది. ఫలితంగా బాగుపడతారు. బతుకుతారు'' అన్నాడు బాబాయ్.

''నిజం బాబాయ్'' అంది జ్యోతి. అప్పుడే అక్కడికి వచ్చింది. పన్ను మీది పన్ను కనిపించేలా నవ్వింది.

# తాతాజీ ఆటలు

సాయంత్రం అయిదయితే చాలు, తాతాజీ పార్కులోకి ప్రవేశిస్తాడు. ఫుట్‌బాల్, వాలీబాల్, రింగ్, క్రికెట్ బ్యాట్, స్టంప్స్ ఇలా చాలా ఆట వస్తువులు పట్టుకుని ప్రవేశిస్తాడు. అతను ప్రవేశిస్తోంటే పిల్లలకు ఆనందమే ఆనందం. మాకు ఇది కావాలి! మాకు అది కావాలంటూ దొరికిన వస్తువులు దొరకబుచ్చుకుని పిల్లలు ఆటల్లో పడతారు. అన్ని ఆటలకీ, అందరికీ 'ఎంపైరింగ్' తాతాజీనే! కనుచీకటి పడేంత వరకూ పిల్లల ఆటలకు అంతు ఉండదు. చీకటి పడిందంటే ఆటలయి పోయినట్టే! అప్పుడిక పార్కు వదలి పిల్లలు వెళ్ళిపోవాలి. వెళ్ళి చదువుకోవాలి. కాదు, ఇంకా ఆడతామంటే తాతాజీకి కోపం వస్తుంది.

తాతాజీకి అరవై రెండేళ్ళుంటాయి. పొట్టిగా లావుగా ఉంటాడు. బట్టతల. షరాయీ, లాల్చీ వేసుకుంటాడు. గత నలభై ఏళ్ళుగా అదే వస్త్రధారణ. మార్పు లేదు. ప్రభుత్వోద్యోగి. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశాడు. ఎందుకు చేశాడంటే కాలనీ పిల్లల కోసమే చేశాడని చెబుతారంతా.

ఇప్పుడు పిల్లలు ఆడుకుంటున్న పార్కు లేదూ, అక్కడ ఒకప్పుడు గుడిసెలు ఉండేవి. కబ్జా చేశారు. దాంతో కాలనీ పిల్లలంతా రోడ్డు మీద ఆడుకునే వారు. ఒక రోజు క్రికెట్ ఆడుకుంటున్నారు పిల్లలు. ఇంతలో ఓ నీళ్ళ లారీ వచ్చింది. అదుపు తప్పింది. పిల్లల మీదికి దూకేసింది. ఆరుగురు పిల్లలు చని పోయారప్పుడు. పిల్లల్ని ఆసుపత్రికి తీసుకుని వెళ్ళడం, చికిత్స చేయించడం, చనిపోయిన పిల్లల్ని ఖననం చేయడం వీటన్నిటితో క్షణం తీరిక లేకుండా గడిపాడు తాతాజీ. తర్వాతఅక్కడి గుడిసెల్ని ఖాళీ చేయించే వరకు నిద్రపోలేదు. పోలీసుల్ని కలిశాడు, ప్రభుత్వాధికారుల్ని కలిశాడు. గొడవలు పడ్డాడు. గాయాలపాలయ్యాడు.

''ఈ గొడవలు నేను పడలేను. మీరు ఇవేవీ పట్టించుకోకుండా సవ్యంగా ఉంటానంటే మీతో ఉంటాను. లేదంటే, అమ్మాయి దగ్గరికి అమెరికా వెళ్ళిపోతాను'' అన్నది భార్య. సవ్యంగా ఉంటానని మాట ఈయమంది ఆమె. మాట ఇవ్వలేదు తాతాజీ. దాంతో మాట తప్పలేదామె. అమెరికా వెళ్ళిపోయింది. ఒక్కడయిపోయాడు తాతాజీ. ఒక్కడయిపోయినా పట్టిన పట్టు వదల్లేదు. ఆఖరికి సాధించాడు. గుడిసెల్ని ఖాళీ చేయించాడు. తర్వాత కాలనీ వాసులతో కలసి, పార్కును తీర్చిదిద్దాడు. పార్కు పనుల్లో పడి, తరచూ ఆఫీసుకి గైర్హాజరు కాసాగాడతను. తను చేస్తున్నది తప్పు అనిపించింది ఓసారి. అంతే! ఆ రోజే స్వచ్ఛంద పదవి విరమణ చేశాడు తాతాజీ.

''ఏంటయ్యా నువ్వు చేసిన పని? ఈ పార్కు కోసం, ఈ పిల్లల కోసం కట్టుకున్న భార్యనే కాకుండా, నిక్షేపంలాంటి ఉద్యోగాన్ని కూడా వదులుకున్నావా? అయ్యయ్యో! ఏవనాలి నిన్ను?'' అన్నారెవరో.

''ఏవంటారు?'' నవ్వుతూ అడిగాడు తాతాజీ.

సమాధానం చెప్పలేక తల పట్టుకున్నాడు సదరు వ్యక్తి.

''మనం అడగక పోయినా పదీ పరకా లంచంగా వచ్చే ఆ సీట్లో కూర్చుని నేను ఉద్యోగం చేయకపోతే వచ్చే నష్టం ఏమీ లేదు. ఇక్కడ ఈ పార్కు లేకపోతే చాలా నష్టం. ఎదిగే పిల్లలకి ఆటలు కావాలి. అవకాశాలు కావాలి. అవి నేను కావడం నాకు ఆనందంగా ఉంది'' అన్నాడు తాతాజీ.

''ఇక నా భార్య సంగతి! ఆమె అమెరికా వెళ్ళిపోవడం కూడా ఒక ఆటే! ఆ ఆటకి అవకాశాన్ని కూడా నేనే కలుగజేశాను. విడిపోయి కలుసుకోవడంలో ఆనందం ఉందయ్యా!. ఆ ఆనందం కోసం త్వరలోనే ఇండియాకొస్తుందామె'' అన్నాడు మళ్ళీ. అతను అన్నట్టుగానే ఆమె అమెరికా నుండి ఇండియాకి వచ్చింది. తాతాజీ కోసం ఇంటి తలుపు తట్టింది. తెరచుకుంది తలుపు. భయం భయంగా ఇంట్లోకి అడుగు పెట్టిందామె. తలుపు చాటున ఉన్న తాతాజీ పెద్దగా కేక పెట్టి దెయ్యంలా మీద పడ్డాడు. జడుసుకుందామె. తర్వాత నవ్వుతూ ఇలా అంది.

''చాల్లెండి, మీరూ మీ ఆటలూ.''

# విమర్శని తట్టుకో! విజయం నీదే!

వనజ ఆఫీసుకు వెళ్ళడం మానుకుంది. స్నేహితుల్ని కలవడం మానుకుంది. ముభావంగా ఉంటోంది. ఒంటరి తనాన్ని కోరుకుంటోంది. ఎందుకిలా ప్రవర్తిస్తోంది? ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఆమెనే అడిగారు కారణం. చెప్పలేదు సరికదా ఏడుస్తూ గదిలోనికి పరుగుదీసింది. దుఃఖం ముంచు కొస్తోందామెకు. తనేపని చేసినా బాస్‌కి నచ్చదు. 'నీ పనేం బాగా లేదు' అంటాడు. స్నేహితులు కూడా అంతే! ఏ మాటన్నా వేలెత్తి చూపిస్తారు. విమర్శిస్తారు. వేళాకోళం చేస్తారు. అందుకే ఆఫీసంటే అసహ్యం వేస్తోంది. స్నేహితులంటే చిరాకు పుడుతోంది.

ఏడుపొస్తోంది వనజకి. ఎంతగా ఆపుకుందామన్నా ఏడు పాగట్లేదు. చేతుల్లో ముఖాన్ని దాచుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది. ఎంతసేపలా ఏడిచిందో తెలీదుగాని, ముఖాన్ని ఎత్తి చూసేసరికి ఎదురుగా బాబాయ్ కనిపించాడామెకు.

''ఏంటమ్మా ఇదంతా?'' బాబాయ్ జాలిగా అడిగాడు. బాబాయ్‌కి చెప్పుకుంటే బాధ తగ్గుతుందనుకుని జరిగిందీ జరుగుతోందంతా చెప్పుకొచ్చింది వనజ.

''దీనికా నువ్వు ఇదయిపోతున్నావు'' అన్నాడు బాబాయ్.

''విమర్శలెప్పుడూ బాధనే కలిగిస్తాయి. అయితే పిడుగుకీ బియ్యానికీ ఒకటే మంత్రంలా సద్విమర్శకీ, కువిమర్శకీ రెంటికీ బాధపడకూడదు. అయినా విమర్శకి బాధపడితే ఎలామ్మా? దాన్ని ధైర్యంగా ఎదిరించాలి.ఎదిరిస్తే మనదే విజయం! ఎలా ఎదిరించాలంటే దానికి కొన్ని చిట్కాలున్నాయి. చెబుతాను. జాగ్రత్తగా విను.''

'చెప్పండి' అన్నట్టుగా కన్నీళ్ళు తుడుచుకుని ఉత్సాహంగా చూసింది వనజ.

''ఎక్కడయినా ఎప్పుడయినా విమర్శించే వాళ్ళుంటారు. వాళ్ళు విమర్శిస్తూనే ఉంటారు. దానికి మనం సరయిన సమాధానం చెప్పాలంటే ముందు ఓపిగ్గా వాళ్ళేమంటున్నారో వినాలి. అంతేగాని తొందరపడి బాధపడకూడదు. అలాగే ఇందాక చెప్పానే సద్విమర్శ–కువిమర్శ అని రెండుంటాయి. సద్విమర్శను పెద్దమనసు చేసుకుని స్వీకరించాలి. కుమర్శను పట్టించుకోనవసరం లేదు. పట్టించుకుని బాధపడాల్సిన అవసరం కూడా లేదు. విమర్శ అన్నది గుండెల్లో గునపంలా గుచ్చుకుంటుంది. విమర్శించిన వాణ్ణి చాచి పెట్టి కొట్టాలనిపిస్తుంది. అప్పుడే...అక్కడే మనం కొంచెం ఓర్పు వహించాలి. బంధాలు తెంచుకోవడం ఎంతసేపమ్మా? రెణ్ణిమిషాలు. పెంచుకోవడమే కష్టం. అది ఆలోచించి జాగ్రత్తపడాలి'' అన్నాడు బాబాయ్.

''నిజమే'' అంది వనజ.

''అసలు అది సద్విమర్శా, కువిమర్శా అన్నది పక్కన పెట్టు! నిన్ను విమర్శిస్తున్నారు. వింటూ నువ్వు నవ్వుకో! నీ నవ్వుని చూసి ఎదుటి వ్యక్తికి ఏం చేయాలో పాలుపోదు. అయోమయంలో పడిపోతాడు. అది మనకు హాయనిపిస్తుంది. ఒక్కటి గుర్తుపెట్టుకో! స్నేహితులుకాని, బాస్‌కాని ఎవరు నిన్ను విమర్శించినా దాన్ని నువ్వు వ్యక్తిగతంగా తీసుకోకు. తీసుకోకూడదు కూడా. విషయాన్నే తీసుకుని ఆలోచించాలి. ఓరకంగా చెప్పాలంటే ఎదిగే జీవితానికీ, జీతానికీ విమర్శలు చాలా అవసరం. వాటిని మనం స్వీకరించాలి'' అన్నాడు బాబాయ్. నవ్వింది వనజ. అమ్మాయి గట్టున పడిందనుకున్నాడు బాబాయ్.

''ఇలా అంటున్నానని నువ్వేమీ అనుకోకపోతే నాదో చిన్న మాట.''

''చెప్పండి బాబాయ్.''

''విమర్శకు నువ్వు భయపడుతున్నావంటే తప్పకుండా నీలో ఏదో లోపం ఉన్నట్టే! అప్పుడు నువ్వు గుర్తించాల్సింది విమర్శను కాదు, నీలో ఉన్న లోపాన్ని నువ్వు గుర్తించాలి. గుర్తిస్తే గొడవే లేదు'' అన్నాడు బాబాయ్.

''అవును బాబాయ్! గొడవే లేదు'' అంది వనజ. సన్నగా వాకిట్లో చినుకులు పడుతోంటే చూసి అటుగా పరుగు తీసింది. చేతులు చాచి నవ్వుతూ వాకిట్లో తిరగసాగింది. చల్లగా చినుకుల్లో తడవడం, విమర్శల్లో మునిగి తేలడం రెండూ ఒకటేననుకుంది. ఆనందంగా కళ్ళు మూసుకుంది వనజ.

# నావల్ల కాదంటే కాదనుకునే వేళ...

అబ్బాయిని చూసి చాలా రోజులయింది. ఎలా ఉన్నాడో? చూడాలనిపించింది బాబాయ్‌కి. దారిలోనే ఆఫీసు. వెళ్ళాడక్కడికి. రూంలోకి వెళ్ళబోతోంటే ఎవరో లోపలి నుంచి మెడ పట్టుకుని గెంటేసినట్టుగా అబ్బాయ్ రూం లోంచి బయటపడ్డాడు ప్యూన్.

''ఉన్నాడా?'' అబ్బాయ్‌ని ఉద్దేశించి అడిగాడు బాబాయ్.

''మండిపోతూ-ఉన్నాడు'' చెప్పాడు ప్యూన్.

మెల్లగా తలుపు తెరిచి లోపలికి ప్రవేశించాడు బాబాయ్. రెండు చేతుల్తో జుత్తు పీక్కుంటూ టేబుల్ మీద వాలిపోయి కనిపించాడు అబ్బాయ్. చాలా ఒత్తిడిలో అబ్బాయ్ ఉన్నాడన్నది ఇట్టే గ్రహించాడు బాబాయ్.

''అబ్బాయ్'' పిలిచాడు. కళ్ళెత్తి బాబాయ్‌ని చూస్తూనే మూడ్ మార్చుకున్నాడు అబ్బాయ్.

''నువ్వా బాబాయ్! రారా'' అన్నాడు. జుత్తును సరి చేసుకునే ప్రయత్నాల్లో పడ్డాడు.

టేబుల్ మీద గుట్టలు గుట్టలుగా ఫైల్సున్నాయి. కుర్చీలో అబ్బాయ్ కూర్చుని ఉంటే అతను కనిపించనంత ఎత్తుగా ఫైల్సు చిందర వందరగా పడి ఉన్నాయి.

''నెలరోజులుగా పనేపని! ఛస్తున్నాను బాబాయ్'' అన్నాడబ్బాయ్.

''అందరికీ ఒకేసారి సెలవులు కావాలి. ఇవ్వాల్సిందే! ఇవ్వకపోతే లేనిపోని ప్రచారాలు చేస్తారు. స్టాఫంతా సెలవులో ఉన్నారంటే మేనేజ్‌మెంట్ ఊరుకుంటుందా? ఊరుకోదు! వాళ్ళను

కున్న పని వాళ్ళనుకున్న టైంలో జరిగి తీరాల్సిందే! లేదంటే గొడవే'' మళ్ళీ అన్నాడబ్బాయ్.

''రా! టీ తాగొద్దాం'' అన్నాడు బాబాయ్. పని ఉందంటున్నా, వద్దు వద్దంటున్నా అబ్బాయ్‌ని వెంటపెట్టుకుని బయల్దేరాడు. ఇక్కడ బాగోదు అక్కడ–అక్కడ బాగోదు ఇక్కడంటూ కిలోమీటర్ దూరం నడిచిన తర్వాత ఓ పాకావిలాస్‌లో అబ్బాయ్‌కి టీ తాగించాడు బాబాయ్. అప్పటికి కోలుకున్నట్టుగా కనిపించాడు అబ్బాయ్. ముఖంలో ఇందాకటి ఒత్తిడి కనిపించలేదు.

''రాత్రి బాగా నిద్రపోయావా?'' అడిగాడు బాబాయ్.

''ఎక్కడ బాబాయ్? అసలు నిద్ర పడితేకదా! ఒకవేళ గంటో రెండు గంటలో నిద్రపడితే...ఆ నిద్రలో కూడా ఫైల్సే కనిపిస్తున్నాయి.''

''కనిపించకూడదు. కనిపిస్తే ఇదిగో ఇలాగే ఉంటుంది పరిస్థితి. మినిమమ్ ఆరుగంటలపాటు నిద్రపోవాల్రా అబ్బాయ్. లేకపోతే ఒత్తిడిని తట్టుకోలేవు. ఒత్తిడి సంగతి పక్కన పెడితే సరయిన నిర్ణయాలు తీసుకోలేవు'' అన్నాడు బాబాయ్.

''నీ దగ్గరున్న ఫైల్సన్నీ నువ్వు చూడాల్సిన ఫైల్సేనా?'' అడిగాడు.

''నావి అందులో తక్కువే! నా స్థాయి ఆఫీసర్లు ఇద్దరున్నారు. వాళ్ళిద్దరూ ఓ పెళ్ళికెళ్ళారు. వాళ్ళు చూడాల్సినవి కూడా నా నెత్తిన రుద్దారు'' బాధపడ్డాడు అబ్బాయ్.

''శక్తికి మించిన సాయం చేస్తామనకూడదురా! చేస్తామంటే ఇదిగో ఇలాగే దెబ్బయిపోతావు. ఇలాంటి వాటిలో మొహమాటాలు పనికిరావు. మర్యాదగా 'నో' చెప్పాలి. చెప్పగలిగి ఉంటే ఇంత ఒత్తిడి ఉండదు'' అన్నాడు బాబాయ్. నిజమేననిపించింది అబ్బాయ్‌కి.

''నీ పనిని ఇంకెవరూ షేర్ చేసుకొనే అవకాశం లేదా?'' అడిగాడు బాబాయ్.

''ఎందుకు లేదూ ఉంది. మా ఆఫీసులోనే నాకిద్దరు ఫ్రెండ్సున్నారు. వాళ్ళు చేయగలుగుతారు.''

''అడిగి చూడు మరి! ఆదుకునే స్నేహితులున్నారనుకున్నప్పుడు ఇంత ఒత్తిడి ఉండదు. అలా అని వాళ్ళని మరీ ఇబ్బంది పెట్టకు'' నవ్వాడు బాబాయ్.

''పనిలో పనిగా అప్పుడప్పుడు నచ్చిన కథలో కవితలో చదువుకోవాల్రా. సరదాగా తోటపని...ఇంట్లో ఉన్న మొక్కలకే నీళ్ళు పొయ్యడం లాంటివి చెయ్యాలి. చేస్తే ఇంత స్ట్రెస్ ఉండదు'' అన్నాడు మళ్ళీ.

''పద'' అని అబ్బాయ్‌తో తిరుగు ప్రయాణమయ్యాడు.

''ఒత్తిడితో ఉన్నప్పుడు ఓ కిలో మీటరు నడక కూడా మంచిదే! అందుకే నిన్నిలా తీసుకొచ్చాను. ఇప్పుడెలా ఉందీ?'' అడిగాడు బాబాయ్.

''హాయిగా ఉంది'' అన్నాడబ్బాయ్. చిన్న రాయిని తీసుకుని సరదాగా బలంగా ఆకాశంలోకి విసిరాడు.

# దేవుడు తాతయ్య!

''రండమ్మా'' కేకేశాడు కండక్టర్. చేతికర్రతో తడుముకుంటూ సంధ్య బస్సెక్కింది. ఖాళీసీటుని వెదకి చూసుకుంది. కూర్చుంది.

''రైట్ రైట్'' కండక్టర్ కేకేశాడు. బస్సు కదిలింది.

సంధ్యకి పాతికేళ్ళుంటాయి. పెద్దపెద్ద కళ్ళు ఆమెవి. అందం అంతా ఆ కళ్ళలోనే ఉంది అంటారంతా. అయితే ఆ కళ్ళకి చూపు లేదు.

ఏడాది క్రితం అనారోగ్యానికి గురయింది సంధ్య. ఆస్పత్రిలో జాయినయింది. వ్యాధిని నిర్ధారించడంలోనూ, చికిత్స చేయడం లోనూ పొరపాట్లు జరిగాయి. ఫలితంగా చూపును కోల్పో యిందామె.

చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని పోగొట్టుకుంది సంధ్య. అమ్మమ్మ కూడా లేదు. తాతయ్య చేరదీశాడామెను. చదివించాడు. స్కూలు టీచర్ని చేశాడు.

చూపును కోల్పోయిన తొలి రోజుల్లో సంధ్య బాధ అంతా ఇంతా కాదు. ఏడ్చేది. నెత్తి మొత్తుకునేది. పలకరిస్తే చాలు, కోపగించుకునేది.

''అది కాదమ్మా'' అని నచ్చజెప్పబోతే పెంచి పెద్ద చేసిన తాతయ్య అని కూడా చూసేది కాదు, చేతికర్రతో అతన్ని చావ బాదేది. తర్వాత తర్వాత బాధను జీర్ణించుకుంది. అంతటి చీకట్లో చిరుదీపంలా స్కూలు యాజమాన్యం కరుణించింది సంధ్యను. ఉద్యోగంలో కొనసాగమంది. బాగానే ఉంది కాని, సంధ్య ఒకతే పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూలుకి ఎలా వెళ్ళి రాగలదు? అందుకని ఆమెని ఆటోలో పంపేందుకు సిద్ధ మయ్యాడు తాతయ్య. రానూ పోనూ నెలసరి 'ఇంత'ని ఆటో

మాట్లాడాడు. అయినా ఒంటరిగా పంపడం ప్రమాదం అని, తాతయ్య కూడా స్కూలుకి వెళ్ళి, అక్కడ సంధ్యను దింపి తిరిగొచ్చేవాడు. తిరిగొచ్చి, ఇటు పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న తను పని చేసే ఆఫీసుకు చేరుకునే వాడతను. సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు తాతయ్య. మాజీ సైనికోద్యోగి కావడంతో చిన్నపాటి ఉద్యోగాన్ని సంపాదించుకున్నాడు. అక్కడ స్కూలు దగ్గర సంధ్యను దిగ విడిచి, ఇక్కడ తను పని చేసే ఆఫీసుకు తాతయ్య చేరడంలో ఆలస్యమయ్యేది. ఆలస్యమయినందుకు చీవాట్లు తినాల్సి వచ్చేదతను. పైగా డబ్బు నీళ్ళలా ఖర్చు కావడాన్ని కూడా తట్టుకోలేకపోయాడు తాతయ్య. ఇది సరికాదనుకున్నాడు. ఒంటరిగా ప్రయాణించడాన్ని సంధ్యకు అలవాటు చేయాలనుకున్నాడు. స్కూలుకి సంధ్యను బస్సులో వెళ్ళి రమ్మన్నాడు.

''బుద్ధుందా నీకు? కళ్ళు కనిపించవు, ఒంటరిగా బస్సులో ఎలా వెళ్ళి రాను?'' తాతయ్యతో తగవు పెట్టుకుంది సంధ్య. తప్పదు అన్నాడు తాతయ్య కఠినంగా. తనంత తానుగా సంధ్యని అన్ని రకాలుగా అలవాటు పడమన్నాడు. ఏడుస్తూ, తాతయ్యని నానా రకాలుగా తిట్టుకుంటూ అలవాటు పడింది సంధ్య. ఆర్నెల్లు అయ్యింది, సంధ్య స్కూలుకి వెళ్ళి వస్తోంది. ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ లేదిప్పుడు.

స్కూలు నుంచి తిరిగి వస్తోంది సంధ్య. బస్సెక్కింది. ''రైట్ రైట్'' అన్నాడు కండక్టర్. అంతలోనే ''ఆగాగు'' అని అరిచాడు. ఆగింది బస్సు. పరిగెత్తుకుని వచ్చి బస్సెక్కిన వ్యక్తి మీద నిప్పులు చెరిగాడు కండక్టర్.

''ఏం మనిషివయ్యా నువ్వు? నీ వయసేమిటి? ఆ పరుగేమిటి? ఆర్నెల్లుగా చూస్తున్నాను. పొద్దునా పరుగున వచ్చి బస్సెక్కుతావు. సాయంత్రమూ అంతే! ఛస్తావు, జాగ్రత్త.''

''తప్పయిపోయింది, క్షమించు.''

ఆయాసపడుతున్న తాతయ్య గొంతు వినవచ్చింది. సంధ్య ఆనందానికి అంతులేకుండా పోయింది. అంటే ఆర్నెళ్ళగా తాతయ్య తన వెన్నంటే ఉన్నాడన్న మాట! కాని, ఉన్నానన్న సంగతి చెప్పలేదనుకుంది సంధ్య.

''తాతయ్యా'' అని పిలిచింది. దగ్గరకు వచ్చిన తాతయ్య గుండెల మీద వాలిపోయింది.

పిల్లల కోసం పెద్దలే కాదు, మన కోసం దేవుడు కూడా వెన్నంటే ఉంటాడు కాని, ఉన్నానని ఎవరికీ చెప్పడు! చెప్పుకోడు!

# షాప్ ట్రీట్‌మెంట్

జానకిరావు ఈ మధ్యనే రిటైరయ్యాడు. అయిందగ్గర్నుంచీ ఏదోలా ఉంటున్నాడు. మూప్పూటలా పేపర్ చదువుతూ కూర్చుంటున్నాడు. టీవీ చూడడు. ఎవరితోనూ మాట్లాడడు. పలకరిస్తే మూతి ముడుచుకుంటున్నాడు. మొహాన్ని తిప్పుకుంటు న్నాడు. ముందు నుంచీ పెద్దగా మాట్లాడే రకం కాదుగాని, పలక రిస్తే పర్వాలేదప్పట్లో. ఇప్పుడందుకు భిన్నంగా ఉంటున్నాడు. ఏదో కోల్పోయిన వాడిలా తయారయ్యాడు. ప్రతి చిన్నదానికీ భయపడుతూ 'ఎంతో కాలం బతకను' అంటున్నాడు. ఆరో గ్యంలో పెద్ద తేడా వచ్చేసిందంటూ అందర్నీ హడలగొట్టేస్తు న్నాడు. ఆ పరిస్థితిలో బాబాయ్ అడుగు పెట్టాడు వాళ్లింట.

''ఎలా ఉన్నాడు మా వాడు?'' అనడిగాడో లేదో బాబాయ్, జానకిరావు వాళ్ళావిడ చీరకొంగుతో కళ్ళొత్తుకుంటూ కహానీ అంతా చెప్పుకొచ్చింది.

''ముభావంగా ఉండడం వాడికి ముందు నుంచీ అలవాటే కదా'' అన్నాడు బాబాయ్.

''అనారోగ్యం అంటూ హైరానా పడుతున్నారు. గోల పెట్టేస్తున్నారు'' అన్నదామె. ఆలోచనలో పడ్డాడు బాబాయ్. కాస్సేపటికి తేరుకుని ఇలా అన్నాడు.

''ఓ పని చెయ్! రోజూ సాయంత్రం పూట జానకిని షాపింగ్‌కి తీసుకెళ్ళు. మాళ్ళకయినా, పచారీ కొట్టుకయినా, బట్టల దుకాణా నికయినా ఇద్దరూ కలిసే వెళ్ళండి. వాణ్ణే కొనుగోలు చెయ్యమను. బేరాలు వాణ్ణే ఆడమను. ఇలా ఓ మూణ్ణెళ్ళు చెయ్. తర్వాత సంగతి తర్వాత ఆలోచిద్దాం'' అన్నాడు బాబాయ్.

''రోజూ షాపింగంటే కొంప కొల్లేరయిపోదూ! బాగున్నారు మీరు. వేలకి వేలు పోసి ప్రతి రోజూ షాపింగ్ చేయడం అంటే మనవల్ల అవుతుందా?'' అన్నదామె.

''షాపింగంటే వేలకి వేలు పొయ్యాలనేం లేదు. ఉప్పూ, పప్పూ, ఓ చిన్న చాక్లెట్. వీటిని కొనడం కూడా షాపింగనే అంటారు. ఇలా షాపింగ్ చేయడం వల్ల నలుగురితో ధైర్యంగా మాట్లాడడం అలవడుతుంది. కొనుగోళ్ళ వ్యవహారం వంటబడుతుంది. విండో షాపింగ్‌తో మెదడు చురుగ్గా పని చేస్తుంది కూడా'' అన్నాడు బాబాయ్.

''నిత్యం షాపింగ్ చేస్తే దీర్ఘాయుష్మంతులవుతారు. అర్థాయుష్షుతో 'హరీ' అనరు. ఈ సంగతి వాడికి చెప్పు'' అన్నాడు బాబాయ్.

''ఒంటరితనంతో మగ్గిపోతున్న జానకిరావులాంటి వాళ్ళకి పదిమందితో సంబంధాలు పెరగాలంటే షాపింగే దిక్కు. ఇలా షాపింగ్ చేసే వాళ్ళు మామూలు మనుషులకన్నా ఎక్కువ కాలం జీవిస్తారు. ఎవరితో మాట్లాడకుండా ముంగిలా ఇంట్లో పడుండే వాళ్ళు పదేపదే షాపింగ్ చేస్తే జీవితం మీద మమకారాన్ని పెంచుకుంటారు. ఇంకా పదికాలాల పాటు బతకాలనుకుంటారు.''

''ఇవి నేను చెబుతున్న మాటలు కావు. తైవాన్ నేషనల్ రిసెర్చ్ వారు పదేళ్ళ పాటు పరిశోధనలు చేస్చేసి దీన్ని కనిపెట్టారు. అందుకని జానకిరావుని కొంగున కట్టుకుని బజార్లంట నువ్వు పడక తప్పదు'' అన్నాడు బాబాయ్. నవ్వాడు.

''షాపింగంటే ఆడవాళ్ళు పడిచస్తారని మగాళ్ళనుకుంటారుగాని, నిజానికి షాపింగ్ చేయడం ఆడవాళ్ళకంటే మగాళ్ళకే మంచిది. జానకికి షాపింగ్ అలవాటు చెయ్'' అన్నాడు బాబాయ్. వెళ్ళిపోయాడు. ఆ వెళ్ళిన వాడు నాలుగైదు నెలలకి మళ్ళీ ఆ ఇంట అడుగుపెట్టి చూద్దుడో...హడావుడి పడుతూ కనిపించాడు జానకిరావు. ఆనందంగా కనిపించాడు. ఉత్సాహంగా ఉల్లాసంగా కనిపించాడు.

''కూర్చో బాబాయ్! మీ అమ్మాయి బొట్టు బిళ్ళలు తెమ్మంది. దుకాణానికి వెళ్ళొస్తాను. ఇప్పుడే వస్తాను'' అన్నాడు. పరుగు దీశాడు. ఆ పరుగులో ఆరోగ్యం ఉంది. ఆశ ఉంది. నమ్మకం ఉంది అనుకున్నాడు బాబాయ్. తిరిగొచ్చిన జానకిరావు తన చేతిలోని బొట్టు బిళ్ళలు చూపిస్తూ–

''ఈ బిళ్ళల ఖరీదు అయిదు రూపాయలు! ఏడుకి తక్కువ ఇవ్వను అన్నాడు. అలాంటి వాడు మన మాటలకి పడిపోయి నాలుగున్నరకిచ్చాడు. చిత్రంగా ఉందంతా'' అన్నాడు జానకిరావు.

అవును! అంతా చిత్రమే బాబాయ్‌కి.

# పాడమని నిన్నడగవలెనా?!

సుజాతకెన్ని కష్టాలో! లేచిన దగ్గర్నుంచీ అన్నీ కష్టాలే! పెద్దదాని దగ్గర్నుంచి ఫోనొస్తుంది. దగ్గరలోనే ఉంటోంది తను. అల్లుడూ మనవరాలూ అదీ ముచ్చటగా ముగ్గురుంటున్నారు. టిఫిన్ ఏదో ఒకటి చేసి పంపమంటుంది. అంతలో రెండో దొస్తుంది. తాముంటోన్న అపార్ట్‌మెంట్స్‌లోనే కింది ఫ్లోర్‌లో ఉంటోంది తను. 'వంటయిపోయిందా? అయిపోతే నాకూ మా ఆయనికీ బాక్సులిచ్చీయే! లేవడం లేటయింది' అంటుంది. పెళ్ళిళ్ళు చేసుకుని ఎవరి మానాన వారుంటున్నా పని తప్పడం లేదు సుజాతకి. వాళ్ళకి టిఫిన్ చేసి, వీళ్ళకు బాక్సులు సర్ది, వాలంటరీ రిటైర్మెంటు తీసుకున్న భర్తకి అవీ ఇవీ పెట్టి, టైమవు తోందని ఆఫీసుకు బయల్దేరితే ఓ పట్టాన ఆటోలు దొరకవు. దొరికి ఆఫీసుకు వెళితే లేటయినందుకు అక్కడ ఆఫీసర్ చేత నానా చీవాట్లూ తినాల్సి వస్తోంది. ఒత్తిడిని తట్టుకోలేకపోతోంది సుజాత. తనకీ ఏభైయ్యేళ్ళు దాటాయి. వయసు మీద పడడమో లేదంటే అల్జీమర్ రోగమో తెలీదు. ఏదీ చప్పున గుర్తుకి రావట్లేదు. హైబీపి ఒకటి. కాల్చుకు తింటోంది. దాంతో పుప్పి పన్ను పీకించుకుందామన్నా సవాలక్ష పరీక్షల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. దానా దీనా ఏడుపొస్తోంది సుజాతకి. ఈ కష్టాలు గట్టెక్కేదెలా అని ఆలోచించడంలో తల పేలిపోతోందామెకు. బాబాయొస్తే బాగుణ్ణనుకుంది. అనుకున్నదే ఆలస్యం బాబాయ్ ప్రత్యక్ష మయ్యాడక్కడ.

''ఏంటమ్మా! ఎలా ఉన్నావు?'' అడిగాడు. 'ఇలా ఉన్నా న'ంటూ అంతా ఏకరువు పెట్టింది సుజాత. కన్నీళ్ళు పెట్టుకుంది.

''చఛ! చిన్నపిల్లలా ఏంటమ్మా ఇది'' బాధపడ్డాడు బాబాయ్.

''నాకేం దిక్కుతోచడం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు'' అంది సుజాత.

''హాయిగా పాటలు పాడుకో'' అని నవ్వాడు బాబాయ్.

''ఎగతాళి చేస్తున్నావా బాబాయ్. పాటలు పాడడం ఏంటి'' కోపగించుకుంది.

''కోపగించుకోకు తల్లీ! ముందీ సంగతి చెప్పు! నీకు పాటలు పాడే అలవాటుందా? లేదా? కనీసం కూనిరాగాలయినా తీస్తావా? తియ్యవా.''

''పాటలు పాడే అలవాటూ లేదు! కూనిరాగాలూ తీయను.''

''అందుకే ఇన్ని రోగాలు నెత్తినేసుకున్నావు. నా మాట విని నోటికొచ్చిన పాటలు పాడుకున్నా, కనీసం బాత్రూంలో ఏదో ఒకటి హమ్ చేసినా నీకీ ఒత్తిడి ఉండేది కాదు. నీకో సంగతి తెలుసా? పాటలు పాడే వాళ్ళకి బిపి ఉండదు. ఉన్నా కంట్రోల్లో ఉంటుంది. రక్తంలో యాంటీబాడీస్ స్థాయిలెక్కువగా కనిపిస్తాయి. ఒత్తిడిని తగ్గించే హైడ్రోకార్టిస్టోన్ హార్మోన్‌లో ఉహకందనంత ఎదుగుదల కూడా ఉంటుంది. అల్జీమర్ ఆమడ దూరంలో ఉంటుంది. జ్ఞాపకశక్తి కోల్పోయే ప్రమాదమే ఉండదు. పాటలు పాడడం వల్ల మెదడు కూడా చురుగ్గా పని చేస్తుంది'' చెప్పాడు బాబాయ్.

''నీ వయసుకి మీ అమ్మా, అమ్మమ్మా ఎలా ఉండేవారు? గుర్తు చేసుకో! ఎప్పుడూ ఏవో పాటలు పాడుతూ ఆరోగ్యంగా ఆనందంగా ఉండేవారు. సీతా కల్యాణం, గోవ్యాఘ్ర సంవాదం, గంగావతరణం...ఎంత మంచి పాటలే! వాళ్ళ గొంతులు బావున్నాయా లేదా అన్నది ప్రశ్న కాదు, వాళ్ళకది ఆనందంగా ఉందా లేదా అన్నదే పాయింట్. పాతికమందికి ఇట్టే వండి వార్చేవారు. పాడి చూసుకునే వారు. ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. తెల్లార జాము నాలుగ్గంటలకి లేచి పనులన్నీ చక్కబెట్టుకుని ఏ అర్ధరాత్రో పడుకునే వారు. అయినా ఆరోగ్యంగా హాయిగా ఉండేవారు. ఎప్పటెప్పటి సంగతులో కలబోసుకునే వారు. అవునా? కాదా?'' అడిగాడు బాబాయ్.

''అవును'' అంది సుజాత.

''మరందుకే పాటలు పాడుకోమంటోంది. ఎవరు వద్దన్నా వినకు! నీకు నచ్చినట్టుగా నీకొచ్చినట్టుగా ఇంటా బయటా పాటలు పాడేయ్! పండగ చేసుకో'' అన్నాడు బాబాయ్. అంతే! సుజాత పాటందుకుంది. బాబాయ్ పరుగుదీశాడక్కణ్ణుంచి.

# ఒక్క నవ్వే చాలు! వద్దులే వరహాలు!

అబ్బాయ్‌కి నలభై మూడేళ్ళు. పెళ్ళయ్యింది. ఇద్దరు పిల్లలు. ఏదో పెద్ద కార్పొరేట్ కంపెనీలోనే పని చేస్తున్నాడు. ఫైనాన్స్ సెక్షన్‌లో ఆఫీసరుగా ఉంటున్నాడు. పొద్దున పది గంటలకి ఆఫీసుకెళ్తే రాత్రి పది గంటలకుగాని ఇంటికి రాడు. ఏకబిగిన పన్నెండు గంటల పాటు పని చేస్తాడు. సహోద్యోగులు కూడా అంతే! రోజూ పన్నెండు గంటలు అతనితో పాటు పని చేయా ల్సిందే! ఆదివారాలూ శలవు దినాలు కూడా వారికి కరువే! ఆఫీసు, అక్కడి పనితో అల్లల్లాడిపోయే అబ్బాయ్, ఎప్పుడో కాని ఎవరికీ కనిపించడు. కనిపించినప్పుడు మాత్రం నోరారా పలక రిస్తాడు. బంధువులన్నా, స్నేహితులన్నా ప్రాణం పెడతాడు. అడిగితే చాలు! ఎలాంటి సహాయం చేసేందుకయినా సిద్ధంగా ఉంటాడు. తగ్గ భార్యే దొరికిందతనికి. దాంతో అబ్బాయ్ ఆడింది ఆట, పాడింది పాటయి కూర్చుంది. తిరుగులేదు, అబ్బాయ్ నూటికి నూరేళ్ళూ బతుకుతాడనుకున్నారు. అనుకున్నదే పాపం! అబ్బాయ్ ఆసుపత్రి పాలయ్యాడు. హార్ట్ ఎటాకొచ్చింది. ఆందో ళన చెందారంతా. అయితే అదృష్టం బాగుంది. గండం గడిచి గట్టెక్కింది. అబ్బాయ్ బతికాడు. ఇంటికొచ్చాడు. అప్పుడతన్ని బాబాయ్ కలిశాడు. అబ్బాయ్ మీద చాలా అనుమానాలు ఉన్నాయతనికి. దాంతో మొహమాటం లేకుండా అడిగేశాడు.

''ఆఫీసులో నువ్వెలా ఉంటున్నావురా?''

''ఎలా ఉంటాను? నా పని నేను చేసుకుంటూ స్టాఫంతా ఎవరి పనిలో వాళ్ళున్నదీ లేనిదీ చూస్తుంటాను'' అన్నాడు అబ్బాయ్.

'' చూస్తుంటావు సరే! నువ్వంటే వాళ్ళిష్టపడతారా? నిన్నభిమానిస్తారా?'' అడిగాడు బాబాయ్. సమాధానం లేదు అబ్బాయ్ దగ్గర్నుంచి.

''నీకూ స్టాఫ్‌కీ పడదు! అవునా?'' అడిగాడు బాబాయ్.

''పడదంటే...తప్పులు చేస్తోంటే చూస్తూ ఎలా వూరుకుంటాను. తిడతాను. దాంతోనే వ్యవహారం అంతా సీరియస్‌గా ఉంటోంది.''

''దాని ఫలితమే ఈ హార్టెటాక్'' అన్నాడు బాబాయ్.

''భార్యాబిడ్డలు, బంధువులు, స్నేహితులతోనే కాదురా, సహోద్యోగులతో కూడా మంచి రిలేషన్స్ ఉండాలి. సరదాగా హాయ్ హాయ్‌గా ఉండాలి. ఉంటే ఎలాంటి రోగాలూ మనల్నంటవు. ఎక్కువ కాలం బతుకుతాం కూడా'' అన్నాడు బాబాయ్. అదెలా సాధ్యం అన్నట్టుగా చూశాడబ్బాయ్.

''పది పన్నెండు గంటలపాటు పని చేసే ఆఫీసులో స్టాఫ్‌తో చక్కని రిలేషన్స్ లేకపోయినా వారితో తరుచూ గొడవలు పడినా అనారోగ్యం కొనితెచ్చుకున్నట్టే! అందులో అనుమానం లేదు. ఇది నేనంటోన్న మాట కాదు, శాస్త్రవేత్తలంటోన్న మాట! అందుకని మొహం ముడుచుకుని కూర్చోడం, స్టాఫ్‌ని పదేపదే తిట్టడం, వారిని  అసహ్యించుకోవడం మంచిది కాదు. ఎవరితోనూ మనసు విప్పి మాట్లాడకుండా ఉండడం, ఇబ్బందిగా పన్చెయ్యడం ఆరోగ్యాన్ని చేజేతులా పాడు చేసుకోవడమే!  ఇందుకే గుండె జబ్బులొస్తాయి'' అన్నాడు బాబాయ్. నిజమేననిపించింది అబ్బాయ్‌కి. ప్రతిరోజూ స్టాఫ్‌తో తను పడిన గొడవలన్నీ ఒకొక్కటీ గుర్తొచ్చి దాహమనిపించిందతనికి. నీళ్ళడిగాడు. అందించాడు బాబాయ్. తర్వాత ఇలా అన్నాడు.

''చనువు తీసుకుంటున్నానని అనుకోకపోతే...ఇక మీదటయినా నీ వ్యక్తిత్వాన్ని మార్చుకోరా! తోటివాళ్ళతో ఆఫీసులో సరదాగా ఉండు. వాళ్ళని నవ్వుతూ పలకరించు. అడిగితే చిన్న చిన్న సలహాలివ్వు. సహాయాలు కూడా చెయ్యి. తప్పు చేస్తే సరిదిద్దు! తిట్టకు. సాయంత్రం పూట ఓ అరగంట టెన్నిసో, బ్యాడ్మింటనో వాళ్ళతో కలసి ఆడుకో! ఒక్క నెల రోజులు నువ్విలా చేశావంటే నీకే కాదు, మీ సంస్థకు కూడా  బాగా కలిసొస్తుంది. నా మాట నమ్ము.''

నమ్ముతానన్నట్టుగా సన్నగా నవ్వాడబ్బాయ్. బాబాయ్ చేతిని తీసుకుని గుండెల మీదుగా ఉంచుకున్నాడు. ఎందుకో ఇప్పుడతనికి చాలా ధైర్యంగా ఉంది.

# పెళ్ళంటే...

అతనూ ఆమె కలసి పదేళ్ళ పాటు కాపురం చేశారు. ఓ కొడుకుని కూడా కన్నారు. వాడికిప్పుడు ఎనిమిదేళ్ళు.

ఇన్నేళ్ళ తర్వాత ఇప్పుడు ఆమె అంటే అతనికి ఇష్టం లేకపోయింది. ఆమెను చూస్తే చాలు, ఏ రకమయిన భావనలూ, స్పందనలూ కలగడం లేదు. అందుకే విడాకులడిగాడు. ఉంటున్న ఇల్లు ఆమె పేరు మీదే రాశాడు. మంచి కారిచ్చాడు. పదిలక్షల నగదు ఇచ్చాడు. విడిపోదాం అన్నాడు. ఆఫీసులో తన పర్సనల్ సెక్రటరీ వీణని ప్రేమిస్తున్నానని, త్వరలో తామిద్దరూ పెళ్ళి చేసుకోబోతున్నామని చెప్పాడతను. గొడవలూ, ఏడుపులూ వద్ద న్నాడు. విడాకులకు అంగీకరించమన్నాడు. ఆలోచించిందామె. 'సరే'నంది. అయితే చిన్న షరతు పెట్టింది. అదేమిటంటే...ఓ నెల రోజుల పాటు కలసి ఉండాలి. ఈ నెల రోజులూ పొద్దుటి పూట, కొడుకు స్కూలుకి వెళ్ళే టైంలో ఆమెను ఎత్తుకుని అతను బెడ్‌రూంలోంచి హాల్లోనికి తీసుకుని రావాలి. పాశ్చాత్య సంప్రదాయంలో పెళ్ళికూతుర్ని పెళ్ళికొడుకు ఎత్తుకుంటాడే అలా ఎత్తుకోవాలతను. నెల రోజుల పాటు అలా ఎత్తుకుంటే చాలు! ఆ తర్వాత ఎవరికి వారుగా విడిపోదాం అందామె.

''ఇప్పుడీ పరిస్థితుల్లో ఇది అవసరమా?'' అడిగాడతను. అలా ప్రవర్తించడం అతనికెంతమాత్రం ఇష్టం లేదు.

''ప్లీజ్'' బతిమలాడిందామె. ఆలోచించాలోచించి, ఆఖరికి ఒప్పుకున్నాడతను. ఆ సంగతి వీణకి చెప్పాడు.

''తనకేమయినా పిచ్చా? వద్దు మొర్రో అంటే హత్తుకోమనడం, ఎత్తుకోమనడం...భలే పెళ్ళాం.'' అని నవ్వింది వీణ.

''ఆఖరి కోరిక కదా, కానీయ్'' అంది మళ్ళీ. ఆ మర్నాటి నుంచే అతను, ఆమెను ఎత్తుకోసాగాడు. మొదటి రోజు చాలా బరువుగా అనిపించిందామె. మోయలేక మోయలేక బెడ్‌రూంలోంచి, హాల్లోకి తీసుకుని వచ్చాడు. ఆసరికి కొడుకు అక్కడ స్కూలుకి రెడీ అయి ఉన్నాడు. తల్లిదండ్రుల్ని అలా చూసి నవ్వుతూ చప్పట్లు కొట్టాడు. రెండో రోజు ఎత్తుకున్నాడామెను. అప్పుడు మంచి అత్తరు ఏదో రాసుకున్నట్టుంది. బలే వాసన వేసింది. మూడో రోజు తన కళ్ళల్లోకి ఆమె తదేకంగా చూస్తూంటే తట్టుకోలేకపోయాడు. నాలుగో రోజు ఆమె పెదవుల్ని చూస్తోంటే, వాటిని అందుకోవాలని పించిందతనికి. ఆ ప్రయత్నం చెయ్యబోతుంటే వారించిందామె. కొడుకు చూస్తున్నాడని చెప్పింది. అయిదు, ఆరు, ఏడు...మూడు వారాలు గడిచిపోయాయి. ఇప్పుడు ఆమెను ఎత్తుకోవడం అతని దినచర్యలో ఓ భాగమయింది. ఎత్తుకోకపోతే ఏదో కోల్పోతున్నట్టుగా ఉంది. తొలిరోజుల్లో బరువుగా అనిపించేందామె, ఇప్పుడు అలవాటు పడడం వల్లనో ఏమో! తేలిగ్గా అనిపిస్తోంది. పదే పదే ఎత్తుకోవడం, హత్తుకోవడంతో ఆమె అంటే ఇష్టం కలుగుతోందతనికి. ఆమెను ప్రేమించాలనిపిస్తోంది. వీణలో ఉన్నదేమిటి? ఈమెలో లేనిదేమిటి? అనిపించింది. విడాకులు తీసుకుంటూ తను తప్పు చేస్తున్నాడేమో అనుకున్నాడు. ఆ రోజు ఆఖరి రోజు. ఆమెను ఎత్తుకుని ఎప్పట్లానే హాల్లో దించాడు. ఆఫీసుకు వచ్చాడు. రాత్రి నుంచి ఇక ఆ ఇంటికి తను వెళ్ళక్కర్లేదు. వీణతో ఉండిపోవచ్చు. కాని, ఎందుకో ఆమెతో బంధాన్ని తెంచుకోవాలనిపించలేదు. విడాకులు వద్దనుకున్నాడతను. ఆ మాటే వీణకు చెప్పాడు.

''యూ ఇడియెట్'' అంది వీణ. అతని దగ్గర ఉద్యోగం కూడా మానేస్తానంది. విసవిసా వెళ్ళి పోయిందక్కణ్ణుంచి.

అతనికెందుకో త్వరగా ఇంటికి వెళ్ళాలనిపించింది. ఆమెను దగ్గరగా తీసుకోవాలనిపించింది. మల్లెపూలు కొన్నాడు. మంచి గంధం కొన్నాడు. ఆగమేఘాల మీద ఇంటికి చేరుకున్నాడు. ఆమెను పిలుస్తూ బెడ్‌రూంలోనికి పరుగుదీశాడు. అక్కడి దృశ్యం చూసి స్థాణువయిపోయాడు. ఆమె చనిపోయి ఉంది. కొడుకు ఏడుస్తున్నాడు.

ఆమెకి క్యాన్సర్. నెలరోజుల్లో తను పోతుందని తెలుసామెకు. ఆ సంగతి భర్తకు చెప్పలేదామె. పోతూ పోతూ తనింకా భర్తకి దగ్గరయి, కొడుకుని దగ్గర చేసి మరీ కన్ను మూసిందామె.

# నీ సుఖమే నే కోరుతున్నా!!

డాడీకి ట్రాన్స్‌ఫరయిపోయింది. ఊరొదిలి వెళ్ళిపోవాలి. రెండు రోజులే ఉందింకా. ఈ రెండు రోజులూ ఆడినంత సేపు ఆడుకుని తర్వాత 'ప్రిన్స్'ను వదిలేయాలి. ఎక్కడ దొరికిందో అక్కడే వదిలేయమంది మమ్మీ. వదలాలంటే బాధగా ఉంది. ప్రిన్స్ కుక్కపిల్లే కావచ్చు! అయిదారు నెలల వయసుదే కావచ్చు. దొరికి నెల రోజులే అయి ఉండొచ్చు. అయినంత మాత్రాన వదిలేయాలా? వదిలేయాలంటోంది మమ్మీ. వదలకపోతే డాడీ కోప్పడతారంటోంది. అసలు ప్రిన్స్‌ను వదిలించుకునేందుకే డాడీ ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నారట! చిత్రంగా ఉందంతా. బుజ్జి కుక్కపిల్ల. కుందేలులా ఇంతే ఉంటుంది. పెడితే తింటుంది. పెట్టకపోతే చూస్తూ ఉంటుంది. దాని మీద డాడీకి ఎందుకింత కోపమో అర్థం కావట్లేదు. మొన్న డాడీ కాలు నాకిందట! అందుకు కోపం వచ్చిందేమో! లేదంటే...కుక్కకాటుకి 'హేపీ హోమ్ అపార్ట్ మెంట్స్'లో కుర్రాడు చనిపోయాట్ట! అందుకొచ్చిందేమో! అయినా ఆ కుర్రాణ్ణి కరిచింది ప్రిన్స్ కాదు కదా! కాక పోయినా తప్పదు. వదిలేయాలంటున్నారు.

కాలనీ చివర తురాయి చెట్టును వదిలేయొచ్చు. మలుపులో ఉన్న దేవాలయాన్ని వదిలేయొచ్చు. ఎదురుగా ఉన్న వీధి దీపాన్ని వదిలేయొచ్చు. ఫ్రెండ్ ప్రిన్స్‌ను వదలడం ఎలా? తెల్లా రిందంటే చాలు! ముఖాన్ని నాకి నిద్ర లేపుతుంది. తోడుగా పెరట్లోకి వస్తుంది. స్నానం చేస్తోంటే తనూ స్నానం చేస్తుంది. అయితే గట్టిగా పట్టుకుని స్నానం చేయించాలి. లేకపోతే పరుగుదీస్తుంది. టిఫిన్ చేస్తోంటే ఎదురుగా కూర్చుని ఉంటుంది. తోకాడిస్తూ జాలి చూపులు చూస్తుంది. పెడితే తింటుంది. తనకి

పెట్టిన ఇడ్లీ ముక్కో, దోసె ముక్కో, ఉప్మా పిసరో...అవే తింటుంది. ప్రత్యేకంగా నాకిది కావాలి! అది కావాలని అడగదు. స్కూలుకి వెళ్ళిపోతుంటే వెనక పడి వస్తుంది. వద్దన్నా వినదు. అందుకే బాల్కనీలో కట్టి మరీ వెళ్ళిపోతున్నా. క్లాసులో కూర్చున్న దగ్గర్నుంచీ దాని ధ్యాసే! ఇప్పుడది ఏం చేస్తుంటుంది? ఎలా పడుకుని ఉంటుంది? మమ్మీ దాన్ని కసురుకుంటోందా? రోడ్డు మీది జనాన్ని చూసి అరుస్తోందా? అరిస్తే మమ్మీ విసుక్కుంటోందా? ఇదే గోల. ఎంత వేగిరం స్కూలొదులుతారా...ప్రిన్స్‌ను చేతుల్లోకి తీసుకుంటానా అన్నదే ఆలోచన. దాంతో ఆడుకుంటుంటే టైమే తెలీదు. ఇట్టే చీకటి పడిపోతుంది. రాత్రి అయిపోతుంది. కాలి వేళ్ళు ఇరవై ఉంటే మంచిదన్నారెవరో. ప్రిన్స్‌కు ఇరవై వేళ్ళే ఉన్నాయి. ఆ మాట మమ్మీకి చెప్పాడు తను. దేనికైనా అంతే ఉంటాయంది మమ్మీ. అసలు పట్టించుకోలేదు. కాని మమ్మీ అంటే ప్రిన్స్‌కి చాలా ఇష్టం. వెనక వెనకే తిరుగుతుంది. కాళ్ళల్లో పడుతోందని మమ్మీకి కోపం.

చలిలో వర్షంలో తురాయి చెట్టు నీడన ప్రిన్స్ దొరికింది. వణికిపోతోంటే చేతుల్లోకి తీసుకున్నాడు. గుండెలకదుముకున్నాడు. వెచ్చ వెచ్చగా నిమిరాడు. అంతే! ఫ్రెండ్సయిపోయారిద్దరూ. ఇంటికి తీసుకొచ్చాడు. మమ్మీ డాడీ ముందొప్పుకోలేదు. ఏడిస్తే ఆఖరికి వూరుకున్నారు. ఇప్పుడొదిలేయాలంటున్నారు. ఏడుపొస్తోంది తనకి. పాడయిపోయిన సూట్‌కేస్‌ను పడేసినట్టు, పాతబడిపోయిన దిండును పారేసినట్టు, విరిగి పోయిన పాత ప్లాస్టిక్ బకెట్‌ను విసిరేసినట్టు ప్రిన్స్‌ను విసిరేయాలంటే...ఎంత బాధ! స్కూల్లో టీచర్ చెప్పింది. అక్కడెక్కడో బ్రెజిల్‌లో 'కాగ్జియాస్డ్ సల్'లో కుక్కలకో కాలనీ ఉందట! అక్కడ వందలకు వందలు కుక్కలుంటాయట! చాలా పెద్ద మైదానంలో ఒక్కో కుక్కకూ ఒక్కో ఇల్లు కట్టారట! ఫుడ్ ఫ్రీట! ఎంత తింటే అంతట! డాడీలా ఎవరయినా ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోతోంటే పెంపుడు కుక్కను అక్కడ వదిలేయొచ్చట! ఊరి వారంతా వాటిని సాకుతారట! ఎంత బాగుంది? ఇక్కడీ ఇండియాలో హైదరాబాద్‌లో కూడా అలాంటిదొకటి ఉంటే బాగుణ్ణు. ఎంచక్కా ప్రిన్స్‌ను అక్కడ వదిలేయొచ్చు!!

# మరో భాష నేర్చుకో!

అతనికి యాభై యేళ్ళు దాటాయి. భార్య ఉంది. ఒక్క గానొక్క కొడుక్కీ పెళ్ళి చేసేశాడీ మధ్యే! కోడలొచ్చింది. డూప్లెక్స్ ఇల్లుంది. పైన కొడుకుంటున్నాడు. కింద అతను ఉంటున్నాడు. అంతా బాగానే ఉంది. బాగా లేంది ఒకటే! అతనికి ఈ మధ్య మతిమరపు ఎక్కువయింది. దాంతో లేనిపోని చిక్కుల్లో ఇరు క్కుంటున్నాడు. పొద్దునే బ్రష్ చేసుకోవాలి. బ్రష్ కనిపించదు. ఎక్కడ పెట్టాడో మరచిపోతాడతను. పైగా 'టూత్‌బ్రష్' అన్నమాట కూడా గుర్తుకి రాక 'నోటికి ఏదో కావాలి. నోటికి ఏదో కావాలి' అని ఇబ్బంది పడతాడు. ఎప్పటికో 'టూత్‌బ్రష్' అన్నమాట గుర్తుకొస్తే, అదెక్కడుందని అడిగితే 'ఇదిగో ఇక్కడంటూ' అతనికి అందించి, 'మతిమరపు ఎక్కువై పోయిందీ మధ్య' అంటున్నారంతా. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ప్లేటు పెట్టుకున్నాననుకుని, అన్నం పెట్టుకుంటాడు. తీరా చూస్తే అక్కడ ప్లేటుండదు. భార్యామణి నెత్తి కొట్టు కుంటోంది. మొన్నా మధ్య ఏం చేశాడో తెల్సా? చొక్కా ఇస్త్రీ చేసుకుని ఐరన్‌బాక్స్ తీసుకెళ్ళి ఎంచక్కా ఫ్రిజ్‌లో పెట్టాడు. చేతివాచీ తీసుకెళ్ళి పంచదార డబ్బాలో దాచాడు. గగ్గోలు పెట్టారంతా. తుపాను. వర్షం. చలి చుట్టబెట్టేస్తోంది. మార్నింగ్ వాక్‌కి వెళ్తూ స్వెట్టర్ వేసుకున్నా ననుకుని ఒట్టి బనీను మీద వెళ్ళిపోయాడు. చూసిన వాళ్ళంతా ముక్కున వేలేసుకున్నారు. 'ఏంటయ్యా ఇదంతా' అంటే కోపం వస్తోందతనికి. ఏడుపు కూడా వస్తోంది. ఎవరితోనూ మాట్లాడా లనిపించడం లేదు. ఒంటరిగా గంటలగ్గంటలు టీవీ చూసు

కుంటూ గడిపేస్తున్నాడు. లేదంటే పడక. ఇదీ దినచర్య అయింది. కొత్తగా వచ్చిన కోడలు పిల్ల మామగారి ఈ చేష్టలన్నీ కథలు కథలుగా చెప్పి నవ్వితే విని బాధపడ్డాడు బాబాయ్. వెంటనే అతన్ని కలుసుకోవాలనుకున్నాడు. అనుకున్నట్టుగానే కలిశాడు.

''ఇవన్నీ అల్జీమర్స్ లక్షణాలయ్యా! జాగ్రత్తగా ఉండాలి నువ్వు'' అన్నాడు.

''ఎలా ఉండాలి'' అడిగాడతను. ఆ అడగడంలో 'ఎలా ఉండాలో చెప్పండి సార్! మీరు చెప్పినట్టే వింటాను' అన్న వేడుకోలు ఉంది.

''తమిళం వచ్చా నీకు?'' అడిగాడు బాబాయ్.

''వచ్చిన తెలుగే మరిచిపోతుంటే రాని తమిళం సంగతి ఇప్పుడెందుకు?'' అడిగాడతను.

''అదే కావాలి. నువ్వు అర్జంట్‌గా తమిళం నేర్చుకోవాలి. నెల రోజులు టైమిస్తున్నాను. నేర్చుకుని నాకు కనిపించు. అదే ట్రీట్‌మెంట్'' అన్నాడు బాబాయ్.

చచ్చాన్రో అని తమిళం నేర్చుకునే ప్రయత్నాల్లో పడ్డాడతను. 'తెలుగు-తమిళం' పుస్తకాలు తెచ్చుకున్నాడు. తెగ చదివాడు. చదివి చదివి గడ్డాన్ని తమిళంలో 'దాడి' అంటారని తెలుసుకున్నాడు. పుట్టుమచ్చని 'మచ్చమ్' అంటారని తెలుసు కున్నాడు. ఎరుపు రంగుని 'సివప్పు' అంటారని, తులసికోటని 'తుళసిమాడమ్' అంటారని, కలువని 'అల్లి' అంటారని...ఇలా చాలా తెలుసుకున్నాడు. అలా తెలుసుకోవడంలో ఆఫీసులో తమిళ మిత్రులని పలకరించడం మొదలెట్టాడతను. వాళ్ళంతా పెద్ద పెద్ద ఆఫీసర్స్. వాళ్ళతో పరిచయం ఆఫీసులో పదన్నోతిని కల్పించింది. ప్రమోషన్‌తో చురుగ్గా తయారయ్యాడతను. ఆ చురుకుదనంలో ఎవరు ఏమిటి? ఏది ఎక్కడ? అన్నీ జ్ఞాపకం ఉంటున్నాయతనికి. ఇప్పుడతను చేతివాచీని డ్రస్సింగ్ టేబుల్ మీదే ఉంచుతున్నాడు. అన్నాన్ని ప్లేటులోనే పెట్టుకుంటున్నాడు. టీవి చూడ్డం మానేశాడు. కావాల్సినంతగానే నిద్రపోతున్నాడు.

''ఏంటీ మార్పు? తమిళంలో ఇంత మహత్తు ఉందా?'' అడిగాడతను బాబాయ్‌ని.

''ఉంది. అయితే ఒక్క తమిళంలోనే కాదు, మాతృభాషతో పాటు మరో భాష అదనంగా నేర్చుకోవడంలో చాలా మహత్తులున్నాయి. ఒకటికి రెండు భాషలొస్తే ఆరోగ్యంగా ఉండడమే కాదు, అల్జీమర్స్‌ని నియంత్రణలో ఉంచుకోవచ్చు. మెదడుని పదును పెట్టొచ్చు'' అన్నాడు బాబాయ్.

# జీవితం

ఇరవై యేళ్ళ వయసులో కార్పెంటర్‌గా జాయినయ్యాడు. నలభై ఏళ్ళుగా ఒకటే పని. చేసిన పనే చేస్తున్నా విసుగెత్తి పోలేదెన్నడూ. పైగా ఆనందించే వాడు. పనినే ప్రత్యక్ష దైవంగా భావించే వాడు. వెంకటాచారి ఉడ్‌వర్క్ చేస్తున్నాడంటే గొప్పగా చెప్పుకునే వారంతా. ఆ డిజైన్లూ, పని తీరూ వేరనే వారు. చారి బాధ్యత తీసుకున్నాడంటే ఎంచక్కా కళ్ళు మూసుకుని పడుకోవచ్చనేవారు. వంక పెట్టేందుకు వీలుండదనే వారు. నలభై ఏళ్ళ క్రితం వంద రూపాయలకు రాజుగారి దగ్గర జాయి నయ్యాడు. అప్పటికే రాజుగారు పెద్ద బిల్డర్.

ఇప్పుడు నెలకి ఇరవై వేలు పైబడే సంపాదిస్తున్నాడు చారి. కాలంతో పాటు జీతం, జీవితం రెండూ పెరుగుతూ వచ్చాయి. ఇద్దరు కొడుకులు. ఇద్దరూ బాగానే చదువుకున్నారు. పెళ్ళిళ్ళు కూడా అయిపోయాయి వాళ్ళకి. పిల్లలు కూడా. మనవడూ, మనవరాలూ. వాళ్ళతోనే రోజంతా గడపాలనిపిస్తోంది చారికి. వీలుకావట్లేదు. చేస్తోన్న పనిలో రిటైర్మంట్ లేదుగాని, తీసు కోవడం సుఖం అనుకున్నాడు. ఆ ముక్కే చెప్పాడు రాజు గారికి.

''కొంత కాలం చెయ్యి. బాగానే ఉన్నావు కదా'' అన్నారు రాజుగారు.

జవాబు ఏం చెప్పాలో తెలియక తలొంచుకున్నాడు.

''ఓ చిన్న ఇల్లు కన్‌స్ట్రక్ట్ చేస్తున్నాను. ఉడ్‌వర్క్ దానికి నువ్వే చెయ్యాలి. నువ్వు చేస్తేనే బాగుంటుంది. అది పూర్తయ్యాక నీ ఇష్టం. మానేయ్'' అన్నారు రాజుగారు.

ఇష్టం లేదు. కాని, తప్పదు. ఒప్పుకున్నాడు చారి. గత నలభై యేళ్ళుగా ఉదయం ఎనిమిది గంటలకే ఠంచన్‌గా సైట్‌లో కనబడే చారి, ఇప్పుడు పది గంటలయినా కనబడకుండా పోయాడు. తోటి కార్మికుల్ని పరిగెత్తించి, పని చేసేవాడు చారి. పనిలో ఆలస్యం అయినా, పని పాడయినా పెద్ద నోరు పెట్టుకుని అరిచే వాడు. ఇప్పుడా అరుపులూ లేవు. పరిగెత్తించడాలూ లేవు. పనిలో క్వాలిటీ ఉండాలంటూ గంటలకు గంటలు ఉపన్యాసాలిచ్చేవాడు. ఎలా చెయ్యాలో, ఎలా చేస్తే క్వాలిటీ ఉంటుందో చేసి చూపించేవాడు చారి. తప్పు చేస్తే తాట తీసేవాడు. ఇప్పుడవేవీ లేవు. ఏదీ పట్టించుకోడు. ఎవర్నీ పట్టించుకోడు. పైగా ఎన్నడూ లేనిది కక్కుర్తి పడసాగాడు. దీంతో ఈ ఉద్యోగం సరి. కాబట్టి కమీషన్లు కొట్టడం ప్రారంభించాడు. అంతా చవకరకం కలపతోనూ, చేశాం అంటే చేశాం, పూర్తి అయిందంటే పూర్తి అయిందన్నట్టుగా పని పూర్తి చేసి, రాజుగారిని కలిశాడు చారి.

''ఇల్లు పూర్తి అయిందయ్యా! వచ్చి చూడండి?'' అన్నాడు.

చూడ్డానికి రాజుగారొచ్చారు. ఇంటి తాళం తీశాడు చారి.

''పదండయ్యా'' అంటూ వెనక్కి తప్పుకున్నాడు. పద్ధతి ప్రకారం ముందు రాజుగారు లోనికి వెళ్తే వెనుక కార్మికులంతా వెళ్తారు. అయితే ఈసారి రాజుగారలా ముందు నడవలేదు.

''నువ్వు ముందు పద'' అన్నారు చారితో. ఆశ్చర్యంగా చూశాడు చారి.

''ఇది నీ ఇల్లు. నీ ఇంట్లోకి నువ్వే ముందు నడవాలి. నడువు'' అన్నారు. చారికంతా అయోమయం అనిపించింది.

''నలభై యేళ్ళుగా నమ్మకంగా పని చేశావు. ఎప్పుడూ పనిలో వేలెత్తి చూపించుకోలేదు. రిటైరవుతానంటున్నావు. నీకో మంచి గిఫ్ట్ ఇవ్వాలనుకున్నాను. అది ఇదే! ఈ ఇల్లు నీకే!'' అన్నారు రాజుగారు. చారిని తోడుకుని లోనికి నడిచారు. లోపలికి అడుగు పెడుతూ మనసులో లబోదిబో మన్నాడు చారి. ఎంత తప్పు చేశాను. సరిదిద్దుకోలేని తప్పు చేశాననుకున్నాడు. ఆఖరిదశలో తన చవకబారు పనితనానికీ, నేలబారు వ్యక్తిత్వానికీ కుంగిపోయాడు. కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

* * *

ఈ జీవితం నీది. నీ కోసమే ఈ జీవితం. నీ జీవితాన్ని నువ్వే క్షణక్షణం చివరి వరకూ ఓర్పుగా నేర్పుగా అందంగా మలచుకోవాలి. అలక్ష్యం చేస్తే ఆ ఫలితం కూడా నువ్వే అనుభవించాలి. అందుకు ఎవరూ బాధ్యులు కారు.

# చెక్

అయిపోయింది. సర్వనాశనం అయిపోయింది. వ్యాపారం దివాళా తీసినట్టే! పైసా అప్పిచ్చేవాడు లేడు. సరుకిచ్చేవాడు అంతకన్నా లేడు. వ్యాపారం చేయడం కష్టం. చేసిన అప్పులు తీర్చమని పీకల మీద కూర్చుంటున్నారు. ఆ అప్పులు తీరిస్తే అంతే సంగతులు! ఉండడానికి ఇల్లు కూడా ఉండదు. చేతిలో పైసా లేకుండా కుటుంబాన్ని పోషించడం కష్టం. అప్పుడు... అప్పుడేం చెయ్యాలి? అందర్నీ చంపేయాలి. లేదంటే అంతా చచ్చిపోవాలి. అంటే ఆత్మహత్యలు చేసుకోవాలి.

ఏడుపొచ్చింది మాధవ్‌కి. చేతుల్లో ముఖాన్ని దాచుకుని ఏడ్చాడు. అంతలోనే తననెవరయినా గమనిస్తున్నారేమోనని చేతులు తొలగించి చూశాడు. అనుకున్నట్టే అయ్యింది. ఎదురుగా అరవై అయిదేళ్ళ వయసున్న ఓ వ్యక్తి నిల్చుని ఉండి, మాధవ్‌నే గమనిస్తున్నాడు. ఛఛ అనుకున్నాడు. అక్కణ్ణుంచి వెళ్ళిపోయేం దుకు దిగ్గున లేచాడు మాధవ్. వారించాడా వ్యక్తి.

''కూర్చో'' అన్నాడు. మాధవ్‌ని కూర్చోపెట్టి, తనూ వచ్చి అతని ప్రక్కగా కూర్చున్నాడు. బాగా చీకటి పడిందేమో! పార్కులో ఎవరూ లేరు, వాళ్ళిద్దరే ఉన్నారు.

''బాగా కష్టాల్లో ఉన్నట్టున్నావు?'' అడిగాడా వ్యక్తి.

''చచ్చిపోవాలనిపిస్తోంది'' అన్నాడు మాధవ్. ఏడుస్తోన్న తనని ఎవరయినా గమనిస్తున్నారేమోనని ఇంతకు ముందు సిగ్గుపడిన మాధవే, ఇప్పుడు, కదిలించగానే కష్టాలన్నీ ఏకరువు పెట్టాడా వ్యక్తి ముందు.

''ఇప్పుడీ కష్టాల నుంచి గట్టెక్కాలంటే నీకెంత కావాలి?''

''యాభై లక్షలు కావాలి.''

జేబులోంచి చెక్‌బుక్ తీశాడా వ్యక్తి. ఏదో రాసి, సంతకం పెట్టిచ్చాడు. మాధవ్ చెక్‌ని చూశాడు. కోటి రూపాయలు! సంతకాన్ని చూశాడు. హరిశ్చంద్రప్రసాద్!

హరిశ్చంద్రప్రసాదంటే పెద్ద పారిశ్రామికవేత్త. వ్యాపారవేత్త. కోట్లకి పడగెత్తిన వ్యక్తి.

''సరిగ్గా వచ్చే సంవత్సరం ఇదే రోజున ఇక్కడే కలుద్దాం. అప్పుడు నా కోటి నాకిచ్చేయాలి'' అన్నాడా వ్యక్తి. కళ్ళు మూసుకుని, చేతులు జోడించాడు మాధవ్. తెరిచేసరికి అతను లేడు. వెళ్ళిపోయాడు.

కోటి రూపాయలున్నాయి. ధైర్యంగా ఉంది మాధవ్‌కి. ఆ ధైర్యంతో అతని ఆలోచనలు మారిపోయాయి. మాట తీరే మారిపోయింది. మాధవ్ మాటలే మూటలయ్యాయి. అప్పిచ్చిన వాళ్ళు ఆగారు. ఇవ్వనన్న వాళ్ళు కూడా సరుకివ్వసాగారు. వ్యాపారం గాడిలో పడింది. సజావుగా సాగింది. నిలదొక్కుకున్నాడు మాధవ్. అదృష్టం కలిసొచ్చింది. వ్యాపారంలో లాభాలొచ్చాయి. ఆర్నెళ్ళలో అప్పులు తీర్చేశాడు. ఏడాదయింది. ఏడాదయినా హరిశ్చంద్రప్రసాద్‌గారిచ్చిన చెక్‌ను వాడలేదతను. ఇక ఇప్పుడు దాని అవసరమే లేదు. చెక్ తిరిగి ఇచ్చేసేందుకు, హరిశ్చంద్రప్రసాద్‌గారిని కలిసేందుకు అనుకున్న రోజుకి పార్కుకి వచ్చాడు మాధవ్. అప్పటికే అక్కడ హరిశ్చంద్రప్రసాద్‌గారున్నారు. మాధవ్ కోసం నిరీక్షిస్తున్నట్టుగా ఉన్నారు.

''బాగా ఆనందంగా ఉన్నట్టున్నావు?'' మాధవ్‌ని చూస్తూనే అడిగారు హరిశ్చంద్రప్రసాద్.

''అవును సార్'' అంటూ డబ్బున్నదన్న ధైర్యంతో తనెలా మసలిందీ, ఎలా నిలదొక్కుకున్నదీ వివరంగా చెప్పుకొచ్చాడు మాధవ్.

''మీ మేలు ఈ జన్మలో మరిచిపోలేను?'' అన్నాడు. అంతలో అక్కడికి పరుగు పరుగున ఓ లావుపాటి నర్సొచ్చింది. హరిశ్చంద్రప్రసాద్‌ని దొంగని పట్టుకున్నట్టుగా గట్టిగా పట్టుకుంది.

''పద పద'' అంటూ అతన్ని లాక్కుపోతూ ఇలా అంది మాధవ్‌తో.

''హరిశ్చంద్రప్రసాద్ అంటూ అందరికీ చెప్పుకుంటాడు. చెక్‌లు కూడా ఇచ్చేస్తుంటాడు. ఛస్తున్నాం ఈ పిచ్చోడితో.''

పిచ్చి అతనికి కాదు, మనకి. డబ్బు లేదనుకుంటే పిచ్చెక్కిపోతాం. ఉందనుకుంటే ఆ తీరే వేరు! పరిస్థితులు మారిపోతాయి. మనుషులూ మారిపోతారు. తెలిసింది కాబట్టి అది చెల్లని చెక్. తెలియకపోతే అదే కోటి! ఏదయినా అంతే!

# రేపు

మధుకి పద్దెనిమిదేళ్ళు. అందంగా ఉంటాడు. క్యాన్సర్ పాపం! ఆఖరి దశలో ఉన్నాడు. ఏ రోజయినా వాడు చనిపోవచ్చు. డాక్టర్లు అలాగే చెప్పారు. అందుకే వాణ్ణి ఇరవై నాలుగ్గంటలూ కనిపెట్టుకుని ఉంటోంది వాళ్ళమ్మ. ఒంటేలుకి వెళ్ళినా వాడు, అమ్మకి చెప్పి వెళ్ళాలి.

కాలనీలో కొత్తగా మ్యూజిక్ షాప్ పెట్టారు. సంగీతం అంటే చాలా ఇష్టం మధుకి. సీడీలు కొనుక్కుని వస్తానన్నాడు. వద్దంది తల్లి.

''వెళ్తానమ్మా! బోరు కొడుతోంది'' బతిమలాడాడు. సరే నంది.

షాపుకి వచ్చాడు మధు. సీడీలు చూస్తున్నాడు.

''ఏం కావాలి సార్?'' తీయని గొంతు వినిపించింది. తల తిప్పి చూశాడు మధు. సేల్స్‌గర్ల్! తన ఈడుదే! చాలా అందంగా నవ్వుతూ అడుగుతోంది. ఆ నవ్వు కోసం చితి నుంచి లేచి రావచ్చ నిపించింది. మనిషి కూడా అందంగా ఉంది. తొలి చూపులోనే ఆమెను ప్రేమించేశాడు మధు. ఓ సీడీ కొన్నాడు.

''గిఫ్ట్ ప్యాక్ చేసి ఇవ్వనా?'' అదే అందమయిన నవ్వు నవ్వుతూ అడిగిందమ్మాయి. ఓకే చెప్పాడు మధు. సీడీని అందంగా ప్యాక్ చేసి ఇచ్చిందామె. తీసుకుని వచ్చేశాడు మధు. ఆనాటి నుంచీ ఇవాళో రేపో చచ్చిపోతాననుకున్న మధుకి, బతికితే బాగుణ్ణనిపించింది. దాంతో రోజూ మ్యూజిక్ షాప్‌కి రావడం, సీడీ కొనుగోలు వంకతో అమ్మాయిని చూడడం, నవ్వడం పనిగా పెట్టుకున్నాడు. ఆ అమ్మాయి కూడా మధు కోసమే ఎదురు

చూస్తున్నట్టుగా ఉండేది. మధు కొన్న ప్రతి సీడీనీ గిఫ్ట్ ప్యాక్ చేసి ఇచ్చేది. మధు ఫోన్ నెంబర్ కూడా అడిగి తీసుకుంది. కొత్త సీడీలు వస్తే ఫోన్ చేసి చెప్పేది. మర్నాడొస్తాడని తెలుసు. అయినా చెప్పడాన్ని అలవాటు చేసుకుంది ఆ అమ్మాయి.

మ్యూజిక్ షాప్ నుంచి అమ్మాయి ఫోన్లు, రోజూ మధు షాప్‌కి వెళ్ళడం, రూం నిండా ప్యాక్ కూడా విప్పని సీడీలు... అన్నీ గమనించింది తల్లి. మధు ప్రేమలో పడ్డాడని తెలుసుకుంది. ఆనందించింది. అడిగింది.

''నువ్వు ప్రేమిస్తోన్న సంగతి మరి ఆ అమ్మాయికి చెప్పావా?''

''లేదు! చెప్పాలి'' అన్నాడు మధు.

''ఇలాంటి విషయాల్లో ఆలస్యం చెయ్యకూడదురా. రేపు చెప్పేయ్'' అంది తల్లి. చెప్పడానికే ఆ రోజు షాప్‌కి వెళ్ళాడు మధు. షాప్ ఓనర్‌తో మాట్లాడుతూ బిజీగా కనిపించిందమ్మాయి. చాలా సేపు ఆమె కోసం చూశాడు. ఆమె కూడా మధుతో మాట్లాడాలని తాపత్రయపడింది. కాని ఇద్దరికీ వీలు చిక్కలేదు. ఓనర్ ఆమెను సీడీల స్టాక్ గురించి, అమ్మకాల గురించీ ఆరా తీస్తూ తల తిప్పనివ్వలేదు. తిరిగొచ్చేశాడు మధు.

మర్నాడు మధు షాప్‌కి రాలేదు. ఎప్పుడూ సాయంత్రం అయిదు గంటలకల్లా వచ్చే మధు రాలేదు. తన మీద కోపం వచ్చిందేమో అనుకుంది అమ్మాయి. ఇంటికి ఫోన్ చేసింది.

''హలో'' అంది మధు వాళ్ళమ్మ.

''మధు ఉన్నారాండీ?'' అడిగిందమ్మాయి. జవాబుగా ఏడుపు వినవచ్చింది.

''ఏమయిందాంటీ?''

''మధు నిన్న రాత్రే చనిపోయాడమ్మా.''

చాలా సేపటి దాకా అటు నుంచి ఎలాంటి శబ్దమూ లేక తర్వాత ఫోన్ పెట్టేసిన శబ్దం వినవచ్చింది.

పదే పదే మధుని గుర్తు చేసుకుంటూ వాడి గదిలో ఉన్న వస్తువుల్ని సర్దసాగింది వాళ్ళమ్మ. సీడీలు కుప్పగా కనిపించాయి. అన్నీ ప్యాక్‌తోనే ఉన్నాయి. ఒక్కటీ విప్పి లేదు. మధుకి ఇష్టమయిన పాటలేమిటో చూడాలనుకుంది తల్లి. ఓ సీడీ ప్యాక్ విప్పి చూసింది. అందులోంచి ఓ కాగితం జారి పడింది. అందులో ఇలా రాసి ఉంది.

'మీరు చాలా అందంగా ఉన్నారు. మీతో ఎంత సేపయినా మాట్లాడాలనిపిస్తోంది. దాన్ని 'ప్రేమ' అంటే నాకు అభ్యంతరం లేదు.

–సుధ'

మధు వాళ్ళమ్మ మరో సీడీని విప్పి చూసింది. అందులో ఇదే మాట! మరో సీడీ, మరో సీడీ...అన్నిటా ఇదే మాట! గగ్గోలుగా ఏడ్చిందామె.

** *

రేపు అన్నది ఉంటుందో! ఉండదో! మనసులో మాటకి మాత్రం 'రేపు' అనే ఆలోచన రానివ్వద్దు.

# మచ్చ

కష్టం వచ్చినా నష్టం వచ్చినా కలిసే ఉండాలన్నాడు తండ్రి. అలా ఉంటేనే వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉంటుందన్నాడు. చనిపోతూ పోతూ నలుగురు కొడుకుల్నీ నాలుగు రకాలుగా ఆలోచించవద్దన్నాడు. ఎవరో ఒకరిని నమ్మండి! వాడు చెప్పినట్టుగా మిగిలిన వాళ్ళు వినం డన్నాడు. అలాగేనన్నారు కొడుకులు. రెండోవాడు బాగా ఆలోచిస్తాడు. వ్యాపార లావాదేవీలన్నీ వాడికి తెలుసు. వాడి మాటే వింటూ వచ్చారు. అలా వినడం వల్ల పెంకుటిల్లు పెద్ద మేడ అయింది. ఒక కారు, నాలుగు కార్లయ్యాయి. చేస్తోన్న వ్యాపారంగాక, మరో రెండు మూడు వ్యాపారాలు ప్రారం భించారు.

రోజులు బాగానే గడుస్తున్నాయని అనుకున్నంతలో కొత్త వ్యాపారంలో కొంత నష్టం వచ్చింది. దాన్ని పూడ్చే ప్రయత్నంలో చిన్న తప్పటడుగు వేశాడు రెండోవాడు. ఆ అడుగుతో వ్యాపారాలన్నిటా నష్టాలు రాజుకున్నాయి. మేడా, కార్లూ అమ్మకానికి వచ్చాయి. తట్టుకోలేకపోయారు అన్నదమ్ములు. రెండోవాడి మీద తెగ రెచ్చిపోయారు. తప్పు చేసినందుకు తలొంచుకున్నా, క్షమించండన్నా వినలేదెవరూ. రెండోవాణ్ణి వేలెత్తి చూపించారు. వేరుపడదాం అన్నారు. వద్దంటే వినడం లేదెవరూ. ఆ సమయంలో వచ్చాడక్కడికి బాబాయ్. ఒకప్పుడు ఆ ఇంట బాబాయ్ అడుగు పెడితే సంబరాలే సంబరాలు, విందులే విందులు. ఇప్పుడు అవేవీ లేవు. బాబాయ్‌ని ఎవరూ సరిగా పట్టించుకోలేదు.

''ఏం జరిగింది?'' అడిగాడు బాబాయ్.

జరిగిందంతా చెప్పుకొచ్చాడు రెండోవాడు. వయసులో చిన్నవాడయినా, ఇంటినీ, వ్యాపారాల్నీ ఒంటి చేత్తో నడిపిస్తున్నాడని, రెండో వాడంటేనే బాబాయ్‌కి చాలా ఇష్టం. బాబాయ్‌ని కూడా రెండోవాడే ఎక్కువగా అభిమానిస్తాడు. ఆ కారణంగా వాళ్ళిద్దరే మాట్లాడుకుంటున్నారు.

''రేపోసారి అందరితో కూర్చుందాం'' అన్నాడు బాబాయ్.

''ఆ రోజులు పోయాయి. కూర్చోరు'' అన్నాడు రెండోవాడు.

''ఆ మాట నువ్వనకూడదు. ప్రయత్నించు. అందరినీ ఒక చోటకి చేర్చు. నేను మాట్లాడతాను'' అన్నాడు బాబాయ్. ప్రయత్నించాడు రెండోవాడు. సాధించాడు. అందరూ ఒక చోటకి చేరారు. చేతిలో ఓ తెల్ల కాగితంతో బాబాయ్ వచ్చాడక్కడికి.

''ఏంటి బాబాయ్, మా బాధల్లో మేముంటే నువ్వేంటి... సభలు తీరుస్తున్నావు'' అడిగారన్నదమ్ములు.

''మీ కోసమే'' అన్నాడు బాబాయ్. తాను తెచ్చిన తెల్లకాగితం మీద, మధ్యలో బ్లాక్‌పెన్నుతో చిన్న డాట్ పెట్టి, అది చూపించాడు వాళ్ళకి.

''ఏం కనిపిస్తోంది?'' అడిగాడు.

''బ్లాక్‌డాట్'' చెప్పాడొకడు.

''నీకు?''

''నాకూ అదే, బ్లాక్ డాటే కనిపిస్తోంది.''

''ఇంకేమీ కనిపించట్లేదా?''

''లేదు.''

''నీకు?'' ఇంకొకణ్ణి అడిగాడు బాబాయ్.

''నాకూ బ్లాక్‌డాటే కన్పిస్తోంది.''

''చుట్టు ప్రక్కల ఇంకేదీ కనిపించట్లేదు.''

''లేదు'' అన్నారంతా ఒకేసారి.

''ఎందుకు లేదు? ఇంత పెద్ద తెల్లకాగితం కన్పించడం లేదూ? అంటే మీ దృష్టిలోనే లోపం ఉంది. చిన్న మచ్చను చూడగలుగుతున్నారు కాని, కన్పిస్తున్న, ఈ కాగితాన్ని మీరు పట్టించుకోవడం లేదు'' అన్నాడు బాబాయ్.

''జీవితంలోనూ, వ్యాపారంలోనూ అనేక మార్పులొస్తాయి. మంచినీ మార్పునీ పట్టించుకోరెవరూ. మచ్చనే పట్టించుకుంటారు. అదే తప్పు. మీకున్న నాలుగు వ్యాపారాల్లో ఇప్పుడొచ్చిన సమస్య, ఇదిగో ఈ పెద్ద కాగితం మీద ఈ చిన్న మచ్చలాంటిది. చాలా చిన్నదిది. చెరిపేయొచ్చు. కళ్ళు కుంచించి చూడకండి. విశాలం చేసి చూడండి. చూస్తేనే నిజానిజాలు తెలుస్తాయి. అప్పుడు రెండోవాడి తప్పు, తప్పుగా మీకు కనిపించదు. క్షమిస్తారు వాణ్ణి. ప్రోత్సహిస్తారు'' అన్నాడు బాబాయ్.

అలాగే జరిగింది. మళ్ళీ నలుగురూ ఒక్కటయ్యారు.

# కొబ్బరి బొండాలు

బాస్ ఇద్దర్నీ పిలిచాడు. అయిదేళ్ళుగా కష్టపడి పని చేస్తు న్నారంటూ ఇద్దర్నీ మెచ్చుకున్నాడు. ఇద్దరికీ ప్రమోషన్లు ఇచ్చాడు. శేఖరాన్ని సేల్స్ ఎగ్జిక్యూటివ్‌ని చేశాడు. తనని సేల్స్ రిప్రజెంటేటివ్‌ని చేశాడు. అదే కోపంగా ఉంది రామానికి. శేఖర్, తనూ ఇద్దరూ డిగ్రీ చేశారు. ఇద్దరూ కంపెనీ కోసం రాత్రీ పగలూ కష్టపడ్డారు. ఇద్దరూ కష్టపడితే ఒకరికి అట్లు ఇంకొకరికి ముక్కానా? వివక్ష చూపించాడు బాస్. తట్టుకోలేకపోతున్నాడు రామం. నిద్రపట్టట్లేదతనికి. ఇక ఈ కంపెనీలో ఉండకూడదు. తప్పుకోవడం బెటర్. ఉంటే శేఖర్ కింద పని చెయ్యాలి. నిన్న మొన్నటి వరకూ తనూ, శేఖర్ ఒకటే! ఇప్పుడీ తేడాని కల్పించారు. హరాయించుకోలేకపోయాడు రామం. ఉద్యోగానికి రాజీనామా చెయ్యాలనుకున్నాడు.

తెల్లారింది. రాజీనామా లేఖను తీసుకెళ్ళి బాస్ ముందుం చాడు రామం. చదివి, సన్నగా నవ్వాడు బాస్.

''మీకు నవ్వు వస్తోందేమోగాని, నాకు మాత్రం చాలా బాధగా ఉంది సార్'' అన్నాడు రామం.

తనంత తానుగా రాజీనామాను రామం వెనక్కి తీసుకోవాలి. శేఖర్ ప్రమోషన్ని ఒప్పుకోవాలి. ఏం చెయ్యాలి? ఆలోచించాడు బాస్.

''నీ రాజీనామా సంగతి తర్వాత చూద్దాం. ముందో చిన్న సాయం చెయ్యి! వీధిలో కొబ్బరిబొండాలు అమ్ముతున్నదీ లేనిదీ చూసిరా'' అన్నాడు. రామం చూసొచ్చాడు.

''కొబ్బరిబొండాలు అమ్ముతున్నార్సార్'' చెప్పాడు.

''ఎంతట?'' అడిగాడు బాస్.

''బొండాం పన్నెండు రూపాయలు.''

శేఖరాన్ని పిలిచాడు బాస్.

''వీధిలో కొబ్బరిబొండాలు అమ్ముతున్నదీ లేనిదీ చూసిరా'' చెప్పాడు.

ఇదేంటి? అమ్ముతున్నారని తను చెప్పాడు కదా, ధర కూడా చెప్పాడు. అయినా శంఖంలో పోస్తేనే కాని, తీర్థం కాదా? శేఖర్ చెబితేనే కరెక్టా? ఏం మనిషో! అనుకున్నాడు రామం. అంతలో వీధిలోకెళ్ళి తిరిగొచ్చాడు శేఖర్. చెప్పాడిలా.

''కొబ్బరిబొండాలు అమ్ముతున్నార్సార్. అయితే వీధి చివర ఒకే ఒకడు అమ్ముతున్నాడు. ఒకటి పన్నెండు రూపాయలు. అదే పది బొండాలు తీసుకుంటే వందకిస్తానంటున్నాడు. బండి మీద ఓ వంద బొండాలున్నాయి. కిందో రెండొందలున్నాయి. నీళ్ళ బొండాలే సార్. బెంగుళూర్ బొండాలు.''

గుక్క తిప్పుకోకుండా బొండాలు గురించి శేఖర్ చెబుతోంటే రామం నోరెళ్ళబెట్టాడు. తనకీ, శేఖర్‌కీ తేడా ఏమిటో తెలిసిందతనికి. శేఖర్ దగ్గర చాలా నేర్చుకోవాలనుకున్నాడు. బాస్ టేబుల్ మీది రాజీనామాని అందుకుని చించేశాడు.

''సారీ'' చెప్పాడు బాస్‌కి.

* * *

విజయాన్ని అందుకున్న ప్రతివ్యక్తీ, ప్రతిదాన్నీ లోతుగా పరిశీలిస్తాడు. ప్రతి దాని గురించీ సమగ్రంగా ఆలోచిస్తాడు. మనం రేపటి గురించి మాత్రమే ఆలోచిస్తే అతడు వచ్చే సంవత్సరం గురించి ఆలోచిస్తాడు. ఇద్దరికీ రోజుల్లో చాలా తేడా ఉంది. సంవత్సరానికి మూడువందల అరవై అయిదు రోజులయితే, రేపుదేముంది? ఇవాళ గడిస్తే రేపు రేపే!!

# కళ్ళు

తనని అంతా 'గుడ్డిరాణి' అని పిలుస్తారు. అసహ్యించుకుంటారు. దగ్గరకు రానీయరెవరూ. నలుగురు కలిసి కబుర్లాడుకుంటుంటే సరదాగా విందామని దగ్గరగా వెళ్ళబోతే చాలు!

'ఎళ్ళెహె! నీకెందుకీ కబుర్ల'ంటారు. కుక్కని కసిరినట్టుగా కసురుతారు. అందుకే గుడి వెనుక బిచ్చగాళ్ళంటే రాణికి పడదు. కాని, అక్కడే ఉండాలి. అక్కడే బతకాలి. ఇంకో చోటుకి వెళ్ళకూడదు. వెళ్తే ఒక వీధికి చెందిన కుక్క ఇంకో వీధికి వెళ్తే ఎలా పోట్లాడుకుని, కాట్లాడుకుంటాయో, అలాగే బిచ్చగాళ్ళంతా మీద పడిపోతారు. అందుకే ఎక్కడికీ వెళ్ళాలనుకోదు రాణి. అక్కడికక్కడే తిరుగుతూ ఉంటుంది. ఆ తిరగడం సాటి బిచ్చగాళ్ళకు నచ్చదు.

''గుడ్డిదానివి ఒక చోట కూచోకుండా, రంగుల రాట్నంలా ఆ తిరుగుళ్ళేటే?'' అని విసుక్కుంటారు. విసుగుకోనిది కుంటిబాబు ఒక్కడే! ఎంత తిరిగితే అంత మంచిదంటాడతను. అన్ని చోట్లూ అర్థమవుతాయంటాడు. అలాగే కుంటిబాబు మాత్రమే గుడ్డి

రాణిని 'రాణీ' అని ముద్దుగా పిలుస్తాడు. అడుక్కుని తెచ్చింది ప్రేమగా పెడతాడు. రాణికి పకోడీ అంటే ఇష్టం. గంజిబువ్వలో పకోడి నంజుకు తినడం చాలా ఇష్టం. ఆ ఇష్టాన్ని వారానికి రెండు మూడుసార్లు తీరుస్తూ వస్తున్నాడు కుంటిబాబు.

ఒకసారి అడిగింది.

''పకోడీ ఏ రంగులో ఉంటాది?''

''నీలాగే ఎర్రగా ఉంటాది. బాగుంటాది'' అన్నాడు కుంటిబాబు. అప్పటి నుంచే కుంటిబాబంటే ప్రేమ పడసాగింది రాణి.

''నాకు దేవుడు కళ్ళిస్తే నిన్ను చూడాలని ఉందయ్యా'' అంది ఓసారి.

''అప్పుడు నిన్నే పెళ్ళి చేసుకుంటాను'' అంది.

''నిజంగా'' ఆశపడ్డాడు కుంటిబాబు.

''నిజం. ఒట్టు'' అంది రాణి.

అంతే! ఏడాది వరకూ ఏమయిపోయాడో తెలీదు. ఎక్కడికెళ్ళాడో తెలీదు. కుంటిబాబు ఎవరికీ కనిపించకుండాపోయాడు. ఏడాది తర్వాత తిరిగొచ్చాడు.

''నీకు కళ్ళొస్తాయి. ఆపరేషన్ చేయిస్తాను, పద'' అన్నాడు రాణితో.

''అంతడబ్బెక్కడిది?'' అడిగింది రాణి.

''అది నీకు అనవసరం'' అన్నాడు కుంటిబాబు. అంతేగాని, తను కిడ్నీ అమ్ముకున్న సంగతి రాణికి చెప్పలేదు. ఆపరేషన్ చేయించాడామెకు. కళ్ళొచ్చాయి రాణికి. అన్నీ చూడగలుగుతోందామె. పచ్చని చెట్లని చూసింది. ఆకాశాన్ని చూసింది. ఆకాశంలో పున్నమి చంద్రుణ్ణి చూసింది. ఎంత బావుందో అని మురిసిపోయింది. ఆ వెంటనే 'రాణీ' అంటూ వచ్చిన కుంటిబాబుని చూసి కుంగిపోయింది. కుంటిబాబుకి కాళ్ళే కాదు, కళ్ళు కూడా లేవు. చాలా అసహ్యంగా ఉన్నాడతను. చిరిగిన నిక్కరులో, విరిగిన కాళ్ళతో డేకుతూ వచ్చిన కుంటిబాబు, 'రాణీ రాణీ' అంటూ తన కోసం చేతులు జాచి వెదుకుతూంటే అందకుండా పరుగుదీసింది రాణి. పారిపోయింది అక్కణ్ణుంచి. కళ్ళూ కాళ్ళూ లేని వాణ్ణి కట్టుకుని సుఖపడలేననుకుంది. గుడి కాపలాదారుని కట్టుకుంది. కళ్ళకి కాటుక పెట్టుకుంది. నుదుటన బొట్టుపెట్టుకుంది. ఇప్పుడు 'గుడ్డిరాణి' ని అంతా 'రాణీ' అని పిలుస్తున్నారు. అలా పిలిచినప్పుడల్లా కుంటిబాబు గుర్తొచ్చి, అలా పిలవకుండా ఉంటే బాగుణ్ణనిపిస్తూంది.

ఒకరోజు, రాణికెవరో చిన్న కాగితం తెచ్చిచ్చారు. విప్పి చదివింది దాన్ని. అందులో ఇలా రాసి ఉంది.

'నీ కళ్ళు జాగ్రత్త! ఒకప్పుడవి మనకళ్ళు. నీకూ నాకూ ఇద్దరికీ నా రెండు కళ్ళూ చాలనుకున్నాను. ఇప్పుడవి, కేవలం నీవే! జాగ్రత్త! కళ్ళు లేకపోతే కాపురాలు కూలిపోతాయి.

–కుంటిబాబు'

# ఓటికుండ

కొండ మీద కుటీరానికి తాగునీరు పోస్తాడతను. రెండు కుండల నీటిని పోస్తాడు. కింద సెలయేరు నుంచి నీటి కుండల్ని కొండ మీదకి మొయ్యాలి. మోస్తాడతను. రెండు కుండల్నీ రెండు భుజాల మీద ఉంచుకుని అంతెత్తున ఉన్న కొండ మీదకి, కుటీరానికి రావాలతను. వస్తాడు. రెండు కుండల నీటిని మోసుకుని వచ్చి కుటీరంలో  పోసినందుగ్గాను నెలకి వెయ్యి రూపాయలు జీతంగా అందుకుంటున్నాడు. అయితే రెండు కుండల్లో ఓ కుండ ఓటికుండ. చిన్న పగులు ఉంది దానికి. దాంతో నిండుగా నీరు నింపినా కుటీరానికి చేరుకునే సరికి ఆ కుండలో నీరు సగం మాత్రమే ఉంటోంది. కుండన్నర నీరు మాత్రమే కుటీరానికి అందుతోంది. రెండేళ్ళగా ఇదే జరుగుతోంది.

ఓటికుండను చూసి మంచికుండ నవ్వని రోజంటూ లేదు. తన గొప్పతనాన్నంతా ఆ నవ్వులో చూపిస్తూ, ఓటికుండని వెక్కిరించని క్షణం అంటూ లేదు. దాంతో ఓటికుండకి తప్పు చేస్తున్నానన్న బాధపట్టుకుంది.

పాపం! కష్టానికి తగిన ప్రతిఫలం అందుకోవట్లేదతను. తను ఓటికుండని అతనికి తెలుసో తెలియదో! నిజం చెప్పాలనుకుంది ఓటికుండ.

ఓ రోజు సెలయేరులో ఓటికుండని నీట ముంచుతున్నప్పుడు అతనితో అదిలా అంది.

''మిత్రమా! నువ్వు నన్ను క్షమించాలి. నేను ఓటికుండని. నీ శ్రమంతా వృథాపోతోంది. నిండుగా నన్ను నీటితో నింపినా నేను అరకుండ నీరు మాత్రమే కుటీరానికి తీసుకు రాగలుగు తున్నాను. సగం నీరు నేల పాలవుతోంది.''

''అయితే'' అడిగాడతను.

''అయితే ఏమిటి మిత్రమా! నువ్వు చూడలేదేమో! ఈ పక్కన నాకు పగులుంది. ఇందులోంచి నీరు సన్న సన్నగా పోతోంది. కింద నుంచి నువ్వు కొండక్కే లోపు సగానికి సగం నీరు వృథా చేస్తున్నాను. చేస్తున్న పనికి సిగ్గుగా ఉంది. ఓటికుండనని బాధగా ఉంది.''

''నీ సంగతి నీకు తెలియదయితే'' నవ్వాడతను.

''కొండ ఎక్కుతున్నప్పుడు ఎన్నడయినా కిందకి చూశావా?'' అడిగాడు.

''లేదు'' అంది ఓటికుండ.

''కుటీరంలో దేవుడి గదిని చూశావా?''

''లేదు.''

''ఇవాళ ఆ రెండూ చూడు'' అన్నాడతను. చూసింది ఓటికుండ. కొండ ఎక్కుతోంటే తనున్న వైపంతా పువ్వులే పువ్వులు! మొక్కలన్నీ పచ్చపచ్చగా ఉండి, పువ్వులతో కళకళలాడుతున్నాయి. ఆనంద మనిపించింది. దేవుడి గది చూసింది. అక్కడా పువ్వులే! రకరకాల రంగు రంగుల పువ్వులు. పువ్వుల్లో దేవుడు మునిగిపోయాడు. చూడచక్కననిపించాడు. అయినా ఓటికుండ బాధ తీరలేదు.

''వద్దు మిత్రమా! నన్నొదులుకో! ఇంకో మంచి కుండని కొనుక్కో! నా మాట విను'' అంది.

నవ్వాడతను. ఇలా అన్నాడు.

''కొండ ఎక్కుతున్నప్పుడు చూశావు కదా, పువ్వులూ మొక్కలూ నిండుగా ఎలా ఉన్నాయో! అవి నీ వైపునే ఉన్నాయి. మంచి కుండ వైపు ఉన్నాయా? లేవు. అంటే అర్థం, నేను నిన్ను ఎప్పుడో గమనించాను. నువ్వు ఓటికుండవని నాకు తెలుసు. తెలిసే వూరుకున్నాను. ఎందుకు వూరుకున్నానంటే నీ వల్ల ఓ ప్రయోజనం ఉంది. మొక్కలకి నువ్వు నీరు పోస్తున్నావు. నీ పగులులోంచే వాటికి నీరు అందుతోంది. అవి ఎదగడానికి నువ్వే కారణం. పువ్వులకు కూడా నువ్వే ప్రాణం. పూజకి ఆ పువ్వుల్నే ఇస్తున్నాను. నెలకి పదిహేను వందలు సంపాదిస్తున్నాను. ఓటికుండవయినా నీ వల్లే నాకు లాభం ఎక్కువ. అందుకని నిన్నెప్పుడూ నేను వదులుకోను. నువ్వెప్పుడూ నాతోనే ఉండాలి. ఉంటావు'' అన్నాడతను. ఆ మాటకి పొంగిపోతూ మంచి కుండ వైపు చూసింది ఓటికుండ. మూతి బిగించుకుని ఉంది మంచి కుండ. దాని మొహాన నవ్వు లేదిప్పుడు.

# కోరిక

ఏటి ఒడ్డున కూర్చుని ఆకాశం కేసి చూస్తున్నాడు రాము. ఆకాశంలో ఎగురుతున్న పక్షులకేసి చూస్తున్నాడు. రెక్కలు విప్పుకుని ఎంచక్కా హాయిగా ఎగురుతున్న పక్షుల్ని చూసిన కొద్దీ వాడికి చూడాలనిపిస్తోంది. పక్షిలా ఆకాశంలో ఎగరాలని, ఆకాశం అంచులు తాకాలని వాడికో కోరిక. గోడలెక్కి, చెట్లెక్కి, అక్కణ్ణుంచి దూకుతూ ఎగరాలని చాలా సార్లు ప్రయత్నించాడు. దెబ్బలు తగిలాయి కాని, ఎగరలేకపోయాడు. కనీసం కోడిలా ఎగిరి గడ్డివాము కూడా ఎక్కలేకపోయాడు. ఎక్కడో తనలో లోపం ఉంది. అందుకే ఎగరలేక పోతున్నాను అనుకున్నాడు. ఆ బాధ వాణ్ణి తినేస్తోంది. అది మరచిపోవడానికే ఏటి ఒడ్డుకొచ్చాడు.

ఆటవిడుపు వేళేమో! పిల్లలంతా ఒడ్డున గోలగోలగా ఆడు కుంటున్నారు. గాలిపటాలు ఎగరేస్తూ నడుస్తున్నారు. పరుగులు తీస్తున్నారు. వాళ్ళని తనివితీరా చూస్తున్నాడు బాబు. కాళ్ళతో నడవడం, పరిగెత్తడం అద్భుతం. ఆ అదృష్టం తనకు లేదను కున్నాడు వాడు. చిన్నప్పుడే కాళ్ళు చచ్చుబడిపోయాయి. నడవ లేడు బాబు.

చాలా రోజులుగా బాబుని చూస్తున్నాడు రాము. పరిచయం ఉన్నట్టే! వాడితో మాట్లాడాలనిపించింది. దగ్గరగా వెళ్ళి పలక రించాడు.

''పాపం! కాళ్ళకి ఏమయింది? అలా ఉన్నాయి.'' అడిగాడు రాము.

''తెలీదు. చిన్నప్పణ్ణించీ అలానే ఉన్నాయి'' అన్నాడు బాబు.

''ఆకాశంలో పక్షుల్ని చూశావా? వాటిలా నాకు ఎగరాలని కోరిక. తీరట్లేదు'' అన్నాడు రాము.

''నాకు నీలా నడవాలని, పరిగెత్తాలని కోరిక. తీరట్లేదు'' అన్నాడు బాబు.

సాయంత్రం అయింది. బాబుని తీసుకుని వెళ్ళేందుకు తండ్రి వచ్చాడక్కడికి. చక్రాలకుర్చీ తీసుకొచ్చాడు. ప్రతిరోజూ చలచల్లని వేళ బాబుని చక్రాల కుర్చీలో ఏటి ఒడ్డుకి తీసుకుని వస్తాడు తండ్రి. ఇసుకలో కాసేపు ఆడుకోనిస్తాడు వాణ్ణి. చీకటిపడే వేళ కుర్చీ తెచ్చి, అందులో కూర్చోపెట్టి తీసుకునిపోతాడు.

''అదిగో నాన్నొచ్చాడు. ఇవాళ కూడా నా కోరిక తీరలేదు. వెళ్ళిపోతున్నాను.'' బాధపడ్డాడు బాబు.

ఆలోచించాడు రాము. బాబు తండ్రి దగ్గరకు పరిగెత్తుకుని వెళ్ళాడు.

తండ్రితో ఏం మాట్లాడాడో బాబుకి వినిపించలేదు కాని, తండ్రి నవ్వుతూ 'సరే'నన్నట్టుగా తలూపడాన్ని మాత్రం బాబు చూశాడు.

రాము పరిగెత్తుకుని వచ్చాడు బాబు దగ్గరకి.

''నీ కోరిక నేను తీరుస్తాను, రా'' అన్నాడు.

''నువ్వు నడుస్తావు. పరిగెడతావు'' అన్నాడు.

బాబుని భుజాల మీదకి ఎత్తుకున్నాడు. ముందు మెల్లగా నడిచాడు. తర్వాత గబగబా నడిచాడు. ఆ తర్వాత పరుగందుకున్నాడు రాము. ఒడ్డున వేగంగా పరిగెత్తడం రాముకి అలవాటే!

వేగంగా లేడిలా పరుగుదీస్తున్నాడు రాము. గాలిని కోసుకుంటూ రివ్వున దూసుకుపోతున్నాడు. అలా దూసుకుపోతుంటే వాళ్ళిద్దరి చెవులూ హోరెత్తిపోతున్నాయి.

నడిచింది రాము కాదు, తను. పరుగుదీస్తోంది రాము కాదు, తను అనుకుంటూ ఆనందిస్తున్నాడు బాబు. ఆ ఆనందంలో చేతులు రెండూ పక్షి రెక్కల్లా చాచాడు. కిందకీ మీదికీ వాటిని ఆడించసాగాడు. అప్పుడు ఎగురుతున్నట్టనిపించింది బాబుకి.

''బలేగా ఉంది. నేను పక్షిలా ఎగురుతున్నాను.'' కేకేశాడు బాబు.

ఆ మాట వినిపించింది రాముకి. బాబు కోరిక తను తీరిస్తే, తన కోరిక బాబు తీర్చాడనుకున్నాడు. మరింత హుషారుగా పరుగందుకున్నాడు. వాళ్ళని చూస్తూ బాబు తండ్రి కన్నీళ్ళు పెట్టుకుని, మేఘమై వర్షించాడు.

# దసరా

నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఎప్పటి లాగే ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు ఆలయ ధర్మకర్తలు. క్రికెట్ పోటీలు ఆఖరి దశకు చేరుకున్నాయి. ఫైనల్‌లో దుర్గావీధి జట్టు, శివాలయం వీధి జట్టు తలపడుతున్నాయి. శివాలయం వీధి జట్టు ఇరవై ఓవర్లలో 120 పరుగులు చేసి, ఆలవుట్ అయింది. వారి మీద గెలవాలంటే దుర్గావీధి జట్టు 121 పరుగులు చెయ్యాలి. నూట పన్నెండు పరుగులు చేసింది దుర్గావీధి జట్టు. ఇంకా తొమ్మిది పరుగులు చెయ్యాలి. తొమ్మిది పరుగులు చేస్తే విజయాన్ని సొంతం చేసుకుంటుంది. ఆఖరి ఓవర్‌లో మూడు బాల్స్ మిగిలాయి. మూడు బాల్స్‌కీ తొమ్మిది పరుగులు చెయ్యాలి.

రేపు దశమి. గెలుపొందిన వారు పండగపూట పదివేలు అందుకుంటారు. ఓడిపోయిన వారు ఉత్త చేతుల్తో వెను తిరుగుతారు. వెను తిరిగి వీధిలోకి వెళ్తే చెప్పేదేముంది? ఎవరూ పలకరించరు. పట్టించుకోరు. పండగ రోజని కూడా చూడకుండా చీదరించుకుంటారు. భరించలేరది. అందుకని ఎట్టి పరిస్థితుల్లో గెలిచి తీరాల్సిందేననుకుంటు న్నాయి, ఇరు జట్లూ. శివాలయం వీధి జట్టు కెప్టెన్ బాగా హడావుడి చేస్తున్నాడు. ఫీల్డింగ్‌లో ఎవ రెక్కడ ఉండాలో అరిచి చెబుతున్నాడు. దుర్గావీధి జట్టు బ్యాటింగ్ చేస్తోంది. బాల్‌ని సంతోష్ ఎదుర్కోవాలి. సంతోష్ బాగానే బ్యాటింగ్ చేస్తాడు. విన్నింగ్ బాల్ ఎప్పుడూ వాడిదే! గత రెండేళ్ళగా జట్టుని విజయపథంలో నడిపిస్తున్నాడు వాడు.

కొట్టాడంటే సిక్సర్లా, ఫోర్లే! మూడు బాల్స్ ఉంటే మాత్రం... గెలుపు సునాయాసంగా చేజిక్కించుకోగలమన్న ధీమాతో ఉంది దుర్గావీధి జట్టు.

బాల్‌ని పరీక్షగా చూశాడు బౌలర్. తొడ దగ్గర దాన్ని రుద్ది రుద్ది పెట్టాడు. నుదుటి చెమటను తీసి దానికి అద్దాడు. బౌలింగ్ చేసేందుకు సిద్ధమయ్యాడు. అతని బాల్‌నే సంతోష్ ఎదుర్కోవాల్సి ఉందిప్పుడు. అందుకు సిద్ధమయ్యాడు సంతోష్. బ్యాట్‌ని పట్టుకుని స్టడీ అయ్యాడు. బాలొచ్చింది. కొట్టాడు సంతోష్. 'ఫోర్' అన్నాడు అంపైర్. నూట పదహారు పరుగులయ్యాయి. ఇంకా అయిదు పరుగులు చెయ్యాలి. చేసేస్తాడు సంతోష్. రెండు బాల్స్, అయిదు పరుగులు. వాడికేం పెద్ద కష్టం కాదు. ఇప్పుడో ఫోర్ కొట్టి, తర్వాతో సింగిల్ రన్ తీసినా చాలన్నారు. బాలొచ్చింది. బలంగా కొట్టాడు సంతోష్. ఫోర్‌కి పోవాల్సిందే! అడ్డుకున్నారు. దాంతో రెండు పరుగులు కన్నా ఎక్కువ చెయ్యలేకపోయాడు సంతోష్. నూట పద్దెనిమిది పరుగులయ్యాయి. ఒకే ఒక బాల్ ఉంది. ఆ బాల్‌కి మూడు పరుగులు చెయ్యాలి. సంతోష్ చేస్తాడా? చెయ్యగలుగుతాడా? అనుమానాలు చెలరేగాయి. వాడికిది అలవాటే! రెండేళ్ళగా ఇంతే! టెన్షన్‌లో ఉంచి, రిలీజ్ చేస్తాడు. గెలుపు ఖాయం అనుకున్నారు దుర్గావీధి జట్టు.

''సంతోష్! సంతోష్! సంతోష్'' ముక్తకంఠంతో అరుస్తూ వాణ్ణి ఉత్సాహపరచసాగారంతా. సంతోష్ కూడా గెలిపిస్తాననే గట్టి నమ్మకంతో ఉన్నాడు. కళ్ళు మూసుకుని గెలుపు సంబరాల్ని ఊహించుకోసాగాడు. గెలిచినందుకు తమనంతా అభినందిస్తూంటే, ఓడినందుకు శివాలయం వీధి జట్టుని ఆ వీధిలో వారంతా చిన్నచూపు చూడడం తట్టుకోలేకపోయాడు. పండగపూటా వారలా చిన్నచూపుకి గురవడం ఇష్టం లేకపోయింది వాడికి. దాంతో ఏం చేశాడో తెలుసా?

ఏం చేశాడేం చేశాడు?

బాల్‌ని బలంగానే కొట్టాడు సంతోష్. అది ఫోర్‌కి వెళ్ళదు గాని, మూడు పరుగుల్ని సులువుగా సాధించి పెడుతుంది. వేగంగా పరుగులు తియ్యాలి. అయితే రెండంటే రెండే పరుగులు చేసి, మూడో పరుగు తన వల్ల కాలేనట్టుగా నిలబడిపోయాడు సంతోష్. 120 పరుగులు మాత్రమే చేశాడు. ఆట డ్రాగా ముగిసింది. ఇరు జట్లూ గెలిచినట్టే! నవ్వుకున్నాడు సంతోష్. దసరా అంటే సరదా అనుకున్నాడు.

# ఓ పువ్వు పూసింది

అక్కడెక్కడో నేలంతా పచ్చగా ఉంటుందని విన్నది. మొక్కలే మొక్కలని చెప్పారు. వర్షం పడుతుందనీ, నీరు కాలవలై ప్రవహిస్తుందనీ విన్నది. అదంతా నిజమా? కలా? ఏదేమయినా వినడానికి ఎంత బావుందో!

ఇక్కడ చుక్క వర్షం పడదు. పచ్చగా మొక్క కనబడదు. ఇక నీరు కాలవలై ప్రవహించడమన్నది అసాధ్యం అనుకుంది ముళ్ళ జెముడు. తనని తాను నిలువునా చూసుకుంది. చూసుకుని బాధపడింది.

నడి ఎడారి జన్మ. నా అన్న వారు లేరు. ఏ పనీ చెయ్యదు. ఎందుకూ పనికి రాదు. పైగా అసహ్యంగా ముళ్ళూ తనూ...ఛీఛీ అనుకుంది. ముట్టుకుంటే చాలు, గుచ్చుకునే ముళ్ళు, దళసరిగా ఆకులు, గడ్డలు గడ్డలుగా శరీరం, ఓ కాయా పండా ఏదీ కాయదు. కనీసం గుబురుగా పెరిగి నీడను కూడా ఇవ్వలేదు. ఉపయోగం లేని జన్మ. నాదీ ఒక జన్మేనా అనుకుంది జెముడు. అలా

అనుకుంటూనే రోజులు గడిపేసింది. మరింత గట్టిగా ఏపుగా పెరిగింది .

ఏదో ఒకటి చెయ్యాలి. పుట్టినందుకు ఎవరికో ఒకరికి ఉప యోగపడాలి. మీదికి చూసింది జెముడు. ఆకాశంలో తిరుగుతూ గెద్ద కనిపించింది దానికి.

''ఇదిగో! నేను దేనికయినా పనికొస్తానా?'' కేకేసి అడిగింది జెముడు. గెద్దకి ఆ మాటలు వినిపించాయో లేదో మరి, తిరిగి తిరిగి వెళ్ళిపోయిందక్కణ్ణుంచి. కిందకి చూసింది. ఊసరవెల్లి

కనిపించింది. ఇసుకలో వయ్యారంగా నడుస్తోందది. అది నడుస్తోంటే దాని తోక ఇసుకలో ముగ్గులు పెడుతోంది. చూడ ముచ్చటనిపించాయవి.

''ఇదిగో! నేను దేనికయినా పనికొస్తానా?'' ఊసరవెల్లిని అడిగింది జెముడు.

''దేనికి పనికొస్తావు? దేనికీ పనికిరావు. గెద్దలున్నాయి. ఆకాశంలో తిరుగుతాయి. వాటిని చూశామంటే...మాకూ ఎక్కడో ఇంత తిండి దొరుకుతుందన్న ఆశ ఉంటుంది. అలాగే ఆకాశంలో చంద్రుడున్నాడు. ఉదయించాడంటే ఆ వెలుగులో దారి వెతుక్కుంటూ హాయిగా ఇంటికి వెళ్ళిపోవచ్చు. నేనున్నాను. ఊసరవెల్లినే! అయినా నాకు తోచింది నేను ఈ ఎడారికి చేసి పెడుతున్నాను. చూడు, ఎంచక్కని ముగ్గులేస్తున్నానో'' అంది ఊసరవెల్లి.

జెముడుకి నోట మాట రాలేదు.

''అంతకో ఆకు, ఇంతకో ముల్లు...అసహ్యం నువ్వంటే అందరికీ'' అంది ఊసరవెల్లి. నడుము ఊపుకుంటూ వెళ్ళిపోయింది.

ఏళ్ళకేళ్ళు గడిచాయి. ముసలిదయిపోయింది జెముడు. ఇక ఎంతో కాలం బతకననుకుంది. ఎందుకూ కొరగాకుండా పోతాననుకుంటూ భగవంతుణ్ణి ఇలా వేడుకుంది.

''దేవుడా! ఎందుకిలా నన్ను పుట్టించావు. ఎవరికీ ఉపయోగపడని ఈ బతుకు నాకెందుకు? ఏదో ఒకటి చేద్దామనుకున్నాను. నా బతుక్కీ ఒక అర్థం ఉందని చెబుదామనుకున్నాను. అనుకున్నాను కాని అలసిపోయాను. ఏదీ నా వల్ల కాలేదు. కాలం దగ్గర పడింది. చావుకి సిద్ధంగా ఉన్నాను. ఇప్పుడు కూడా నన్ను కనికరించవా?''

దేవుణ్ణి అలా అడిగిన మరుక్షణం జెముడు నిలువెల్లా వణికిపోయింది. ఏదో బలం తోసుకొచ్చినట్టనిపించింది. తెలియని ఆనందం, మత్తూ కమ్ముకొచ్చాయి దానికి. చూస్తూండగానే తన ముళ్ళ మధ్య నుంచి ఓ పువ్వు పుట్టుకొచ్చింది. రెక్కలు విచ్చుకుంది. కిరీటంలా మెరిసిపోసాగింది. పువ్వుని చూసుకుని ఆనందం పట్టలేకపోయింది జెముడు. దొరికిందే అవకాశం. మరింతగా విచ్చుకుంది. సువాసనలు వెదజల్లింది. ఎడారంతా గుబాళింపే గుబాళింపు. సీతాకోకచిలుకలొచ్చాయప్పుడు. పువ్వు చుట్టూ మూగాయి. గుసగుసలాడాయి. రాత్రయింది. చంద్రుడొచ్చాడు. పువ్వుని చూసి, జెముణ్ణి మెచ్చుకున్నాడు. ఈ జన్మకిది చాలు అనుకుంది జెముడు. అప్పుడు వినవచ్చింది దేవుడి గొంతు.

''ఈ ప్రపంచంలో ఏదీ ఊరకనే పుట్టదు. పుట్టింది ఉపయోగ పడకుండా పోదు. అన్నిటికీ అర్థాలు పరమార్థాలూ ఉన్నాయి. కాకపోతే కాలం కలసి రావాలి. దాని కోసం నిరీక్షించాలి. నిరీక్షణే నిజమైన ఆనందం''

# అమ్మమాట

దీపావళి.

రకరకాల టపాసులు కాలుస్తున్నారంతా. అవి పేలుతోంటే వినసొంపుగా ఉంది శీనుకి. అప్పుడప్పుడు చెవులు చిల్లులు పడేట్టుగా టపాసులు పేలుతోంటే చెవులు మూసుకుని నవ్వుకో సాగాడు వాడు. అప్పుడు గుర్తొచ్చింది అమ్మ అడిగిన ప్రశ్న.

శరీరంలో ఏది గొప్పది?

ఇంకేది? చెవే! ఇంత చక్కటి శబ్దాలు వినాలంటే చెవు లుండాలి. చెవే గొప్పది. ఆ మాటే తల్లికి చెప్పాడు శీను.

''కాదు'' అంది తల్లి.

''ప్రపంచంలో చాలా మంది బధిరులు ఉన్నారు. ఆలో చించు. చాలా టైముంది. నీ వయసింకా పన్నెండేగా'' అంది.

శీను పెరిగి పెద్దయ్యాడు. శ్రీనివాసరావు అయ్యాడు. మిత్రు లతో మానస సరోవరం చూసొచ్చాడు. కైలాస పర్వతాన్ని కూడా సందర్శించి వచ్చాడు. గతజన్మలో చేసుకున్న పుణ్యం, అంతటి అందాల్ని చూడడం అనుకున్నాడు. అప్పుడు గుర్తొచ్చింది మళ్ళీ తల్లి ప్రశ్న.

శరీరంలో ఏది గొప్పది. ఇంకేది? కన్ను. కన్నే గొప్పది. ఆ మాటే తల్లికి చెప్పాడతను.

''కాదు'' అంది తల్లి.

''బాగానే ఆలోచిస్తున్నావు కాని, కన్ను కాదురా ముఖ్యం. కళ్ళు లేని కబోదులు చాలామంది ఉన్నారు ప్రపంచంలో. ప్రయ త్నించు. సరయిన జవాబు దొరుకుతుందేమో'' అంది.

శ్రీనివాసరావు, శ్రీనివాసరావుగారు అయ్యాడు. పెద్ద ఉద్యోగి అయ్యాడు. ఢిల్లీలో ఉంటున్నాడు. ఒకనాడు రాత్రి ఫోనొచ్చింది, తాతయ్య చనిపోయాడని. మర్నాడు ఫ్లయిట్‌కి బయల్దేరి వచ్చాడు. తాతయ్య మృతదేహాన్ని చూసి తట్టుకోలేకపోయాడు. ఆ కాళ్ళ మీద ఊయలలూగాడు తను. ఆ గుండెల మీద ఆడుకున్నాడు తను. ఆ భుజాల మీద గుమ్మడిపండయ్యాడు. ఇప్పుడవన్నీ అచేతనమంటే, తాతయ్య ఇక లేడు లేడంటే కళ్ళు చెమర్చాయి. తండ్రిని చూశాడు. తండ్రి కూడా ఏడుస్తున్నాడు. చిన్నతనంలో తండ్రి ఏడవడం చూశాడు. ప్రాణస్నేహితుణ్ణి పోలీసులు అడవుల్లో పొట్టన పెట్టుకున్నా రంటే బాధ పడ్డాడు తండ్రి. అప్పుడు ఏడ్చాడు. తర్వాత మళ్ళీ ఇప్పుడు, ఇన్నేళ్ళకి ఏడుస్తున్నాడు. ఆశ్చర్యపోయాడు.

''నా ప్రశ్నకి ఇప్పుడయినా సమాధానం చెప్పగలవా?'' అడిగింది తల్లి. విస్తుపోయాడతను. ఇప్పుడు...ఈ పరిస్థితుల్లో...శరీరంలో ఏది గొప్పదని చెప్పాలి? అంతుచిక్కలేదతనికి. కళవళపడ్డాడు.

''ఈ ప్రశ్నకి నువ్విప్పుడు సమాధానం తెలుసుకోవాలి. తెలుసుకుంటేనే నువ్వు నువ్వుగా జీవిస్తున్నట్టు. మనిషయినట్టు. లేకపోతే కష్టం'' అంది తల్లి.

''గతంలో చాలా శరీర భాగాల పేర్లు చెప్పావు. నేను కాదన్నాను. ఎందుకు కాదన్నదీ చెప్పాను. ఇప్పుడు నేనడిగిన ప్రశ్నకి నువ్వు సమాధానం చెప్పలేకపోయినా సమాధానం చెప్పాల్సిన అవసరం ఓ స్త్రీగా నాకు ఉంది'' అంది తల్లి. కన్నీళ్ళు పెట్టుకుంటూ అతని భుజాన్న తల వాల్చింది.

''శరీరంలో గొప్పది ఇది నాన్నా, ఈ భుజం. నేను తల పెట్టుకున్నానని కాదురా, రేపు నిన్ను ప్రేమించిన మనిషి, లేదంటే నీ మిత్రుడు పెను దుఃఖంలో ఉంటే ఓదార్చేందుకు నీ భుజాన్ని నువ్వు ఆసరా చేయగలగాలి. ప్రతి మనిషీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు కన్నీళ్ళు పెట్టుకుంటాడు. ఓదార్పు ఆశిస్తాడు. అప్పుడు ఈ భుజమే అతన్ని ప్రేమగా నిమిరే అమ్మచేయి కావాలి. భరోసా ఇచ్చే నాన్న చూపు కావాలి. అందుకు నువ్వు సిద్ధంగా ఉండాలి. ఉంటావు కదూ'' అడిగింది తల్లి.

మనిషికి కావాల్సింది స్వార్థం కాదు, సానుభూతి అని అప్పుడు తెలుసుకున్నాడతను.

మనం చెప్పింది మరచిపోతారు.

మనం చేసింది మరచిపోతారు.

కాని, మన ఓదార్పునీ, కన్నీళ్ళనీ అంతా అందరూ గుర్తు పెట్టుకుంటారు. అందుకే ప్రతి మనిషీ కన్నీరు తుడిచే కొనగోరు కావాలి. ఆసరానిచ్చే భుజం కావాలి.

# ఆ క్షణాలు...

శీతకాలం రాత్రి. పదకొండు గంటలయింది. అడ్రసు ప్రకారం అతను ఆ అపార్ట్‌మెంట్స్ ముందు క్యాబ్ ఆపాడు. అప్పటికే అపార్ట్‌మెంట్స్‌లోని లైట్లన్నీ ఆరిపోయి ఉన్నాయి. అంటే నిద్రపోతున్నారంతా. గ్రౌండ్‌ఫ్లోర్‌లో మాత్రం 101 అపార్ట్‌మెంట్‌లో లైటింకా వెలుగుతోంది. ఇంత రాత్రప్పుడు క్యాబ్‌ని కేకేశారంటే ఏదో ఎమర్జన్సీనే అనుకున్నాడతను. వెళ్ళి మూసి ఉన్న ఆ అపార్ట్‌మెంట్ తలుపు తట్టాడు.

''వస్తున్నా'' సన్నగా నీరసంగా జవాబు వినవచ్చింది. కాస్సేపటికి తలుపు తెరుచుకుంది. చూస్తే ఆమెకు ఎనభై ఏళ్ళు పైబడే ఉంటాయి. సన్నగా ఉండి, వంగిపోయి ఉంది. నైటీలో ఉంది.

''నేను క్యాబ్ డ్రైవర్ని...'' అని అతనేదో చెప్పబోతుంటే, అతన్ని వారించిందామె.

''తెలుసు, లేకపోతే నాకోసం ఇంకెవరొస్తారు?'' అంది.

''బయల్దేరుదాం'' అంది.

''ఏమీ అనుకోకపోతే అక్కడున్న బ్యాగ్ తీసుకో'' రిక్వెస్ట్ చేసింది. సరేనన్నట్టుగా తలూపాడతను. బ్యాగ్‌ని అందుకుని అపార్ట్‌మెంట్‌ని కలియజూశాడు. పాతగా ఉంది. రంగులు వేసి చాలా ఏళ్ళయినట్టుగా ఉంది. గోడ మీద ఫోటోలు తొలగించిన గుర్తులు అక్కడక్కడా ఉన్నాయి.

ఈజీచైర్ ఉంది, దాని గుడ్డ చిరుగులతో ఉంది.

''రా'' అందామె. అతన్ని ఆసరాగా చేసుకుని తలుపుకి తాళం వేసింది. తర్వాత అతని చేతిని పట్టుకుని, క్యాబ్ దగ్గరకు నడిచింది. ఎక్కి కూర్చుంది.

''నీకు బాగా శ్రమ ఇస్తున్నాను కదూ'' అందామె, అతను డ్రైవింగ్ సీట్లో కూర్చున్నప్పుడు. పర్వాలేదన్నట్టుగా సన్నగా నవ్వాడతను.

''చెప్పండమ్మా, ఎక్కడకి వెళ్ళాలి మనం?'' అడిగాడు. అడ్రస్ కాగితాన్ని అతని చేతిలో ఉంచిందామె. చదివాడతను. భీమిలీ వెళ్ళాలి. ఆసరికి తెల్లారిపోతుంది అనుకున్నాడు.

''మనం ఇటు బస్టాండు మీద నుంచి కాకుండా, అటు రేడియో స్టేషన్ మీద నుంచి వెళ్దాం'' అందామె. రేడియోస్టేషన్ మీద నుంచి భీమిలీ వెళ్ళాలంటే మరో పది పన్నెండు కిలోమీటర్లు దూరం పెరుగుతుంది. తనకేం? కస్టమర్ ఇష్టం అనుకున్నాడతను. అటుగానే క్యాబ్‌ని పోనిచ్చాడు. క్యాబ్ వెళ్తోంటే ఆమె ఆత్రంగా రోడ్డుకి ఇరువైపులా చూస్తూ చాలా విషయాలు చెప్పింది.

''ఇదిగో! ఇప్పుడీ చెమన్‌బార్ ఉందే, ఒకప్పుడక్కడ కాలనీ లైబ్రరీ ఉండేది. అక్కడే నేను రవిని మొదటిసారిగా చూశాను. రవి అంటే ఎవరనుకున్నావు? మావారు. చనిపోయార్లే! ఇదిగిదిగో ఇక్కడే మంజు థియేటర్ ఉండేది, ఇప్పుడు దాన్ని కూలగొట్టి, ఈ ఫంక్షన్‌హాలు కట్టారు. ఏయేయ్, ఆపాపు'' అరించిందామె. ఆపాడతను. శారదా సంగీత కళాశాల బోర్డు కనిపించింది. దానికి చేతులు జోడించి మొక్కుకుందామె.

''నేను ఇక్కడే సంగీతం నేర్చుకున్నాను'' అంది. తర్వాత అలా చాలా విషయాలు చెబుతూనే ఉందామె. రాత్రి అసలు నిద్రపోలేదు. పాటలు పాడింది. నవ్వింది. అక్కడక్కడా ఒంటేలుకని, క్యాబ్‌ని ఆపమని చెప్పి, అతని చెయ్యి పట్టుకుని కూర్చునేది. అతను దూరంగా వెళ్ళేందుకు ప్రయత్నిస్తే ''మీ అమ్మని అనుకో, అలా దూరంగా వెళ్ళిపోకు, పడిపోతాను'' అనేది.

సూర్యోదయం అవుతోంటే భీమిలీ చేరుకున్నారు. అడ్రసు ప్రకారం వృద్ధుల ఆనందాశ్రమానికి చేర్చాడామెను. వీల్ ఛైర్లో కూర్చోబెట్టి, ఆమెను లోపలికి తీసుకుని వెళ్ళిపోతున్నారు.

''ఇదిగో, నీకెంతివ్వాలి?'' అడిగిందామె. పర్సు తీసింది.

''ఏం ఇవ్వక్కర్లేదు'' అన్నాడతను. గట్టిగా ఆమెను కౌగిలించుకున్నాడు. అతనికెందుకో కన్నీళ్ళు వచ్చాయి. ఎందుకొచ్చాయన్నది అతనికి తెలీదు. కొందరి కొందరి కబుర్లు కథలవుతాయి. కన్నీళ్ళవుతాయి. కడుపుని దేవేస్తాయి. ఏడుపొస్తుంది. అప్పుడు ఏడవడమే హాయిగా ఆనందంగా ఉంటుంది. కన్నీళ్ళు తుడుచుకుని వెను తిరిగాడతను.

# చిన్నబుర్ర అప్పన్న

వాడి పేరు శివ. అయితే వాణ్ణంతా 'చిన్నబుర్ర అప్పన్న' అని పిలుస్తారు. ఎందుకలా పిలుస్తారంటే...వయసుకి తగ్గట్టుగా వాడి తల ఎదగలేదు. వాడికి పదిహేడేళ్ళు. పదిహేడేళ్ళకు తగినట్టుగా తలకాయ లేదు వాడికి. చిన్నదిగా ఉంది. నాలుగైదేళ్ళ వాడి తలకాయ ఎంత ఉంటుందో అంతే ఉందిప్పటికీ.

ఏడోతరగతిలో ప్రవేశించాడు శివ. ప్రవేశించాడూ అంటే ఒకొక్క క్లాసూ పాసై ప్రవేశించలేదు వాడు. స్నేహితులంతా పాసై పై క్లాసుకి వస్తోంటే వాడూ వస్తున్నాడంతే! రావద్దని చెబితే ఏడుస్తాడు. అందుకని ఎవరూ అడ్డుకోరు వాణ్ణి. మేనేజ్‌మెంట్‌కి బాగా కావాల్సిన వ్యక్తి కొడుకని, వాణ్ణి కసరడం, కొట్టడం చేయొద్దని చెబుతారంతా. చెబుతారు సరే, వాణ్ణి భరించొద్దూ?

సీట్లో సవ్యంగా కూర్చోడు శివ. బెంచ్‌ని పదే పదే చరిచి పెద్దగా శబ్దం చేస్తాడు. నవ్వుతాడు. ఏడుస్తాడు. వాడలా ఎప్పుడే పని చేస్తాడో తెలియని పరిస్థితుల్లో వాడినో కంట కనిపెడుతూ పాఠం చెప్పడం అంటే గీతకి కత్తి మీద సాము చేసినట్టుగా ఉంటోంది. గీత కొత్తగా సోషల్ టీచర్‌గా జాయినయ్యిందా స్కూల్లో. పాఠాన్ని చెవులు రిక్కించుకుని వింటారు పిల్లలు. శివే, చెప్పింది వినడు సరికదా, హఠాత్తుగా చప్పట్లు చరుస్తూ మూడ్‌ను చెడగొడుతున్నాడు. వాణ్ణి ఎలాగయినా క్లాసు నుంచి తప్పించాలి. లేకపోతే మిగిలిన పిల్లలు పాడయిపోతారు. పాఠాలు అవ్వవు అనుకుంది గీత. ఆ మాటలే చెప్పింది హెడ్‌మాస్టర్‌కి.

''వాణ్ణి పట్టించుకోకమ్మా! వదిలేయ్! పిల్లలేం పాడయిపోరు, రెండో తరగతిలో శివ ఇక్కడ జాయిన్ అయ్యాడు. వాడితో పాటు

అప్పుడు జాయినయిన పిల్లలే ఇప్పుడు ఏడో తరగతిలో ఉన్నది. పిల్లలకి వాడు బాగా అలవాటయి పోయాడు. వాడి అల్లరి వాడిదే, వీళ్ళ చదువులు వీళ్ళవే! నీకో సంగతి తెలుసా? స్కూలుకి వాడు ఒక్కపూట రాకపోతే పిల్లలు చాలా బాధపడతారు. వాడెందుకు రాలేదోనని ఈ పిల్లలు చదవరు. పాఠాలు వినరు. వాళ్ళంతా ఫ్రెండ్సమ్మా, మంచి ఫ్రెండ్స్'' అని నవ్వాడు హెడ్‌మాస్టర్.

భవిష్యత్తులో ఎవరెవరు ఏమి కావాలనుకుంటున్నారో, ఏ సామాజిక హోదాలో నిలదొక్కుకోవా లనుకుంటున్నారో ఒక పేజీకి మించకుండా వ్యాసం రాసి, విద్యార్థుల్ని తీసుకు రమ్మన్నది గీత. మర్నాడు తీసుకొచ్చారంతా. శివ కూడా తెచ్చిచ్చాడు. పిచ్చిగీతలు ఉంటాయి అందులో, ఇంకేముంటుందని దాన్ని అడుగున పెట్టి, మిగిలిన వారివి చదవనారంభించింది గీత. ఓ విద్యార్థి, తాను డాక్టర్ కావాలని రాశాడు. 'గుడ్' మెచ్చుకుంది గీత. మరో విద్యార్థి, తాను లాయర్ కావాలని రాశాడు. 'వెరీగుడ్' అని అభినందించింది గీత. ఇంకొకరు, తాను పోలీస్ ఇన్‌స్పెక్టర్ కావాలని రాస్తే, మరొకరు సోషల్ టీచర్ కావాలని ఉందని రాశారు. చదివి నవ్వుకుంది గీత.

ఆఖరుగా శివ రాసింది తీసి, చదివింది.

పొట్టిగాడు అంటే ప్రసాద్ డాక్టర్ కావాలి. నల్లకాకి రాంబాబు డాక్టర్ కావాలి. బోండాం బాబుగాడు పోలీసు కావాలి. ముద్దబంతి సుజాత సోషల్ టీచర్ కావాలి. చిన్నబుర్ర అప్పన్న అంటే నేను, వాళ్ళందరితోనూ ఉండాలి. ఉంటాను.

''శివా'' అంది గీత. వాడి రాతకి ఆశ్చర్యపోయింది. కళ్ళు చెమర్చుకుంది. కన్నీళ్ళు పెట్టుకున్న గీతను చూశాడు శివ.

''హేపీ హేపీ'' అంటూ బెంచ్‌ని పెద్దగా చరిచాడు. ఓ వారం తర్వాత క్లాసులో ఒక్కరంటే ఒక్క విద్యార్థి లేడు.

ఏమయిపోయారంతా? అనుకుంది గీత. అర్థం కాలేదామెకు. హెడ్‌మాస్టర్ అటుగా వచ్చాడు.

''అంతా శివా వాళ్ళింటి దగ్గర ఉన్నారమ్మా! వాడే పాపం...ఈ లోకంలో లేకుండా పోయాడు'' అన్నాడు.

గీతకి ఏడుపాగలేదు. పిల్లలు బాగుపడాలంటే శివని క్లాసులోంచి తప్పించాలనుకుందామె. ఇప్పుడు వాడంతట వాడే తప్పుకున్నాడు. అయ్యయ్యో అనుకుంది గీత.

''హేపీ హేపీ'' శివ మాటలు వినవచ్చాయామెకు. రూంలో బెంచ్‌ని ఎవరో పెద్దగా చరిచిన శబ్దం అయింది.

# క్రిస్మస్ తాత

''క్రిస్మస్ తాత, పాడా! ఎవరూ లేరు. బామ్మ చెప్పినవన్నీ అబద్ధాలే! అన్నీ కథలు'' అంది అక్క. క్రిస్మస్ తాత కల్పిత పాత్ర అని ఫ్రెండ్స్ చెప్పారట ఆమెకి.

ఎర్రటి కోటు, నల్లటి బెల్ట్, తెల్లని గడ్డం, భుజాన్న మ్యాజిక్ సంచిలో గిఫ్ట్ బాక్సులు...అన్నీ అంతా అబద్ధం అంటే తట్టు కోలేకపోయాడు పన్నెండేళ్ళ డేవిడ్. పరిగెత్తుకుని వెళ్ళి బామ్మని అడిగాడు.

''అక్క చెప్పింది నిజమా?''

''అబద్ధం'' అంది బామ్మ.

''ఇవాళ మీ అక్కే కాదు, ఇంతకు ముందు ఇదే మాట ఎందరో చెప్పారు. నమ్మకు. క్రిస్మస్ తాత ఉన్నాడు. ఉన్నాడు కాబట్టే పేద పిల్లలు బతుకుతున్నారు'' అంది బామ్మ.

''పద పద'' అని తొందర చేసింది.

''ఎక్కడికి?'' అడిగాడు డేవిడ్.

''షాపింగ్‌కి'' అంది బామ్మ. డేవిడ్‌ని తీసుకుని ఆటో ఎక్కింది. బజారుకి బయల్దేరింది.

పెద్ద షాపు ముందు ఆటో ఆగింది.

''దిగు'' అంది బామ్మ. దిగాడు డేవిడ్. వాడి చేతిలో వెయ్యి రూపాయల నోటు ఉంచింది.

''లోపలికెళ్ళు. మీ ఫ్రెండ్స్‌కి నువ్వేది గిఫ్ట్‌గా ఇవ్వాలను కుంటున్నావో అది కొనుక్కో'' అంది బామ్మ.

''నువ్వో'' అడిగాడు.

''నేను నీ కోసం వెయిట్ చేస్తూ ఇక్కడే ఉంటాను'' అంది. సరేనంటూ షాపులోనికి వెళ్ళాడు డేవిడ్.

షాపంతా జనంతో కిటకిటలాడుతోంది. అందరూ రకరకాల బట్టలు, బొమ్మలు కొంటున్నారు.

ఒంటరిగా ఎప్పుడూ షాపింగ్ చెయ్యలేదు డేవిడ్. అమ్మతోనో, నాన్నతోనో వచ్చేవాడు. తనకి కావాల్సింది చెబితే అమ్మానాన్నా కొనిపెట్టేవారు. ఇవాళ తను కొంటున్నాడు. చాలా ఆనందంగా ఉంది డేవిడ్‌కి. బ్లాక్ జీన్స్ చూశాడు. ఫ్యాంటు బాగుంది. బ్లాక్ జీన్సంటే రాజుగాడికి చాలా ఇష్టం. ఎప్పుడయినా అలాంటి ఫ్యాంటు కొంటానన్నాడు.

తనతో పాటు రాజు ఏడో తరగతి చదువుతున్నాడు. పాపం! సరయిన బట్టలు లేవు వాడికి. పోస్ట్‌బాక్స్ నిక్కరూ వాణ్ణీ చూస్తే చాలు, నవ్వు వస్తుంది. వాడికి జీన్స్ కొంటే...ఆ ఆలోచనకే పొంగిపోయాడు డేవిడ్. బ్లాక్ జీన్స్ తీసుకున్నాడు.

''ఎంత?'' అడిగాడు.

''థౌజెండ్ రుపీస్'' చెప్పాడు కౌంటర్లోని వ్యక్తి. చేతిలోని వెయ్యినోటుని అతనికి ఇచ్చేసి బయటికి నడిచాడు. జీన్స్‌ని బామ్మకి చూపించాడు.

''మా ఫ్రెండ్ రాజుకి'' చెప్పాడు.

''బాగుంది'' మెచ్చుకుంది బామ్మ.

రాత్రి పదకొండు గంటలయింది. బామ్మతో పాటుగా రాజుగాడింటికి చేరుకున్నాడు డేవిడ్. బాగా చలిగా ఉందేమో! కిటికీ తలుపులు కూడా మూసేసి పడుకున్నారంతా. చేతిలోని జీన్స్ ఫ్యాంటుని గుండెలకు హత్తుకుని, ఇంటి గుమ్మం ముందు ఉంచాడు డేవిడ్. రెండు సార్లు తలుపు తట్టాడు. తర్వాత పరుగెత్తుకుని, బామ్మ దగ్గరకు వచ్చాడు.

ఇద్దరూ మందార చెట్టు వెనుగ్గా దాగుని చూడసాగారు. అంతలో తలుపులు తెరుచుకున్నాయి. కళ్ళు నులుముకుంటూ రాజే వచ్చాడు బయటికి. తలుపులు తట్టింది ఎవరా? అని చుట్టూ చూసి, తర్వాత కిందికి చూశాడు. తనకి ఇష్టమయిన బ్లాక్ జీన్స్ ఫ్యాంటు. చేతుల్లోకి తీసుకున్నాడు రాజు. ఇంట్లోకి చూస్తూ పెద్దగా కేకేశాడు.

''క్రిస్‌మస్ తాత వచ్చాడోచ్.''

బామ్మని గట్టిగా సంతోషంగా కౌగిలించుకున్నాడు డేవిడ్.

''క్రిస్‌మస్ తాత నిజం! అబద్ధం కాదు'' అన్నాడు.

''అవును మరి'' అంది బామ్మ. డేవిడ్ అంటించుకున్న తెల్లని గడ్డాన్ని ఆప్యాయంగా నిమిరింది. వాడి వేసుకున్న ఎర్రని కోటుని ముందుకు లాగి కళ్ళకద్దుకుంది. జారి పోతున్న డేవిడ్ బెల్ట్‌ని సరిజేసి నవ్వింది.

# చదువులోని మర్మమెల్ల....

కోటిగాణ్ణి చూడాలంటేనే అసహ్యం. చూస్తే చితక బాదా లనిపిస్తుంది. పిలిస్తే పలకడు. అరిస్తే భయపడడు. చదవడు. టేబుల్ మీద తలపెట్టి నిద్రపోతుంటాడు. తలకి నూనె రాసి, ఎన్నాళ్ళయిందో! నెలరోజులుగా అవే బట్టలు. స్నానం చేసి కూడా చాలా రోజులయి ఉంటుంది.

''పద్యం చెప్పరా!

చదివించిరి నను గురువులు'' అంటే–

''సదివించిరి నను గురువులు'' అంటాడు. భాషని భ్రష్టు పట్టిస్తున్నాడు. తెలుగు మాస్టారుగా దానిని తట్టుకోలేకపోతు న్నాడు మూర్తి. క్లాసుకి కోటిగాడు రాకపోతేనే సుఖం అనిపిస్తోం దతనికి. అయితే కోటిగాడు క్లాసుకి రావడం మానట్లేదు. వస్తాడు. పడుకుంటాడు. పదేళ్ళ వెధవకి మహా పొగరు.

''ఆ కోటిగాడు ఎవడండీ, వాణ్ణి నా తలకి చుట్టారు'' స్టాఫ్ రూంలో బాధపడ్డాడు మూర్తి.

''మంచికుర్రాడండీ'' చెప్పాడు సైన్సు టీచర్.

''వాళ్ళ నాన్నగారికి క్యాన్సర్. దాంతోనే వాడలా అయి పోయాడు. లేకపోతే ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్.''

ఆశ్చర్యపోయాడు మూర్తి.

''లెక్కల్లో వాణ్ణి మించిన వాడు లేడండీ! బోర్డు మీద మన లెక్క పూర్తికాదు, పుస్తకంలో వాడిలెక్క అయిపోతుంది'' చెప్పాడు మ్యాథ్స్ టీచర్.

''ఈ మధ్యనే వాళ్ళ నాన్న పోయాడు. పాపం, తల్లే తండ్రి అయింది. వాళ్ళింటా వీళ్ళింటా ఆ పనీ ఈ పనీ చేస్తూ వాణ్ణి పెంచుకొస్తోంది. తండ్రి ఉంటే ఆ పెంపకం వేరు. ఆ భయం వేరు'' అన్నాడు సోషల్ టీచర్.

కోటిగాడి గురించి కొంత తెలియడంతో వాణ్ణి అసహ్యించుకోవడాన్ని తగ్గించాడు మూర్తి. వాణ్ణి తిట్టడం మానుకున్నాడు.

గురుపూర్ణిమ సందర్భంగా మూర్తికి చాలా కానుకలు వచ్చాయి. విద్యార్థులు ఇచ్చారతనికి. కోటిగాడు కూడా రెండు కానుకలు ఇచ్చాడతనికి. ఒకటి చేతివాచీ. రెండు చుట్టలు పెట్టుకునే చిన్న పెట్టె. ఆ రెండూ వాళ్ళ నాన్నవట! చేతివాచీలో నిమిషాల ముల్లు లేదు. విరిగి పడిపోయింది. చుట్టల పెట్టెలో రెండు చుట్టలు ఉన్నాయి. ఎప్పటివో! పిల్లలు వాటిని చూసి నవ్వారు. మూర్తి కూడా నవ్వాడు.

ఆ సాయంత్రం మూర్తికెందుకో చుట్ట తాగాలనిపించింది. పొగతాగే అలవాటు లేదు. కాని, కోటిగాడి కానుకది. ఆస్వాదించాలనిపించింది. చుట్టముట్టించాడు మూర్తి. రెండు దమ్ములులాగాడో లేదో, దగ్గుతో కిందా మీదా అయిపోయాడు. అప్పుడు అక్కడికి ఎక్కణ్ణుంచి వచ్చాడో కోటిగాడు వచ్చాడు. పెద్దగా నవ్వాడు.

''మా అయ్య కూడా ఇంతే సార్! చుట్ట తాగితే ఇలాగే అయిపోయేవాడు'' అన్నాడు.

''అచ్చు మీరు మా అయ్యలాగే ఉన్నారు'' అన్నాడు. ఆ మాటకి మూర్తికి కళ్ళు చెమర్చాయి. అప్పటి నుంచీ కోటిగాడంటే మూర్తికి అసహ్యం పోయి, అభిమానం ఏర్పడింది. వాడి మీద శ్రద్ధ పెట్టాడతను. పాఠాలు ప్రియంగా చెప్పసాగాడు. కోటిగాడు అయిదో తరగతి పాసయ్యాడు. హైస్కూలుకి వెళ్ళిపోయాడు. టెన్త్‌లో స్టేట్ ఫస్టొచ్చాడు. తెలుగులో నూటికి నూరు మార్కులు సాధించాడు. ఆశ్చర్యపోయాడు మూర్తి. డిగ్రీ, పిజి అన్నీ పూర్తి చేసి, తెలుగులో సివిల్స్ రాసి కలెక్టరయ్యాడు కోటిగాడు. ఇప్పుడు వాణ్ణి కోటేశ్వరరావు అంటున్నారంతా.

వాడికి పెళ్ళంటే దీవించడానికి వచ్చాడు మూర్తి. మాంగల్యధారణ అయ్యింది. అక్షితలు వేశాడు మూర్తి. అప్పుడతని ఎడమ చేతికి అప్పుడెప్పుడో కోటిగాడిచ్చిన నిమిషాల ముల్లు లేని వాచీ ఉంది. అలాగే అదే చేతిలో వాడిచ్చిన చుట్టల పెట్టె కూడా ఉంది. వాటిని కోటేశ్వరరావుకి చూపించాడు మూర్తి. నవ్వాడు.

గురువుగారికి శిరసు వంచి పాదాభివందనం చేశాడు కోటేశ్వరరావు. వాణ్ణి చూసి పొంగిపోయాడు మూర్తి. అక్షరానికి అణకువ ఎక్కువనుకున్నాడు. భాషకి బంధం ఎక్కువనుకున్నాడు.

భాషనయినా, మనిషినయినా ముందు ప్రేమించాలి. తర్వాతే ఫలితాన్ని ఆశించాలి.

# నన్నొకసారి తలచుకోండి

సంక్రాంతి. చేతిలో పైసా లేదు. పండుగ ఎలా చేసుకోవాలో తెలియట్లేదు. పండుగదేముంది? ఉన్నప్పుడే పండుగ. లేనప్పుడు లేదనుకున్నా తర్వాతి ఖర్చు తలచుకుంటే తల తిరిగిపోతోంది బాలుకి. ఉద్యోగం పోయి మూణ్ణెళ్ళయ్యింది. కార్మికులకు, యాజమాన్యానికి గొడవలు. లాకౌట్ ప్రకటించారు. దాంతో అంతా రోడ్డున పడ్డారు. సన్నగా వర్షం కురుస్తోంది. వద్దు వద్దన్నా ఒక్కడే నడుస్తూ ఊరికి దూరంగా వచ్చాడు బాలు. చీకట్లు ముసురుకుంటున్నాయి. వెను తిరగాలి, తప్పదనుకున్నాడు బాలు. వెను తిరిగాడు.

అరవై ఏళ్ళుంటాయి ఆమెకు. లావుగా ఉంది. రోడ్డుకి అటుగా కారుని ఆనుకుని నిల్చుని ఉంది. వర్షానికి తడిసిపోతూ కనిపించింది. ఏదో బాధలో ఉందనుకున్నాడు బాలు. వెళ్ళి పలకరించాడామెను.

''ఏమయింది మేడం?''

సమాధానం లేదు ఆమె దగ్గర్నుంచి. భయం భయంగా చూస్తోంది. అర్థం కాలేదు బాలుకి. అనుమానంగా కారు చక్రాలకేసి చూశాడు. ముందున్న చక్రాల్లో ఓ దానికి గాలి లేదు. పంక్చర్ అయి ఉంటుంది. ఆ చక్రాన్ని తొలగించి, ఇంకొకటి ఫిట్ చెయ్యాలక్కడ.

''కీసివ్వండి.''

ఇచ్చిందామె. డిక్కీ తెరిచాడు బాలు. అందులో స్టెఫినీ ఉంది. దాన్ని తీశాడు.

''మీరు కార్లో కూర్చోండి మేడం. నేనంతా చూసుకుంటాను. ప్లీజ్'' అన్నాడు బాలు. పదే పదే చెప్పడంతో ఆమె కార్లో కూర్చుంది. కూర్చుని, అద్దం దించి, బాలు చేస్తున్నదంతా గమనించసాగింది. బాలు చకచకా చక్రాన్ని మార్చేశాడు. ఆ మార్చడంలో అతని బట్టలు బురదమయమయిపోయాయి. బురదంటుకుని చేతులు కూడా ఏదోలా ఉన్నాయి.

''ఒకే మేడం! బయల్దేరండి'' అన్నాడు బాలు. ఆమె కారు స్టార్ట్ చేసింది. వెళ్ళిపోతూ పర్సులోంచి అయిదు వందల నోటు తీసి ఇవ్వబోయింది.

''వద్దు మేడం! మీరు కష్టంలో ఉన్నారు. నేను హెల్ప్ చేశాను. అయిపోయింది. కాదు, కూడదంటారా, ఎవరయినా కష్టంలో ఉన్నప్పుడు నన్నోసారి తలచుకుని వాళ్ళని ఆదుకోండి. ఆనందిస్తాను. బై'' అన్నాడు బాలు.

''నీ పేరు?'' అప్పుడడిగిందామె.

''బాలు'' చెప్పాడు. అతన్ని చిత్రంగా చూసి, ముందుకు దూసుకుపోయిందామె. ఊరిలోకి వచ్చింది. ఆకలిగా ఉంది. ఏదయినా తినాలనుకుందామె. చూసింది. రెండు మూడు చిన్న హోటళ్ళు కనిపించాయి. ఒకదాని ముందు కారాపింది. లోనికి ప్రవేశించింది.

''వేడిగా ఏం ఉంది?'' అడిగింది.

''ఉప్మా'' హోటల్లోని సర్వర్ కమ్ ఓనర్ చెప్పింది. పేరు పార్వతి. పాతికేళ్ళుంటాయి ఆమెకు. నిండు గర్భిణి. వారం పదిరోజుల్లో ప్రసవించేట్టుగా ఉంది.

''సరే! పెట్టు'' పెట్టింది. తిన్నదామె. ఆకలి మీద ఉన్నదేమో! బాగా రుచిగా అనిపించింది. కాఫీ కూడా బాగానే ఉంది. అంతా ఒక్కతే చేస్తూ కనిపించింది పార్వతి. గ్యాస్‌స్టవ్ కూడా లేదు, అంతా నిప్పుల మీదే చేస్తోంది. పేదరికం కొట్టొచ్చినట్టుగా కనిపించింది.

''బిల్లెంతయింది?''

''పాతిక రూపాయలు.''

వెయ్యి నోటు అందించిందామె. అందుకుని చిల్లర కోసం పరుగుదీసింది పార్వతి. వచ్చి చూసే సరికి ఆమె అక్కడ లేదు. కారు కూడా లేదు. తన కష్టాన్ని చూసి చిల్లర వదిలేసింది అనుకున్నది పార్వతి. ఎంగిలి ప్లేటును తీస్తోంటే దాని కింద తొమ్మిది వెయ్యినోట్లు కనిపించాయి. అలాగే చిన్న ఉత్తరం కూడా ఉందక్కడ. చదివింది పార్వతి.

''నీకు కొడుకే పుడతాడు. పుడితే 'బాలు' అని పేరు పెట్టు.''

ఆశ్చర్యపోయింది పార్వతి. అప్పుడే అక్కడి వచ్చిన భర్తని చూసింది.

జరిగిందంతా చెప్పిందతనికి.

''సంక్రాంతి వచ్చింది. సంబరాన్ని తెచ్చింది. మన కష్టాలు గట్టెక్కాయి'' అంది.

''నాకు కొడుకే పుడతాడు. నీ పేరే పెడతాను'' అంది మళ్ళీ. పార్వతి మాటలకి నవ్వుతూ ఆమెను ప్రేమగా దగ్గరకి తీసుకున్నాడు బాలు.

# అద్భుతం

తండ్రి మంచం కిందికి దూరింది గౌరి. మంచం కింద పాడుబడిన పెట్టె ఉంది. తెరిచిందది. అందులో పాతగుడ్డలు ఉన్నాయి. వాటన్నిటినీ తొలగించింది. అడుగున ఉంది మర చెంబు. అందుకుంది దాన్ని. మూత తీసి, చూసింది. డబ్బు లున్నాయి. చేయి పెట్టి తడిమి చూసింది. చేతికి బలంగా బరువుగా డబ్బులు తగిలాయి. మరచెంబుని బోర్లించింది. భళ్ళుమంటూ డబ్బులు కింద పడ్డాయి. దొర్లుకుంటూ అటూ ఇటూ పోతుంటే చేతులడ్డం పెట్టి డబ్బుల పరుగును ఆపింది. అన్నిటినీ దగ్గరగా కూడదీసింది. లెక్కించింది. నూట పదకొండు రూపాయలు ఉన్నాయి. వాటిని మళ్ళీ జాగ్రత్తగా మరచెంబులో ఉంచింది. మూత పెట్టింది. మంచం కింద నుంచి బయటకు వచ్చింది. పరుగు పరుగున ముందుకు నడిచింది.

అన్నయ్య బతికి బట్టకట్టాలంటే ఏదేని అద్భుతం జర గాలి అంది తల్లి. అదృష్టాలూ, అద్భుతాలూ మనకంద వన్నాడు తండ్రి. ఏడ్చారు. వాళ్ళ దుఃఖాన్ని తట్టుకోలేకపోయింది ఏడేళ్ళ గౌరి. అన్నయ్యను బతికించుకోవాలనుకుంది. బతికించు కోవాలంటే అద్భుతం కావాలి. అదెక్కడ దొరుకుతుంది? మందుల షాపులో. దాన్ని కొనడానికి నూటపదకొండు రూపా యలు ఉన్న మరచెంబుని పట్టుకుని షాపుకి బయల్దేరింది.

షాపులో కొనుగోలుదారులు చాలా మంది ఉన్నారు. నాకంటే నాకంటూ మందుల కోసం ఎగబడుతున్నారు. గోలగోలగా ఉంది. ఆ గోలలో 'అంకుల్ అంకుల్' అంటూ మరచెంబుని ఎత్తి చూపిస్తూ ఎగురుతున్న గౌరి ఎవరికీ కనిపించడం లేదు. షాపు ఓనరు ఇటు మందులు అమ్ముతూ, అటు హైదరాబాదు

నుంచి వచ్చిన అన్నగారితో మాట్లాడుతున్నాడు. అతను తనని పట్టించుకోవాలి. ఏం చెయ్యాలి? డబ్బులున్న మరచెంబుని ఊపుతూ పెద్దగా శబ్దం చేయసాగింది గౌరి.

''ఏయ్, ఆపు'' అరిచాడు ఓనరు. గౌరి చేతిలోని మరచెంబుని లాక్కున్నాడు.

''ఏం కావాలి?'' విసుక్కున్నాడు.

''మా అన్నయ్య బతకాలి'' అంది గౌరి.

''మా అన్నయ్య తలలో బంతిలా ఏదో పెరుగుతోందట. తగ్గాలంటే అద్భుతం జరగాలంటోంది అమ్మ. నాకు అద్భుతం కావాలి. మీ దగ్గర ఉందా? ఉంటే ఎంతో చెప్పండి, డబ్బులిస్తాను'' అంది గౌరి.

''ఇక్కడ అద్భుతాలు అమ్మరమ్మా'' ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక ఎలాగోలా ఆ మూడు మాటలూ పలికాడు ఓనరు.

''ఎందుకమ్మరు? అమ్ముతారు. నాకు తెలుసు. ఆ చెంబులో నూట పదకొండు రూపాయలు ఉన్నాయి. సరిపోతాయా? కావాలంటే చెప్పండి, ఎల్లుండి మా పిన్ని వస్తుంది. నాకు డబ్బులిస్తుంది. అప్పుడిచ్చేస్తాను'' అంది గౌరి.

అప్పుడు షాపు ఓనరు అన్నగారు కలుగజేసుకున్నారు.

''మీ అన్నయ్యకి ఎలాంటి అద్భుతం కావాలి?'' అడిగాడు గౌరిని.

''తెలీదు. అన్నయ్య బతకాలి. బతకాలంటే అద్భుతం కావాలి. అంతే'' అంది గౌరి. కన్నీళ్ళు పెట్టుకుంది.

''నీ దగ్గర ఎంతుందన్నావు?'' అడిగాడతను.

''నూట పదకొండు రూపాయలు. అదిగో ఆ మరచెంబులో ఉంది'' అంది గౌరి.

మరచెంబుని అందుకున్నాడతను. తర్వాత గౌరి చేయి పట్టుకున్నాడు.

''పద, మీ ఇల్లు ఎక్కడో చూపించు. మీ అన్నయ్యకి ఏ మేరకు అద్భుతం కావాలో నేనిస్తాను. పద'' అన్నాడతను. గౌరితో పాటుగా ముందుకు నడిచాడు. అతని పేరు, డాక్టర్ సౌజన్యరావు. హైదరాబాద్‌లో అతను పెద్ద సర్జన్. న్యూరో సర్జరీకి  పెట్టింది పేరతను.

గౌరి అన్నయ్యను చూశాడు సౌజన్యరావు. హైదరాబాద్‌కి అతన్ని తరలించాడు. పైసా కూడా తీసుకోకుండా ఆపరేషన్ చేశాడు. కుర్రాడి బతుక్కి ఢోకా లేదని చెప్పి పంపించాడు.

''జరిగిందంతా తలచుకుంటుంటే అంతా అద్భుతం అనిపిస్తోంది. విలువ కట్టలేం అనిపిస్తోంది'' అంది తల్లి. కట్టగలం అనుకుంది గౌరి. దాని విలువ నూటపదకొండు రూపాయలు. అంతేకాదు, అన్నయ్యని బతికించి తీరగలనన్న గట్టి నమ్మకం కూడా.

# భగవద్గీత

సెలవులు. తాతగారి ఊరికొచ్చాడు మనవుడు. అమ్మమ్మంటే ఇష్టం. అడిగినవన్నీ చేసి పెడుతుంది మరి. అలాగే తాతయ్య అంటే కూడా ఇష్టమే! రకరకాల కథలు చెబుతాడాయన. వచ్చిన దగ్గర్నుంచీ గమనిస్తూనే ఉన్నాడు. తాతయ్య భగవద్గీత చదువుతూనే ఉన్నాడు. భగవద్గీత చదవడమే ఆయనకి దినచర్యగా ఉంది. ఏం ఉందా పుస్తకంలో? చదివితే లాభం ఏమిటి? తెలుసుకోవాలనుకున్నాడు మనవడు. చదవసాగాడు. అన్ని విధాలా తాతయ్యని అనుకరిస్తూ భగవద్గీతను చదువుతూ కూర్చున్నాడు.

కొద్దిరోజులు గడిచాయి. ఒక రోజు తాతయ్యని అడిగాడిలా.

''నీలాగే నేనూ భగవద్గీత చదువుతున్నాను. ఒక్క ముక్క అర్థమయితే ఒట్టు! ఒకవేళ ఏ మాత్రం అర్థమయిందనుకుంటే, గీత మూసేసిన మరుక్షణం మరిచిపోతున్నాను. నాకు తెలియక అడుగుతాను తాతయ్యా, అసలీ పుస్తకం చదవడం వల్ల లాభం ఏమిటి?''

సమాధానంగా అక్కడున్న బొగ్గులబుట్ట వైపు చూశాడు తాతయ్య. నవ్వుతూ అన్నాడిలా.

''ముందో పని చెయ్యి! అందులో ఉన్న బొగ్గుల్ని కింద పడేసి, ఖాళీ బొగ్గులబుట్ట తీసుకెళ్ళి, అదిగో! కనిపిస్తోంది చూడూ, ఆ యేటిలో ముంచి బుట్టతో బుట్టడు నీరు తీసుకుని రా.''

''అలాగే'' అంటూ పరుగుదీశాడు మనవడు. బుట్టని నీళ్ళలో ముంచాడు. పైకి తీశాడు. పరిగెత్తుకుని వచ్చి తాతయ్యకు చూపాడు. అందులో ఒక్క చుక్క కూడా నీరు లేదు. అంతా కారిపోయింది. జారిపోయింది.

''కొంచెం వేగంగా పరిగెత్తుకుని రావా(ాలా'' చెప్పాడు తాతయ్య. అలాగే చేశాడు మనవడు. ఆయాసపడుతూ వచ్చాడు. అయినా లాభం లేకపోయింది. బుట్టలో నీటి చుక్క లేదు.

''మెరుపులా రావాలిరా! నువ్వనుకుంటే వస్తావు'' చెప్పాడు తాతయ్య. మనవడు మెరుపులాగానే మెరిశాడు. ఇలా వెళ్ళి అలా వచ్చాడు. ఊపిరి అందడం లేదు. అంతలా అలసిపోయాడు. అయినా నీరు నిలవలేదు. అప్పుడు గ్రహించాడు నిజాన్ని.

''బుట్టలో ఎక్కడయినా నీరు నిలుస్తుందా తాతయ్యా, బాల్చీలో నిలుస్తుంది గాని. చెప్పండి, బాల్చీతో నీరు తీసుకురానా?'' అడిగాడు.

''వద్దు! నాకు బుట్టతోనే నీరు కావాలి'' పట్టుబట్టాడు తాతయ్య.

''నువ్వు సాధిస్తావు. నాకా నమ్మకం ఉంది'' అన్నాడు అంతలోనే. పరుగుదీశాడు మనవడు. అయినా ఫలితం దక్కలేదు. యేటిలో బుట్టను ముంచుతున్నాడు. తీస్తున్నాడు. పరిగెడుతున్నాడు. వస్తున్నాడు కాని, లాభం లేకుండా పోతోంది. చుక్కనీరు కూడా బుట్టలో నిలవట్లేదు. పనికిరాని పనంటే ఇదే! అనుకున్నాడు మనవడు. అలసిపోయి, చెమటలు పట్టిపోయి, కళ్ళు తేల వేస్తూ ఖాళీ బుట్టతో వచ్చి అదే మాటన్నాడు తాతయ్యతో.

''పనికి రాని పనేం నువ్వు చెయ్యలేదు. మంచి పనే చేశావు. బుట్టనోసారి చూడు'' చెప్పాడు తాతయ్య.

చూశాడు మనవడు.

ఇంతకు ముందు మసిబారి నల్లగా చెత్తచెత్తగా అసహ్యంగా ఉన్న బుట్ట, ఇప్పుడు తెల్లగా ఉండి, ముత్యంలా మెరుస్తోంది. లోపలా బయట కూడా స్వచ్ఛంగా శుభ్రంగా ఉంది.

''భగవద్గీత చదవడం వల్ల లాభం ఏమిటని అడిగావు చూడూ, ఇదే లాభం. చదివిందంతా గుర్తుండకపోవచ్చు. అర్థం కాకపోవచ్చు. కాకపోతే చదివిన ప్రతిసారీ ఎంతో కొంత నీలో మార్పు కలుగుతుంది. నీ మనసూ, శరీరం రెండూ స్వచ్ఛత సంతరించుకుని, శుభ్రపడతాయి. చాలు కదా?'' అన్నాడు తాతయ్య.

'చాలు' అనుకున్నాడు మనవడు.



అయలసోమయాజుల నీలకంఠేశ్వర జగన్నాథశర్మ 1956 ఏప్రిల్ 13న జన్మించారు. ప్రవృత్తిరీత్యా రచయిత, వృత్తిరీత్యా పత్రికా రచయిత. సుమారుగా అయిదు వందల కథలూ, అయిదు నవలలూ, అనేక వ్యాసాలూ రాశారు. సినిమా, టీవీ రచయితగా కూడా ప్రసిద్ధులు. ప్రస్తుతం ఆంధ్రజ్యోతి ప్రచురణ 'నవ్యవీక్లీ'కి సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు.

గతంలో వీరు 'జగన్నాథ రథచక్రాల్' పేరిట నవ్యవీక్లీ మొదటి పేజీలను వెలువరించారు. ఆ పుస్తకం విశేష పాఠకాదరణ పొందింది. ఇప్పుడు 'జగన్నాథ కథచక్రాల్' పేరిట ఈ పుస్తకం వెలువడుతోంది.

ఒక్క పేజీలోనే జీవితానికి చెందిన ఒక్కొక్క సత్యాన్నీ, ఒక్కొక్క అనుభవాన్నీ ఆణిముత్యంలా పొదిగిన అపూర్వ జీవనహారం ఈ పుస్తకం మీ కోసం...

jagannadha katha chakraal
jagannadha sarma

కొందరికి మాత్రమే పరిమితం అనుకునే పేజీని అందరూ చదివేలా చేయడం అంత సులభం కాదు. అందరికీ సాధ్యమూ కాదు. అరుదైన ఆ విజయానికి జగన్నాథశర్మ సారథ్యం వహించారు. దాన్ని సుసాధ్యం చేశారు. అది ఆ పేజీకే పరిమితం కాకుండా చక్రాలు కట్టుకుంది...చకచకా పరుగులు తీసింది. 'జగన్నాథ కథచక్రాల్'గా పుస్తకరూపం సంతరించు కుంది.

ఒకప్పుడు దిన, వార, పక్ష, మాసపత్రికలన్న తేడా లేకుండా ఎడిట్ పేజీ అనగానే ఓ పడికట్టు ధోరణి ఉండేది. దాని చదువరుల సంఖ్య కూడా పరిమితంగానే ఉండేది. ముఖ్యంగా వారపత్రికలైతే పాఠకులు, ముందు పేజీలో ఏముందో చూసే ఓపిక లేకుండా తమకిష్టమైన పేజీల్లోకి నేరుగా వెళ్లిపోయేవారు. తమకు నచ్చిన వాటిని గబగబా చదివేసుకుని ఆనక మిగిలిన పుటల్ని తీరిగ్గా తిరగేసే వారు. తన రాకతో, రాతలతో ఆ పోకడను మార్చిన ప్రతిభావంతుడైన సంపాదకుడు జగన్నాథశర్మ. నందీశ్వరుడికి నమస్కరించకుండా శివలింగాన్ని చేరలేనట్లు ఎడిట్ పేజీని చదవకుండా లోపలి పేజీల్లోకి వెళ్లజాలని పరిస్థితిని ఆయన 'నవ్యవీక్లీ' పాఠకులకు కల్పించారు.

అందమైన శిల్పాన్ని చెక్కినట్లుండే అద్భుతమైన పని'వాడి'తనంతో, ముగ్ధ మనోహరమైన ముఖానికి ముచ్చటైన తిలకంలాంటి సింగారంతో, లోపలి పేజీల్లోకి పరుగుతీయకుండా మొదటి పేజీకి కళ్ళప్పగించేలా చేశారు జగన్నాథశర్మ. 'గుండె గుప్పెడంత... ఊహ ఉప్పెనంత' అన్న కవి మాటను నిజం చేస్తూ జగన్నాథశర్మ 'నవ్యవీక్లీ' ఎడిట్ పేజీలో వారం వారం రాస్తున్న కథలు పాఠకుల్ని కదిలిస్తున్నాయి. కరిగిస్తున్నాయి. దర్శనానంతరం గుడి మెట్ల మీద కాసేపు కూర్చునేటట్లు కథ చదవడం పూర్తి చేసిన తర్వాత గబుక్కున పేజీ తిప్పేయకుండా అదే పేజీలో అక్షరాల్ని చూపులతో తడిమి, హృదయంతో ఆలోచించేలా చేస్తున్నాయి. అలాంటి వాటిలో అనేకులు మెచ్చిన అత్యుత్తమమైన 100 కథల్ని ఎంపిక చేసి, ఏర్చి కూర్చిన ఈ సంకలనం విభిన్న పార్శ్వాల జీవితగుచ్ఛం. ఇందులోని ప్రతీ కోణం మిమ్మల్ని పలకరిస్తుంది. మీ హృదయాల్ని కథ చక్రాల్లా పరుగులు తీయిస్తుంది.

అమరావతి
పబ్లికేషన్స్

సాయిబాబా రోడ్,
గుంటూరు-522007